

# ఇదియే ఇస్లామ్

RISALA-E-DINIYAT
(Telugu)

# ఇదియే ఇస్లాం

మూలం

సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై)

అనువాదం

ఎస్.ఎమ్. మలిక్

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

**Idiye Islam**

**Risala-e-Diniyat** (Telugu)

**TIP Series No. 27**

Written by : Maulana Maududi

Translated by : S.M. Mallick

All Rights Reserved with Publishers

32nd Edition June 2024

Copies : 2000

**Price : Rs.120**

ISBN : 81- 86826 - 06 - 8

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Phones: 040-24564583, 24576237
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# విషయసూచిక


నా మాట

1. మొదటి అధ్యాయం – ఇస్లాం విశ్వధర్మం 1

నామకరణం; ఇస్లాం – దాని భావం; విశ్వవ్యాప్తమయిన ఇస్లామ్; మానవస్థితి; కుఫ్ర్ అంటే ఏమిటి? కుఫ్ర్‌లోని చెడులు; దౌర్జన్యం; ద్రోహం, తిరుగుబాటు; కీడుకుదారి; ఇస్లామ్ అనుగ్రహించే వరాలు; పరీక్ష; ఉనికే ఓ వరప్రసాదం; నిజమైన ముస్లిం; బాధ్యతాభావం; శక్తిసంపన్నతకు మారుపేరు;

2. రెండవ అధ్యాయం – విశ్వాసం, విధేయత 27

జ్ఞానం, విశ్వాసం; పరలోకం; ఈమాన్ నిర్వచనం; జ్ఞానం లభించే మార్గం; మనిషి నిష్ఫలత; అజ్ఞాత విషయాలపట్ల విశ్వాసం.

3. మూడవ అధ్యాయం – దైవదౌత్యం 37

దైవదౌత్యం వాస్తవికత; అవసరాన్నిబట్టి అర్హతలు; ప్రవక్తలు; ప్రవక్తను గుర్తుపట్టడం, ఆదర్శమూర్తి; దైవ ప్రవక్త విధేయత; సమంజస, సహేతుకవైఖరి; ప్రవక్తలను నమ్మవలసిన ఆవశ్యకత; దైవదౌత్య సంక్షిప్తచరిత్ర; తొలి ప్రవక్త; ప్రవక్తల పరంపర; ప్రవక్తల ఎడల ప్రజల ప్రవర్తన; మార్పులు చేర్పులు; బాధ్యతలు; మారిన పరిస్థితులు; సమగ్ర విశ్వధర్మం; ముహమ్మద్ దైవ దౌత్యం; సమగ్రభాష్య సహేతుక నిర్ధారణ;

మానవాళి రుణపడిఉంది; మహా గొప్ప విప్లవకారుడు; వాతావరణ జనితమా ఈ వ్యక్తిత్వం? దైవదౌత్యం సమాప్తం; దైవదౌత్యం ముగింపు - ఆధార ప్రమాణాలు; మరో దైవప్రవక్త ఆవిర్భావానికి కారణాలు; అంతిమ దైవ సందేశహరుడు;

4. నాల్గవ అధ్యాయం – ఈమాన్ ముఖ్యాంశాలు 97

దైవ విశ్వాసం; "లా ఇలాహ ఇల్లల్లాహ్" అర్థం; "లా ఇలాహ ఇల్లల్లాహ్" వాస్తవికత; మూఢత్వానికి పరాకాష్ఠ; జ్ఞానకాంతి ప్రవేశం; నిజమయిన దైవ భావన; దేవుడు ఒక్కడే; "తౌహీద్" (ఏకేశ్వరోపాసన) ప్రభావం; దైవ దూతల ఎడల విశ్వాసం; దైవగ్రంథాల పట్ల విశ్వాసం; పరలోక విశ్వాసం - దివ్య ఖుర్ఆన్; చారిత్రక ప్రమాణాలు; దైవ సందేశహరుల పట్ల విశ్వాసం; పూర్వప్రవక్తలు; మరణానంతర జీవితం పట్ల విశ్వాసం; పరలోక విశ్వాసం- దాని హేతువు; పరలోకంపట్ల విశ్వాసం అవసరమా? రెండు విభిన్న దృక్పథాలు; పరలోకం - సహేతుక నిర్ధారణ; భిన్న దృక్పథాలు; జన్మచక్రం; ప్రళయం; పరలోకం; మానవుని అంతిమ నివాసం; కలిమయే తయ్యిబా;

5. అయిదవ అధ్యాయం – ఆరాధనలు 146

ఇబాదత్ భావం; జీవితమే ఓ ఆరాధన; నమాజ్; శీల నిర్మాణంలో నమాజ్; సమైక్యతకు సోపానం; ఉపవాస వ్రతం - రోజా; శీల నిర్మాణం; సామూహిక శిక్షణ; వీరు దైవ

విధేయులా? చిత్తశుద్ధి అవసరం; సమాజ శ్రేయం; హజ్; తొలి ఆరాధనాలయం; సమగ్ర ఆరాధన; చెరగని ముద్ర; ప్రేమకు ప్రమాణం; విశ్వాసానికి గీటురాయి; జిహాద్; అత్యున్నత ఆరాధన;

6. ఆరవ అధ్యాయం – దీన్, షరీఅత్ 169

వ్యత్యాసం; షరీఅత్ మూలాధారాలు; ఫిక్హ్; తసవ్వుఫ్; అంతర్ బాహ్యాలు; దారి తప్పిన సూఫీలు; ప్రేమకు ప్రతిరూపం;

7. ఏడవ అధ్యాయం – షరీఅత్ ఆదేశాలు 179

షరీఅత్ సిద్ధాంతాలు; ఈ లోకం మనిషికోసం; మంచిగా బ్రతకగోరే వారికి; దైవం ప్రసాదించిన జ్ఞానం; షరీఅత్ సూత్రాలు; హక్కులు నాలుగు రకాలు; దైవం హక్కులు; భౌతికమయిన ఉనికి; సొంత హక్కులు; శుభాలన్నీ మనిషి కొరకే; మానవుల హక్కులు; సామూహిక బాధ్యతలు; కుటుంబం; నైతికతకు ప్రాధాన్యం; సకల సృష్టిజీవరాసుల హక్కులు; సార్వజనీనమయిన సార్వకాలికమయిన షరీఅత్;

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడఃయిన అల్లాహ్ పేరుతో

# నా మాట

నీలాంబరంలోని కాంతిపుంజాల పైకి భువినుంచి వంతెనలు కడుతూ వెలుగు వేగంతో ముందుకు సాగుతున్న కాలగతి నేడు ఓ మలుపులో ఉంది - ప్రతి మలుపులో క్రాంతిమయమయిన ఓ నవజీవన కాంతి ప్రజ్వలిస్తుందన్న యదార్థానికి చరిత్ర సాక్ష్యం పలుకుతోంది. నేటి మలుపు కూడా మానవ సమాజ నవనిర్మాణానికై నిరీక్షిస్తోంది.

నవయుగానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. మనం సృష్టించుకున్న ఎన్నో సిద్ధాంతాలు, వాటి ఆధారంగా నిర్మించుకున్న ఎన్నో కాల్పనిక సౌధాలు కుప్పగా కూలిపొయ్యాయి. అటు కమ్యూనిజం తన జన్మస్థలంలోనే నిలువనీడ లేక అనాధగా చివరి ఘడియలు లెక్కపెట్టుకుంటోంది. ★ ఇటు కాపిటలిజం తన గర్భాన జన్మించిన అనేక రుగ్మతల మూలంగా కుళ్ళి అసహ్యంగా తయారయింది. చికిత్స కొరకు తిరిగి ప్రాచ్యాభిముఖమయింది.

ఈ సందర్భంలో ప్రతిచోటా జాగృతమవుతున్న ఇస్లామీయ పునరుజ్జీవన ఉద్యమాలు మానవ సమాజంలో కొత్త చైతన్యాన్ని కలిగిస్తున్నాయి. ఈ జాగృతి నవయుగ నిర్మాణానికి నాంది కాగలదనడంలో

---

★అది కాస్త్రా 1990లో అంతిమశ్వాస వదిలిందన్న విషయం నేటి యదార్థం-అను

సందేహం లేదు. అయితే ఈ పునరుజ్జీవనాభిలాష శాస్త్రీయ విప్లవంతో జోడయి ఉత్తేజమవ్వాలి. అప్పుడే ఇస్లామీయ సిద్ధాంతాలు, దృక్పథాలు, మానవ జీవితపు నవ నిర్మాణానికి అవసరమయిన జీవనదాయక సందేశంగా రూపొందగలుగుతాయి.

ఈ జీవనదాయక సందేశాన్ని మన తెలుగు ప్రజలకు అందజేసే యత్నమే ఈ పుస్తక ప్రచురణ. ఈ సందేశ దీపికను ఎవరు పటిష్టంగా చేబూని చీకట్లను చీల్చగలరో వారే భావి నాయకులు.

ఈ పుస్తకం, మన సమకాలీన ఖుర్ఆన్ వ్యాఖ్యాత ప్రఖ్యాత ఇస్లామీయ తత్వవేత్త, ఇస్లామీయ ఉద్యమానికి జీవితపు చివరి ఘడియల వరకు సారథ్యం వహించిన మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మలై) రచించిన ఉర్దూ పుస్తకం "రిసాలయే దీనియాత్" కు అనువాదం. ఇది ప్రపంచ భాషల్లోనేకాక భారతావనిలోని పన్నెండు భాషల్లో అనువదింపబడిన మేటి గ్రంథం. ఇది అనేక కాలేజీల్లోనూ, హైస్కూళ్ళలోనూ పాఠ్యగ్రంథంగా కూడా ప్రవేశం పొందింది.

తెలుగులో దీని అనువాదం ఇంతకు క్రితమే "ఇస్లామ్ బోధిని" పేరుతో వెలువడినా దాని భాష, శైలి సరళమయింది కాకపోవడం చేతను, అసలు పుస్తకంలోనే మౌలానా కొన్ని మెరుగులు దిద్దడంచేతను, మౌలానా అనుమతితో డా. ఖుర్షీద్ అహ్మద్ ఎన్నో అధఃసూచికలు చేర్చడం చేతను ఇప్పుడు సరికొత్త అనువాదం సమర్పించడం అవసరమయింది. ఇందులో సరళమయిన వ్యావహారిక భాషను ఉపయోగించడం జరిగింది. శైలికూడా సులభగ్రాహ్యమయిందే.

విషయం ఏదయినా దాని ప్రత్యేక పారిభాషిక పదాలను అనువదిస్తే అవి నిస్సారంగా తయారవుతాయి. ఇస్లాంలోని ప్రత్యేక పారిభాషిక పదాలను వీలయినంతవరకు వాటి భావానికి అతి సన్నిహితమయిన తెలుగు సమాసాలుగా

అనువదించడానికి కృషి జరిగింది. కాని పెక్కుచోట్ల ఇది సాధ్యపడలేదు. అందుచేత వాటిని యధాతథంగా ప్రయోగించడం అనివార్యమయింది. అవసరమనుకున్న చోట అధఃసూచికలు (Foot Notes) ఇవ్వడానికి ప్రయత్నం జరిగింది.

విశ్వంలోని పరమ సత్యాలను, మానవ జీవితంలో ఎదురయ్యే ప్రధాన సమస్యల్ని, వాటి పరిష్కారాలను ఇస్లామీయ దృక్పథం వెలుగులో విశదపరచేందుకు, ఇస్లాం మౌలిక సిద్ధాంతాల వివరణ, వాటి అంతరార్థాల అవగాహన కొరకు చేసిన కృషి ఈ కృతి. ముస్లిం సోదరులకు, ముస్లిమేతర సోదరులకు సమంగా ఉపకరిస్తుందని ఆశిస్తూ -

మలిక్

హైదరాబాద్, 8,
షాబాన్, 1402
30 జులై, 1982.

# అయిదవ ముద్రణ

ఇస్లాం అవగాహనా మార్గంలో ప్రపంచ విఖ్యాత గ్రంథం ఈ ఇదియే ఇస్లాం. దీని లక్షలాది ప్రతులు ప్రపంచమంతటా ప్రముఖ ప్రపంచ భాషలన్నింటిలో ప్రచారం పొందాయి. తెలుగులోనూ గత పదేళ్ళ కాలంలో 10 వేల ప్రతులు పంపిణీ చెయ్యగలిగినందుకు దైవానికి కృతజ్ఞతలు.

ఇది నిజానికి 1971లో చేసిన అనువాదం. ఆ తరువాత 1982లో ప్రచురించేటప్పుడు దాన్ని క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ప్రాప్తం కాలేదు అనువాదకునికి. ఇప్పుడు పునర్విమర్శనకు అవకాశం కల్పించాము. సాహితీ పథాన సంతృప్తి, సంతుష్టి అన్నవి అందని పళ్ళు. అయినా వీలయినంత మేరకు తప్పులు దొర్లకుండా కృషి చేశాము.

ఈ పరిష్కృత ముద్రణలోని బాగోగులు పాఠకులు స్వయంగానే గ్రహించగలుగుతారని ఆశిస్తున్నాము.

– ప్రకాశకులు

# ఇదియే ఇస్లాం

'అపార కృపాశీలుడు అనంత కరుణామయుడయిన అల్లాహ్ పేరుతో

# మొదటి అధ్యాయం

# ఇస్లాం–విశ్వ ధర్మం

## నామకరణం

ప్రపంచంలోని ప్రతి మతం దాని స్థాపకుని పేరిట లేక అది ఆవిర్భవించిన జాతి, తెగల పేరిట నామకరణం చెయ్యబడింది. ఉదాహరణకుః క్రైస్తవ మతమనే పేరుకు దాని ప్రవక్త ఏసుక్రీస్తు నామంతో సంబంధం ఉంది. అలాగే బౌద్ధ మతం దాని స్థాపకుడు గౌతమ బుద్ధుని పేరిటనూ, జోరాస్ట్రియానిజం దాని బోధకుడు జోరాస్టర్ పేరిటను నామకరణం చేయబడ్డాయి. యూదుల మతమయిన "యూదు" మతం (యూదియా అనే దేశానికి చెందిన) యూదా తెగలో ప్రారంభమయిన కారణాన యూదు మతం అనబడుతోంది. అన్య మతాల స్థితి కూడా ఇంతే. కాని ఇస్లామ్ విషయం అలా కాదు. దానికి ఒక ప్రత్యేకత ఉంది. దానికి ఏ వ్యక్తితోనూ లేక ఏ జాతి తోనూ ఇలాంటి సంబంధం లేదు. "ఇస్లామ్" అనే పదం ఇలాంటి సంబంధాన్ని వ్యక్తపరచదు. అది ప్రత్యేక వ్యక్తికి లేక ప్రత్యేక జాతికి లేక ప్రత్యేక దేశానికి చెందినది ఏ మాత్రం కాదు. మానవ మస్తిష్కం యొక్క సృజన అసలే కాదు. ఏ జాతికయినా అంటి పెట్టుకుని కూడా లేదు. ఇది విశ్వాన్నంతటికీ చెందిన ధర్మం – విశ్వ ధర్మం. "ఇస్లాం" అనే గుణ విశేషాన్నీ స్వభావాన్నీ మానవునిలో సృజించి దాన్ని పెంపొందించడమే దీని ఉద్దేశ్యం.

"ఇస్లామ్" అన్నది వాస్తవానికి గుణవాచకం. ఇస్లామ్ గుణ విశేషాన్ని పొంది ఉన్నవారు - ఏ వంశావళికీ, ఏ వర్గానికీ, ఏ దాశానికీ మరి ఏ తెగకు చెందిన వారయినా ముస్లిములే! దివ్య ఖుర్‌ఆన్ (ఇస్లాం ధార్మిక ఉద్గ్రంథం) సూచన ప్రకారం ఈ గుణ విశేషాన్ని కలిగిన సదాచారులూ సజ్జనులూ ప్రతి జాతిలోనూ సర్వ కాలాల్లోనూ ఉంటూ వచ్చారు. వారంతా ముస్లిములే.

అయితే ఇస్లామ్ అంటే ఏమిటి? ముస్లిమంటే ఎవరు? అనే ప్రశ్నలు ఎదురవుతాయి.

# ఇస్లాం – దాని భావం

"ఇస్లామ్" అన్నది ఒక అరబీ పదం. దీనికి స్వయం సమర్పణ, విధేయత, ఆజ్ఞాపాలన అని అర్థం. ఇస్లాం ధర్మం దైవానికి పరిపూర్ణ స్వయం సమర్పణను ఆయన విధేయతను బోధిస్తుంది. గనుక అది "ఇస్లాం" అని పిలువబడుతుంది.*

# విశ్వ వ్యాప్తమయిన ఇస్లాం

మనం జీవించే ఈ ప్రపంచం ఒక నియమానికి కట్టుబడి ఉందని ప్రతి ఒక్కరూ ఇట్టే గ్రహించగల విషయం. ఇందులో ఉన్న వాటన్నిటిలోనూ

---

* "ఇస్లాం" అనే పదానికి మరొక శాబ్దిక అర్థం "శాంతి" అని. అంటే జీవితంలో నిజమయిన భౌతిక మానసిక శాంతి, దేవునికి పరిపూర్ణ స్వయం సమర్పణ ద్వారా, ఆయన విధేయత పాటించడం ద్వారా మాత్రమే సాధించడానికి వీలవుతుందని భావం. అలాంటి జీవితమే అంతరంగంలో ప్రశాంతతను ప్రసాదించి తద్వారా సంఘం మొత్తంలో యదార్థమయిన శాంతిని నెలకొలువుతుంది.

ఒక క్రమబద్ధత, శాసనబద్ధత ఉంది. అత్యంత వైభవోపేతంగా అత్యుత్తమ రీతిలో సాగుతున్న ఈ మహోన్నత విశ్వ వ్యవస్థలో ప్రతి వస్తువుకూ ఒక స్థానమంటూ నిర్ణయమయి ఉంది. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు - ఒక్కటేమిటి అంతరిక్షంలో ఉన్నదంతా - ప్రచండమయిన ఒక నియమావళికి లోబడి ఉన్నాయి. ఉల్లంఘించడానికి వీలు కాని చట్టాన్ని పాటిస్తున్నాయి. తమ నిర్ణీత మార్గాన్ని వదలి ఇసుమంతయినా తప్పుకోలేవు. భూమి తన చుట్టు తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ పరిభ్రమించడంలో నిర్ణీత వేగాన్ని, మార్గాన్ని ఎంతో శ్రద్ధగా అనుసరిస్తోంది. ఈ అనుసరణలో రవ్వంతయినా వ్యత్యాసం కలుగదు. నీరు, గాలి, వెలుగు, వేడిమి - అన్నీ ఒక నిబంధనకు లోబడి ఉన్నాయి. జీవరాసులు, వృక్షరాసులు, ఖనిజరాసులు - భ్రమరిస్తూ గంతులు వేసే అత్యంత సూక్ష్మమయిన విద్యుత్కణం మొదలుకుని బ్రహ్మాండమయిన పాలవెల్లి వంటివన్నీ - వాటికై నియమించిన నియమాన్నే, ఎలాంటి హెచ్చు తగ్గులు లేకుండా పాటిస్తూ ఉంటాయి. వీటి పుట్టుక, పెరుగుదల, మనుగడ మరియు అంతం - అంతా ఒక నియమానుసారంగానే సంభవిస్తాయి. స్వయంగా మానవాళిలోనూ ఈ ప్రకృతి సిద్ధాంతాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. మనిషి పుట్టడం, ఎదగడం బ్రతకడం - అంతా జీవ శాస్త్ర సిద్ధాంతాలకనుగుణంగా ఒక క్రమంలో జరుగుతాయి. ఆ నియమాల ప్రకారమే మనిషి గాలి, నీరు, వెలుగు, వేడిమి గ్రహిస్తాడు. ఇతని హృదయ స్పందనం, రక్త ప్రసారం, ఉఛ్వాస నిశ్వాసాలు ఈ నియమాలకే లోబడి ఉన్నాయి. ఇతని శరీరంలోని సూక్ష్మకణాలు మొదలుకుని నరాలు, గుండె, మెదడు, కాళ్ళు, చేతులు, కళ్ళు, చెవులు మొదలయిన అవయవాలన్నీ వాటి నిర్దిష్ట నియమాన్నే పాటిస్తాయి. అంటే, మన శరీరం ఒక నియమబద్ధమయిన జగత్తు, ఇందులోని ప్రతి పదార్థం

దానికై నిర్ణయించబడిన విధానాన్నే అనుసరిస్తూ ఉంటుంది.

భువిలో అల్పాతి అల్ప ధూళి రేణువు మొదలుగా నభాంతరాల్లో భ్రమరించే అసంఖ్యాకమైన మహోన్నత గ్రహాల్ని,నక్షత్రాల్ని తన బంధాల్లో బిగించుకున్న ప్రచండ శక్తిమంతమయిన, సర్వ వ్యాప్తమయిన ఈ నియమం – సృష్టికర్త విశ్వ ప్రభువయిన దేవుని నియమం. అంతు కానరాని ఈ విశ్వం విశ్వంలోని సర్వమూ ఈ దైవ నియమాన్నే అనుసరిస్తున్నాయి, ఆయన ఆజ్ఞల్నే పాలిస్తున్నాయి. కనుక యావజ్జగత్తు అనుసరించే ఆచరణ నియమావళి – ధర్మం – "ఇస్లాం" అని తెలుస్తోంది. ఎందుకంటే, ఇస్లాం అంటే విశ్వ ప్రభువయిన దేవుని ఆజ్ఞాపాలన, ఆయన విధేయత తప్ప మరేమీ కాదు. కాబట్టి సూర్యుడు, చంద్రుడు, భూమి, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు అన్నీ "ముస్లిములే"! అలాగే గాలి, వాన, ఎండ, రాళ్ళు రప్పలు, చెట్లు చేమలు, పశువులు, పక్షులు అన్నీ దైవ నియమాలకు కట్టుబడి, ఆయన విధేయతను పాటిస్తున్నాయి. అందుచేత విశ్వంలో ఉన్నవన్నీ "ముస్లిములే"!

అంతేకాదు, దేవుని ఉనికిని గుర్తించడానికీ, దైవాన్ని విశ్వసించడానికి నిరాకరించే మనిషి, దైవం తప్ప ఇతరుల్ని ఆరాధించే మనిషి, దైవేతరుల్ని అల్లాహ్ సహవర్తులని భావించే మనిషి– స్వయంగా ఈ మానవుడు సయితం – ప్రకృతి సిద్ధాంతం రీత్యా శారీరకమయిన ముస్లిమే! ఎందుకంటే, ఇతను పిండ రూపం దాల్చినప్పటి నుంచి పుట్టి, పెరిగి, గిట్టి మట్టి పాలయ్యేంత వరకు అంతా దైవ శాసనాలకు లోబడే జరుగుతుంది. ఇతని అవయవాలన్నీ దైవ నియమాల కనుగుణంగా తయారై పెరిగి పనిచేస్తూ ఉంటాయి. కనుక ఇతని అవయవాలన్నీ, ఇతని ప్రతి రోమమూ అవలంబించే ధర్మం, ఆచరణ

నియమావళి ఇస్లామే! చివరికి ఇతని అవివేకం మూలాన బహుదైవ వాదాన్ని, నాస్తికతను వ్యక్తపరిచే ఇతని నోరు సయితం సహజ సిద్ధంగా ముస్లిమే! దైవం తప్ప అన్యుల సమక్షంలో బలవంతంగా ఇతను వంచే శిరస్సు కూడా జన్మతః ముస్లిమే! ధర్మజ్ఞానం లేకపోవడం చేత దైవం తప్ప ఇతరుల భీతి, గౌరవం, ప్రేమ ఆదరణలను కలిగి ఉండే ఇతని హృదయ కుహరం కూడా సహజంగా ముస్లిమే! ఇవన్నీ దైవాజ్ఞల్నే పాలిస్తున్నాయి. వీటిలో కలిగే ఒక్కొక్క కదలిక, ఇవి చేసే ఒక్కొక్క పని కేవలం దైవ నియమాలకు మాత్రమే లోబడి ఉంటుంది.

## మానవుని స్థితి

సూక్ష్మాతి సూక్ష్మమైన అణువు మొదలుకుని, మహోన్నత గ్రహాల వరకు విశ్వంలో ఉన్నవన్నీ తమ ప్రభువయిన దైవానికి ఆజ్ఞాబద్ధులయి మసలుతున్నాయి, అవన్నీ దైవాజ్ఞలకు లోబడి మెలగటం మూలాన అవన్నీ "ముస్లిములే". విశ్వంలో ఉన్న పదార్థాలన్నీ జన్మతః "ఇస్లామ్" - దైవాజ్ఞా పాలననే అనుసరిస్తున్నాయి! జన్మతః విశ్వమంతా "ముస్లిమే"!

ఇదే మనిషి నిజస్థితి, ఈ లోకం నిజస్థితి కూడా ఇదే. ఈ విషయాన్ని మరో రూపంలో పరిశీలిద్దాం. మనిషి జీవితానికి రెండు రూపాలు - ప్రస్ఫుటమయిన రెండు విభిన్న కార్యరంగాలున్నాయి. ఒక రంగంలో తాను పరిపూర్ణంగా దైవ శాసనాలచేత పాలింపబడుతున్నట్లు గ్రహిస్తాడు మనిషి. వాటిని ఒక వీసమెత్తు కూడా అతిక్రమించ లేడు. వాటిని వదలి ఒక్క అడుగు కూడా వెయ్యలేడు. వాటిని ఏ విధంగానూ తప్పించుకోనూ లేడు! వాస్తవానికి సకల సృష్టివలే మనిషి కూడా ప్రకృతి సిద్ధాంతాల బలవత్తర నియమాలకు లోబడి ఉన్నాడు. వాటిని పాటించడానికి బద్ధుడయి ఉన్నాడు.

మనిషికి మరో ఆచరణ రంగం కూడా ఉంది. అతనికి వివేకం, విజ్ఞత ప్రసాదించబడ్డాయి. యోచించడానికీ, నిర్ణయించడానికీ, ఇష్టమయిన దాన్ని ఎన్నుకోడానికి ఇష్టంలేని దాన్ని మానివేయడానికీ, నచ్చితే స్వీకరించడానికీ, నచ్చకపోతే తిరస్కరించడానికీ మనిషికి అధికారం ఉంది. తనకు ఇష్టమయిన ఏ బ్రతుకు బాటనయినా అవలంబించడానికి మనిషి స్వతంత్రుడు; ఏ విశ్వాసాన్నయినా ఆశ్రయించగలడు; ఎలాంటి జీవిత విధానాన్నయినా అనుసరించగలడు, నచ్చిన దృక్పథానికనుగుణంగా తన జీవితాన్ని మలచు కోగలడు, తాను స్వయంగానూ ఒక ఆచరణ నియమావళిని రూపొందించు కోగలడు కూడా. జీవితపు ఈ రెండవ రంగంలో ఇతర సృష్టిరాశికి భిన్నంగా మానవునికి, ఆలోచన, ఆచరణల స్వాతంత్ర్యం ప్రసాదించడం జరిగింది.

ప్రస్ఫుటంగా భిన్నమయిన ఈ రెండు రంగాలు కూడా మనిషి జీవితంలో విలీనమయి వున్నాయి.

మొదటి రంగంలో యావత్తు సృష్టివలే మనిషి ప్రకృతి సిద్ధంగానే ముస్లిం. దైవాజ్ఞల్నే పాలించడానికి బద్ధుడై ఉన్నాడు. రెండవ క్రియారంగంలో ముస్లిమ్ అవడానికి లేదా ముస్లిమ్ కాకపోవడానికీ (అంటే దైవాజ్ఞల్ని పాలించడానికి లేక పాలించక పోవడానికి) మనిషి స్వతంత్రుడు. ఈ రంగంలో మనిషికి స్వేచ్ఛ, అధికారం ప్రసాదించబడ్డాయి. ఈ స్వేచ్ఛను వినియోగించుకునే రీతిని బట్టి మానవాళి మొత్తం రెండు వర్గాలుగా విడిపోతుంది.

ఒక వ్యక్తి తన సృష్టికర్తను గుర్తిస్తాడు; ఆయన్ని తన యజమానిగా, నిజ ప్రభువుగా స్వీకరిస్తాడు; ఆయన ఆజ్ఞలకు ఆదేశాలకు చిత్తశుద్ధితో పరిపూర్ణంగా దాసోహమంటాడు; మనిషి వ్యక్తిగత, సామూహిక జీవితానికై

దైవం పంపిన నియమావళిని అనుసరిస్తాడు. ఇలాంటి వ్యక్తి పరిపూర్ణంగా ముస్లిమ్. అంటే తాను ప్రకృతి సిద్ధంగా బద్ధుడయి ఉన్న రంగంలోనే కాక తనకు స్వేచ్ఛ అధికారాలూ ప్రసాదించబడ్డ క్రియారంగంలోనూ అల్లాహ్‌కు విధేయుడయి ఉండటానికి బుద్ధిపూర్వకంగా నిర్ణయించుకున్న మూలాన అతని ఇస్లామ్‌లో పరిపూర్ణత సిద్ధించిందన్న మాట. ఇక అతని జీవితం సర్వమూ దైవానికి ఆత్మ సమర్పణామయమైంది. అతని జీవితంలో ద్వంద్వ నీతి లేదు. అతడు అన్నిటా ముస్లిమే. అతని ఇస్లామ్ పరిపూర్ణం. ఇస్లామ్ అంటే - సర్వస్వాన్నీ అల్లాహ్ అభీష్టానికి సమర్పణ చేయడం తప్ప మరేదీ కాదు కదా!

ఎవరికయితే తాను ఇంతకు ముందే అసంకల్పితంగా విధేయుడయి ఉండేవాడో ఇప్పుడాయనకు సచేతనంగా విధేయుడయ్యాడు ఈ మనిషి. ఇష్టాయిష్టాల ప్రమేయం లేకుండా ఏ ప్రభువుకయితే లోగడ తల ఒగ్గేవాడో ఇప్పుడాయన సమక్షంలో తాను స్వయంగా మనసారా మోకరిల్లుతున్నాడు. తనకు గ్రహణ శక్తినీ, విజ్ఞాన సముపార్జనా యుక్తినీ ప్రసాదించిన దైవాన్ని గుర్తించడంచేత అతని జ్ఞానం సార్థకమయింది. ఇప్పుడు ఇతని వివేచనా శక్తి, ఆలోచనా శక్తి సవ్యమయినవయ్యాయి - ఎందుకంటే ఈ యోచన, వివేచన, నిర్ణయ శక్తి సామర్థ్యాలను సరయిన విధానంలో ఉపయోగించి వాటిని అనుగ్రహించిన దైవానికి విధేయుడై ఉండటానికి ఇతడు తీసుకున్న నిర్ణయం సరయిన నిర్ణయం. మాట్లాడే శక్తిని ప్రసాదించిన స్వామి పట్ల అంగీకార భావాన్ని వక్కాణించిన ఇతని నోరు కూడా సత్య సంధత కలదే. ఇతని జీవితంలో సర్వస్వమూ సత్య స్వరూపం, ఎందుచేతనంటే - ఇతను ఐచ్ఛికంగానూ, స్వాభావికంగానూ జీవితంలోని సర్వరంగాల్లో విశ్వప్రభువయిన ఒకే దైవం - అల్లాహ్ శాసనాలకే కట్టుబడి జీవిస్తున్నాడు. సృష్టి సర్వమూ

ఆరాధించే అల్లాహ్‌నే తానూ ఆరాధిస్తున్నాడు. కనుక యావజ్జగత్తుతో ఇతనికి సామరస్యం శాంతి భావం కుదిరాయి. ఇలాంటి వ్యక్తే భువిలో దేవుని నిజ ప్రతినిధి. ప్రపంచమంతా తనకే దాసోహమంటే తానేమో దైవానికి అంకితం!

# కుఫ్ర్ అంటే ఏమిటి ?

పైన ఉదాహరించిన వ్యక్తికి పూర్తిగా భిన్నమయిన వ్యక్తిని తీసుకోండి. అతడు స్వాభావికమయిన ముస్లిమ్‌గా పుట్టి జీవితాంతం అసంకల్పికంగా ముస్లిమయి జీవిస్తూ ఉన్నప్పటికీ, తన వివేకాన్నీ, బుద్ధినీ, అంతర్ జ్ఞానాన్ని తన ప్రభువును, తన సృష్టికర్తను గుర్తించడానికి వినియోగించడు. పైగా ఆయన్ని ధిక్కరించేందుకు సిద్ధపడటంచేత తన స్వేచ్ఛను, నిర్ణయాధికారాన్ని దుర్వినియోగపరచినవాడవుతాడు. ఇలాంటి వ్యక్తే తిరస్కారి – ఇస్లామీయ పరిభాషలో 'కాఫిర్'.

'కుఫ్ర్' అనే పదానికి శాబ్దిక అర్థం : దాచివేయడం, కప్పిపుచ్చడం, మూసివేయడం అని వస్తుంది. తనకు సహజమయిన దాన్ని, తన ఆత్మను ఆవరించి ఉన్నదాన్ని, ఇతను తన తిరస్కార భావం ద్వారా కప్పివేస్తాడు, లేక దాచి వేస్తాడు. కనుకనే దైవాన్ని తిరస్కరించిన వ్యక్తిని కాఫిర్ (కప్పి పుచ్చినవాడు) అనంటారు. ఎందుకంటే – వాస్తవానికి ఇతని నైజంలోనే ఇస్లాం సహజంగా ఉంది. ఇతని శరీరమంతా, శరీరంలోని ప్రతి అంగం, అణువణువూ ఈ సహజసిద్ధమయిన ప్రవృత్తికిలోబడి వ్యవహరిస్తోంది. ఇతని చుట్టూ వ్యాపించి వున్న జగత్తు, చరాచర సృష్టిరాశి అంతా, ఉనికి కలిగిన ప్రతి కణం ఇస్లాం కనుగుణంగా వ్యవహరిస్తోంది – దాని విద్యుక్త

బాధ్యతనూ నిర్వహిస్తోంది - కాని ఈ మనిషి కళ్ళపై చీకటి తెరలుపడ్డాయి. ఇతని వివేకంపై పొరలు క్రమ్ముకున్నాయి. కొట్టవచ్చినట్టు కానవచ్చే పరమ సత్యాన్ని ఇతను గ్రహించలేకపోతున్నాడు, స్వయంగా తన ప్రకృతియే తనకు అగోచరమయిపోయింది. అందుకే తాను పూర్తి విముఖంగా ఆలోచిస్తున్నాడు, ప్రవర్తిస్తున్నాడు. వాస్తవికత అతనికి అపరిచితమయిపోయింది. చిమ్మచీకటిలో కళ్ళప్పగించి చూస్తూ ఉండి పోతున్నాడు - ఇదీ 'కుఫ్ర్' వాస్తవికత!

## కుఫ్ర్‌లోని చెడులు

'కుఫ్ర్' ఒక విధంగా అజ్ఞానం - కాదు, కుఫ్ర్ అంటేనే అజ్ఞానం. విశ్వప్రభువు, సృష్టికర్త అయిన అల్లాహ్ గురించి తెలుసుకోలేక పోవడంకంటే గొప్ప అజ్ఞానం ఏముంది? ఈ సువిశాల సృష్టి మహాచిత్రాన్ని, నిర్విరామంగా పయనిస్తున్న అత్యంత శ్రేష్టమయిన ఈ యంత్రాగాన్ని, సృష్టిమూలమూలల్లో చిత్రించబడిన చిత్ర విచిత్ర రూపాల్ని చూస్తాడు మనిషి. బ్రహ్మాండమయిన ఈ కర్మాగారాన్ని పరిశీలిస్తాడు. కాని దీని కర్త ఎవరు? నిర్వాహకుడెవరు? అన్న విషయం మాత్రం ఇతనికి తోచదు. స్వయంగా తన దేహాన్నే - అద్భుతమయిన చాకచక్యంతో వ్యవహరిస్తున్న ఈ వింత యంత్రాన్నే తిలకిస్తాడు. తన అవసరాలను తీర్చుకోడానికి దీన్ని ఉపయోగించుకుంటాడు కూడా. కాని దీన్ని ఉనికిలోకి తెచ్చిన శక్తి ఏదో? ఈ యంత్రానికి రూపకల్పన చేసి నిర్మించిన ఇంజనీర్ ఎవరో? కార్బన్, కాల్షియం, సోడియం లాంటి కొన్ని నిర్జీవ పదార్థాల ద్వారా సాటిలేని ఈ జీవిని తయారుచేసిన సృష్టికర్త ఎవరో అర్థం చేసుకోలేక పోతాడు. విశ్వంలో అపురూపమయిన రూపకల్పనను వీక్షిస్తాడు. కాని దాని కళాకారుడెవరో గమనించలేకపోతాడు. సృష్టిలో గొప్ప సౌందర్యం సామరస్యం గోచరిస్తుంది

తనికి, కాని కానరాడు సృష్టికర్త! ప్రకృతిలో అనన్య సామాన్యమయిన శిల్పకళను తిలకిస్తాడు, దాని శిల్పిని గుర్తించలేక పోతాడు. విజ్ఞానం, వివేకాలు ఉట్టిపడే, ఏ గణితశాస్త్రం, యంత్ర శాస్త్రాలకు అందని రూపకల్పన విశ్వంలోను, ప్రతి నిత్యం తన చుట్టు ప్రక్కల్లోను కానవస్తుంటే పరిశీలిస్తాడు. కాని అనంతమయిన విశాల సృష్టికి అనుపమ రూపం ప్రసాదించిన శక్తి ఎడల అంధుడయిపోతాడు మనిషి.

అయితే, ప్రస్ఫుటమయిన ఈ పరమ సత్యం పట్ల కళ్ళు మూసుకుపోయిన వ్యక్తి సమక్షంలో విజ్ఞానం దాని నిజరూపంలో ఎలా సాక్షాత్కరిస్తుంది? నిజ జ్ఞాన ద్వారాలు ఇతనికై ఎలా తెరచుకుంటాయి? తొలి మెట్టులోనే తప్పటడుగు వేసిన మనిషికి గమ్యం ఎలా ప్రాప్తమవుతుంది? పరమ సత్యానికి ప్రథమ సోపానం గ్రహించలేని ఈ వ్యక్తికి జీవితపు ఋజుమార్గం కానవస్తుందా? ఇతడు ఆలోచన, పరిశీలనల్లో, విజ్ఞాన వివేకాల్లో, అన్వేషణ ఆవిష్కారాల్లో, కళల్లో, శాస్త్రాల్లో కృషి చేసి ఎంత ప్రజ్ఞ సంపాదించుకున్నా ప్రపంచ వాస్తవికత దాని మర్మాలు అతనికి దర్శనమివ్వవు. ఇతను ఆదిలో అజ్ఞానాంధకారంలో తట్టాపుతూ ఉన్నట్లే అంతంలోనూ కారు చీకట్లో పడి కొట్టుమిట్టాడుకోవలసిందే!

## దౌర్జన్యం

ఇంకా, "కుఫ్ర్" అన్నది ఒక దౌర్జన్యం, కాదు అతి నీచమైన దౌర్జన్యం ఇదే! అయితే దౌర్జన్యం అంటే ఏమిటి? అన్యాయంగా, అధర్మంగా శక్తిని ప్రయోగించడమే దౌర్జన్యం. ఒక పదార్థాన్ని - దాని స్వభావానికి, దాని ఇచ్ఛకు, దాని నైజానికి భిన్నంగా ఉపయోగించడం, దాని ధర్మాన్ని న్యాయాన్ని కాదని మరోలా ప్రవర్తింపచేయడమే దౌర్జన్యం.

విశ్వంలో ఉన్నవన్నీ సృష్టికర్త అల్లాహ్ విధేయత పాటించేవే అని మనం ఇంతకు ముందు తెలుసుకున్నాము. ఆయన సమ్మతితో, ఆయన ఆదేశాలకనుగుణంగా జీవించడం ఆయన పట్ల విధేయత కలిగి ఉండడం - ఒక్క మాటలో చెప్పాలంటే - ముస్లిములయి ఉండడమే వాటికి సహజ సిద్ధమైన మార్గం, మనిషికి ఇలాంటి వాటిపై అధికారాలనిచ్చాడు అల్లాహ్. అయితే తమ ప్రభువు అభీష్టాన్ని నెరవేర్చడం తప్ప మరో విధంగా ఉపయోగపడటం వాటి ప్రకృతికే విరుద్ధం, కాని అల్లాహ్‌కు అవిధేయుడయి కుఫ్రను ఆశ్రయించిన వ్యక్తి మహాఘోరం తలపెడతాడు. ఎందుకంటే అతడు తన మానసిక, శారీరక శక్తులన్నింటినీ, వాటి సహజ మార్గానికి విరుద్ధంగా నడవటానికి, ప్రకృతికే ఎదురుతిరగడానికి, అవిధేయతా నాటకానికి ఇష్టంలేని బొమ్మలుగా మారడానికి ఉపయోగిస్తాడు. అల్లాహ్‌ను వదలి ఇతర చిల్లర దేవుళ్ళ ముందు మోకరిల్లడానికి తన దేహాన్ని బలాత్కరిస్తాడు. దైవాన్ని కాదని ఇతర శక్తుల ప్రేమకు భయభక్తులకు తన ఆంతర్యంలో చోటిస్తాడు. ఈ అవయవాల సహజ అభిమతానికి ప్రతికూలంగా ఇదంతా చేయిస్తాడు. తన శక్తుల్నీ తన అధీనంలో ఉన్న వస్తువుల్నీ దైవేచ్ఛకు భిన్నంగా ఉపయోగించి బహిరంగంగా దౌర్జన్యాన్ని స్థాపిస్తాడు. భువిలోని సకల వస్తువుల్ని దుర్వినియోగం చేస్తూ వాటి ప్రకృతికీ, న్యాయానికీ విరుద్ధమయిన మార్గంపై బలవంతాన నడిపించడానికి సాహసించే వ్యక్తి చేసే అన్యాయం, దౌర్జన్యం క్రూరత్వంకంటే ఘోరమయినది మరేదయినా ఉందా?

## ద్రోహం, తిరుగుబాటు

"కుఫ్ర్" కేవలం దౌర్జన్యమే కాదు, తిరుగుబాటు, కృతఘ్నత, ద్రోహం కూడాను. ఇంతకూ మనిషి నిజ స్థానమేది? ఇతని శక్తి సామర్థ్యాల

విలువెంత? ఇతనే స్వయంగా తన ఆత్మను, మనసును, మస్తిష్కాన్ని, దేహంలోని అవయవాలను సృష్టించుకున్నాడా? లేక ఇవన్నీ దైవం చేత సృజించబడ్డాయా? ఈ జగత్తు, జగత్తులోనిదంతా సృష్టించింది మనిషా? దైవమా? ఈ శక్తులన్నింటినీ మనిషి సేవ కొరకు నియమించిందెవరు – విశ్వ వ్యవస్థను సృజించి ఇవన్నీ మనిషికి ఉపయోగకరంగా, ప్రయోజనకరంగా నిర్మించి, వీటిని వినియోగించుకునే శక్తిని మనిషికి ప్రదానం చేసింది దైవమా? స్వయంగా మనిషేనా?? దీని యజమాని ఎవరు? నిజ ప్రభువు ఎవరు? నిస్సందేహంగా దైవమే! మరెవ్వరూ కాజాలరు. దేవుడే సృష్టికర్త, దేవుడే యజమాని, దేవుడే ప్రభువు – అయితే దేవుని సృష్టిని ఆయన ఇష్టానికి విరుద్ధంగా వినియోగించేవాడు, తన మేధ ద్వారా దైవానికి వ్యతిరేకంగా ఆలోచించేవాడు, హృదయాంతరాళాల్లో ఆయనకు ప్రతికూలమయిన భావాలకు తావిచ్చేవాడు, తన వివిధ శక్తిసామర్థ్యాలను ప్రభువు ఇచ్ఛకు భిన్నంగా ఉపయోగించేవాడు అసలయిన ధిక్కారి, నిజమయిన విద్రోహి కాడా? నౌకరు తన యజమాని ఆజ్ఞల్ని ఉల్లంఘిస్తే అతన్ని విశ్వాసఘాతకు డంటారు. ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వానికి అవిధేయుడయితే అతన్ని విద్రోహకారుడని ఎత్తి చూపుతారు. తనను పోషించే వ్యక్తిని ఎవడయినా మోసగిస్తే అతన్ని కృతఘ్నుడని నిందిస్తారు. కాని వాస్తవానికి మనిషి తన తోటివారి పట్ల చేసే ఈ ద్రోహం, ధిక్కారం, కృతఘ్నతలకూ, ఒక తిరస్కారి తన "కుఫ్ర్" మూలాన ప్రదర్శించే దైవధిక్కారానికి ఏమయినా పోలిక ఉందా?

ఇంతే కాదు శక్తులన్నింటికీ, అధికారాలన్నింటికీ, కారణభూతుడెవరు? వనరులన్నింటిపై మనిషికి అధికారాన్ని ప్రసాదించిందెవరు? మనుషులకు అన్నింటా ఆధిక్యతగల వారుగా శక్తిమంతులుగా ఉన్నత స్థానాన్ని ఇచ్చిందెవరు? స్వయంగా మనిషికి సంప్రాప్తమయిన వస్తుసామగ్రి, శక్తిసామర్థ్యాలు మనిషి

ఇతరులకు చేసే ఉపకారం కొరకు ఉపయోగించే పదార్థాలన్నీ దైవం ప్రసాదించినవే. లోకంలో మనిషి ఎవరి తీరని ఉపకారాలకు ఋణపడి ఉన్నాడో, వారు అతన్ని కని పెంచే తల్లిదండ్రులు. కాని తల్లిదండ్రుల గుండెల్లో అనురాగ కుసుమాన్ని సృజించిందెవరు? తల్లి మనస్సులో పసివాని పట్ల ప్రేమానురక్తులు సృష్టించిందెవరు? బిడ్డల శ్రేయం కొరకు తమ సర్వస్వాన్ని ధారపోయగల త్యాగం ఉద్వేగం తల్లిదండ్రుల్లో సృజించిందెవరు?

ఏమాత్రం ఆలోచించినా దైవమే మానవుని మహోపకారి. ఆయనే మనిషికి వరప్రదాత అన్న యదార్థం ఋజువవుతుంది. ఇంకా ఆయన సృష్టికర్త, ప్రభువు, పోషకుడు, పాలకుడు. అంతేకాదు మనిషికి నిజమయిన యజమాని, స్వామి కూడా ఆయనే. మనిషికీ దైవానికీ గల సంబంధబాంధవ్యాల పరిస్థితి ఇది. అయితే మనిషి తన "కుఫ్ర్" కారణంగా తన నిజప్రభువు, స్వామి, సార్వభౌముని తిరస్కరిస్తాడు. ఆయనకు అవిధేయుడవుతాడు. ఈ కుఫ్ర్‌కు మించిన తిరుగుబాటు, కృతఘ్నత, విద్రోహం ఇంకా ఏది కాగలదు?

## కీడుకు దారి

కుఫ్ర్‌ను చేపట్టిన మనిషి దేవునికి ఏదయినా హాని చెయ్యగలడా? ఏ మాత్రం చెయ్యలేడు. అనంత విశ్వంలోని చిన్నారి బంతిపై నివసించే చిట్టిజీవి, ఈ మనిషి, విశ్వ ప్రభువు పట్ల ఏ కీడు తలపెట్టగలడు? ఆ విరాట్ ప్రభువు సామ్రాజ్యానికి హద్దులున్నాయా? ఎంతో శక్తిమంతమయిన దూరదర్శిని ద్వారా సయితం ఆ హద్దుల్ని నేటికీ కనుగొనలేకపోయాము మనం. ఎంతో గొప్ప శక్తి ఆయనది. దిగంతాల్లోని అసంఖ్యాకమయిన గ్రహాలు నక్షత్రాలు, భూమి, సూర్యచంద్రులు ఒక్కటేమిటి? అన్నీ ఆయన కనుసన్నల కనుగుణంగా బొంగరాల్లా భ్రమరిస్తున్నాయి.

తిరుగులేని ఆయన సిరికి కొలమానాలున్నాయా? విశ్వాన్నంతటినీ-మరొకనితో పొత్తులేకుండా - ఏలే ఏకఛత్రాధిపతి, అందరినీ అనుగ్రహించేవాడు ఆయనే. ఆయన మరొకరెవరి సహాయమూ ఆవశ్యకత లేని నిరపేక్షాపరుడు. ఆయనకు వ్యతిరేకంగా మనిషి చేసే తిరుగుబాటు ఆయనకు ఎలాంటి హానిచెయ్యజాలదు. పై పెచ్చు ఈ తలబిరుసుతనం స్వయంగా మనిషి పతనానికీ, సర్వనాశనానికీ దారితీస్తుంది.

పరమ సత్యాన్ని నిరాకరించి చేసే ఈ తిరుగుబాటుకు తప్పనిసరి పర్యవసానం : జీవిత పరమార్థంలో పరాజయం! ఇలాంటి వ్యక్తికి నిజదృష్టి, సత్యజ్ఞానం, రుజుమార్గం ఏ నాటికీ చేజిక్కవు. ఎందుకంటే స్వయంగా తన సృష్టికర్తనే గుర్తించని జ్ఞానం మరే సత్యాన్నయినా గ్రహించజాలదు. ఇతని బుద్ధీవివేకాలు నిత్యం వక్రమార్గాన్నే అవలంబిస్తాయి. తన స్వామిని గుర్తించడంలోనే తప్పటడుగు వేసిన వివేకం జీవన పథాన్ని కాంతిమయం చేయగల్గుతుందా? ఇతను జీవన వ్యవహారాలన్నింటిలో అపజయాన్నే ఎదుర్కొంటాడు; ఇతని స్వరూప స్వభావాలు, సామాజిక జీవితం, జీవికకై చేసే కృషి, కుటుంబ జీవితం, ఒక్కటేమిటి జీవితం మొత్తం తల్లక్రిందుల వుతుంది.

ఇతడు లోకంలో కల్లోలాన్ని, అరాచకాన్ని వ్యాపింపజేస్తాడు. ఇతరుల హక్కుల్ని అపహరిస్తాడు; ఇతరులతో క్రూరంగా ప్రవర్తిస్తాడు, ప్రపంచంలో వినాశాన్ని విచ్ఛిన్నాన్ని సృష్టిస్తాడు. ఇతని వక్రమయిన ఆలోచనలు, వికృతమయిన కోరికలు అసమంజసమైన దృక్పథాలు, దుష్కృత్యాలు ఇవన్నీ స్వయంగా ఆ వ్యక్తి జీవితాన్నీ అతని చుట్టుపట్ల ఉండేవారి జీవితాన్నీ దుర్భరం చేస్తాయి. ఇలాంటి వ్యక్తి ఈ లోకంలో శాంతీ సామరస్య భావాలను మట్టిపాలు జేస్తాడు. ప్రకృతి విరుద్ధంగా తన శక్తి సామర్థ్యాలపై తాను జరిపిన

అత్యాచారాలకుగాను పరలోకంలోనూ బాధ్యత వహిస్తాడు. అతని మనోమస్తిష్కాలు, కళ్ళూ చెవులు, కాళ్ళూ చేతులు - ఒక్కటేమిటి అన్నీ అతను చేసిన అన్యాయాలు, అత్యాచారాల అభియోగం అతనిపై మోపుతాయి. అతని శరీరంలోని అణువణువూ దైవ సమక్షంలో అతన్ని దోషిగా నిలబెడుతుంది. ఇంకా పరమ న్యాయశీలుడు అయిన అల్లాహ్ అతనికి తగిన శిక్షను విధిస్తాడు - కుఫ్రకు ఇలా ఇంత ఘనంగా శాస్తి జరుగుతుంది! "కుఫ్ర" అంటే ఇహపరాలలో ఘోరపరాజయానికీ, పరాభవానికి సోపానం!

## ఇస్లాం అనుగ్రహించే వరాలు

కుఫ్ర వల్ల కలిగే చెడులూ కీడుల్నీ తెలుసుకున్నాము. ఇక ఇస్లామ్ ప్రసాదించే వరాలేమిటో కాస్త పరిశీలిద్దాము. మనచుట్టూ ఉన్న ప్రపంచంలో, స్వయంగా మన అంతర్ జగత్తులో దేవుని ప్రచండ శక్తికి అసంఖ్యాకమయిన నిదర్శనాలున్నాయి. అసమానమయిన క్రమబద్ధత, అమోఘమయిన శాసనపాలనలో నిరంతరం నిర్విరామంగా పనిచేసే ఈ మహోన్నత విశ్వమే స్వయంగా ఎలుగెత్తి చాటుతోంది - తన రూపకల్పన చేసినవాడు, తనను సృష్టించినవాడు, తనను నడిపించేవాడు అత్యంత శక్తిశీలుడని, సర్వసమర్థవంతుడనీను. అపారమైన శక్తి, అవధుల్లేని జ్ఞానం, అనంతమైన సాధనాలు కలవాడు ఆయన. ఆయన వివేకం అత్యంత పరిపూర్ణం. ఆయన ఆజ్ఞల్ని జవదాటటానికి జగత్తులోనిదేది సాహసించలేదు. విశ్వంలో ప్రతి వస్తువులానే స్వయంగా మానవుడు కూడా ఆయన విధేయుడయి ఉండటమే అతనికి సహజమయిన మార్గం. వాస్తవానికి, సంకల్పికంగానో, అసంకల్పికంగానో మనిషి ఆయన శాసనాలను అనుదినం శిరసావహిస్తూనే ఉంటాడు. ఎందుకంటే ఆయన ఏర్పరచిన నియమాలకు విరుద్ధంగా నడచిన మరుక్షణమే మనిషి మృత్యువు, వినాశాలకు గురికావలసి వస్తుంది. ఇది ప్రకృతి సిద్ధాంతం. మన దైనందిన అనుభవం కూడా ఇదే.

# పరీక్ష

అయితే మనిషికి విజ్ఞానాన్ని సముపార్జించే సామర్థ్యం యోచనాశక్తి, మంచీచెడుల విచక్షణాజ్ఞానం అనుగ్రహిస్తూ ఎన్నిక, ఆచరణల స్వేచ్ఛను కూడా కొంతవరకు ప్రసాదించాడు అల్లాహ్. ఈ స్వేచ్ఛలోనే మానవుని అసలు పరీక్ష. ఇతని బుద్ధి కుశలత, వివేచనా శక్తి, విచక్షణా శక్తి, ఎన్నిక, ఆచరణల స్వేచ్ఛ – అన్నీ పరీక్షించబడుతున్నాయి. ఈ పరీక్షలో సమాధానానికి ఓ ప్రత్యేక విధానాన్ని అవలంబించవలసిన నిర్బంధం ఏదీ లేదు. నిర్బంధం వల్ల పరీక్ష లక్ష్యమే నిరర్థకమవుతుంది. పరీక్షాపత్రానికి ప్రత్యేకమయిన సమాధానాలు వ్రాయవలసినదిగా నిర్బంధిస్తే అలాంటి పరీక్ష నిష్ప్రయోజనం. స్వేచ్ఛగా జ్ఞానోచితంగా బోధపడిన రీతిలో ప్రశ్నలకు సమాధానాలు వ్రాసే స్వాతంత్ర్యం మీకు లభించినప్పుడే మీ యోగ్యతాయోగ్యతలు ఖచ్చితంగా నిర్ణయించడానికి వీలవుతుంది. సమాధానం సరైనదయితే మీరు ఉత్తీర్ణులవు తారు, ప్రగతి మార్గానపడతారు. సమాధానమే తప్పయితే అపజయాన్ని పొందుతారు, ఈ అపజయం మీ పురోగతి మార్గానికి అవరోధమవుతుంది.

ఈ లోకంలో మానవునికి ఎదురయ్యే పరిస్థితి కూడా ఇలాంటిదేః తనకు ఇష్టమయి సముచితమని తోచిన ఏ జీవిత దృక్పథాన్నయినా ఎన్నుకునేందుకు వీలుగా మనిషికి ఇచ్ఛా ఆచరణల స్వాతంత్ర్యం ప్రసాదించాడు దేవుడు – ఇస్లామ్ మార్గాన్నయినా కుఫ్ర్ విధానాన్నయినా సరే.

అయితే తన వాస్తవికతనూ, సృష్టి వాస్తవికతనూ అర్థం చేసుకోజాలడు ఒక వ్యక్తి. తన నిజ ప్రభువును ఆయన గుణగణాలను గుర్తించడంలో తప్పటడుగు వేస్తాడు. తనకు ప్రసాదించిన స్వేచ్ఛా అధికారాల దుర్వినియోగం

ద్వారా అవిధేయత ధిక్కారాల మార్గాన్ని అవలంబిస్తాడు. ఇలాంటి వ్యక్తి తన బుద్ధీ వివేకం కర్తవ్య జ్ఞానాల పరీక్షలో విఫలుడయ్యాడు, యోగ్యతా స్థానాన్ని అందుకోలేకపోయ్యాడు - పర్యవసానంగా పైన పేర్కొన్న పరిణామం తప్ప ఇతర ఫలితానికి అర్హుడు కాడు.

మరొకవైపు ఇంకొక వ్యక్తి ఈ పరీక్షలో విజయవంతంగా నిలుస్తాడు. తన జ్ఞానం వివేకాలను సద్వినియోగం చేసుకుని తన సృష్టికర్తను గుర్తిస్తాడు, ఆయన్ని విశ్వసిస్తాడు. తనపై ఎలాంటి బలవంతం లేకపోయినప్పటికీ దైవ విధేయతా మార్గాన్నే అవలంబించడానికి ఎన్నుకుంటాడు. మంచి - చెడుల విచక్షణలో తప్పటడుగు వెయ్యడు. చెడు వైపు మొగ్గడానికి తాను సర్వస్వతంత్రుడయినప్పటికీ మంచిని అనుసరించాలనే కోరుకుంటాడు. తన ఉనికి యదార్థాన్ని, సృష్టి వాస్తవికతను, ప్రకృతి సిద్ధాంతాలను అర్థం చేసుకుంటాడు. ఏ విధానాన్నయినా అనుసరించడానికి స్వేచ్ఛ, శక్తి కలవాడయినప్పటికీ సృష్టికర్త అయిన దేవుని విధేయతా విధానాన్నే అనుసరిస్తాడు. తన వివేకాన్నీ ఇతర శక్తులన్నిటినీ సమంజసంగా, సవ్యంగా ఉపయోగించిన కారణాన ఇతను సాఫల్యం పొందుతాడు. యదార్థాన్ని చూడటానికి ఉపయోగిస్తాడు తన కళ్ళను. సత్యాన్ని వినడానికి వినియోగిస్తాడు తన చెవుల్ని, సరయిన నిర్ణయాలను చెయ్యడానికి ఉపయోగిస్తాడు తన వివేచనా శక్తిని. తన మనోమస్తిష్కాల శక్తుల్ని తాను ఈ విధంగా ఎన్నుకున్న సన్మార్గంపై నడవడానికి వినియోగిస్తాడు. పరమ సత్యాన్ని ఎన్నుకుని, యదార్థాన్ని కనుగొని, హృదయపూర్వకంగా సంతోషంగా తన ప్రభువుకు, తన యజమానికి దాసోహమంటాడు. ఇతనే విజ్ఞుడు, సత్యవంతుడు, కర్తవ్యపరాయణుడు. ఎందుకంటే అంధకారానికి బదులుగా కాంతిని ఎన్నుకున్నాడు. తద్వారా కన్పించిన వెలుగుబాటను మనస్ఫూర్తిగా ఉత్సాహంతో ఆనందంతో అనుస

రించాడు. ఇలాచేసి, తాను కేవలం ఒక సత్యాన్వేషి మాత్రమే కాడనీ, సత్యజ్ఞానం కలవాడనీ, సత్యోపాసకుడని కూడా నిరూపించుకున్నాడు. నిస్సందేహంగా ఇతను సన్మార్గంపై ఉన్నాడు - ఇలాంటి వ్యక్తే ఇహపరాలలో సాఫల్యం పొందేవాడు.

## ఉనికే ఓ వరప్రసాదం

జ్ఞానం ఆచరణల ప్రతి రంగంలోనూ సదా సన్మార్గాన్ని ఎన్నుకుంటాడు. ఇలాంటి వ్యక్తి, దేవుణ్ణి, ఆయన గుణవిశేషాల సమేతంగా గుర్తించిన వ్యక్తి, పరమ సత్యానికి ఆద్యంతాలను గ్రహిస్తాడు. ఇతడు ఎన్నటికీ మార్గం తప్పిపోడు. ఎందుకంటే ఇతని తొలి అడుగే రుజుమార్గంపై పడింది. జీవితంలో పయనించవలసిన దశ, చేరవలసిన గమ్యం అన్నీ బాగా విశదమయ్యాయి.

ఒక తత్వవేత్తగా సృష్టి రహస్యాలను ఛేదించడానికి ప్రయత్నిస్తాడు. కాని, ఒక కాఫిర్ తాత్వికునిలా సందేహం, సందిగ్ధాల పద్మవ్యూహంలో పడి దారి తప్పడు. ఇతని మార్గం దివ్య దృష్టి ద్వారా కాంతిమయం కావడంచేత ఇతని ప్రతి అడుగు సరయిన దిశలో పడుతుంది. వైజ్ఞానిక రంగంలో ప్రవేశిస్తే ప్రకృతి సిద్ధాంతాలను గ్రహించి సరయిన పంథాలో కృషి చేస్తాడు. ధరణిలోని గుప్తనిధుల్ని వెలికితీస్తాడు. అంతవరకు నిగూఢమయి ఉన్న మానసిక భౌతిక శక్తులనన్నింటినీ మానవాళి సుఖశాంతుల కొరకు వినియోగిస్తాడు. విజ్ఞాన వీధులన్నిటినీ గాలించి భూమ్యాకాశాల్లో ఉన్నదంతా మానవ శ్రేయానికై ఉపయోగపడేలా తన శక్తినంతా ధారపోసి కృషి చేస్తాడు. ఇతనిలో ఉన్న దైవ జ్ఞానం, అన్వేషణ, పరిశోధనకు సంబంధించిన ప్రతి దశలోనూ ఇతన్ని తన విజ్ఞానాన్ని, వైజ్ఞానిక శక్తుల్ని చెడుకై, వినాశకరమయిన

పనులకై దుర్వినియోగం చెయ్యడానికి అనుమతించదు.

ఉనికిలో ఉన్నదానికంతటికీ, సృష్టి మొత్తానికి తానే యజమాని అనే భ్రమకు లోనయి ప్రకృతినే జయించానని ప్రగల్భాలు పలకాలని, దైవిక శక్తులు, శాసక శక్తులు అన్నీ తనకు సంక్రమించాయని విర్రవీగాలని, అహంభావపు ఘోషలు చెయ్యాలని ఇతడు ఎన్నడూ తలపోయడు. ప్రపంచాన్నే తల క్రిందులు చేసే, మానవాళినే లోబరచుకునే, పెద్దా చిన్నా అందరిపైనా ఏదో ఒక విధంగా అధికారం చెలాయించే పగటి కలలకూ భ్రమలకూ ఎన్నటికీ తావివ్వడు. ఇలాంటి అహంభావానికీ, తిరుగుబాటు ప్రవృత్తికీ ఒక ముస్లిమ్ వైజ్ఞానికుడు బానిస కానేరడు. కాఫిర్(దైవ తిరస్కారి) సైంటిస్టు మాత్రమే ఇలాంటి భ్రమకు లోనయి మానవాళినంతటినీ ప్రమాదాలకు సర్వనాశనానికీ గురిచేస్తాడు.★ కాని ఒక ముస్లిమ్ శాస్త్రవేత్త

---

★ సరిగ్గా ఇలాంటి పరిస్థితినే ఆధునిక మానవుడు ఎదుర్కొంటున్నాడు *Dr. Joad* ఎంత బాగా వ్రాశాడు: "దేవతలకు మాత్రమే యోగ్యమయిన శక్తుల్ని, విజ్ఞానం నేడు మనకు ప్రసాదించింది. కాని వాటి వినియోగానికై మనకు ఉన్న మానసిక శక్తి బడి పిల్లలదీ, అడవి మనుషులదీను."

ప్రముఖ తత్వవేత్త బర్ట్రాండ్ రస్సెల్ ఇలా అన్నాడు: "విస్తృతంగా చెప్పాలంటే మానసిక ప్రావీణ్యం అనే సాధనాలకూ మానవుని పొరపాట్లనే గమ్యాలకు జరుగుతున్న పరుగు పందెం మధ్యలో ఉన్నాము మనం. ఈ గమ్యాలను సాధించడానికి ప్రావీణ్యంలో ఎంతగా అభివృద్ధి జరుగుతుందో అంతగా దుష్టపరిణామాలే ఎదురవుతున్నాయి. అజ్ఞానం అయోగ్యతల వల్లనే ఇంతవరకు మానవాళి మనగలిగింది కాని పొరపాట్లు అవివేకాలతోపాటు విజ్ఞానం, యోగ్యతలు మిళితమయినప్పుడు మానవాళి మనుగడే సందేహాస్పదం.

(సైంటిస్టు) పూర్తిగా భిన్నమయిన రీతిలో వ్యవహరిస్తాడు. వైజ్ఞానిక రంగంలో అతని ప్రావీణ్యం ఎంత అధికమవుతుందో అంతే దృఢమవుతుంది అతని దైవ విశ్వాసం. దైవం ఎడల కృతజ్ఞతా భావంతో అతడు అంతే వినమ్రుడవుతాడు. ప్రభువు తనకు గొప్ప విజ్ఞానాన్ని, శక్తినీ ప్రసాదించినందుకు, స్వయంగా తన శ్రేయం కొరకు మానవ కళ్యాణం కొరకు తాను చెయ్యవలసిన కృషి ఎంతో ఉందనే యదార్థం అతనికి వెల్లడవుతుంది. అహంకారానికి బదులు వినమ్రత జనిస్తుంది. అధికారోన్మాదం కాక మానవ సేవాభావం దృఢమవుతుంది. హద్దుపద్దుల్లేని విశృంఖలత్వాన్ని కాంక్షించక నైతిక సూత్రాలు, దైవాదేశాల పరిధుల్లో మెలుగుతాడు. ఈ విధంగా ఇతని హస్తాల్లో విజ్ఞానం వినాశ కారణంగా మారకుండా మానవ శ్రేయానికీ, నైతిక విలువల వికాసానికీ సాధనంగా రూపొందుతుంది. తనకు అల్లాహ్ అనుగ్రహించిన బహుమానాలూ కానుకలకై తన ప్రభువు పట్ల ఇతను ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలుపుకుంటాడు.

---

విజ్ఞానం ఒక శక్తి, మంచి కొరకు దీన్ని ఎంతవరకు వినియోగించడానికి వీలుందో చెడుకోసం సయితం ఉపయోగించుకునేందుకు అంతే వీలుంది. తేలిందేమంటే విజ్ఞానాభివృద్ధి జరిగిన కొద్దీ మనిషి తన వివేకాన్ని వృద్ధిపరచుకోలేకపోతే విజ్ఞానాభివృద్ధి దుఃఖానికి చేటు."

*(Impact of Science on Society : PP 120 – 121)*

మరో ప్రముఖ తత్వవేత్త ఇలా సెలవిచ్చాడుః "మనం పక్షుల్లా గాలిలో ఎగరడం, చేపల్లా నీటిలో ఈదడం నేర్చుకున్నాము. కాని భూమిపై మనుషుల్లా ఎలా జీవించాలో మనకు తెలీదు."

*(Counter attack from the East by Dr. Joad P – 28)*

ఇలాగే చరిత్ర, ఆర్థిక శాస్త్రం, రాజనీతి, న్యాయశాస్త్రం ఇంకా ఇతర శాస్త్రాల్లో, కళల్లో, అన్వేషణ, కృషి సలపడంలో ఒక ముస్లిమ్ వైజ్ఞానికుడు కాఫిర్ కంటే ఏ విధంగానూ తీసిపోడు. కాని, దృక్కోణాలు, తదనుగుణంగా వారి కార్యాచరణ విధానాలు ఎంతో భిన్నంగా ఉంటాయి. ఒక ముస్లిమ్ ప్రతి శాస్త్రాన్ని దాని నిజ స్వరూపం దృష్ట్యా పరిశోధిస్తాడు. సరయిన లక్ష్యాలకై కృషి చేస్తాడు, సవ్యమైన ఫలితాలను సాధిస్తాడు.

## నిజమయిన ముస్లిం

చరిత్రను మధించి మానవుని గత అనుభవాల ద్వారా సముచిత మయిన గుణపాఠాన్ని గ్రహించి నాగరికతా వృద్ధికీ, పతనానికీ కాగల కారణాలను కనుగొంటాడు. గతంలోని మేలయిన, సరయిన విషయాలన్నింటినీ గ్రహించడానికి ప్రయత్నిస్తాడు. జాతుల పతనానికి కారణభూత ములయిన వాటినన్నింటినీ అతి జాగ్రత్తగా త్యజిస్తాడు.

రాజకీయ రంగానికి వస్తే ఒక ఆదర్శ రాజ్యాన్ని స్థాపించే కృషి చెయ్యడమే అతని ధ్యేయం. అది నీతి, నిజాయితీ, న్యాయం, శాంతి, సౌభ్రాత్రతలు విలసిల్లే రాజ్యం; మానవులంతా సోదరులై సహజీవనం గడిపే, మానవత్వం ఆదరింపబడే రాజ్యం; స్వప్రయోజనాలకై ఇతరులను వినియోగించుకునే వారు కానరాని చోటు; బానిసత్వం సమసిపోయి ప్రాథమిక మానవ హక్కులు గౌరవింపబడే చోటు; ప్రభుత్వాధికారాలు దైవదత్తమయిన అమానతుగా పరిగణింపబడి అవి సర్వ మానవ శ్రేయానికై ఉపయోగింపబడే చోటు.

న్యాయశాస్త్ర రంగంలో ఒక ముస్లిమ్ చేసే కృషిలోని ముఖ్యాంశాలుః ఈ వ్యవస్థను న్యాయానికి ప్రతీకగా రూపొందించడం, ప్రజలందరి హక్కుల్ని ముఖ్యంగా బలహీనుల హక్కుల్ని పరిరక్షించడం, ప్రతి ఒక్కడు తన వాటాను సముపార్జించుకునేందుకు వీలుగా ఒత్తిడి, అన్యాయం ఎవరిపై నా జరగకుండా చూడటం, న్యాయాన్ని ఆదరించడం, ఇతరులచేత ఆదరింపజెయ్యడం, న్యాయం సర్వసామాన్యంగా లభించేందుకు కృషి చెయ్యడం.

## బాధ్యతాభావం

ఒక ముస్లిమ్ నైతిక జీవితం దైవభక్తి, దైవ భీతి, సదాచారం, సత్యం సౌశీల్యాలతో కళకళలాడుతూ ఉంటుంది. ఉనికిలో వున్నదానంతటికీ ప్రభువు అల్లాహ్ ఒక్కడే అనీ, తనకూ ఇతరులందరికీ లభించినదంతా ఆ దైవం ప్రసాదించినదే అనీ, తనకున్న శక్తిసామర్థ్యాలన్నీ దైవం తరఫున లభించిన అమానతు అనీ, తనకు అనుగ్రహించబడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గుడ్డిగా ఉపయోగించడానికి కాదనీ, వీటిని దైవేచ్ఛ ప్రకారం వినియోగించటంలోనే తన శ్రేయోలాభాలు ఇమిడి ఉన్నాయని దృఢ విశ్వాసంలో జీవిస్తాడు ముస్లిమ్. ఒకనాడు తన ప్రభువు సన్నిధిలో తాను మరలిపోవలసి ఉందనీ, అక్కడ తన ఇహలోక జీవితపు లెక్కల్ని సమర్పించుకోవలసి ఉందని అతడు విశ్వసిస్తాడు. అనుక్షణం తన ప్రతి కదలిక గణించబడుతూనే ఉంటుందనే భావం అతని హృదయాంతరాళాల్లో నాటుకుని ఉంటుంది. అందువల్ల అతడు ఏనాడూ విశృంఖల జీవిగా బాధ్యతారహితుడుగా ప్రవర్తించడు.

ఇలాంటి భావాలతో, ఇలాంటి మనో ప్రవృత్తితో జీవించే వ్యక్తిలోని

నైతిక ఔన్నత్యం గురించి మీరే అంచనా వేసుకోండి. సత్యం, సదాచారం, సానుభూతి, ప్రేమ, సుహృద్భావాలకు ఆలవాలమవుతుంది. అతని ఉనికి, అతని మనుగడే మానవాళికి మహా వరప్రసాదం. ఇలాంటి వ్యక్తి తన మనస్సులో చెడు భావాలకు తావివ్వడు; మస్తిష్కంలో దురాలోచనలకు చోటివ్వడు; నోటిని, కళ్ళను, చెవులను చెడు విషయాల ద్వారా కలుషితం కానివ్వడు; అధర్మమైన జీవనోపాధితో కడుపు నింపుకోవడంకన్నా పస్తులుండటం శ్రేయస్కరంగా తలుస్తాడు, తన చేతులతో దౌర్జన్యం జరగటం ఏనాటికీ సహించడు. కాళ్ళు పెడద్రోవ తొక్కడం ఏ మాత్రం ఒప్పుకోడు, తల నరికివేసినా అసత్యం ముందు తలవంచడు. తన అవసరాలను, కోరికల్ని, అన్యాయంగా తప్పుడు మార్గాల ద్వారా ఏ పరిస్థితిలోనూ తీర్చుకోడు.

సదాచారానికి, సౌశీల్యానికి ప్రతీక అతని జీవితం. సత్యాన్ని, సన్మార్గాన్ని ప్రాణాలకంటే అధికంగా ప్రేమిస్తాడు - వీటికై అవసరమయితే ప్రతి స్వప్రయోజనాన్నీ ప్రతి కోరికనూ చివరికి తన ప్రాణాన్నయినా సరే త్యాగం చెయ్యగలడు. దుర్మార్గాన్నీ, దౌర్జన్యాన్నీ అన్నిటికన్నా అధికంగా అసహ్యించుకుంటాడు. నష్టం కలిగే భయమో, లాభం పొందే ప్రలోభమో చెడును ఆశ్రయించేందుకు ఇతన్ని పురికొల్పలేవు. ఇలాంటి ఒక వ్యక్తినే స్వయంగా ఒక శక్తి అనవచ్చు. తన ధ్యేయంలో ఇతను విజయం సాధించడం తథ్యం. ఇతని దారికి అడ్డువచ్చినదేదీ నిలువకపోవడం సత్యం.

అతనికంటే మంచివాడు, గౌరవనీయుడు మరొకడు దొరకడు. ఎందుకంటే ఇతడు దైవం తప్ప మరెవరి సమక్షంలోనూ తలవంచడు.

ఇతడు దైవం తప్ప మరెవ్వరి సన్నిధిలోనూ చేయి చాచి అర్థించడు. ఇలాంటి వ్యక్తి జీవితంలో ఏ దశలోనయినా నైచ్యం అన్నది తొంగిచూడటం కూడా సాధ్యమా?

## శక్తిసంపన్నతకు మారుపేరు

ఇతన్ని మించిన శక్తిమంతుడు కూడా లోకంలో ఉండడు. ఎందుచేతనంటే ఇతని ఆంతర్యం దైవానికి తప్ప మరే శక్తికీ భయపడదు. దైవం తప్ప ఇతరుల వల్ల ప్రతిఫలమో బహుమానమో లభిస్తుందన్న ఆశ కూడా ఇతనికి ఉండదు. ఇలాంటి వ్యక్తిని సత్యాన్నుండి, సన్మార్గాన్నుండి తొలగించగల శక్తి ఏది? ఇతని విశ్వాస బలాన్ని కొనగల సిరి ఏది?

ఇతనితో సరితూగే శ్రీమంతుడు కూడా ఎవడూ దొరకడు. ఎందువల్లనంటే, ఇతను భోగప్రియుడు కాదు. మనోకాంక్షలదాసుడు కూడా కాదు. లోభి దురాశాపరుడు అంతకన్నా కాదు. ధర్మసమ్మతంగా, స్వయంకృషి వల్ల ఆర్జించిన దానిపైనే తృప్తిచెందుతాడు. అధర్మమయిన ధనరాసుల్ని తనకు సమర్పించినా వాటిని తుచ్ఛమని భావించి తృణీకరిస్తాడు, సంతృప్తికి మించిన సంపద మరొకటి ఉందా?

ఇతనిలాంటి సకలజనప్రియుడు, అందరి మన్ననల నందుకునేవాడు కూడా మరొకడు ఉండడు. ఎందుకంటే ఇతను అందరి హక్కులను న్యాయవంతంగా అందజేస్తాడు; ఎవరి హక్కునూ కాజేయడు; ప్రజల యోగక్షేమాల కొరకు శ్రేయో లాభాల కొరకు పాటుపడతాడు; ఎవరికీ నష్టం కలిగించడు - ప్రతి ఒక్కరి మంచినే కోరుకుంటాడు. ఎలాంటి

ప్రతిఫలమూ ప్రజల ద్వారా ఆశించడు. ప్రజల హృదయాలు ఇతని వైపుకు తామయి మరలవా? ఇలాంటి వ్యక్తిని కాకపోతే ప్రజలు ఎవరిని గౌరవిస్తారు? ఎవరిని అభిమానిస్తారు?

ఇతనికంటే విశ్వసనీయుడయిన మనిషి కూడా మరొకడు దొరకడు. ఎందుకంటే ఇతడు తనకు అప్పజెప్పిన అప్పగింత (అమానతు) పట్ల ఏమాత్రం ద్రోహం తలపెట్టడు. సత్యాన్ని ఏ పరిస్థితిలోనూ వదలడు. ఇచ్చిన మాటను ఎన్ని పాట్లయినా పడి నిలబెట్టుకుంటాడు. వ్యవహారాల్లో నికరంగా ప్రవర్తిస్తాడు. తనను మరెవ్వరూ చూసేవారు లేకపోయినా సర్వోపరిజ్ఞాని అల్లాహ్ చూస్తూ ఉంటాడనే విశ్వాసంతో నిత్యం నిజాయితీగా వ్యవహరిస్తాడు. ఇలాంటి వ్యక్తి విశ్వసనీయతను శంకించడానికి వీలుంటుందా? ఇతన్ని విశ్వసించనివారంటూ ఎవరుంటారు?

"ముస్లిమ్" స్వరూప స్వభావాలను బాగా తెలుసుకుంటే అతడు ప్రపంచంలో నీచంగా, బానిసగా, అణగిమణగి, మరొకరికి లొంగి ఉండవలసిన అవసరం ఏమాత్రం ఉండదని అతన్ని ఎప్పటికీ ప్రభావశాలిగా, పాలకునిగా, అధిపతిగానే ప్రపంచం చూడగలుగుతుందని ఎవరయినా ఇట్టే నమ్మగలరు. ఎందుకంటే ఇస్లామ్ ఇతనిలో సృజించిన గుణగణాలపై ఆధిక్యతపొందే మరో శక్తి ఉండదు.

ఇలా ప్రపంచంలో గౌరవమర్యాదలతో జీవితం గడిపిన తరువాత ఇతను తన ప్రభువు సమక్షంలో హాజరయినప్పుడు అల్లాహ్, ఇతనిపై తన కరుణానుగ్రహాలను వర్షింపజేస్తాడు. ఎందుకంటే దైవం తనకు అప్పజెప్పిన అమానతుపట్ల తన విద్యుక్త ధర్మాన్ని ఇతను పూర్తిగా నెరవేర్చాడు, దైవం ఏర్పరచిన పరీక్షలో మంచి మార్కులతో నెగ్గాడు. ఇది మహోజ్వలమయిన

విజయాల అనంత పరంపర - ఇహలోకం మొదలు పరలోకం వరకు ఎడతెగకుండా వర్షించే అనుగ్రహాల అమృతధార.

ఇదియే ఇస్లామ్ - మానవుని ప్రకృతి సిద్ధమయిన ధర్మం. ఇది ప్రత్యేకంగా ఒక జాతికీ, ఒక దేశానికీ చెందినది కాదు. ప్రతి యుగంలోనూ, ప్రతి జాతిలోనూ, ప్రతి దేశంలోనూ నివసిస్తూ వచ్చిన దైవభక్తులూ, సత్యప్రియులూ అయిన సజ్జనులందరూ అనుసరించిన ధర్మం. తమ తమ భాషల్లో వారు దీన్ని ఇస్లామ్ అని పిలిచినా మరే పేరు పెట్టి పిలిచినా వారు అనుసరించిన ధర్మం ఈ ఇస్లామే. వారంతా ముస్లిములే.

# రెండవ అధ్యాయం

# విశ్వాసం, విధేయత

ఇస్లామ్, విశ్వ ప్రభువు విధేయతకే మారుపేరు. అయితే మనిషి దేవుని విధేయత పూర్తిగా పాటించాలంటే అతనికి కొన్ని ప్రాథమిక సత్యాల జ్ఞానం ఉండాలి. ఆ జ్ఞానం దృఢ విశ్వాసంగా మారాలి. అలా కాకపోతే విధేయత సాధ్యపడదనే మాట సుస్పష్టం. అయితే ఆ సత్యాలేవీ? దైవా జ్ఞానుసారం జీవితాన్ని సరిదిద్దుకోడానికి కావలసిన ప్రాతిపదికలేవి? ఈ విషయాలు ఇప్పుడు మన చర్చనీయాంశాలు.

## జ్ఞానం, విశ్వాసం

ప్రప్రథమంగా మనిషికి దేవుని ఉనికి పట్ల పరిపూర్ణ విశ్వాసం ఉండటం అవసరం. ఎందుకంటే అతడు దేవుడు ఉన్నాడని దృఢంగా, అచంచలంగా నమ్మకనేపోతే దైవ విధేయతను ఎలా పాటిస్తాడు?

దీనికితోడుగా దేవుని గుణవిశేషాల జ్ఞానం ఉండటం కూడా అవసరమే. అల్లాహ్ గుణవిశేషాల జ్ఞానమే మనిషిలో ఉత్తమ మానవీయ గుణాలు సృజించి అతని జీవితాన్ని ధర్మపరాయణతకు దైవ భక్తికి అనురూపంగా మార్చడంలో తోడ్పడుతుంది, దేవుడు ఒక్కడే, ఆయన దైవత్వంలో ఎవ్వరికీ భాగస్వామ్యం లేదు అనే విషయాలు ఎవరికయితే తెలియవో వారు దైవం తప్ప ఇతరులముందు తలవంచకుండా, తప్పుడు దేవుళ్ళ మెప్పులు పొందడానికి వారికి ముడుపులు చెల్లించకుండా ఎలా ఉండగలరు? అల్లాహ్ సర్వాన్ని చూడగలడు, వినగలడు. ఆయన అన్ని విషయాల జ్ఞానం కలవాడు అని గట్టినమ్మకంలేని వ్యక్తి దేవుని అవిధేయతకు గురికాకుండా ఉండగలడా? ఈ

విషయాలను కాస్త జాగ్రత్తగా పరిశీలించారంటే, మనిషికి దేవుని గుణగణాల సరయిన జ్ఞానం లేనంతవరకు ఆలోచనల్లో, ఆచరణల్లో ఇస్లామ్ చూపే రుజుమార్గాన్ని అవలంబించడానికి అవసరమయిన లక్షణాలు అతనిలో జనించజాలవని ఇట్టే గ్రహించగలరు. ఈ "జ్ఞానం" కేవలం తెలుసుకునేంతవరకు ఉంటే లాభం లేదు. ఇది దృఢ విశ్వాసంగా హృదయాంతరాళాల్లో ప్రతిష్ఠించ బడాలి. అప్పుడే మనిషి మనసులో దీనికి భిన్నమయిన ఆలోచనలు, సందేహాలు, సంశయాలు చొరబడవు; జీవితం ఈ జ్ఞానానికి ప్రతికూలమయిన ఆచరణ, అలవాట్లు లేకుండా స్వచ్ఛంగా నిర్మలంగా ఉంటుంది.

ఆపైన, దైవప్రసన్నత పొందడానికి, ఆయన అభీష్టానికనుగుణంగా జీవితం గడపడానికి సరయిన విధానమేదో దైవం ఇష్టపడే విషయం ఏదో, ఇష్టపడనిదేదో మనిషికి బాగా అవగతమయి ఉండాలి. అప్పుడే దైవం సమ్మతించేదాన్ని అవలంబించడం, సమ్మతించనిదాన్ని త్యజించడం సాధ్యమవుతుంది. దైవ శాసనం, దైవం ప్రసాదించిన నియమావళి ఏదో మనిషికి పూర్తిగా తెలియాలి. కేవలం తెలిసి ఉంటే సరిపోదు అది దైవ నియమావళి అనీ, దాని అనుసరణలోనే తన ఇహపరాల సాఫల్యం ఉందనీ మనిషికి అచంచల విశ్వాసం కలగాలి. ఎందుకంటే ఇలాంటి దృఢమైన విశ్వాసం లేకుండా కేవలం జ్ఞానం మాత్రమే ఉంటే, అంధకారమయమయిన అవిధేయతా సాగరంలో అతడు మునిగిపోవడానికి ఎంతయినా ఆస్కారం ఉంది.

## పరలోకం

ఇంతేకాదు, విశ్వాసం, విధేయతల వల్ల, అవిశ్వాసం, అవిధేయతల వల్ల కలిగే పర్యవసానాలు ఎలా ఉంటాయో, దైవ సమ్మతికి భిన్నంగా ప్రవర్తిస్తే కలిగే పరిణామం ఏమిటో, ఆయన విధేయతలో పరిశుద్ధమయిన

జీవితం గడపడంచేత లభించే భాగ్యాలేవో మనిషికి బాగా తెలిసి ఉండాలి. దీనిగ్గాను అతనికి, మరణానంతర జీవితం(ఆఖిరత్) అల్లాహ్ న్యాయస్థానంలో హాజరుకావడం, అవిధేయతకు శిక్ష, విధేయతకు బహుమానం ప్రాప్తం కావడం - తదితర విషయాల సంపూర్ణ జ్ఞానం, వాటిపై ఎటూ తొణకని నమ్మకం ఉండటం ఎంతో అవసరం.

పరలోక జీవితం గురించి ఎరుగని వ్యక్తి దైవ విధేయత, అవిధేయతలను నిష్ఫలమయినవిగా భావిస్తాడు. విధేయతతో ఆజ్ఞాపాలన చేసేవాడూ అవిధేయుడయి మసలుకునేవాడూ ఇద్దరూ సమానమే అని ఊహిస్తాడు. ఎందుకంటే ఇతని ప్రకారం, ఇద్దరూ మరణించి మట్టిపాలు కావలసినవారే. ఇలాంటి భావాలుకల వ్యక్తి విధేయతా బంధనాల్ని ఆ మార్గంలో కలిగే కష్టాల్ని మనసారా సహిస్తాడనీ, ఈ లోకంలో ప్రత్యక్షంగా ఎలాంటి నష్టాన్ని కలగజెయ్యని చెడు కార్యాల్ని త్యజిస్తాడనీ ఆశించేందుకు ఎలా వీలవుతుంది? ఇలాంటి అపవిశ్వాసంతో మనిషి దైవ నియమావళిని ఏనాడూ శిరసావహించడు. ఇంకా మరణానంతర జీవితానికి, దైవ న్యాయస్థానంలో హాజరు కావడానికి సంబంధించిన జ్ఞానం మాత్రం ఉండి, వాటిపై దృఢ విశ్వాసంలేని వ్యక్తి కూడా, పాపపు కార్యాల పట్ల, చెడు వ్యసనాల పట్ల ఆకర్షణ కలిగించే ఈ ఐహిక జీవితంలో దైవ విధేయతా మార్గంపై స్థిరంగా నిలువలేడు. ఎందుకంటే సందేహం, సంశయాలతో మనిషి ఏ విషయంపై కూడా నిలకడ కనబరచలేడు. ఒక కార్యాన్ని మనఃపూర్వకంగా నిర్వర్తించాలంటే ఆ కార్యం లాభదాయకమని మీకు పూర్తిగా నమ్మకం కుదరాలి. అంతవరకూ మీరు ఈ కార్యాన్ని తలపెట్టరు. మరో విషయాన్ని పూర్తిగా వదలుకోవాలంటే అది నష్టదాయకమని మీకు గట్టి నమ్మకం కలగాలి. లేకపోతే మీరు దాన్ని వదలివెయ్యరు. కనుక తేలిందేమంటే ఒక విధానాన్ని అనుసరించాలంటే దానివల్ల కలిగే పరిణామం, ప్రతిఫలాల జ్ఞానం ఉండటం ఎంత అవసరమో, ఈ జ్ఞానం ప్రగాఢ విశ్వా

సాన్ని జనింపజేసేదిగా ఉండటం కూడా అంతే అవశ్యం.

## ఈమాన్ నిర్వచనం

జ్ఞానం, విశ్వాసం అని పైన పేర్కొన్న దానికే "ఈమాన్" అని పేరు. "ఈమాన్" అన్న అరబీ పదానికి, తెలుసుకోవటం, నమ్మడం, ఏ మాత్రం సంశయం లేకుండా సంపూర్ణ తృప్తితో విశ్వసించడం అని భావం. ఏ వ్యక్తి అయితే దేవుని ఏకత్వాన్ని, ఆయన నిజ గుణగణాల్ని, ఆయన శాసనాల్ని, ఆయన ప్రసాదించే శిక్ష, బహుమానాల్ని తెలుసుకుని అవి సత్యమైనవని మనఃపూర్వకంగా విశ్వసిస్తాడో అలాంటి వ్యక్తిని "మోమిన్" (విశ్వాసి) అని అంటారు. ఈమాన్, మనిషిని విధేయతకై, దైవాజ్ఞాపాలనకై, దేవునికి స్వయం సమర్పణకై సిద్ధం చేస్తుంది. ఇలాంటి జీవితాన్ని గడిపే వ్యక్తి - ముస్లిమ్.

ఈ ఈమాన్ (దైవ విశ్వాసం) నిర్వచనం ద్వారా 'ఈమాన్' లేకుండా ఏ వ్యక్తీ ముస్లిమ్ కాజాలడని గ్రహించడం అతి సులభం. ఇస్లామ్, ఈమాన్‌ల మధ్యగల సంబంధం, చెట్టుకూ విత్తనానికీ గల సంబంధం లాంటిది. విత్తనం లేకుండా చెట్టు మొలకెత్తడం అసంభవం. అచ్చం ఇలాగే ఒక వ్యక్తిలో అసలు ఈమాన్ అన్నదే లేకపోతే అతను "ముస్లిమ్" అవడం ఏ విధంగానూ సంభవం కాదు. అయితే మరో విధంగా జరగడం మాత్రం సంభవమే. విత్తనమయితే భూమిలో నాటడం జరిగింది. కాని భూమి సారవంతం కాకపోవడంచేత లేక దాని అనుకూల వాతావరణం లభించకపోవడంచేత ప్రయోజనంలేని చెట్టు ఎదుగుతుంది. అలాగే ఒక వ్యక్తి ఆంతర్యంలో ఈమాన్ ఉన్నప్పటికీ అతడు తన మానసిక బలహీనతల వల్లనో, లేక సరయిన శిక్షణ లేకపోవడం వల్లనో, లేక దుష్ట సహవాసం వల్లనో పరిపూర్ణ ముస్లిమ్ కాలేకపోతాడు.

ఈమాన్, ఇస్లామ్‌ల ఆధారంగా మానవులందరినీ నాలుగు వర్గాలుగా విభజించవచ్చు.

మొదటి వర్గంవారు ఈమాన్ (విశ్వాసం) కలవారు. వీరి ఈమాన్ వీరిని పరిపూర్ణ దైవ విధేయులుగా తయారుచేస్తుంది. మామూలుగా నిప్పును ముట్టుకునేందుకు మనిషి ఏ విధంగా భయపడతాడో అలాగే దైవం సమ్మతించని విషయాల నుండి దూరంగా వుంటారు వారు. దైవం సమ్మతించిన పనుల నిర్వహణలో సామాన్యంగా సిరిసంపదల సముపార్జన కొరకు మనిషి కనబరిచే ఆసక్తి కంటే అధికమయిన శ్రద్ధ ప్రకటిస్తారు.

రెండవ వర్గానికి చెందినవారిలో విశ్వాసమైతే ఉంటుంది కాని వారిని సంపూర్ణ దైవ విధేయులుగా తీర్చిదిద్దే దృఢమయిన విశ్వాసం కాదు వారిది. వారు ఈమాన్ దృష్ట్యా కాస్త అధమ వర్గానికి చెందినవారయినప్పటికీ వారు కూడా ముస్లిములే. పూర్తిగా దైవాజ్ఞాపాలన చేయలేకపోవడం వల్ల తమ నేరానికి శిక్షకు పాత్రులవుతారు. కనుక వారి పరిస్థితి "దోషి" లాంటిది మాత్రమే కాని "ద్రోహి" లాంటిది మాత్రం కాదు. ఎందుకంటే వారు నిజ ప్రభువును తమ ప్రభువుగా అంగీకరిస్తారు. ఆయన శాసనాల్ని అతిక్రమించినప్పటికీ వాటిని ప్రభు శాసనాలుగా ఒప్పుకుంటారు.

మూడవ వర్గానికి చెందినవారు, ఈమాన్ (విశ్వాసం) లేనివారు. దైవాదేశాలకు అనుగుణంగా కనబడే కార్యాల్ని బాహ్యంలో చూస్తూ ఉన్నప్పటికి వారు యదార్థంలో ద్రోహులు. వారి బాహ్య ఆచరణ, విశ్వాసంలేని కారణాన, వాస్తవంగా దైవ విధేయత లేక దైవాజ్ఞాపాలన ఏ మాత్రం కాదు. కనుక దీనికి ఎలాంటి విలువ కూడా లేదు. ఒక వ్యక్తి నిజప్రభువును ప్రభువుగా స్వీకరించకుండా ఆయన ఆజ్ఞల్ని ఆజ్ఞలుగా సమ్మతించకుండా బాహ్యంలో మాత్రం ప్రభువు ఆదేశాలకు భిన్నంకాని కార్యాలే చేసినప్పటికీ అతన్ని ప్రభువు పట్ల

భక్తికలవాడనీ ఆయన ఆజ్ఞల్ని పాలించేవాడనీ మనం అనలేము. అతను ఎట్టి పరిస్థితుల్లోనూ ద్రోహుల్లో చేరినవాడే.

నాల్గవ వర్గానికి చెందినవారు, విశ్వాసం (ఈమాన్) లేని వారు, సత్కార్యాలు కూడా చెయ్యనివారు. వారు అధమాతి అధమ వర్గానికి చెందినవారు. ఎందుకంటే వీరు (విశ్వాసం రీత్యా) ఒక వైపు ద్రోహులయితే (తమ ప్రవర్తన దృష్ట్యా) మరొక వైపు దుష్టులూ దుర్మార్గులు కూడా!

మానవుల ఈ విభజన ద్వారా తేలిందేమంటే వాస్తవానికి, మానవ మోక్షం, శ్రేయం, సఫలతలు ఈమాన్(విశ్వాసం) పై ఆధారపడి ఉన్నాయి. దైవ విధేయతా జీవితం (ఇస్లామ్) - సంపూర్ణంగానో, అసంపూర్ణంగానో - కేవలం ఈమాన్ బీజం ద్వారానే ఉత్పన్నమవుతుంది. ఈమాన్ లేనిచోట ఇస్లామ్ ఉండదు. ఇస్లాం లేనిచోట మిగిలేది కుఫ్ర్ - దైవ ధిక్కారం, దైవ ద్రోహం మాత్రమే. దీని రూపం, పరిమాణాల్లో వ్యత్యాసం ఉండవచ్చుకాని, దీని గుణం రీత్యా దీన్ని ఎటూచ్చీ 'కుఫ్ర్' అని మాత్రమే అనగలం.

# జ్ఞానం లభించే మార్గం

విధేయత కొరకు విశ్వాసం ఎంత అవసరమో బోధపడే ఉంటుంది. అయితే దేవుని ఉనికి, గుణగణాలు, ఆయన ఆదేశాలు మరియు మరణానంతర జీవితం గురించి సరయిన జ్ఞానం - దృఢ విశ్వాసానికి పునాదికాగల జ్ఞానం - ఎలా ప్రాప్తమవుతుంది? అన్నదే ప్రశ్న.

ఇంతకుముందు చెప్పినట్లు దైవం చేసిన రూపకల్పన, శిల్పం, సృష్టి యొక్క నిదర్శనాలు లోకంలో ప్రతిచోటా కానవస్తుంటాయి. ఈ కర్మాగారాన్ని నిర్మించిన నిపుణుడు ఒక్కడే అని, ఆయనే దాన్ని నడిపిస్తున్నాడనీ అవి సాక్ష్యమిస్తున్నాయి. ఈ నిదర్శనాల్లో సర్వేశ్వరుని గుణగణాల ప్రతిరూపాలు

ప్రదర్శింపబడుతున్నాయి. ఆయన వివేకం, ప్రావీణ్యం, ఆయన కారుణ్యం, ఆయన జ్ఞానం, ఆయన శక్తిసామర్థ్యాలు ఆయన పోషణా గుణం, ఆయన అనుగ్రహం, ఆయన ఆగ్రహం - సృష్టి కార్యకలాపాల్లో ప్రస్ఫుటంగా గోచరించని ఆయన గుణమంటూ ఏదయినా ఉందా? కాని మానవ జ్ఞానం, మానవ శక్తి సామర్థ్యాలు వీటిని తిలకించడంలోనూ, అర్థం చేసుకోవడంలోనూ సాధారణంగా పొరపడుతూ ఉంటాయి.

ఈ నిదర్శనాలన్నీ కొట్టవచ్చినట్టు కానవస్తున్నప్పటికీ దేవుళ్ళు ఇద్దరున్నారని కొందరు, ముగ్గురని మరికొందరు అంటారు. ఇంకా కొంద రయితే దేవుళ్ళు అసంఖ్యాకంగా ఉన్నారని నమ్ముతారు. కొందరైతే దైవత్వాన్ని తునాతునకలు చేసివేసి గాలికొక దేవుడనీ, వానకొక దేవుడని ఎండకు మరొక దేవుడనీ భావించారు. ఇలా ప్రకృతిలోని ఒక్కొక్క శక్తికీ ఒక్కొక్క దేవుడనీ, వీరందరికీ నాయకుడు మరో దేవుడనీ తలపోశారు. ఈ విధంగా దేవుని ఉనికినీ ఆయన గుణగణాలను అవగతం చేసుకోవడంలో రకరకాలుగా మోసపోయింది మానవ మేధ. ఇప్పుడు దాన్ని విపులీకరించే అవకాశమూ లేదు, అవసరమూ లేదు.

ఆఖిరత్ (మరణానంతర జీవితం) గురించి సయితం చాలా తప్పుడు భావాలు, అభిప్రాయాలు ప్రజల్లో ఏర్పడ్డాయి. మనిషి మరణించి మట్టి అయిపోతాడనీ, ఆ తరువాత అతనికి ఎలాంటి జీవితమూ లేదని కొందరన్నారు. మరికొందరు మనిషికి ఈ లోకంలోనే పునర్జన్మ ప్రాప్తమవుతూ ఉంటుందనీ అతని కర్మలకు శిక్ష లభించడమో, బహుమానం దొరకడమో ఈ పునర్జన్మలోనే జరుగుతూ ఉంటుందనీ భావించారు.

## మనిషి నిష్ఫలత

జీవిత విధానానికి సంబంధించిన ప్రశ్న ఎదురయినప్పుడు ఇంకా

క్లిష్టతరమయిన పరిస్థితి ఏర్పడుతుంది. దైవసమ్మతమయిన జీవితం గడపదలచుకుంటే పాటించవలసిన సమంజసమయిన నియమావళిని మనిషి స్వయంగా తన బుద్ధిబలంతో నిర్మించుకోలేడు.

మనిషి అత్యుత్తమమయిన, మహత్తరమైన వైజ్ఞానిక దృష్టి సంపాదించ గలిగినప్పటికీ, ఏండ్ల తరబడి గడించిన అనుభవం, ఆలోచన, అనుశీలనల తరువాత జీవితాన్నంతా ధారపోసి, ప్రయత్నించి అతడు జీవితపు చివరి ఘడియల్లో మాత్రం ఈ విషయాలను గురించి కొన్ని నిర్ణయాలు చెప్పగలడు; అయితే ఇంతచేసీ యదార్థాన్ని పూర్తిగా గ్రహించగలిగాడన్న సంపూర్ణ తృప్తి అదే సరయిన మార్గమన్న గట్టి నమ్మకం అప్పటికీ ప్రాప్తం కాదు.

వాస్తవానికి మనిషి మేధాశక్తి, విజ్ఞానాలను సరయిన రీతిలో పరీక్షించాలంటే మానవుడు మనుగడ సాగించే బాటను వెదుక్కోడానికి అతన్ని ఎలాంటి మార్గదర్శకత్వం, సహాయం లేకుండా వదలిపెట్టాలి. ఆ తరువాత తన కృషి యోగ్యతలతో, సత్యాన్నీ, సన్మార్గాన్నీ కనుగొని అనుసరించిన వ్యక్తి శ్రేయం, సాఫల్యం పొందుతాడు; కనుగొనజాలని వ్యక్తి తీవ్రమయిన వైఫల్యానికి గురవుతాడు.

కాని, దేవుడు తన దాసులయిన మానవుల్ని ఇలాంటి కఠిన పరీక్షకు గురిచెయ్యకుండా రక్షించాడు. తాను కరుణానుగ్రహాల స్వామి అవటాన స్వయంగా మానవుల్లో నుంచే కొందరు వ్యక్తుల్ని ఎన్నుకుని, వారికి తన ఉనికీ, గుణవిశేషాల జ్ఞానం ప్రసాదించాడు. వారిద్వారా దైవానికి సమ్మతమయిన బ్రతుకుబాటను మానవులకు తెలిపాడు. పరలోక జీవితం తాలూకు సరయిన వివరాలు తెలియపరిచాడు. తోటి మానవులకు ఈ జ్ఞానాన్ని అందజేయాలని వారిని ఆదేశించాడు. వీరు దైవసందేశహరులు, ప్రవక్తలు.

వీరికి దైవం ఈ జ్ఞానాన్ని ప్రసాదించిన పద్ధతికి 'వహీ' దైవవాణి అని పేరు. ఏ గ్రంథం ద్వారా జ్ఞానం అందజేయబడిందో దాన్ని దైవ గ్రంథం, దైవ వచనం అంటారు.

ఇప్పుడు మనిషి, అతని బుద్ధివివేకాల పరీక్ష ఏమంటే - అతడు దైవ సందేశహరుని పవిత్ర జీవితాన్ని అధ్యయనంచేసి ఆయన బోధించిన ఉన్నతమయిన ఆదర్శాలను పరిశీలించి ఆయన్ని విశ్వసిస్తాడా లేదా? అన్నది. అతడు సత్యాన్వేషి, సత్యప్రియుడయితే, ఆ సత్య వాక్కును, సత్పురుషుని సద్బోధను స్వీకరించి ఈ పరీక్షలో నెగ్గుతాడు. దాన్ని స్వీకరించలేకపోతే అతడు సత్యాన్ని, వాస్తవికతను గ్రహించగలిగే సామర్థ్యాన్ని కోల్పోయ్యాడని అర్థం. ఈ తిరస్కారం వల్ల అతడు పరీక్షలో పరాజయాన్ని పొందుతాడు. తదనంతరం దైవం, ఆయన ఆదేశం, మరణానంతర జీవితం గూర్చి సరైన జ్ఞానం అతడు ఎన్నటికీ పొందలేడు.

## అజ్ఞాత విషయాల పట్ల విశ్వాసం

ఒక విషయంలో మీకు సరయిన వివరాలు తెలియకపోతే తెలిసినవారిని అడిగి తెలుసుకుంటారు. వారి సలహా ప్రకారం మసలుకుంటారు. మీరు అనారోగ్యానికి గురయితే మీ చికిత్స స్వయంగా మీరే చేసుకోరు. డాక్టరు దగ్గరికి వెడతారు. అతడు పట్టభద్రుడా? అతని వల్ల రోగులు చాలా మంది నివారణ పొందారా? అనే విషయాలను మీరు పరిశీలిస్తారు. వాటి ఆధారంగానే మీరు ఏదయినా నిర్ణయం తీసుకుంటారు. తదనుగుణంగా అతణ్ణి మీరు విశ్వసిస్తారు - అతనిపై మీకు 'ఈమాన్' (విశ్వాసం) ఏర్పడుతుంది. ఈ ఈమాన్ కారణంగానే అతడు ఏ మందును ఏ విధంగా పుచ్చుకోమంటే దాన్ని ఆ విధంగానే పుచ్చుకుంటారు, అతడు ఏ పథ్యం నిర్ణయిస్తే దాన్ని పాటిస్తారు.

ఇలాగే చట్టసంబంధమైన విషయాల్లో మీరు వకీలును విశ్వసిస్తారు. అతని సలహాను పాటిస్తారు. విద్యాబోధన విషయంలో ఉపాధ్యాయునిపై ఈమాన్ కలిగి ఉంటారు. అతడు చెప్పినదాన్నే ఆచరిస్తారు. మీరు ప్రయాణం చేసేటప్పుడు, దారి తెలియకపోతే ఎవరినైనా అడిగి తెలుసుకుంటారు; వారిని నమ్ముతారు. వారు చూపిన మార్గాన్నే పయనిస్తారు. ఇలాగే జీవితంలోని ప్రతి వ్యవహారంలోనూ జ్ఞానం, విషయ పరిచయం పొందడానికి జ్ఞానమున్న వ్యక్తిని విశ్వసించడం అతన్ని అనుసరించటం అనివార్యం. దీనికే "ఈమాన్ బిల్ గైబ్" - అజ్ఞాత విషయాల పట్ల విశ్వాసం - అని పేరు.

"ఈమాన్ బిల్ గైబ్" అంటే తెలియని విషయాలను తెలిసినవారి ద్వారా గ్రహించడం, వాటిని విశ్వసించడం అన్నమాట. విశ్వ ప్రభువు ఉనికి, ఆయన గుణగణాలను గురించి మనకు ఏమీ తెలియదు. ఆయన దూతలు (ఫరిష్తాలు, మలాయికా) ఆయన ఆదేశానుసారం విశ్వ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారనీ, వారు మమ్మల్ని నలువైపులా పరివేష్టించి ఉన్నారని మనమెరుగము. దైవ సమ్మతి ప్రకారం జీవితం గడిపే విధానం మనకు తెలియదు. ఆఖిరత్ (పరలోక) జీవితం గురించి సయితమూ మనకు సరిగ్గా తెలియదు. ఈ విషయాలన్నిటి జ్ఞానం మనకు ఒక వ్యక్తి ద్వారా ప్రాప్తమవుతుంది. ఆయన సత్యసంధత, సదాచారం, భక్తితత్పరతలు, అత్యంత పరిశుద్ధ జీవితం, గొప్ప విజ్ఞాన వివేకాలతో విరాజిల్లే బోధలు - వీటన్నింటినీ చూచి మనం ఆయన చెప్పేదంతా సత్యమనీ, నమ్మదగినవనీ అంగీకరిస్తాము. ఇదే "ఈమాన్ బిల్ గైబ్" - అజ్ఞాత విషయాలపై విశ్వాసం. అల్లాహ్ విధేయతకూ, ఆయన ఇష్టానుసారం నడచుకోవడానికి 'ఈమాన్ బిల్ గైబ్' అనివార్యం. ఎందుకంటే ప్రవక్త ద్వారా తప్ప మరే విధంగానూ మనకు నిజ జ్ఞానం ప్రాప్తం కాదు. సరైన జ్ఞానం లేకుండా ఇస్లామ్ మార్గాన ఒక్క అడుగయినా ముందుకు వెయ్యడమన్నది అసాధ్యం.

# మూడవ అధ్యాయం

# దైవదౌత్యం

వెనుకటి పుటల్లో మూడు విషయాలు చర్చించబడ్డాయి.

ఒకటి : దైవ విధేయత చేయాలంటే, దేవుని ఉనికి, గుణగణాలు, ఆయనకు సమ్మతమయిన విధానాలు, మరణానంతర జీవితంలో లభించే శిక్ష లేక బహుమానం - వీటన్నింటి గురించి సరయిన జ్ఞానం అవశ్యం. ఈ జ్ఞానం మనిషికి 'ఈమాన్' ను (దృఢ విశ్వాసాన్ని) చేకూర్చేటంతటి బలీయమయినదిగా ఉండాలి.

రెండవది : ఈ జ్ఞానాన్ని పొందడానికి మనిషి స్వయంగా కృషి చెయ్యాలన్న కఠిన పరీక్షకు గురి చెయ్యలేదు మనిషిని దైవం. మానవుల్లో నుంచే కొందరు సత్పురుషులను (దైవ సందేశహరులుగా, ప్రవక్తలుగా) ఎన్నుకుని వారికి "వహీ" (దైవవాణి) ద్వారా ఈ జ్ఞానాన్ని అందజేశాడు అల్లాహ్. ఇతర మానవులకు ఈ జ్ఞానాన్ని అందజెయ్యాలని వారిని నియమించాడు.

మూడవది : సామాన్య ప్రజల కర్తవ్యమేమంటే, దేవుని నిజ ప్రవక్తలను గుర్తించాలి; ఫలానా వ్యక్తి వాస్తవంగా దైవ ప్రవక్త అని రూఢీ అవగానే ఆయన ప్రబోధించే ఉపదేశాలను విశ్వసించాలి; ఆయన ఆదేశాలను వినాలి; ఆయన అవలంబించే మార్గాన్ని అనుసరించాలి.

"దైవ దౌత్యం" యొక్క వాస్తవికత ఏమిటి? దైవ సందేశహరులను, దైవ ప్రవక్తలను గుర్తించే విధానమేమిటి? అనే విషయాలను ఇప్పుడు

తెలుసుకుందాము.

## దైవదౌత్యం వాస్తవికత

ప్రపంచంలో మనిషికి అవసరమయిన పదార్థాలేవో వాటినన్నింటినీ ఖుద్దుగా అల్లాహ్‌యే సమకూర్చాడు. పసివాడు పుట్టేటప్పుడు ఎన్ని ఆధారాలు సమకూర్చి ప్రపంచానికి మరీ పంపించాడో కాస్త గమనించండి. చూడటానికి కళ్ళు, వినడానికి చెవులు, వాసన చూడటానికీ, ఊపిరి పీల్చుకోవడానికి ముక్కు, స్పర్శించే శక్తి అంతటా పరచి ఉన్న దేహం, నడవటానికి కాళ్ళు, పనిచెయ్యటానికి చేతులు, ఆలోచించడానికి మేధస్సు, ఇలాగే అసంఖ్యాకమయిన ఇతర ఆధారాలు మనిషికి అనుగ్రహించాడు ఆ దయామయుడు. ముందే అతని అవసరాలన్నీ గ్రహించి, అతని చిన్నారి శరీరంలో అన్నీ అమర్చాడు. ఈ ప్రాణి ధరణిపై కాలు మోపగానే అతని మనుగడ సాగడానికి లభ్యమయ్యే ఆధారాలు మనం గణించనూ లేము, ఊహించనూ లేము. నేల, గాలి, నీరు, వెలుతురు, వేడిమియే కాక, తల్లి పాలిండ్లలో కమ్మని వెచ్చని పాలు, తల్లిదండ్రులు, ఆప్తులే కాక పరాయివాళ్ళ కండ్లల్లోనూ ఇతనికై అమృత మయమయిన చూపు, వారి హృదయాల్లో ప్రేమానురాగాలు, కారుణ్యం, వాత్సల్యాలు పుష్కలంగా పొందుపరచాడు, వీటి ద్వారా ఇతని ఆలనా పాలనా జరుగుతుంది. ఇలాగే ఇతడు పెరిగే కొద్దీ అతని అవసరాలను తీర్చే సకల విధాల సామగ్రి సమకూరుతాయి. జాగ్రత్తగా పరిశీలిస్తే భూమ్యాకాశాల్లోని సర్వశక్తులూ కలిసి ఇతని పోషణ కొరకే నిరంతరం కృషి జేస్తున్నాయా అనిపిస్తుంది.

ఇంకా కాస్త ముందుకు సాగుదాము. ప్రపంచంలో పనులు చేసుకోడానికి కావలసిన శక్తిసామర్థ్యాలన్నీ మానవులకు ప్రాప్తమయ్యాయి. శారీరక శక్తి, బుద్ధిబలం, మాట్లాడే చాతుర్యం ఇంకా ఇలాంటి ఎన్నో యోగ్యతలు,

ఇంచుమించు, ప్రతి మనిషిలోనూ ఉన్నాయి. కాని వింతేమంటే, మానవులకు సామర్థ్యాలన్నీ సమంగా పంచిపెట్టలేదు దైవం. ఇలాగైతే ఎవరూ మరొకరిపై ఆధారపడేవారు కారు, ఎవరూ మరొకరిని ఖాతరు చేసేవారు కారు.

మనుషుల అన్ని అవసరాలకు తగ్గ యోగ్యతలు మనుషుల్లోనే సృజించినప్పటికీ, దైవం, ఒకనికి ఓ విధమయిన శక్తినిస్తే మరొకనికి మరో కోవకు చెందిన సామర్థ్యాన్ని ప్రసాదించాడు. కొందరు శారీరకంగా బలాఢ్యులవడం, ఇంకా కొందరు కొన్ని కళల్లో, వృత్తుల్లోనూ సహజంగా ఆరితేరిన వారవడం మనం నిత్యం గమనిస్తూనే ఉంటాము. కాని ఇతరులకు అవి ఏ మాత్రం ప్రాప్తం కావు. కొందరిలో స్వాభావికంగానే మేధాశక్తి ఇతరులకంటే అధికంగా ఉంటే, మరికొందరు సమరయోధులుగా ఎదుగుతారు. ఇంకా కొందరయితే పుట్టుకతోనే పరిపాలనా ప్రావీణ్యంతో అలరారుతారు. ఒకరు అసమాన వాక్పటిమగల ప్రచండ వక్తలయితే, మరొకరు ఊహలకు ఊపిరి పోసే రచయితలుగా రాణిస్తారు. ఒకనికి గణిత శాస్త్రం మంచినీళ్ళ ప్రాయమయి అతడు చిక్కు ప్రశ్నలన్నీ ఒక్క నిమిషంలో చక్కబరిస్తే మరొకడు ఎవరికీ తట్టని, అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తే కొత్త పదార్థాన్ని ఆవిష్కరిస్తాడు. ఒక్కొక్క వ్యక్తి న్యాయశాస్త్రంలో అనుపమ ప్రజ్ఞ కలిగిపుడితే ఇంకొకడు భౌతిక రసాయనిక శాస్త్రాల్లో ఇతరులకు అంతుదొరకని అంశాలను ఇట్టే కనిపెట్టగలుగుతాడు. ఇదంతా దైవదత్తం, ఈ యోగ్యతలు ఎవరయినా స్వతహాగా తనలో సృజించుకోగోరితే అది సాధ్యం కాదు. లేక శిక్షణ, దక్షతలచేతా సాధ్యపడదు. ఇవి సహజమైన, స్వాభావికమయిన సామర్థ్యాలు. అల్లాహ్ తాను తలచిన వారికి, భావ్యమని భావించిన రీతిలో వీటినీ అనుగ్రహిస్తాడు.

# అవసరాన్నిబట్టి అర్హతలు

దేవుని ఈ అనుగ్రహాన్ని గమనిస్తే ఒక విషయం బాగా బోధపడుతుంది. మానవ నాగరికతకు అత్యవసరమయిన గుణగణాలు, యోగ్యతలు చాలా మందిలో సృజించబడతాయి. ఏ యోగ్యతలు ఏ మేరకు అవసరమో అవి అంతవరకే పరిమితంగా సృష్టించబడతాయి. సైనికులు అనేకులుంటారు. రైతులు, వడ్రంగులు, కమ్మరులు, కుమ్మరివారు అసంఖ్యాకంగా ఉంటారు. కాని సేనాపతులు, వైజ్ఞానికులు, మేధావులు, రాజకీయవేత్తలు పరిమితంగా పుడతారు. అలాగే ఒక ప్రత్యేక కళలో అసాధారణ ప్రజ్ఞాప్రావీణ్యాలుగల వ్యక్తులుకూడా చాలా అరుదు. ఎందుకంటే ఇలాంటి వారంతా నిర్వహించిన కార్యకలాపాల ప్రభావం శతాబ్దాల వరకు విస్తరించి ఉంటుంది. సామాన్య మనుషులకు ఇలాంటి నిపుణుల ఆవశ్యకత తిరిగి ఎంతో కాలానికిగాని ఏర్పడదు.

ఇప్పుడు ఒక విషయం ఆలోచించాలి. మానవ జీవితాన్ని సార్థకత, సఫలత, పరిపూర్ణత చేకూర్చడానికి, కేవలం ఇంజనీర్లు, గణితజ్ఞులు, వైజ్ఞానికులు, న్యాయనిపుణులు, రాజకీయ ప్రాజ్ఞులు, ఆర్థిక శాస్త్రవేత్తలు ఇంకా ఇతర వృత్తులు నిర్వహించే నిపుణులు మాత్రమే సరిపోరు కదా! వీటన్నిటిని మించిన మరో ఆవశ్యకత ఉంది మనిషికి; దైవ మార్గం చూపగల మార్గదర్శి కావాలి.

# ప్రవక్తలు

ఇతరులయితే, మనిషికి ఈ లోకంలో ఏవేవి దొరుకుతాయో వాటిని ఎలా ఉపయోగించుకోవాలో చూపెట్టేవారేకాని స్వయంగా మనిషి

మనుగడకు పరమార్థం ఏది? మనిషికి ఈ సకల సామగ్రిని సమకూర్చిందెవరు? ఇలా ప్రదానం చెయ్యడంలో ఆ 'దాత' ఉద్దేశ్యం ఏమిటి? ఆయన అభీష్టమేమిటి? అనే విషయాలను వివరించడానికి ఒకరు కావాలి. అప్పుడే మనిషి తన 'దాత' ఇష్టానుసారం జీవితం గడిపి, తన బ్రతుకుకు సార్థకత, విశ్వసనీయమయిన, సుస్థిరమైన సఫలత, సంపూర్ణతను పొందగలుగుతాడు. మానవుని ముఖ్యమయిన, యదార్థమయిన ఆవశ్యకత ఇదే! మన చిన్న చిన్న అవసరాలను సైతం తీర్చే ఏర్పాటుచేసిన సర్వలోక ప్రభువు ఇలాంటి ముఖ్యమయిన ఆవశ్యకతను ఉపేక్షించాడంటే, విస్మరించాడంటే మనసు ఒప్పుకోదు. ఇలా జరగడానికి వీల్లేదు.

ఒక్కొక్క శాస్త్రంలో, ఒక్కొక్క కళలోనూ ప్రత్యేక నైపుణ్యంగల మనుషుల్ని సృష్టించినట్లే, దేవుని గుర్తించేందుకు కూడా అత్యంత ఉన్నతమైన యోగ్యతలు, సామర్థ్యాలుగల వ్యక్తుల్ని సృజించాడు అల్లాహ్. వారికి, ధర్మం (జీవన వ్యవస్థ, దీన్) నీతి, చట్టం (షరీఅత్) తదితర విషయాల జ్ఞానం ప్రసాదించాడు. ఇతరులకు ఆ జ్ఞానాన్ని అందజేయమని, దాన్ని అందరికీ బోధించమని వారిని నియమించాడు. వీరినే ధార్మిక పరిభాషలో "నబి" (ప్రవక్త), రసూల్, పైగంబర్ (సందేశహరుడు, దేవునిదూత) అనంటారు.

## ప్రవక్తను గుర్తుపట్టడం

ఏ విధంగానయితే శాస్త్రీయ, కళారంగాల్లోని ప్రవీణులు స్వాభావికంగానే ప్రత్యేక మేధ, విశిష్ట గుణగణాలు, లక్షణాలతో జన్మిస్తారో అలాగే దైవ ప్రవక్తలు సయితం సహజంగానే విశేషమయిన లక్షణాలు కలిగి పుడతారు.

సహజసిద్ధంగా కవి అయిన వ్యక్తి చేసిన రచనను చూడగానే ఆ వ్యక్తిలో కవితాభిరుచి పుట్టుకతోనే పుట్టిందని గ్రహించడం చాలా తేలిక. (ఎందు

కంటే ఇతరులు ఎంత ప్రయత్నించినా అలాంటి రచన చెయ్యడం సాధ్యపడదు). ఇలాగే జన్మతః ఉపన్యాసకుడు, రచయిత, ఆవిష్కర్త, ప్రజానాయకుడు వగైరా అయినవారు కూడా తమ తమ కార్యకలాపాల ద్వారా అతి స్పష్టంగా గుర్తింపు పొందుతారు. ఎందుచేతనంటే వీరిలోని ప్రతి ఒక్కరూ తమ కళలో అసమాన ప్రతిభను ప్రకటిస్తారు; అది ఇతరులకు సాధ్యపడదు.

## ఆదర్శమూర్తి

ఇదేమాట ఒక దైవ ప్రవక్తకూ వర్తిస్తుంది. ఇతరులకు ఊహామాత్రం గానైనా తట్టని భావాలెన్నో ఆయన ఆంతర్యాన్ని జ్యోతిర్మయం చేస్తాయిః ఇతరులెవరూ పలుకలేని వచనామృత ధార ఆయన నోట వర్షిస్తుందిః ఇతరులెవరూ ఏండ్ల తరబడి యోచించినా అందుకోజాలని, అంతు తెలియని విషయాల్ని ఆయన అమోఘమయిన సూక్ష్మదృష్టికిరణాలు ఇట్టే పసిగట్టగలవు. ఆయన మాటలు సులువుగా మనోగతమవుతాయి. బుద్ధి వాటిని బలపరుస్తుంది; మనసు అవి సత్యమయినవనీ, సమంజసమయినవనీ వాటికి సాక్ష్యం పలుకుతుంది; లోకానుభవం, సృష్టి అనుశీలనం ఆయన మాటలను ధృవీకరిస్తాయి. చిత్రమేమంటే అలాంటి మాట ఒక్కదాన్నయినా సొంతంగా పలుకుదామంటే మనవల్ల కాదు.

ఇక ఆయన స్వరూప స్వభావాలను పరిశీలిస్తే అవి పవిత్రమైనవి పరిశుద్ధమైనవిగా ప్రత్యక్షమవుతాయి. ప్రతి వ్యవహారంలోనూ సత్యమయిన, సమంజసమయిన, సభ్యమైన, శ్రేష్ఠమైన విధానాన్నే అవలంబిస్తాడు ఆయన. చెడు మాటలు ఆయన నోటికి రావు. చెడు చేతలు ఆయన చెంత చేరవు; నిత్యం సత్యాన్ని సన్మార్గాన్ని ప్రబోధిస్తాడు. ఇతరులకు బోధించినది తానూ ఆచరిస్తాడు. చెప్పినదానికి భిన్నంగా ఆచరించాడని చెప్పడానికి ఆయన

యావత్తు జీవితంలో ఒక్క సంఘటన అయినా మచ్చుకు కానరాదు.

ఆయన మాటలు, చేతలు ఆయన నిస్వార్థ ఆదర్శాలకు ప్రతి రూపాలు. ఇతరుల శ్రేయానికి స్వతహాగా నష్టపోగలడే కాని సొంత ప్రయోజనానికై ఇతరుల నష్టాన్ని ఏ మాత్రమూ సహించడు. ఆయన జీవితమంతా సత్యసంధతకు, వినయవినమ్రతలకు, భావ పరిశుద్ధతకు, విశాల హృదయతకు, ఉన్నత మానవీయ గుణాలకు అపూర్వమయిన ఆదర్శం, నిదర్శనం, తిరుగులేని తార్కాణం. ఆ ఆదర్శ జీవితంలో లక్ష వెదికినా ఒక్క వెలితి కూడా అగుపడదు. ఈ విషయాలను గమనించినప్పుడే ఒక వ్యక్తిని నిజమయిన దైవ ప్రవక్తగా గ్రహించడానికి వీలుపడుతుంది.

## దైవప్రవక్త విధేయత

ఫలానా వ్యక్తి దేవుని నిజమయిన ప్రవక్త అని తెలుసుకున్న తరువాత ఆయన మాటను స్వీకరించడం, ఆయన పట్ల విధేయులయి ఉండటం, ఆయన చూపిన విధానాన్ని అవలంబించడం తప్పనిసరి అవుతుంది. ఒక వ్యక్తిని దైవ ప్రవక్తగా అంగీకరించడం, ఆ తరువాత ఆయన మాటను ఖాతరుచేయకపోవడం అనేది సహేతుకం కాదు. ఎందుకంటే ఒక వ్యక్తి దైవ ప్రవక్త అని ఒప్పుకోవడమంటే ఆయన పలికేదంతా దైవం తరఫునే అనీ, ఆయన చేసేదంతా దైవ సమ్మతి ప్రకారమే అని ఒప్పుకోవడమన్నమాట. ఆయనకు ప్రతికూలంగా ఏది పలికినా ఏది చేసినా అది వాస్తవానికి దైవానికే ప్రతికూలంగా వర్తిస్తుంది. దైవానికి ప్రతికూలంగా పలికిన మాట ఏ మాత్రం ధర్మమయింది కాదు, కనుక ఎవరినయినా దైవ ప్రవక్తగా స్వీకరిస్తే ఆయన మాటను తు.చ. తప్పకుండా వినాలన్న విషయం దానంతటదే తప్పనిసరి అవుతుంది.

ఆయన ఆదేశాలను శిరసావహించవలసిందే - వాటి మర్మ హేతువు మనకు బోధపడినా బోధపడకపోయినా, ఒక మాట పరమ సత్యమయినదని, దర్మబద్ధమయినదని, సకల లాభాలకు నిలయమని, సర్వ హేతువులకు ఆలవాలమని నమ్మడానికి అది దైవ ప్రవక్తకు సంబంధించినదవడమే చాలు. ఒకవేళ ఏ విషయానికి సంబంధించినదయినా మర్మ హేతువు మనకు అర్థం కాలేదంటే, ఆ విషయంలో ఏదో లోపముందని మాత్రం అర్థం కాదు; మన బుద్ధి గ్రహణ శక్తుల్లోనే ఏదో లోపముందని మనం తెలుసుకోవాలి.

## సమంజస, సహేతుక వైఖరి

ఓ ప్రత్యేక కళారంగంలో ప్రవేశంలేని వ్యక్తి అందులోని సూక్ష్మాంశాలను గ్రహించలేడని అందరికీ తెలిసిన విషయమే. కాని అది తనకు బోధపడలేదనే మిషతో దాన్ని అతడు త్రోసి రాజనడంలో ఏమయినా వివేకముందా?

కాస్త లోతుగా ఆలోచించాలి. ప్రపంచంలో ఏ కార్యాన్నయినా సవ్యంగా చెయ్యాలంటే మనిషికి అందులో నైపుణ్యం ఉండటం ఎంతయినా అవసరం. ఇలా నైపుణ్యంగల వ్యక్తికి ఆ కార్యభారాన్ని అప్పజెప్పి అతన్ని పూర్తిగా విశ్వసిస్తాము. అంతే, ఆ తరువాత, అతని వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకోము. అసలు విషయమేమంటే, అందరూ అన్ని పనులూ చేసుకోలేరు; అందరూ అన్ని విషయాలనూ అర్థం చేసుకోలేరు. కనుక మనం చేయగలిగింది, చేయవలసింది కేవలం ఒక్కటే; మన అవసరానికి తగ్గట్టు పనిచెయ్యగల ఒక మంచి నిపుణుణ్ణి అన్వేషించి చేపట్టడంలో మన బుద్ధివివేకాలను వినియోగించడం అంతే. ఒక వ్యక్తి పట్ల అతడు ఓ కార్యంలో సిద్ధహస్తుడని గట్టి నమ్మకం గనక కుదిరితే, ఇక మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ

కూర్చోకుండా అతన్ని పూర్తిగా విశ్వసించాలి. తదనంతరం అతని కార్యకలాపాల్లో తలదూర్చడం, ఒక్కొక్క విషయం ముందు మనకు బోధపడితేనే తప్ప ఒప్పుకోమని కూర్చోవడం వివేకవంతమయిన పని కాదు - కేవలం అవివేకం. ఒక న్యాయవాదికి మీరు తమ కేసును అప్పగించి ఈ విధంగా వాదులాడటం ప్రారంభించారంటే అతడు మిమ్మల్ని ఆఫీసునుంచే గెంటివేయిస్తాడు. డాక్టరు వద్దకు వెళ్ళి అతని ప్రతి నిర్దేశానికి హేతువు ఏమిటో ప్రశ్నించడం మొదలెడితే అతడు మీ చికిత్స చేయడమే వదలు కుంటాడు.

సరిగ్గా ఇదే మాట మన చర్చనీయాంశానికి వర్తిస్తుంది. దైవ జ్ఞానం పొందడం మన అవసరం. దైవేచ్ఛ ప్రకారం జీవించే విధానమేదో తెలుసు కోవడం మన అవసరం. ఈ జ్ఞానాన్ని పొందే మార్గం స్వయంగా మనవద్ద ఏదీ లేదు. అలాంటప్పుడు దేవుని నిజమయిన సందేశహరుణ్ణి అన్వేషించడమే మన కర్తవ్యం. ఈ అన్వేషణలో మనం కడు మెలుకువగా, ఎంతో వివేకవంతంగా వ్యవహరించవలసి ఉంటుంది. ఎందుకంటే, తప్పుడు మనిషిని మనం దైవ ప్రవక్తగా భావించామంటే అతడు మనల్ని తప్పుదారి పట్టిస్తాడు. కాని, బాగా పరిశీలించి, పరీక్షించి ఒక వ్యక్తిని దేవుని నిజ ప్రవక్తగా, నిజ సందేశహరునిగా రూఢీ చేసుకుంటే అతన్ని పూర్తిగా ఎలాంటి అరమరికలు లేకుండా విశ్వసించాలి. అతని ప్రతి ఆదేశానికీ తలఒగ్గాలి.

## ప్రవక్తలను నమ్మవలసిన ఆవశ్యకత

దైవం తరఫున దైవ ప్రవక్త చూపెట్టినదే "ఇస్లామ్" చూపే నిజమయిన రుజుమార్గమని మనం తెలుసుకున్నాము. దీనివల్ల మనకు బోధపడేదేమంటేః దైవ ప్రవక్తను నమ్మడం, ఆయన విధేయతను పాటించడం, ఆయన

ఆదర్శాన్ని అనుసరించడం, మానవులందరికీ అనివార్యం. ఇలాకాక దైవ ప్రవక్త చూపిన విధానాన్ని కాదని, తన సొంత బుద్ధిని వినియోగించి, ఏదో ఒక మార్గాన్ని నిర్మించుకుని దాన్ని అనుసరించే వ్యక్తి నిస్సందేహంగా అపమార్గం పాలవుతాడు.

ఈ విషయంలో మనుషులు వింతయిన పొరపాట్లు చేస్తారు. కొందరు దైవ సందేశహరుని సత్యతను శంకించరు, అంగీకరిస్తారు. కాని ఆయన్ని విశ్వసించరూ అనుసరించరు. వీరు కేవలం కాఫిర్‌లు (విశ్వాసం లేనివారు) మాత్రమే కారు అవివేకులు కూడా. దైవ ప్రవక్తను నిజ ప్రవక్తగా అంగీకరించి ఆయన్ని అనుసరించకపోవడమంటే తెలిసీ మార్గభ్రష్టతను స్వీకరించడమన్నమాట. ఇంతకంటే తెలివితక్కువతనం మరొకటి కాగలదా?

కొందరయితే దైవ దూతల అనుసరణ అనవసరం, మేమే స్వయంగా సన్మార్గాన్ని గ్రహించగలమని అంటారు. ఇది కూడా గొప్ప పొరపాటు. మీకు సామాన్య గణితం తెలిసే ఉంటుంది, రెండు బిందువుల మధ్య గీయబడే సరళరేఖ ఒక్కటే కాగలదు. అదొక్కటి వినా మరెన్ని రేఖలు గీసినా అవన్నీ వక్రంగా ఉంటాయి, లేదా రెండో బిందువును చేరలేకనయినా పోతాయి. నిజమైన "సన్మార్గం" విషయంలో జరిగేది కూడా ఇదే. ఈ ఒక్క మార్గమే "సిరాతె ముస్తకీమ్" (ఋజుమార్గం, సరళ మార్గం) అనబడుతుంది ఇస్లామీయ పరిభాషలో. ఈ మార్గం మానవుని నుండి బయలుదేరి సరాసరి దైవాన్ని చేరుతుంది. గణిత శాస్త్ర సిద్ధాంతం రీత్యా ఇలాంటి మార్గం ఒక్కటే కాగలదు. ఇదికాక మరెన్ని మార్గాలు సృష్టించుకున్నా అవన్నీ వక్రమార్గాలయినా అవుతాయి లేక అవి దైవాన్ని చేరలేకనయినా పోతాయి.

దీన్ని దృష్టిలో పెట్టుకుని కాస్త ఆలోచించండి. సరళ మార్గాన్నీ,

రుజుమార్గాన్నీ దైవ ప్రవక్త, దైవ సందేశహరుడు చూపెట్టారు. రుజు మార్గం అదొక్కటే. ఈ మార్గాన్ని కాదని స్వయంగా తానే ఒక మార్గాన్ని అన్వేషించదలచుకున్న మనిషికి ఎదురయ్యే పర్యవసానాలు కేవలం రెండే – అతనికి దొరికే మార్గం అసలు దైవాన్ని చేరే మార్గమే కాజాలదు; లేదా అది డొంకతిరుగుడు మార్గమే కాగలదు, సరళ మార్గం కాజాలదు. మొదటి మార్గం అవలంబించాడా, అతని సర్వ నాశనం తథ్యమని వ్యక్తమవుతూనే ఉంది. ఇక రెండో మార్గమో? దాని అనుసరణ కేవలం అవివేకం అనడంలో సందేహమే లేదు. జ్ఞానంలేని పశువయినా సరే ఒక చోటునుండి మరొక చోటికి పోవటానికి సరయిన మార్గాల్ని వదలి వక్ర మార్గాల్ని అవలంబించదు. ఒక వ్యక్తి సరయిన దారిని చూపిస్తూ ఉంటే దాన్ని కాదని వక్రమార్గాన్ని అనుసరించదలచిన వ్యక్తి అనేదేమంటే : "వద్దు, వద్దు నీవు చూపే మార్గాన్ని నేను అవలంబించను. నేనే నా వంకర టింకర దారిలో పడి తడుముకుంటూ, తడుముకుంటూ వెదకి వెదకి గమ్యాన్ని చేరుకుంటాను." ఇలాంటి వ్యక్తిని గురించి మీరేమంటారు?

ఇంతవరకూ ఇది ఎవరయినా ఇట్టే గ్రహించగల విషయమే. అయితే కాస్త శ్రద్ధగా గమనించవలసిన విషయమేమంటే, దైవ సందేశహరుని నిరాకరించిన వ్యక్తికి వక్ర మార్గమూ లభించదు, సరళ మార్గమూ దొరకదు – దేవుని చేరే ఏ మార్గమూ కానరాదు. కారణమేమంటే, ఒక వ్యక్తి ఒక సత్యసంధుని మాటను కాదని సత్యానికి దూరంగా తొలగిపోయాడంటే అతను అలా ఎందుకు చేశాడు? అతని మెదడులో ఏదో మాంద్యముంటుంది; అతని బుద్ధీ వివేకాలే ఎదిగి ఉండవు, అతని ఆంతర్యం అహంకారంతో అంధకారమయి ఉంటుంది. లేక సత్యాన్నీ సదాచార విషయాల్నీ స్వీకరించడానికి సిద్ధంగా లేని అతని స్వభావమే లోపభూయిష్టమయి ఉంటుంది! లేకపోతే అతడు

తన పూర్వీకుల ఆచారాల అంధానుసరణకు బానిసయి ఉంటాడు. దాని మూలాన ప్రచారంలో ఉన్న ఏ తప్పుడు పనికయినా భిన్నంగా ఉన్నదాన్ని ఒప్పుకోడు; లేదా తన మనోవాంఛలకు దాసుడయిన కారణంగా, దైవ సందేశహరుని బోధనల్ని స్వీకరిస్తే దుష్ట కార్యాలు, అధర్మమయిన పనులు చేసే స్వేచ్ఛ లభించదు గనుక, వాటిని నిరాకరిస్తాడు.

ఈ కారణాల్లో ఏ ఒక్క కారణానికీ మనిషి గురయినా అతనికి దైవం చూపిన రుజు మార్గం ప్రాప్తించడం దుర్లభం. ఏ కారణమూ లేకుండా సత్యవంతుడయిన వ్యక్తి, ఏ పక్షపాత బుద్ధిలేని మనిషి, నిర్మల మనస్కుడయి కూడా నిజమయిన ప్రవక్త బోధించిన మార్గోపదేశాన్ని తృణీకరించడం అన్నది అసంభవం.

అన్నిటికంటే ముఖ్యమయిన విషయం ఏమిటంటే, ప్రవక్త దైవం చేత నియుక్తులయినవారు. ఆయన్ని విశ్వసించమని దైవమే ఆదేశిస్తుండగా విశ్వసించ నిరాకరించే వ్యక్తి వాస్తవానికి దైవానికే ఎదురు తిరుగుతున్నాడన్నమాట! కాస్త గమనించండి. మీరు ఒక ప్రభుత్వంలో పాలిత ప్రజలుగా జీవిస్తున్నారు; ఆ ప్రభుత్వం ఎవరినయినా తన అధికారిగా నియమిస్తే ఆ అధికారికి విధేయులయి ఉండటం తప్ప గత్యంతరం లేదు. అతన్ని మీరు అధికారిగానే అంగీకరించకపోతే నిజానికి మీరు ఆ ప్రభుత్వాన్నే ధిక్కరిస్తున్నారన్న మాట! ప్రభుత్వాన్నయితే ఆమోదించడం, అది నియమించిన అధికారిని మాత్రం త్రోసిపుచ్చడం - ఈ రెండూ పరస్పర వ్యతిరేకాలే. దైవమూ, దైవ ప్రవక్తల పరిస్థితి కూడా సరిగ్గా ఇలాంటిదే.

మానవులందరి నిజప్రభువు దేవుడే. ఆ దేవుడు ఎవరినయితే తన తరఫున మానవాళి జీవన మార్గదర్శకత్వానికి నియమించాడో, మరెవరికయితే

విధేయులై ఉండవలసిందని తన దాసులయిన మానవులకు బోధించాడో, ఆయన్ని దైవ ప్రవక్తగా స్వీకరించడం, ఇతరుల్ని త్రోసిరాజని కేవలం ఆయన్నే అనుసరించడం మానవుల విద్యుక్త ధర్మం. ఈ ధర్మాన్ని, ఈ విధిని కాదన్న వ్యక్తి ముమ్మాటికీ తిరస్కారియే. అతడు దైవాన్ని విశ్వసించినా దైవ సందేశాన్ని కాదన్నందువల్ల తిరస్కారి, కాఫిర్‌గానే పరిగణించబడతాడు.

# దైవదౌత్యం సంక్షిప్త చరిత్ర

మానవాళిలో దైవదౌత్యం ఏ విధంగా ప్రారంభమైందో, ఎలా పరిణామం చెందుతూ చివరి ప్రవక్తతో అంతమయిందో పరిశీలిద్దాము.

మానవాళి ఆది మానవుడు "ఆదమ్" ఒకని ద్వారానే ప్రారంభ మయింది. ఈయన ద్వారానే మానవ కుటుంబం మూడు పూవులు ఆరు కాయలుగా వృద్ధిచెంది, ప్రపంచం మొత్తాన్నీ ఆక్రమించుకుంది. పృథ్విపై పాదం మోపిన యావత్తు మానవ జాతి తొలి మానవ జంట "ఆదమ్-హవ్వా"ల సంతానమే. ★ ప్రపంచంలోని సకల మతాలు, మానవ చరిత్ర సయితం ఈ యదార్థాన్ని ధృవీకరిస్తున్నాయి. వైజ్ఞానిక పరిశోధనల్లో

---

★ ఇది ఎంతో ముఖ్యమయిన విప్లవాత్మక దృక్పథం. ఈ భావన వల్ల జనించే సహజ పరిణామం మానవ జాతి యొక్క ఏకత్వం, సర్వ మానవ సమానత; ఈ భావన ప్రకారం, వర్గం, వర్ణం, వంశం, దేశం ప్రాతిపదికలపై మానవుల్లో విచక్షణ, భేదభావం కనబరచడం, మూర్ఖత్వం, జాత్యహంకారం, జాతీయ దురభిమానం, వంశపారంపర్యం పట్ల మూఢ నమ్మకం, రక్తపాతం చేయించే పక్షపాతం – ఇవన్నీ కలసి ప్రపంచాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించిన ఈ యుగంలో మానవ జాతి యొక్క ఏకత్వాన్ని చాటే ఈ దృక్పథం మానవ భవితవ్యానికే ఓ ఆశాకిరణం.

సయితం, మానవులు, భూమండలంలోని విభిన్న భాగాల్లో, విభిన్న కాలాల్లో జన్మించినట్లు, ఏ ఆధారమూ దొరకలేదు. శాస్త్రజ్ఞులు చాలామంది, ప్రథమంగా ఒకే మానవజంట ఉనికిలోకి వచ్చి వారి ద్వారానే మానవాళి ప్రపంచమంతటా వ్యాపించగలిగిందని అభిప్రాయపడుతున్నారు.

## తొలి ప్రవక్త

ఆది మానవుడు ఆదం (అస్సలాం) కేవలం తొలి మానవుడుగానేకాక తొలి దైవ సందేశహరుడుగా కూడా నియమించబడ్డారు. దేవుడు తనకు సమ్మతమైన ధర్మాన్ని ఆయనకు బోధించి, దాన్ని తన సంతతికి ఉపదేశించాలని ఆదేశించాడు. అంటే, "ఆరాధ్యుడు కేవలం ఒక్కడే; ఆయనే అల్లాహ్; ఆయనే సృష్టికర్త, పోషకుడు, ప్రభువు, ఆరాధ్యుడు, విధేయతకు అర్హుడు; మానవులంతా ఆయన సన్నిధిలోనే తిరిగి చేరవలసి ఉంటుంది; సహాయం అర్థించవలసింది ఆయన్నే. దైవ సమ్మతికనుగుణంగా, సజ్జనులుగా, సదాచారులుగా, భయభక్తులు కలవారుగా మనుషులు జీవించాలి; అలా నడుచుకుంటే దైవానుగ్రహ భాగ్యం ప్రాప్తమవుతుంది; అలాకాక ఆయన అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఇహపరాలలో నష్టపోతారు; ఈ అవిశ్వాస అవిధేయతా వైఖరికి ప్రతిఫలంగా కఠినమయిన దైవ శిక్షకు గురికావలసి వస్తుంది" అని తన సంతానానికి బోధించమని అల్లాహ్ ఆదం (అస్సలామ్) ను ఆదేశించాడు.

ఆదమ్ సంతతిలో మంచి బుద్ధి కలవారు తమ తండ్రి చూపిన రుజుమార్గాన్ని అనుసరించారు; దుష్టులు ధిక్కరించారు. క్రమేపి సకల విధాల చెడులు వారిలో చోటు చేసుకున్నాయి. వారిలో కొందరు సూర్య చంద్ర నక్షత్రాదుల్ని పూజించసాగారు. కొందరు చెట్లను, జంతువుల్ని,

నదుల్ని ఆరాధించడం మొదలెట్టారు. గాలి, నీరు, అగ్ని, ఆరోగ్యం, అనారోగ్యం ఇంకా ఇతర ప్రకృతి వరప్రసాదాలు శక్తులు అన్నింటికీ వేర్వేరు దేవుళ్ళు ఉన్నారని, వారు ప్రసన్నులయి కటాక్షించాలంటే వీటన్నింటినీ ఆరాధించాలని భావించారు కొందరు.

ఇలా అజ్ఞానం వల్ల బహుదైవారాధన, విగ్రహారాధనకు సంబంధించిన అనేక రూపాలు ఉనికిలోకి వచ్చాయి. వీటిద్వారా అనేక మతాలు ఆవిర్భ వించాయి. ఆదమ్ సంతతి భూగోళంలో విభిన్న ప్రాంతాల్లో విస్తరించి విభిన్న జాతులుగా రూపొందిన కాలమది. ప్రతి జాతి తనదంటూ ఓ కొత్త మతాన్ని ఓ ప్రత్యేక ఆచారవ్యవస్థను నిర్మించుకుంది. విశ్వప్రభువు, ఏకైక స్వామి అయిన దైవాన్ని మరచిపోవడంతోపాటు తమ తండ్రి అయిన ఆదమ్ బోధించిన నియమావళిని సయితం విస్మరించారు ప్రజలు. తమ మనోకాంక్షల్ని పాటించసాగారు. ప్రపంచం సకల దురాచారాలకు ఆలవాల మయిపోయింది. అన్నిరకాల మూఢభావాలు; మూర్ఖత్వపు నమ్మకాలు ప్రజల్లో ప్రబలిపోయాయి. మంచీ-చెడుల విచక్షణలో మనుషులు అనేక పొరపాట్లు చేశారు. ఎన్నో చెడ్డ వస్తువుల్ని మంచివిగా, మరెన్నో మంచి విషయాలు చెడ్డవిగా పరిగణించసాగారు. ★

---

★ మానవునికి మతపరంగా ప్రకృతి పూజయే తొలిమెట్టు అని ఆ తరువాతే మనిషి క్రమేణా దైవారాధన వైపుకు మరలాడని, ఇంకా పురోగమించి ఏకేశ్వరోపాసనకు చేరుకున్నాడని భావించేవారున్నారు. అయితే ఇస్లాం చూపే చారిత్రక దృక్పథం ఈ భావానికి పూర్తిగా భిన్నమయింది. ఈ తప్పుడు భావనగలవారు ప్రకృతి పూజకంటే ముందుండిన మానవ సమాజం లోని ఆరాధనా భావాన్ని పరిశీలించలేకపోతున్నారు. ఆధునిక శాస్త్రీయ పరిశోధనల ద్వారా తేలిందేమంటే మానవుని ఆరాధనా భావానికి తొలి

## ప్రవక్తల పరంపర

అప్పుడు ప్రతి జాతిలోనూ దైవ ప్రవక్తలు పంపబడ్డారు. హజ్రత్ ఆదమ్ (అలైహిస్సలాం) ప్రారంభంలో బోధించిన ఇస్లామ్ బోధనలనే వీరూ మానవులకు బోధించారు. వీరు తమ తమ జాతి ప్రజలకు వారు విస్మరించిన అసలు పాఠాన్ని జ్ఞాపకం చేశారు. ఒకే దేవుని ఆరాధన నేర్పారు. షిర్క్ (బహు దైవారాధన)ను, విగ్రహారాధనను నిషేధించారు. మూఢాచారాలను నిర్మూలించారు. దైవ సమ్మతికనుగుణంగా జీవితం గడిపే మార్గాన్ని చూపారు. దైవాదేశాలను అందజేసి వాటిని పాటించాలని చాటారు. భారతదేశం, చైనా, ఈరాన్, ఇరాక్, ఈజిప్ట్, ఆఫ్రికా, యూరోపు - ఒక్కటేమిటి దైవ ప్రవక్తలు ఆవిర్భవించని దేశమంటూ భువిలో ఏదీ లేదు. వారందరు బోధించిన ధర్మం ఒక్కటే - అదియే ఇస్లామ్. *

అయితే బోధనా విధానాలు, శాసనాంగం (షరీఅత్) వివరాలు

---

రూపం తౌహీద్ - ఏకేశ్వరోపాసనే. వేరే భావనలు, మతాలు, అన్నీ ఆ నిజ ధర్మానికి వికృత రూపాలే అని రుజువు అవుతోంది. వివరాలకు, ప్రొ. W.Schmidt రాసిన The Origin and Growth of Religions చదవగలరు.

* ఇస్లామ్, మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా ప్రారంభమయిందన్నది అపోహ. ఈ అపోహ సామాన్యంగా అంతటా ప్రచారం పొందింది. అంతేకాదు, ఇస్లాం వ్యవస్థాపకుడు ఆయనే అని కూడా చాలా మంది అభివర్ణించారు. ఇది తప్పు. ఇస్లాం ఆది నుండే మానవాళికై దైవం సమ్మతించిన ధర్మం. ప్రపంచంలో ఎప్పుడు, ఎక్కడ ఏ ప్రవక్త ప్రభవించినా వారు ఈ ధర్మాన్నే బోధించారు. అయినా వారెవరూ ఇస్లాం వ్యవస్థాపకులు కారు. దేవుని సందేశహరులు మాత్రమే.

విభిన్నమయినవే అన్నమాట వాస్తవం. ఆయా జాతుల్లో ఏ విధమయిన మూఢత్వాలు ప్రబలి ఉన్నాయో వాటిని నిర్మూలించడం పట్ల ఆయా జాతుల్లో వెలసిన ప్రవక్తలు అధికంగా శ్రద్ధ చూపారు. ఏ విధమయిన తప్పుడు భావాలు, తప్పుడు నమ్మకాలు సర్వసామాన్యంగా ఉండేవో వాటి సంస్కరణకై ఎక్కువ జాగ్రత్త తీసుకున్నారు.

సంస్కృతీ నాగరికతలు, విజ్ఞానం వివేకాలు, ఇంకా శైశవ దశలో ఉన్నప్పుడు సాధారణ బోధనలు, సులువయిన జీవన విధానం అనుగ్రహించ బడ్డాయి. మానవాళి ప్రగతిని సాధించినకొద్దీ, విస్తృతమయిన, కాలానుగుణ మయిన బోధనలు, జీవన నియమావళి ప్రసాదించడం జరిగింది. ఈ వ్యత్యాసం స్థూలంగానూ, అతి స్వల్పంగానూ ఉండేది. ప్రవక్తలందరూ బోధించిన మూలసూత్రాలు, సిద్ధాంతాలు, బోధనలు మాత్రం ఒక్కటే. అంటే విశ్వాసపరంగా దేవుని ఏకత్వం, ఆచరణరీత్యా నీతి, నిజాయితీ, సామరస్యాలు, ఇంకా మరణానంతర జీవితంలో శిక్ష లేక బహుమానం ప్రాప్తిస్తాయనే నమ్మకంలాంటి మౌలిక విషయాలు మాత్రం నిత్యం ఒక్కటే అన్నమాట.

## ప్రవక్తల ఎడల ప్రజల ప్రవర్తన

ఈ ప్రవక్తల పట్ల ప్రజలు చాలా విచిత్రంగా ప్రవర్తించారు. వారిని కష్టాలకు గురిచేశారు. వారి బోధనల్ని ఆలకించడానికి నిరాకరించారు. ఒకరిని దేశాన్నుండి బహిష్కరిస్తే మరొకరిని దారుణంగా హత్యచేశారు. కొందరు ప్రవక్తలు జీవితమంతా శ్రమించి ప్రజల్ని నయాన భయాన సన్మార్గం వైపుకు పిలిస్తే ఎంతో కష్టంగా ఏ కొందరినో తమ అనుచరులుగా చేసుకోగలిగేవారు. అయినా ఈ మహనీయులు తమ విధిని నిర్వర్తించడంలో

ఏ లోపమూ రానివ్వలేదు. చివరికి వారి శ్రమ ఫలించింది. వారి బోధలు క్రమేణ ప్రజాదరణ పొందసాగాయి. పర్యవసానంగా గొప్ప గొప్ప జాతులు వారిని అనుసరించసాగాయి. ఆ తరువాత మార్గభ్రష్టత్వం మరో రూపు ధరించింది. ప్రవక్తలు పరమపదించిన తరువాత వారి అనుచర సంఘాలు వారు బోధించిన ప్రబోధాల్లో, వారు ప్రసాదించిన గ్రంథాల్లో ఇష్టం వచ్చిన విధంగా ప్రక్షిప్తాలు చెయ్యసాగారు. వాటిలో మార్పులు చేర్పులు చేసి వాటి నిజ స్వరూపాన్నే మార్చివేశారు.

ఆరాధన, ఉపాసనా రీతుల్లో కొత్త పుంతలు తొక్కారు. కొందరు ఖుద్దుగా ప్రవక్తలనే పూజించసాగారు. ఇంకా కొందరు ప్రవక్తలనే దేవుని అవతారంగా అభివర్ణించారు. (అవతారమంటే దైవమే స్వయంగా మానవాకారంలో ప్రపంచంలో వెలిశాడని అర్థం). మరికొందరు తమ ప్రవక్తల్ని దేవుని కుమారులని నమ్మారు. ఇంకా ఇతరులు తమ ప్రవక్తనే దైవత్వంలో దేవునికి సహవర్తుడని భావించారు. మొత్తానికి మానవులు, దేవుని సందేశహరులపట్ల వ్యవహరించిన తీరు చాలా విచిత్రమయింది. మానవుల ఈ అత్యాచార క్రీడ ఎంతో వింతగా కొనసాగింది. ఎవరయితే విగ్రహాలను విరగ్గొట్టారో స్వయంగా వారి విగ్రహాలనే తయారుచేసి పూజించాడీ మానవుడు!

## మార్పులు, చేర్పులు

అంతేకాదు, ప్రవక్తలు తమ అనుచర సంఘాలకు అందజేసిపోయిన జీవిత నియమావళిని, చట్టాలను సయితం రూపు మాపడం జరిగింది. ఆ స్వచ్ఛమయిన నియమావళిలో ఎన్నో మూఢాచారాలు, కాకమ్మ కథలు, అసత్యాలు, నిరాధారమయిన మిథ్యా వ్యాఖ్యానాలు చేర్చబడ్డాయి. ఈ

దైవాదేశాలతో పాటు మానవ కల్పిత నియమాలను కలగాపులగం చేశారు, చివరికి కొన్ని శతాబ్దాల తరువాత దైవ ప్రవక్తల నిజ ప్రబోధం ఏదో, వారు ఆదేశించిన నియమావళి ఏదో, అందులో వారి అనుచరులు చేర్చిన చేర్పులేవో, చేసిన మార్పులేవో తెలుసుకునే మార్గమే లేకుండా పోయింది.*

స్వయంగా ప్రవక్తల జీవిత వివరాలు సయితం కట్టు కథలతో కలసి కలుషితమైపొయ్యాయి. వాటిలో నమ్మదగ్గదేదీ లేకుండా పోయింది. అయినప్పటికీ ప్రవక్తల శ్రమ వృథాపోలేదు. ఎన్ని ప్రక్షిప్తాలు జరిగినా ఏదో కొంత సత్యం, ఏదో ఒక యదార్థం ప్రతి జాతిలోనూ మిగిలింది. దైవభావన, మరణానంతర జీవితం పట్ల నమ్మకం ఏదో ఒక రూపంలో జాతులన్నిటిలోనూ సామాన్యమయిపొయ్యాయి. సత్యం, సన్మార్గం, నీతి, నిజాయితీల నియమాలు సామాన్యంగా ప్రపంచమంతటా అంగీకరించబడ్డాయి. ఇలా వివధ జాతుల్లో ఆవిర్భవించిన ప్రవక్తలు ఒక్కొక్కరే తమ తమ అనుచర సంఘాల్లో సలిపిన కృషి ఫలితంగా, సార్వజనీన ధర్మ ప్రబోధానికి సానుకూలత సిద్ధించింది. ఎలాంటి విచక్షణ లేకుండా సకల మానవులు, సర్వసామాన్యంగా, సులభంగా గ్రహించగలిగే ఒకే ఒక నిజ ధర్మాన్ని ప్రబోధించేందుకు ప్రపంచమంతటా పరిస్థితులు మారి అనుకూల వాతావరణం ఏర్పడింది.

## బాధ్యతలు

ముందు పేర్కొన్న విధంగా ప్రతి జాతిలోనూ ప్రత్యేకంగా ప్రవక్తలు

---

★ ఈ సందర్భంలో స్పష్టంగా అర్థం చేసుకోవలసిన విషయమేమంటే – ఈ మార్పులు చేర్పులతో ప్రవక్తల అనుచరులు తమ నిజధర్మమైన ఇస్లాం రూపాల్ని తారుమారుచేసి వేర్వేరు మతాలు స్థాపించుకున్నారు. అవే నేడు విభిన్న పేర్లతో చెలామణి అవుతున్నాయి.

ప్రభవించేవారు. వారి ప్రబోధాలు ఆయా జాతుల వరకే పరిమితమయి ఉండేవి. ఎందుకంటే ఆ కాలంలో ఏ జాతికాజాతి వేర్వేరుగా ఒకదానికొకటి సంబంధం లేకుండా ఉండేది. పరస్పరం కలుసుకునే అవకాశాలు చాలా అరుదు. జాతుల మధ్య విభేదాలు ప్రబలి ఉండేవి. ప్రతి జాతి తన దేశం పొలిమేరలకే పరిమితమయి ఉండేది.

అలాంటి పరిస్థితుల్లో జాతులన్నిటికీ సమంగా వర్తించే ఒక సామాన్య ధర్మం జాతులన్నిటిలో వ్యాప్తిచెందడం సాధ్యమయ్యే పనికాదు. అంతేకాక వివిధ జాతుల పరిస్థితులు వేర్వేరుగా విభిన్నంగా ఉండేవి. ప్రపంచమంతటా అజ్ఞానం సర్వ వ్యాప్తంగా ఉండేది. ఈ అజ్ఞానం కారణంగా విశ్వాసాల్లో ఆచరణల్లో ఏర్పడిన చెడులు, అపమార్గాలు ఒక్కోచోట ఒక్కో విధంగా ఉండేవి. ఆ కారణంచేతనే దైవ ప్రవక్తలు ప్రతి జాతిలోనూ వేర్వేరుగా ప్రభవించి, వేర్వేరు ప్రబోధాలు చెయ్యడం, ఆయా ప్రజలలో ఉన్న మిథ్యాభావాలను రూపుమాపి వాటిస్థానే సద్భావనల్ని ప్రబోధించడం, మూఢాచారాలను ఒక్కొక్కదాన్నే దూరంచేసి సదాచారాలను నెలకొల్పడం అనివార్యమయింది, అంటే చిన్న పిల్లలకు శిక్షణ ఇచ్చినట్లు శిక్షణ గరపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. జాతుల్ని ఈ విధంగా సుశిక్షితులుగా తయారుచెయ్య డానికి ఎన్ని వేల ఏండ్లు గడిచాయో దైవానికే తెలియాలి.

ప్రగతి మార్గాన పయనిస్తూ మానవజాతి శైశవ దశ నుండి పెరిగి ప్రాజ్ఞత పొందే కాలం సమీపించింది. వృత్తుల్లో, వాణిజ్యంలో, కళల్లో, పరిశ్రమల్లో వృద్ధివికాసాలతోపాటు ప్రపంచ జాతుల మధ్య పరస్పరం సంబంధాలు ఏర్పరచుకునే అవకాశాలు లభించాయి. చైనా, జపాను మొదల యిన ప్రాచ్యదేశాల నుండి బహుదూరాన ఉండే పాశ్చాత్య యూరోపు, ఆఫ్రికా దేశాల వరకు నౌకాయానం ద్వారా, భూయానం ద్వారా ప్రయాణ

సదుపాయాలు ఏర్పడ్డాయి. పెక్కు జాతుల్లో అక్షరాస్యత పెరిగింది. వ్రాత ప్రచారంలోకి వచ్చింది. కళలు, వైజ్ఞానిక విషయాలు సామాన్యమవసాగాయి. జాతుల మధ్య రాకపోకలతో భావాలు, సిద్ధాంతాలు, శాస్త్రీయ విషయాల ఇచ్చిపుచ్చుకోవడాలు ప్రారంభమయ్యాయి.

## మారిన పరిస్థితులు

గొప్ప గొప్ప విజేతలు బయల్దేరారు, గొప్ప గొప్ప సామ్రాజ్యాలు స్థాపించి ఎన్నెన్నో దేశాల్ని, ఎన్నెన్నో జాతుల్ని ఒకే రాజకీయ వ్యవస్థ కింద తెచ్చారు. ఈ విధంగా మానవుల్లో ముందుండిన దూరాలు అంతరించాయి. విభేదాలు సయితం సన్నగిల్లాయి. అప్పుడు ఇస్లామ్ బోధనల్ని ఒకే రూపంలో ఒకే పంథాలో బోధించడానికి, ఒకే జీవిత నియమావళిని ప్రపంచం మొత్తాన వ్యాపింపజెయ్యడానికి అవకాశాలు సుగమమయ్యాయి. వాస్తవానికి, నేటికి రెండున్నరవేల ఏండ్ల క్రితం, ప్రపంచ పరిస్థితులు మెరుగయి మనిషి అభివృద్ధి గడించిన కాలంలో ప్రపంచం మొత్తానికి సామాన్యంగా వర్తించే ఓ ధర్మానికై నిరీక్షించాడు మానవుడు. బౌద్ధమతం పరిపూర్ణ ధర్మం కాకపోయినప్పటికీ, అందులో కేవలం కొన్ని నైతిక నియమాలే ఉన్నప్పటికీ అది భారత దేశం దాటి అటు జాపాను, మంగోలియా వరకు ఇటు అఫ్ఘానిస్తాన్, బుఖారా వరకు వ్యాపించింది. దాని ప్రచారకులు దూరప్రయాణాలు చేసి బహుదూర దేశాల్లో దాని ప్రచారం చేశారు. దానికి కొన్ని శతాబ్దాల తరువాత క్రైస్తవ మతం వెలిసింది. హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు) (అలైహిస్సలాం) ప్రబోధించిన ధర్మం ఇస్లామ్ ధర్మమే అయినా ఆయన తరువాత క్రైస్తవమతం పేరుతో ఓ అసంపూర్ణమతం ఉనికిలోకి వచ్చింది. క్రైస్తవులు ఈ మతాన్ని ఈరాన్ నుంచి ఆఫ్రికా వరకు వ్యాపింపజేశారు. ఆనాటి ప్రపంచమే ఒక

సార్వజనీనమయిన మతం కొరకు ఒక పరిపూర్ణ ధర్మం కొరకు తహ తహలాడేదని, దానికై పరిపూర్ణ ధర్మం, సత్యధర్మం లభించకపోవడంచేత అసంపూర్ణమయిన మతాలను మానవుల్లో ప్రచారానికి అవకాశం ఇచ్చిందని ఈ పరిశీలన వల్ల బోధపడుతూనే ఉంది.

## సమగ్ర విశ్వధర్మం

మానవ నాగరికతే ఓ మలుపులో ఉన్న ఆ పరిస్థితుల్లో మనిషి అంతర్యం ఓ విశ్వధర్మం కొరకు పరితపిస్తోంది, అప్పుడు ప్రపంచం మొత్తానికి, జాతులన్నింటికిగాను అరేబియాలో ఓ ప్రవక్త ప్రభవింపజెయ్య బడ్డారు. ఏ ధర్మం వైపుకు ప్రజల్ని ఆహ్వానించమని ఆయన్ని నియమిం చటం జరిగిందో అదీ ఇస్లామే - ఐతే ఇప్పుడు అది పరిపూర్ణంగా, సర్వతో ముఖంగా మానవ జీవితపు వ్యక్తిగత, సామూహిక రంగాలపై నైతిక, భౌతిక రూపాలపై సర్వవ్యాపకమయినదిగా పంపబడింది. ఆయన సకల మానవాళి కిగాను దేవుని సందేశహరులుగా నియమించబడ్డారు. ఆయన తన సందేశాన్ని ప్రపంచం మొత్తాన ప్రచారం చెయ్యడానికి నియుక్తులయ్యారు. ఈ ప్రవక్తే "ఇస్లామ్" ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)!

## ముహమ్మద్ దైవదౌత్యం

భూగోళంపై ఒక్కసారి దృష్టిని సారించామంటే మనిషికి అవశ్యమైన విశ్వధర్మం ప్రారంభమవడానికి అరేబియా దేశంకన్నా ఉచితమయిన వేరే దేశం కానరాదు. అది సరిగ్గా ఆసియా, ఆఫ్రికాల మధ్య ఉంది, యూరోపు సయితం ఎంతో దూరంలో లేదు. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) కాలంలో నాగరికంగా, సాంస్కృతికంగా అభివృద్ధిచెందిన యూరపు దేశాలు దానికి

దక్షిణ దిశలోనే వుండేవి. అందుచేత అక్కడి ప్రజలు, భారతదేశ ప్రజలు అరేబియా నుండి సమాన దూరంలోనే వుండేవారు. ఈ కారణాల వల్లి అరేబియా దేశానికి మధ్యస్థానం లభించింది.

ఆ కాలపు చరిత్రను కాస్త గమనించండి. ఈ విశ్వ ప్రవక్తా పదవి అప్పగించడానికి అరబ్బుల కన్నా యోగ్యమైన వారు కానరారు.

ప్రపంచంలో తమ ఆధిక్యతను చలాయించడానికి ప్రపంచంలోని గొప్ప గొప్ప జాతులన్నీ అమితంగా కృషిచేస్తూవుండేవి. ఈ సుదీర్ఘ పోరాటంలో అవి తమ శక్తిసామర్థ్యాలను కోల్పోయాయి. అరబ్బు జాతి ప్రపుల్ల యౌవ్వనంలో వున్న జాతి. ఆనాటి అగ్రదేశాల్లో సాంఘికపురోభివృద్ధి ఎన్నో కీడుల్ని ఉత్పన్నం చేసింది. అరబ్బుల్లో సాంఘిక వ్యవస్థ లేనే లేదు. తత్కారణంగా, సోమరితనం, పిరికితనం, సుఖ ప్రీతి, తదితర భోగవిలాసాలు, వాటి పర్యవసానంగా జనించే రుగ్మతలు వారిలో ఉత్పన్నం కాలేదు. ప్రపంచంలోని గొప్ప జాతుల సాంఘిక వ్యవస్థ, నాగరికతల కృత్రిమ ప్రభావం క్రీ.శ. 5వ శతాబ్దంలోని దేశదిమ్మరులయిన అరబ్బుల చేరువకు చేరలేదు. సమకాలీన "సాంఘికపురోభివృద్ధి" గాలిసోకని జాతులకు ఉండవలసిన సద్గుణాలన్నీ అరబ్బుల్లో ఉండేవి. ధైర్యం, సాహసం, నిర్భయత, విశాల హృదయత, విశ్వసనీయతలు వారి సహజ గుణాలు. వాగ్దాన పాలనలో సాటి లేనివారు, స్వాతంత్ర్యప్రియులు, రాజకీయంగా స్వతంత్రులు కూడా. ఏ సామ్రాజ్య శక్తికీ దాసులు కారు. అమిత నిరాడంబర జీవులు. భోగభాగ్యాల జీవితం వారెరుగరు. అయితే వారి జీవితంలో మెచ్చుకోతగని దుష్టత్వాలు కొన్ని వుండేవన్న దానిలో ఎలాంటి సందేహం లేదు. కాని, వాటికి కారణం వేరు. కొన్ని వేల ఏండ్లుగా వారిలో దైవ ప్రవక్త ఎవ్వరూ ప్రభవించలేదు. సంస్కర్త కూడా వెలియలేదు, వారి నైతిక జీవితాన్ని పరిశుద్ధపరచడానికి,

శతాబ్దాలుగా ఎడారుల్లో సాగిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల జీవితం వారిలో అంతులేని అజ్ఞానాన్ని పెంపొందించింది. తమ మూఢాచారాలపై ఎనలేని పట్టుదల వారిలో పెంచింది. వారిని సంస్కరించి మామూలు మనుషులుగా తయారు చేయడం సాధారణ వ్యక్తి వల్ల జరిగే పని కాదు. అదే సమయంలో అసమానమయిన ప్రజ్ఞావంతుడెవరయినా వారి సంస్కరణకై పూనుకుని, వారికి ఒక ఉత్తమాశయం, ఒక పరిపూర్ణ కార్యక్రమం అప్పగిస్తే తక్షణమే దాన్ని స్వీకరించి ఆ ఆశయసిద్ధికై ప్రతిభావంతంగా కృషిచెయ్యడానికీ, ఆ మార్గంలో ఏ విధమైన కష్టాన్నయినా సహించడానికీ, ఎలాంటి త్యాగానికయినా సిద్ధమవడానికి వెనుకాడరు. తమ లక్ష్యసాధనలో లోకమంతా ఏకమయి అడ్డుపడినా ఏమాత్రం జంకులేకుండా ప్రపంచాన్ని సయితం ఎదిరించడానికి సన్నద్ధులు కాగలరు. నిస్సందేహంగా ఇలాంటి ప్రఫుల్ల హృదయాలూ, శక్తిమంతులయినవారే విశ్వప్రవక్త ముహమ్మద్(సఅసం) బోధనల ప్రచారానికి అవసరం అన్నది సుస్పష్టం.

## సమగ్ర భాష

ఇక అరబీ భాషను గమనించండి. ఆ భాషను మీరు చదివి దాని సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేశారంటే - ఉన్నతమయిన ఆదర్శాల స్పష్టీకరణకు, దైవజ్ఞాన సంబంధమయిన అతి సున్నితమూ, అమిత సూక్ష్మమూ అయిన సమస్యల్ని వివరించటానికి, మానవ హృదయాన్ని కదిలించి, దైవ సంస్మరణకు, దైవానికి స్వయం సమర్పణ వైపుకు దాన్ని మరల్చడానికీ, అరబీ భాషకన్నా ఉత్తమమైన భాష వేరొకటి లేదనేది మీరు ఇట్టే పసిగట్టగలరు. చిన్న చిన్న వాక్యాల నుడికారపు సొంపులు, భావసాగరాలను ఒలికిస్తాయి. అదే సమయంలో వాటి ధారావాహికమైన భావోద్వేగం ఎంత

బలవత్తరమయినది! అమాంతంగా హృదయాంతరాళాల్లో దూసుకుపోతుంది! దాని స్వరాల సంగీతం హృదయాల్ని చలింపజేసి కన్నీటి ధారను ఉప్పొంగిస్తుంది. మృదుమధురమయిన కోమల లావణ్య శబ్దాల ఆలాపన ఆలకిస్తే చెవుల్లో అమృతం రంగరించి పోసినంత తీయగా కర్ణపేయంగా ఉంటుంది. ఆనందదాయకమయిన ఆ ఆలాపన శ్రోతల అణువణువును పులకింపజేస్తుంది. ప్రతి అంగమూ డోలలూగుతుంది. పవిత్ర ఖురాన్‌లాంటి మహద్వాణికై భావశబ్దారావ సంపన్నమైన భాషే కావలసింది!

ఈ విధంగా కాబోయే విశ్వ శక్తికి జన్మస్థానంగా అరేబియా దివ్యభూమిని ఎన్నుకోవడంలో దేవుని మహత్తర ప్రజ్ఞా విశేషం, ప్రతిభ వ్యక్తమవుతాయి. విశ్వప్రవక్తా పదవికిగాను ఎన్నుకోబడ్డ అపురూపమైన శుభాత్మ వ్యక్తిత్వం ఎలాంటి అపూర్వమయినదో చూద్దాం.

## సహేతుక నిర్ధారణ

కాస్త కళ్ళు మూసుకుని 1400 సంవత్సరాలకు ముందుండిన ప్రపంచాన్ని ఊహించుకోండి. మనకు అది ఒక అజ్ఞాతమయిన ప్రపంచం, నేటి ప్రపంచానికి ఏ మాత్రం పోలికలేని జగత్తు.

అంతా అంధకారమయం, విద్యా జ్యోతి ఎక్కడో ఒక చోట మినుకు మినుకుమంటూ వుండేది. మానవ అజ్ఞానపు చీకటికి అది ఏ విధంగానూ కాంతిని ప్రసాదించలేకపోయింది. టెలిఫోన్, వైర్‌లెస్, సినిమా, టెలివిజన్‌లాంటి సాధనాలు అప్పుడు ఎక్కడా కానరావు. రైళ్ళు, మోటారులు, ఎయిరోప్లేన్‌ల పట్ల కలగనడం కూడా ఆ కాలంలో అసాధ్యమే. అచ్చుయంత్రాలు, వార్తాపత్రికలు, గ్రంథాలయాలంటే యేమిటో అప్పటిలో ఎవరికీ తెలియదు. ఏ కొద్దిగా అక్షర జ్ఞానంఉన్నా అది తరతరాలుగా వంశపారంపర్యంలో వచ్చే

వ్రాత ప్రతుల మూలంగానే ఉండేది.

విద్యాసముపార్జన ఎంతో గొప్ప భాగ్యం. ఐశ్వర్యవంతులకే అది సాధ్యం. విద్యాసంస్థలు అరుదు, బహుదూర ప్రాంతాల్లో వుండేవి. అప్పటి మానవుని విజ్ఞానం అతిస్వల్పం. దృష్టి సంకుచితం, భావాలు పరిమితం. నేటి సాధారణ వ్యక్తి కన్నా ఆనాటి విద్వాంసులూ వైజ్ఞానికంగా ఎంతో వెనుకబడిన వారు. అప్పటి సంస్కారశ్రేష్ఠుడయిన వ్యక్తికన్నా నేటి దారినపోయే దానయ్యే ఎంతో మెరుగు!

వాస్తవానికి మానవ జగత్తే అజ్ఞానం మూఢనమ్మకాల కారుచీకటి లోయలలో పడివుండేది. ఏ కొద్దిగా వెలుగుండినా అది చుట్టూ ఆవరించిన చీకట్లతో పోరాడుతూ వృధాప్రయాసపడుతూ ఉండేది. నేడు సామాన్య విజ్ఞానమనబడే విషయాలెన్నో, ఆనాడు ఏళ్ళ తరబడి కష్టపడి సాధించడమూ దుర్లభమే. కష్టభూయిష్టమయిన ప్రయాణాలు చేసి, జీవితాన్నంతా ధారపోసి సాధించేవారు - నేడు ప్రతివానికీ వారసత్వంగా లభించే ఒక్కొక్క సాధారణ విషయాన్ని! ఆధునిక కాలంలో కాకమ్మ కథలూ, మూఢనమ్మకాలనబడే విషయాలు ఆ కాలంలో అభేద్యమయిన సత్యాలుగా వ్యవహరించబడేవి. ఈ యుగంలో పశుత్వంగా అమానుషంగా పరిగణించబడే చర్యలు ఆ యుగంలో సర్వసామాన్యం. ఇప్పుడు మనకు నైతికంగా అసహ్యంగా గోచరించే విధానాలు అప్పటి పరమపావన నైతికపు విలువలు. ఆ కాలంలో, "వేరొక జీవిత విధానం కూడా సాధ్యమే" అని ఊహించడం కూడా అసాధ్యమే. ఒక విషయం మానవాతీతంగా, అసాధారణంగా, సాధ్యమయినదిగా, అనూహ్యమయినదిగా, చివరికి అహేతుకమయినదిగా వ్యక్తమవనంతవరకు దాన్ని ఉన్నతమయినదిగా పరిగణించడానికి సిద్ధపడేవారు కారు జనులు. గుడ్డి నమ్మకాలు, అజ్ఞానం అంతగా ప్రబలిపోయి, విస్తృతంగా వ్యాపించాయన్నమాట. న్యూనతాభావం

వారిలో బాగా పేరుకుపోయింది. సాధారణ మానవుడు కూడా దైవిక భావాలు, ధర్మజ్ఞానం కలిగి ఉంటాడనీ, రుషులు కూడా మానవులేననీ వారిప్పటికీ ఊహించజాలరు.

## కారుచీకట్లలో అరేబియా

అలాంటి అంధకార యుగంలో చీకట్లు అతి గాఢంగా క్రమ్ముకున్న ప్రదేశం ఒకటి వుండింది. పొరుగు దేశాలయిన పర్షియా, రోము, ఈజిప్టు దేశాలు ఏదో కొంత నాగరికతతో మెరిసిపోయేవి. అక్కడ మినుకు మినుకుమనే విద్యాకిరణాలు గోచరించేవి. కాని వాటితో వున్న సాంస్కృతిక సంబంధాల ద్వారా ఎలాంటి ప్రయోజనమూ పొందలేకపోయింది అరేబియా. ఇసుక మహాసముద్రాల కారణంగా అన్య దేశాల నుండి బహుదూరమయి ఏకాకిగా ఉండిపోయింది. అరబ్బు వర్తకులు నెలల తరబడి బహుదూర ప్రయాణాలు చేసి ఈ దేశాలతో లావాదేవీలు ఎన్ని పెంపొందించినా ఈ ప్రయాణాలు వారికి విద్యావిషయంలో రవ్వంత కూడా లాభకరించలేదు. వారి స్వదేశంలో ఒక విద్యాలయమూ, ఒక గ్రంథాలయమంటూ స్థాపించుకోలేకపోయారు. విజ్ఞానాభివృద్ధికై ఆసక్తి అందరిలో మృగ్యమయిపోయింది. వారిలో విద్యావంతులయిన ఏ కొద్ది మందిలోనూ సమకాలీన కళ, శాస్త్రీయ పరిజ్ఞానం లేకపోయింది. వారు సాధించినది ఒక్కటే - అత్యున్నతంగా వృద్ధిపొందిన భాష మానవ భావనా ఔన్నత్యానికీ, విచార ధారలకు సంబంధించిన సూక్ష్మాతిసూక్ష్మమయిన వర్ణనను ఎంతో శ్లాఘనీయమైన రీతిలో అభివర్ణించయోగ్యమయిన భాష! దీనితో పాటు అత్యుత్తమమైన సాహిత్యాభిరుచి కూడా వారికి ఉంది. కాని వారి సాహిత్య అవశేషాలను పరిశీలిస్తే వారి జ్ఞానం ఎంత పరిమితమయి ఉండిందో అవగతమవుతుంది. వారి సంస్కృతీ

నాగరికతలు ఎంత అల్పస్థాయిలో ఉండేవో బోధపడుతుంది. వారి మానసిక స్థితి మూఢనమ్మకాలచేత ఎంత కరుడుగట్టిపోయిందో తెలుస్తుంది. వారి ఆలోచనాసరళి, వారి దృక్పథాలు, వారి సంప్రదాయాలు ఎంత క్రూరంగా అమానుషంగా ఉండేవో ద్యోతకమవుతుంది. వారి నైతిక ప్రమాణాలు, భావాలూ ఎంత అల్పమయినవో వ్యక్తమవుతంది.

అది ప్రభుత్వంలేని దేశం. ప్రతి తెగ తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకునేది. స్వయంగా ఒక స్వతంత్ర వర్గంగా పరిగణించుకునేది. ఆటవిక న్యాయమే అక్కడ న్యాయం. కొల్లగొట్టడం, దోపిడీ జరపడం, అనాథలూ, నిరపరాధుల హత్యలు సర్వసాధారణం. మనుషుల ధన, మాన ప్రాణాలు అనుక్షణం ప్రమాదంలో ఉండేవి. వివిధ తెగలవారు ఒకరిపై మరొకరు ఎల్లప్పుడూ కత్తులు దూసేవారు. సందర్భవశాత్తు జరిగే ఒక చిన్న సంఘటనే చాలు – భయంకర క్రోధాలు రగులుకోడానికి! కొన్ని దశాబ్దాల వరకు దేశమంతటా వ్యాప్తమయ్యే ఎడతెగని హత్యా కాండకు! తాను తలచిన వ్యక్తిని హింసించడానికి తనకు అధికారమున్నప్పుడు అతన్ని ఎందుకు వదిలిపెట్టాలో వాస్తవంగా అక్కడి సగటు మనిషికి బోధపడేది కాదు!

నైతికంగా, సాంస్కృతికంగా, నాగరికంగా వారిలో వున్న భావాలు కేవలం మూర్ఖత్వం క్రూరత్వాలే. శుద్ధాశుద్ధాలలో, న్యాయాన్యాయాలలో, సభ్యాసభ్యాలలో తారతమ్యం గోచరించదు వారికి, వారిది ఆటవిక జీవితం. పాశవిక విధానాలు, వ్యభిచారం, జూదం, మద్యపానంలో ఆరితేరినవారు. కొల్లగొట్టడం, దోపిడీలు జరపడం వారి సూత్రాలు. హింసలూ, హత్యలు వారి నైజం. లజ్జారహితంగా ఎదురెదురుగా దిగంబరులయి సంచరించినా వారి మనస్సాక్షికి ఎలాంటి అభ్యంతరం లేదు. మానసీమణులు సయితం

నగ్నంగా "కాబా" ప్రదక్షిణంలో పాల్గొనేవారు. ఎవరినయినా అల్లునిగా అంగీకరించడం అంటే నీచంగా భావించేవారు. ఈ మూర్ఖపు పరువుప్రతిష్ఠల కొరకు తమ ఆడ సంతానాన్ని సజీవంగా పూడ్చిపెట్టేవారు. తండ్రి మరణానంతరం సవతి తల్లిని నిర్మొహమాటంగా పెళ్ళాడేవారు. భోజనం, వస్త్రధారణ, స్నానాది దినచర్యలలోనూ అవలంబించవలసిన కనీస సభ్య విధానాలు సయితం వారికి తెలియవు.

ఆ కాలంలో ప్రపంచమంతటా మత సంబంధమైన విషయాల్లో వ్యాపించివుండిన దురాచారాలూ, దుష్ట విశ్వాసాలకు వారూ లోనయి ఉండేవారు. రాళ్ళూరప్పలు, వృక్షలూ, విగ్రహాలూ, నక్షత్రాలూ, దయ్యాలను - అంటే దైవం తప్ప గోచరించిన ప్రతి దాన్నీ ఆరాధించేవారు. ఎక్కడా తలవంచనివారు శిలా విగ్రహాల ముందు సాష్టాంగపడేవారన్నమాట!

## రక్షకుని జననం

అలాంటి అంధకారబంధురమయిన దేశంలో ఒక వ్యక్తి జన్మిస్తాడు. శైశవంలోనే తల్లిదండ్రులు దివంగతులయ్యారు. కొన్ని ఏండ్ల తదుపరి పోషించిన తన తాతయ్యగారి దేహాంతమూ జరిగింది. దీనికి పర్యవసానంగా ఆ కాలంలో ఒక అసాధారణ అరబ్బు బాలునికి అధమంగా లభించే కనీసమయిన పెంపకమూ శిక్షణా సౌకర్యాలు కూడా పొందే భాగ్యానికి నోచుకోలేదా బాలుడు. ప్రాజ్ఞత రాగానే పల్లెవాసులయిన మోటు బాలురతో చేరి గొర్రెల మందల్ని మేపుకునేవాడు. అరబ్బుల పరిస్థితి ఎంత హీనంగా ఉందో ఇంతకు ముందే తెలుసుకున్నాము. అలాంటి అరబ్బులలోనే ఆయన నిత్య సహవాసమూ లావాదేవీలంతా. విద్యా పరిమళం ఆయనకు సోకలేదు. పూర్తిగా నిరక్షరాసి, పాఠశాల పేరు కూడా ఎరుగడు. అరబ్బుల్లో

విద్వాంసులూ, పండితులూ మృగ్యమయిన కారణాన అలాంటి వారితో సహవాసం ఎన్నడూ లభించలేదు. స్వదేశాన్ని వదలి విదేశాలకు పోయే సందర్భాలు కొన్ని లభించినా అవి సిరియా వరకే పరిమితమై ఉండేవి. కాని, అరబ్బు వర్తకుల సాధారణ వాణిజ్య వర్గంకన్నా అవి ఏ విధంగానూ భిన్నమయినవి కావు. ఒకవేళ అక్కడ ఆయన కొందరు పండితులను దర్శించినా లేక అక్కడి నాగరికతా సంస్కృతులను పరిశీలించే అవకాశం ఆయనకు లభించినా కాకతాళీయంగా లభించిన ఈ స్వల్పమైన అవకాశాలకు ఆయన వ్యక్తిత్వ నిర్మాణంలో ఎలాంటి స్థానమైనా ఉంటుందనడానికి తావులేదు. ఆ ప్రయాణాలు - వైజ్ఞానికంగానూ, నాగరికంగానూ ఎలాంటి ప్రభావాన్నయినా ఆయనపై ఏర్పరచి ఉంటాయని నమ్మినప్పటికీ యదార్థం అది కాదు. ఆ కాలంలో ఎవరిలోనూ, ఎక్కడనూ గోచరించని పరిపూర్ణ ఆదర్శప్రాయమైన అసమాన మానవ గుణాల్ని ఆయనలో జనింపజేయగలిగే ధార్మిక, నైతిక, సాంస్కృతిక, నాగరికతా సంబంధమయిన దృక్పథాలూ, సిద్ధాంతాలు ఆ ప్రయాణాల ద్వారా ఆయనకు లభించాయనడానికి వీలులేదు.

## రాళ్ళకుప్పల్లో ఆణిమాణిక్యం

ఈ అత్యుత్తమ వ్యక్తి జీవితాన్ని ఆయన సాధించిన ఘనకార్యాల్నీ, ఆనాటి అరేబియా సమాజాన్నే కాక యావత్తు ప్రపంచ స్థితిని దృష్టిలో ఉంచుకుని మరీ పరిశీలించాలి.

తాను ఎవరి మధ్యనయితే పుట్టి పెరిగి పెద్దవాడయ్యాడో, వారందరిలో ఆయన పూర్తిగా విభిన్నమైన వ్యక్తి. ఎన్నడూ అబద్ధమాడి ఎరుగడు. జాతి మొత్తం ఆయన సత్యసంధత గురించి ఏకగ్రీవంగా సాక్ష్యమిస్తుంది. ఆయన శత్రుగణం సయితం ఆయన తన జీవితమంతటా ఎలాంటి సందర్భాన

అయినా అబద్ధమాడినట్లు ఆయన్ని నిందించలేదు. మిత భాషి, మృదుభాషి మధురభాషి, అసభ్యమయిన పలుకులూ, దూషణలూ ఆయన నోట ఏనాడూ ఎవరూ వినలేదు. ఎంతో మనోహరమయిన వ్యక్తిత్వం, చూచేవారి మనస్సుల్ని ఇట్టే చూరగొనే మనోజ్ఞమయిన స్వభావాలు, నీతినిజాయితీ ఉట్టిపడే వ్యవహారాలు. వాణిజ్య రంగంలో అనేక సంవత్సరాలు పని చేసినా తప్పుడు లావాదేవీలలో ఎప్పుడూ పాల్గొనలేదు. తోటివారంతా ఆయన్ని "సాదిక్, అమీన్" (సత్యసంధుడు, నిజాయితీపరుడు, విశ్వసనీయుడు) అని పిలిచేవారు. పరమ శత్రువులు సయితమూ తమ విలువయిన సామగ్రి ఆయన వద్ద భద్రపరచుకునేవారు. ఆయన కూడా వారి నమ్మకాన్ని నిరంతరం కాపాడేవాడు. ఆపాదమస్తకం అశ్లీలమైన సమాజం మధ్యన సౌశీల్య స్వరూపుడై జీవించేవాడు. మద్యపానం, జూదం కూడా సత్కార్యాలేనని తలచేవారిలో జన్మించి, వారిలోనే శిక్షణా పోషణలు గ్రహించినప్పటికీ వాటి చెంత చేరనివాడు. మోటుగా, సంస్కారరహితంగా, అశుద్ధంగా జీవించే మూఢజనంలో అత్యుత్తమ సభ్యతా సంస్కారాలు, శుచీశుభ్రతలను ప్రదర్శించేవాడు. హృదయమే లేనివారు నాలుగు వైపులా చుట్టి ఉన్నప్పటికీ మానవీయ దయార్ద్రత ఉప్పొంగే మనసు కలవానిగా వినమ్ర మనస్కునిగా నిలిచాడు. అనాధలను, వితంతువులను ఆదరించి సహాయం చేసేవాడు. ప్రయాణీకులను సత్కరించేవాడు. ఎవ్వరికీ హాని చేయనివాడు, ఇంకా ఇతరుల శ్రేయానికై తానే కష్టాలు సహించేవాడు.

యుద్ధాలూ రక్తపాతమంటే వెన్నముద్దలా భావించేవారిలో మెలిగినప్పటికీ తోటివారు కత్తులు దూసి పరస్పరం గొంతులు కోసుకున్నప్పుడు శాంతి ప్రియుడయిన అతని హృదయం ద్రవించేది. తెగలలో ప్రబలి ఉన్న విద్వేషాలు, వైషమ్యాలకు తాను దూరంగా ఉంటూ తోటి తెగలవారి మధ్య

సంబంధబాంధవ్యాల పునఃస్థాపనకై కృషి చేయడంలో ముమ్ముందు ఉండేవాడు. మూఢనమ్మకాలు కల విగ్రహారాధకుల్లో జన్మించినప్పటికీ విజ్ఞానం, వివేకం నిండిన మనస్సు పరిశుద్ధమయిన భావాలు కలవాడయి మెలిగేవాడు. భూమ్యాకాశాల్లో ఏకైక దైవం తప్ప వేరే ఏదీ పూజనీయం కాదని భావించేవాడు. సృష్టిలో దేని సమక్షాన కూడా తలవంచరాదని తలచేవాడు. విగ్రహాలకు అర్చనలు నైవేద్యాలు సమర్పించుకునే ఆచారాల్లో ఎన్నడూ - చివరికి బాల్యంలోనూ - పాల్గొనలేదు. దైవం తప్ప సృష్టిలోని ఇతర వాటన్నింటి పూజను అసహ్యించుకునేవాడు. క్లుప్తంగా చెప్పాలంటే ఆయన వ్యక్తిత్వం - అంధకారబంధుర వాతావరణంలో కాంతి శిఖరంలా, రాళ్ళకుప్పలో ఆణిమాణిక్యంలా అత్యున్నతంగా, అత్యుత్తమంగా ప్రజ్వలించేది!

## విప్లవం వస్తుంది

ఇలా సౌశీల్యవంతంగా, పరిశుద్ధంగా, అత్యున్నత శిష్టరీతిలో జీవితంలోని అధిక భాగం గడిచిపోయిన తరువాత ఆయనలో పెద్ద మార్పు వస్తుంది, తన చుట్టూ ఆవరించిన అజ్ఞానాంధకారం పట్ల ద్వేషం జనిస్తుంది ఆయనలో. తన్ను చుట్టుముట్టి వున్న అజ్ఞానం, అవినీతి, అమానుషత్వం,అరాచకం, విగ్రహారాధనల ఘోరమయిన మహాసాగరాలను ఛేదించుకుంటూ ఈదుకొని పోవాలని పరితపిస్తాడు. తన మనోభావాలతో పరాగంగా శృతి కలిపేదేదీలేదని గ్రహిస్తాడు, జనవాసాల్లో జరిగే గందరగోళాలకు బహుదూరంగా, పర్వతాల్లో పోయి అప్పుడప్పుడు విశ్రమించేవాడు. పరిపూర్ణ ఏకాగ్రతతో ధ్యానంలో గడిపేవాడక్కడ. ఆత్మ, మనోమస్తిష్కాల్లో నుంచి ప్రాపంచిక కల్మషాలను తొలగించి పరిశుద్ధత, పవిత్రత కొరకు ఉపవాస వ్రతాలు పాటించి సుదీర్ఘంగా నిగూఢ చింతనలో ఆ అంధకారాన్ని పారద్రోలగలిగే కాంతికై అన్వేషించేవాడు.

అవినీతి, అరాచకం పాలయిన తత్కాలపు వికృత ప్రపంచాన్ని తుదముట్టించి, ఉత్తమమయిన మరో ప్రపంచాన్ని నిర్మించడానికి కావలసిన శక్తిని చేపట్టేందుకు తాపత్రయపడేవాడు.

## సందేశం

అకస్మాత్తుగా ఆయన వ్యక్తిత్వంలో ముఖ్యమయిన విప్లవం వస్తుంది. ఒక్కసారిగా ఆయన చిత్తం దైవ కాంతితో జ్యోతిర్మయమవుతుంది. తాను దేనికై తాపత్రయపడుతున్నాడో ఆ శక్తి జనిస్తుంది. ఏకాంత గుహలో నుంచి వెలుపలికి వస్తాడు. ప్రజల్లో ప్రవేశిస్తాడుః

"మీరారాధించే విగ్రహాలు కేవలం పనికిమాలినవి, ఇక వాటిని పూజించడం మానివేయండి. నక్షత్రాలూ, వృక్షాలూ, ప్రేతాత్మలూ - అంతమయ్యేవేవీ మానవారాధనకు తగవు. వాటిని ఆరాధిస్తూ వాటిముందు తలవంచకండి. ఈ విశ్వం యావత్తు ఇందులో ఉన్న సకల వస్తుసమేతంగా - సర్వేశ్వరుడయిన ఏకైక దేవునిదే. ఆయనే సృష్టికర్త, పోషకుడు, పాలకుడు. అందుచేత ఆయనే నిజ ప్రభువు. ఆయన ముందరే అందరూ మోకరిల్లాలి. ఆయననే ప్రార్థించాలి. ఆయనకే విధేయులై ఉండాలి. ఆయననే ఆరాధించాలి. ఆయన ఆజ్ఞలనే పాటించాలి.

"మీరు చేసే దుండగాలూ, హత్యాకాండలూ, శీలాపహరణలూ, అన్యాయాలూ, అత్యాచారాలూ - అన్నీ దైవదృష్టిలో మహాపాతకాలు. ఈ పాపపు కార్యాలను, ఈ అధర్మమయిన కార్యాలను త్యజించండి. వీటన్నింటినీ అసహ్యించుకుంటాడు దేవుడు. సత్యమే పలకండి, నీతిపరులై జీవించండి, హత్యలు మానండి, ఎవరినీ దోచుకోకండి, న్యాయం రీత్యా మీ హక్కులను మీరు తీసుకోండి, అలాగే ఇతరుల హక్కులనూ వారికి ఇప్పించండి.

"మీరు మానవులు - మానవులంతా దైవ దృష్టిలో సమానులే. ఎవరిదీ తుచ్ఛమయిన పుట్టుక కాదు. ఇంకా పుట్టుక రీత్యా ఎవరూ ఉత్తములూ, పావనులూ కారు; దైవ విశ్వాసం, దైవ భీతి, సదాచారం, సత్యసంధత కలవాడూ, మాటల్లో, చేతల్లో, నిజాయితీపరుడయినవాడే గౌరవనీయుడు, ఉత్తమమయినవాడు. పుట్టిన కుటుంబంలో గల వ్యత్యాసం, వంశంలో గల ఔన్నత్యం మనిషి గొప్పతనానికీ, గౌరవానికీ ప్రమాణాలు కావు. దైవానికి భయపడేవాడూ సత్కర్మల నాచరించేవాడే మానవుల్లో ఉత్తముడు. దైవ భక్తిలేనివాడు, దుర్వ్యసనాల పాలయినవాడు పరాజయం, పరాభవాలకు గురవుతాడు.

"మరణానంతరం ఒక నిర్ణయ దినాన మీరంతా మీ నిజప్రభువు ముందు హాజరు కావలసి ఉంటుంది. అప్పుడు మీ మంచి పనులూ, చెడ్డ పనుల లెక్క మీరు చూపవలసి ఉంటుంది. ఆనాడు ఏదీ దాచడానికి వీలుపడదు. మీ జీవితపు కర్మపత్రం మొత్తం ఆ ప్రభువు సమక్షాన ప్రత్యక్షంగా ఉంటుంది. మీ సత్కర్మల, మీ దుష్కర్మల ఆధారంగా మీ భవితవ్యం నిర్ణయించబడుతుంది. నిజ న్యాయాధిపతి, సర్వాంతర జ్ఞాని, పరమ న్యాయశీలుడయిన దేవుని న్యాయస్థానంలో ఎలాంటి సిఫారసు చెల్లదు. అక్కడ ఏ విధమయిన పక్షపాతం వుండదు. మరెలాంటి లంచంవల్ల కూడా పని జరగదు. కేవలం నిష్కల్మషమయిన దైవ విశ్వాసం, చిత్తశుద్ధి కల సత్కర్మలే మీకు ఆనాడు నిలువ నీడనిస్తాయి. ఇవి ఉన్నవారికి శాశ్వత సుఖాల స్వర్గంలో స్థానం ప్రాప్తమవుతుంది. కాని ఇవి లేనివారు నరకాగ్నిలో చిరకాలానికి పడవేయబడతారు."

ఇదీ ఆయన ఇచ్చిన సందేశం. దీన్ని విని, అజ్ఞానంలో మునిగిపోయిన జాతి ఆయనకు ఎదురు తిరుగుతుంది. ఈ సందేశమిచ్చిన "అపరాధం"

మూలాన విశ్వసనీయుడు, సత్యవంతుడయిన ఈయనకు లభించిందేమిటి? తిట్ల మాలికలు, రాళ్ళజల్లులు! తమకు చేతనయిన హింసలన్నింటినీ, క్రూరమయిన యాతనలన్నింటినీ ఆయనపై ప్రయోగించడంలో వెనుతీయ లేదు స్వజాతీయులు. ఇలా ఒక దినం, ఒక నెల, ఒక సంవత్సరం కాదు, పూర్తిగా 13 సంవత్సరాలు, బాధాకరమయిన ఒకటిన్నర దశాబ్దం! చివరికి ఆయన్ని దేశం నుండి బహిష్కరించడం కూడా జరిగింది. పరదేశంలో మాత్రం ఆయన మార్గంలో పూల పాన్పులు వేశారా? అక్కడా పలు విధాలయిన కష్టాలకు గురయ్యారాయన. అరేబియా మొత్తమే ఆయనకు వ్యతిరేకంగా తిరగబడుతుంది. వలసపోయిన చోట కూడా పూర్తిగా ఎనిమిదేళ్ళు ఎడతెగని బాధలకు లోనవుతాడు. అంతా ఓర్చుకుంటాడు, తన ధ్యేయాన్ని ఏ మాత్రం వదలడు. తన లక్ష్యం కొరకు, తన జీవితాశయం కొరకు, దృఢసంకల్పంతో, స్థిరనిశ్చయంతో కొండలా నిలుస్తాడాయన.

## ఈ శతృత్వమంతా దేనికి?

స్వయంగా అతని జాతే అతని పట్ల విరోధానికి ఎలా పాల్పడిందని ఎవరైనా అడగవచ్చు, వెండీ - బంగారాల గూర్చి ఏదయినా తగాదా వచ్చిందా? పాత వైషమ్యాలేవయినా ఉబికి వచ్చాయా? ఆయన వారివద్ద ఏదయినా కోరాడా? కాదు, శతృత్వమంతటికీ కారణం ఒక్కటే - ఏకైక దేవుని ఆరాధించమనీ, సత్యం, సన్మార్గం, భయభక్తులతో జీవించమనీ అర్థించాడాయన. విగ్రహారాధన బహు దైవారాధనకు విరుద్ధంగా ప్రచారం చేస్తూ, వారి తప్పుడు జీవన మార్గాన్ని ఖండించాడు. పౌరహిత్యానికి మొదట్లో వేటు వేశాడు. మనిషీ మనిషీ మధ్య ఉచ్ఛ నీచ తారతమ్యానికి, నిమ్నోన్నతా భావాలకు ఎదురు తిరిగాడు. వర్ణాలూ, వర్గాల దురభిమానాన్ని

కేవలం మూర్ఖత్వమని నిరసించాడు, అజ్ఞాతకాలం నుంచి సాంప్రదాయికంగా వస్తున్న సామాజిక వ్యవస్థ పూర్తిగా మారిపోవాలన్నాడు. ఈ సందేశానికి ప్రతిగా ఆయన జాతివారు ఈ సిద్ధాంతాలూ, ఆదర్శాలూ తమ "పూజ్యులయిన పూర్వుల" పారంపర్య సంప్రదాయాలకు, ఆచారాలకూ విరుద్ధమయిన వన్నారు. అంతేకాదు – "ఇక నీ ప్రచారాన్నయినా చాలించు. లేక తీవ్రమైన పర్యవసానానికయినా సిద్ధంగా వుండ"మని బెదిరించారు.

అయితే ఒక ప్రశ్న. ఆయన కష్టాలన్నీ భరించడానికి కారణమేమిటి? సందేశ ప్రచారాన్ని త్యజిస్తే తమ రాజుగా స్వీకరిస్తామనీ, దేశంలోని సిరినంతా తన పాదాలకు అర్పిస్తామనీ అన్నారు దేశవాసులు. కాని, ప్రపంచ వ్యామోహాన్ని ప్రేరేపించే కోర్కెల్ని తిరస్కరించి తన ధ్యేయానికై అష్టకష్టాలు సహించడమే స్వీకరించాడాయన. ఎందుకూ? వీళ్ళంతా భక్తిపరాయణులయితే, సన్మార్గులయితే తనకేమైనా లాభమా?

సిరిసంపదలు, రాజరికం, గౌరవమర్యాదలు, భోగవిలాసాలు, సుఖం, ఆనందం, వీటన్నిటిని ఎందుకాయన ఏమాత్రం లెక్కచెయ్యలేదు? ఈ భాగ్యాలకన్నా అధికమయిన ప్రాపంచిక లాభాలేవయినా అతని దృష్టిలో వున్నాయా? ఇవి స్వల్పమని తలచి వాటికై అలా "నాటక"మాడుతున్నాడా? ఆ "లాభాలు" ఎంత గొప్పవయి ఉండాలి? ఎడతెగకుండా సంవత్సరాల తరబడి అగ్ని కరవాలాల మధ్య జీవించడానికి ఒప్పుకుంటాడే! శారీరక, మానసిక, ఆత్మపరమయిన బాధలను వ్యధలను భరించడానికి సిద్ధమవుతాడే! ఈ విషయం ఎంతయినా లోతుగా ఆలోచించవలసిన విషయం.

ఎవరి శ్రేయస్సుకై తాను తన సుఖాలను కాలదన్ని శక్తినంతా ధారపోసి, కృషి చేస్తున్నాడో వారే తనపై రాళ్ళు రువ్వి, తిట్టి, బహిష్కరించి,

చివరికి శరణు కోరినచోటనూ స్థానం లభించకుండా చేస్తే, అప్పటికీ, వారి శ్రేయోసుఖాల కొరకు పాటుపడటం మానని వ్యక్తి కంటే త్యాగశీలుడు, సౌభ్రాతృతా పరాయణుడు, దయార్ద్రహృదయుడు ఎవరైనా ఉంటారని ఊహించటానికి వీలవుతుందా?

ఏదయినా బూటకపు ధ్యేయానికై కపటి ఎవడయినా ఇంతటి కష్టాలను భరిస్తాడా? దేశమంతా తనకు ఎదురుతిరిగి కత్తులు దూసినప్పుడు వర్ణనాతీతమయిన అష్టకష్టాల ప్రమాదాన్ని ముఖాముఖీన ఎదుర్కోవలసి వచ్చినప్పటికీ, చలించకుండా, బిత్తరపోకుండా, బూటకపు తత్వవేత్త, వట్టి ఆదర్శాలరాయుడయితే ఇలా స్థయిర్యాన్ని, దృఢ నిశ్చయాన్ని కనబర్చగలడా?

ఈ ఉద్యమానికి విజయం చేకూర్చిన ఆయన విశ్వాసం స్థయిర్యం, కృతనిశ్చయమే ఆయన ధ్యేయం సత్యమయినదనడానికి ప్రబల తార్కాణం. ఆయన ఆంతర్యంలో అణుమాత్రమైనా సందేహం, లేశమయినా సంశయం ఉండి ఉంటే ఎన్నో ఏండ్లుగా ఎడతెగకుండా తన యావత్తు ఉక్రోషాన్ని వెలిబుచ్చుతూ వచ్చిన ఆ తుఫానును ఎదుర్కోగలిగినవాడే కాదు.

ఆయనలో వచ్చిన విప్లవానికి ఇదొక రూపం. మరొక రూపం ఇంకా చిత్రమయినదీ చెప్పుకోతగ్గదీ కూడా.

# నలభైఏండ్ల వయస్సులో ......?

నలభై ఏండ్లుగా తోటి అరబ్బుల్లా మామూలు అరబ్బు వ్యక్తిగా జీవించాడాయన. ఆ కాలంలో ఒక రాజకీయ వేత్తగాగానీ, బోధకునిగా గానీ, ఉపన్యాసకునిగా గానీ, ఆయన్ని ఎవరూ ఎరుగరు. అంతకుముందెన్నడూ బుద్ధీ వివేకాలు భాసిల్లే వజ్రాల్లాంటి పలుకులు పలకగా ఆయన్ని ఎవరూ

వినలేదు. ఆధ్యాత్మికతత్వాలూ, నైతిక దృక్పథాలు, రాజకీయ విధానాలూ, ఆర్థిక రీతులూ, సామాజిక వ్యవహారాలూ, న్యాయశాస్త్రాల్లాంటి విషయాలపై వ్యాఖ్యానాలూ విమర్శనలు చేస్తున్నట్లు ఎవరూ చూడలేదాయన్ని. గొప్ప సేనాని మాట అలా ఉంచి సాధారణ సైనికునిగా కూడా ఎవరూ ఆయన్ని ఎరుగరు. దైవం, దైవదూతలు, దైవ గ్రంథాలు, పూర్వ ప్రవక్తలు, మార్గ విహీనులయిన జాతులు, తీర్పు దినం, మరణానంతర జీవితం, నరకం, స్వర్గం - వీటన్నిటి గూర్చి ఒక్క మాటయినా ఇంతకు ముందు పలికి ఎరుగడు. సద్గుణాలూ, మనుషుల్ని, మనసుల్ని ఇట్టే ఆకట్టుకోగలిగే ప్రవర్తన ఆయనలో ఉన్న మాట వాస్తవమే. ఆయన చాలా సంస్కారవంతుడన్న విషయంలోనూ సందేహం లేదు. కాని భవిష్యత్తులో ఆయన గొప్ప విప్లవ కారుడవుతాడని ఆశించేందుకు ఆయనలో అసాధారణమయిన విషయమేదీ కన్పించలేదు. ఎరిగినవారు ఆయన్ని - వినమ్ర హృదయుడు, శాంత స్వభావుడు, సభ్యత, చట్టబద్ధత క్రమబద్ధతగల సద్గుణ సంపన్న పౌరునిగా చెప్పుకునేవారు. కాని హిరా గుహలో నుంచి బయటికి రాగానే ఆయన పూర్తిగా మారిపోయాడు.

తన సందేశాన్ని ఆయన ప్రబోధించడం మొదలెట్టగానే అరేబియా మొత్తమూ సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయింది. ఆయన విచిత్రమయిన ఉపన్యాస ధోరణి విని మంత్రముగ్ధులయ్యారు జనులు. అది ఎంత భావగర్భితంగా, సరళంగా, ఉదాత్తంగా, ప్రభావవంతంగా వుండిందో, ఎంత వేగంగా మనస్సుల్లోకి దూసుకుపోయేదో! అది తమ హృదయాంతరాళాల్లో తమ ఆత్మకుహరాల్లో ప్రవేశించి తమ పురాతన మతాన్నీ, సంస్కృతినీ విసర్జింప చేస్తుందో ఏమో అని ఆయన పరమ శత్రువులు సయితం ఆయన ఉపన్యాసాన్ని వినడానికి జంకేవారు. అరబ్బులకు తమ ఉపన్యాసవాహినిపై,

కవితా పాటవంపై, భావకల్పనా శిల్పంపై ఎంతో గర్వం ఉండేది. తాను పఠించే వచనాల్లాంటి ఒక్క అధ్యాయం కాదు – ఒక్క పంక్తినయినా అందరూ కలిసి కృషిచేసి రచించి తీసుకురమ్మని ఆయన తన వ్యతిరేకుల్ని ఛాలెంజి చేసినప్పుడు అరబ్బుల్లోని అత్యుత్తమ శ్రేణికి చెందిన కవిపుంగవులూ, పండితులూ, బోధకులూ, ఉపన్యాసకులంతా చేరి భాషాలంకరణలో, భావ ప్రదర్శనలో దానికి సమానమయిన వచనాన్ని రచించలేక పోయారు. అద్వితీయమయినదీ, అనుపమమైనదీ ఆ వచనం. ఇతర అరబ్బుల మాట అలా ఉంచి, స్వయంగా ఆయన సాధారణ సంభాషణ, ఉపన్యాసాల భాష ఆ దివ్యవాణి యొక్క ప్రత్యేకమయిన శైలీస్థాయిని పొంది ఉండేది కాదు. ఒక వైపున ఖుద్దుగా ఆయన చేసిన సొంత ఉపన్యాసాలనూ, మరో వైపున దైవవాణిగా ఆయన నోట ప్రోక్తమయిన దాన్నీ పెట్టి పోల్చిచూస్తే రెంటిలో విస్పష్టమైన తారతమ్యం గోచరిస్తుంది.

## సార్వజనీన సందేశం

దీనికి తోడుగా ఇప్పుడాయన అపూర్వ తత్వవేత్తగా, ప్రజ్ఞావంతుడయిన సంస్కర్తగా, సంస్కృతీ నాగరికతల ప్రముఖ నిర్మాతగా, ప్రఖ్యాత రాజకీయవేత్తగా, గొప్ప నాయకునిగా, అనుభవజ్ఞుడయిన న్యాయాధిపతిగా, అసమానమయిన సామర్థ్యం గలవానిగా తన ప్రజల ముందు నిలబడ్డాడు. ఈ నిరక్షరాసి, 'బద్దూ' (పల్లెవాసి), ఎడారుల్లోని గుడారవాసి ఎంతో అపూర్వమయిన పాండిత్యం, వివేకం వెదజల్లే ప్రవచనాలను పలికాడు! ఆనాటికీ, ఈనాటికీ అలాంటి ప్రవచనాలు రచించగలిగిన వారెవ్వరూ లేరే! ఆధ్యాత్మికమయిన చిక్కుల్ని ధార్మికమయిన సమస్యల్ని అనేకం పరిష్కరించాడు. జాతులూ, రాజ్యాలూ, ప్రభుత్వాల క్షీణతకు, పతనానికి మూలకారణమయిన సూత్రాలను –

పూర్వ ఐతిహాసిక నిదర్శనాల ఆధారంగా విశదీకరిస్తూ ఉపన్యాసాలనిచ్చాడు. గతంలోని సంస్కర్తల విజయాలను సమీక్షించాడు. ప్రపంచంలో నున్న విభిన్న మతాలను గురించి నిర్ణయాలిచ్చాడు. జాతుల మధ్య నుండిన విభేదాలూ తగాదాలపై తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. సాంస్కృతిక, నైతిక సిద్ధాంతాలూ సూత్రాలను బోధించాడు. ఆయన స్థాపించిన సామాజిక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ సామూహిక నీతి, అంతర్జాతీయ నియమాలు, సంస్కృతీ సభ్యతల మర్మ హేతువును అర్థం చేసుకోవడం సామాన్యంగా సాధ్యపడదు. గొప్ప ప్రజ్ఞావంతులయిన ఆలోచనాపరులు, పండితులు కూడా తమ జీవిత కాలంలో సలిపిన పరిశోధన, అన్వేషణ, గడించిన లౌకికానుభవాన్ని వినియోగిస్తేనేగాని అది సాధ్యం కాజాలదు. వాస్తవానికి మానవుడు శాస్త్రీయజ్ఞానంలోనూ, అనుభవంలోనూ పురోగమించిన కొద్దీ ఆ విషయాల్లోని సౌందర్యం, అంతరార్థం వికసిస్తూనే వుంటాయి!

# అద్వితీయ ప్రజ్ఞ

శాంతిప్రియుడు, మిత భాషి అయిన ఈ సామాన్య వర్తకుడు ఎన్నడూ కత్తిపట్టి ఎరుగడు. ఎన్నడూ సైనిక శిక్షణ పొందలేదు. జీవితంలో ఒకే ఒక యుద్ధాన్ని కేవలం ఒక ప్రేక్షకునిలా మాత్రం చూచాడు. అది తప్ప మరే యుద్ధంలోనూ పాల్గొనలేదు. కాని, విప్లవం తరువాత ఒక్కసారిగా సైనిక యోధునిగా మారిపోయాడు. ఆ తరువాత ఎలాంటి భయంకర రణరంగమైనా వెనుకంజవేసి ఎరుగడు! ఆయుధాలు మిక్కిలి ప్రాథమిక దశలో ఉన్న సమయాన, రవాణా సౌకర్యాలు అందుబాటులో లేని కాలంలో మొత్తం అరేబియానే తొమ్మిదేళ్ళ స్వల్పకాలంలో జయించగలిగే గొప్ప సేనానిగా తయారు అయ్యాడాయన. తన శక్తి సామర్థ్యాల మూలంగా

నిరాయుధులయిన అరబ్బు మోటుమూకకు ఆయన పోసిన జీవంతో, వారికి ఆయన ఇచ్చిన సైనిక శిక్షణతో అరబ్బులు ఎంతో ఉన్నతంగా రూపొందారు. ఉజ్వలంగా రాణించారు, అద్భుతాలను సాధించారు – ఆ కాలంలోని అభేద్యమయిన రెండు సైనిక బలాలను సునాయాసంగా ఓడించారు. ఆ కాలపు జ్ఞాత ప్రపంచంలోని అధిక భాగాన్ని ఆక్రమించారు.

వినమ్రస్వభావుడు జాగ్రత్తపరుడయిన ఈ వ్యక్తి, నలభై ఏళ్ళవరకు ఎలాంటి రాజకీయ కార్యకలాపాలలో ఉత్సాహం చూపని వ్యక్తి. ఆకస్మికంగా ప్రపంచ వేదికపై గొప్ప రాజకీయ సంస్కర్తగా, రాజనీతిజ్ఞునిగా ప్రకాశించాడు. రేడియో, వైర్‌లెస్, పత్రికల సహకారం లేకుండానే 12 లక్షల చదరపు మైళ్ళ ఎడారి భూభాగంలో నివసించే సమరప్రియులూ, అజ్ఞానులూ, అహంభావులూ, సంస్కార రహితులూ పరస్పరం యుద్ధాల్లో నిమజ్ఞులై ఉన్న జనుల్ని – ఒక్క పతాకం, ఒక్క చట్టం, ఒక్క మతం, ఒక్క సంస్కృతి, ఒక్క నాగరికత, ఒక్క ప్రభుత్వ వ్యవస్థ నీడన ఏకం చేశాడు.★

అంతేకాదు వారి ఆలోచనా విధానాలను, వారి అలవాట్లను, వారి నైతిక ప్రవర్తనను మార్చివేశాడాయన. మోటు ప్రజల్ని సంస్కారవంతులుగా, అనాగరికుల్ని నాగరికులుగా, దుష్టుల్ని, దుర్మార్గుల్ని దైవభక్తులుగా, దైవభీతి

---

★ ఇస్లామ్ వ్యతిరేక విమర్శకుడయిన "సర్ విలియమ్ మ్యూర్" తన గ్రంథం *Life of Muhammad*లో ఇలా పేర్కొన్నాడు.

"తొట్టతొలి మన దృష్టిని ఆక్రమించుకునేదేమంటే అరబ్బులు అసంఖ్యాక మయిన తెగల్లో విభజించబడి ఉండటం, ప్రతి తెగ తనంతట స్వతంత్ర ప్రతిపత్తిగలది. ప్రజలు తరచుగా పరస్పరం పోరాడుకుంటూ వుండేవారు. ఎప్పుడైనా రక్త సంబంధాల ద్వారానో లేక స్వలాభాపేక్ష వల్లనో ఐకమత్యం కుదిరినా, ఏదయినా అత్యల్పమయిన మిష మీద వేరుపడటానికి తద్వారా

పరాయణులుగా, సన్మార్గులుగా తయారుచేశాడు. స్వేచ్ఛావర్తనులూ దురహంకారులైన వారిని విధేయతా స్వరూపులుగా శాంతిభద్రతలకు అంకితమైన వారిగా తీర్చిదిద్దాడు. శతాబ్దాలుగా ఒక్క గొప్ప వ్యక్తికయినా జన్మ నివ్వలేకపోయిన జాతి, ఆయన ప్రభావం, సహాయం, శిక్షణల్లో, ప్రపంచం మూలమూలల కేగి ధార్మిక, నైతిక, నాగరికతా సిద్ధాంతాలను బోధించగలిగే వేలాగి ఉత్తమ పురుషుల్ని కన్నది.

ఇదంతా ప్రాపంచిక ఆపేక్ష చూపి సాధించలేదాయన. లేక ఒత్తిడి బలాత్కారాల ద్వారా సాధించలేదు. కేవలం మనసుల్ని స్వాధీనపరచుకునే ప్రవర్తన, ప్రేమమయమయిన వ్యక్తిత్వం సహేతుక బోధనల ద్వారానే సాధించాడు. తన అత్యుత్తమ ప్రవర్తన ద్వారా తన శత్రువుల్ని సైతం మిత్రులుగా మార్చుకున్నాడు. మనుషుల హృదయాల్ని తన ప్రేమానురాగాలు, కారుణ్యాలతో చూరగొన్నాడు. న్యాయ పరిపాలనకు ప్రతీకగా నిలిచాడు. సత్యమూ సన్మార్గాలను ఎంత మాత్రం వదలలేదు. తన ప్రాణహానికి పాలుపడ్డవారినీ, రాళ్ళురువ్వి సత్కరించినవారినీ, తాను తన స్వస్థలాన్ని వదిలి వెళ్ళేలా చేసిన వారినీ, యావత్తు అరేబియానే లేపి తన కెదురుగా

---

అంతంలేని యుద్ధానికి పాలుపడటానికి నిరంతరం సిద్ధంగా ఉండేవారు. కనుక ఇస్లామ్ ఆవిర్భావంనాటి అరేబియా చరిత్రను చూస్తే విచిత్రదర్శిని (*Kaleidoscope*) లోని రూపాల్లా ఏకమవుతూ వేరుపడుతూ ప్రతినిత్యం పరివర్తన చెందుతున్న అరబ్బులు కానవస్తారు. ఈ కారణంగా అప్పటివరకు అరబ్బుల సమైక్యతకై చెయ్యబడిన ఏ ఒక్క కృషి కూడా సఫలమవలేదు. ఏ శక్తి ద్వారా ఈ తెగలన్నీ ఒక సామాన్య కేంద్రాన్ని చేరగలుగుతారో అన్న సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోయింది. చివరికి ఆ సమస్య పరిష్కరించబడింది ముహమ్మద్ ద్వారానే."

నిలిపిన వారినీ, చివరికి తన బాబాయి మృతకళేబరం నుండి కాలేయాన్ని తీసి, ద్వేష పైశాచికత్వానికి లోనయి, అక్షరాలా పచ్చిగా నమిలినవారినీ - ఇలాంటి పరమ శత్రువుల నందరినీ, తన మాట చెల్లినప్పుడు కూడా, మాట వరసకైనా పీడించలేదు, బాధించలేదు. వారిని జయించినప్పుడు, అందరినీ మన్నించివేశాడాయన. వ్యక్తిగతంగా తనపై జరిపిన అత్యాచారాలకూ కలిగించిన బాధలకూ ఎవరిమీదా పగతీర్చుకోలేదు.

# ఆదర్శమూర్తి

దేశానికి ఆయన పాలకుడయినప్పుడు సైతమూ చాలా నిరాడంబరంగా, సాధారణ వ్యక్తిగా జీవితాన్ని గడిపేవాడు. ముందున్నట్లే పూరిగుడిసెలో నివసించేవాడు. ఖర్జూరపు ఆకుల చాపపై పరుండేవాడు. ముతక దుస్తుల్ని ధరించేవాడు. బీదసాదలకు లభించే అతి సాధారణ ఆహారం భుజించేవాడు. భోజనం లేకనే గడిచిపోయిన రోజులెన్నో! తన నిజ ప్రభువైన దైవం సమక్షంలో ఆరాధనకై నిలిచి రాత్రంతా గడిపేవాడు. అనాధలకు, నిర్ధనులకు అండగా నిలవడానికి ప్రతి నిత్యం సిద్ధంగా వుండేవాడు. సాధారణ కూలివానిగా కష్టించి జీవించడానికి కొంతయినా జంకేవాడు కాడాయన. రాజఠీవి, దర్జా, దర్పం, శ్రీమంతుడు బీదలన్న విచక్షణాభావం, చివరి శ్వాస వరకూ ఆయన చెంత చేరలేదు. సామాన్య మానవుడిలా అందరితోబాటు మెలుగుతూ వారి సుఖ దుఃఖాలను పంచుకునేవాడు. జన సామాన్యంతో కలసి మెలసి మెలగటం కారణాన ఒక్కొక్కసారి క్రొత్తగా వచ్చినవారికి సామాన్య ప్రజలెవరో, ప్రజానాయకుడు, దేశానికి పాలకుడెవరో గుర్తించడం కష్టమయ్యేది.

అంతటి ఔన్నత్యంగల వ్యక్తి, సామాన్య ప్రజలతో అతి సాధారణ వ్యక్తిగా ప్రవర్తించేవాడు. తాను జీవితాంతమూ సలిపిన కృషికి ప్రతిఫలంగా ఎలాంటి పారితోషికం, ఎలాంటి ప్రయోజనం అర్థించలేదాయన. తన

వారసులకై ఎలాంటి ఆస్తివదలి వెళ్ళలేదు. తన సర్వస్వాన్ని తన మిల్లత్ (అనుచర సంఘం)కై అంకితం చేశాడు. తన సంతతి వారికి ఏదయినా కేటాయించమని అనుచరుల్నీ కోరలేదాయన. ఇంతేకాదు, తన సంతతిలోని వారు "జకాత్" ధనం వినియోగించకూడదని ఆదేశించాడాయన - తన అనుచరులు భావికాలంలో ఎప్పుడైనా జకాత్ ధనం మొత్తాన్నీ వారికే అంకితం చేస్తారేమో అన్న సంశయంచేత కాబోలు!

## మానవ మహోపకారి

ఈ మహాపురుషుడు సాధించినది ఇంతటితో ముగిసిపోలేదు. ఆయన యోగ్యతలను సరిగ్గా పరిగణించగలగాలంటే విశ్వచరిత్ర యొక్క ఇతివృత్తిని పరిశీలించవలసి వుంటుంది. 1400 ఏళ్ళక్రితం అంధకారపు యుగంలో జన్మించిన నిరక్షరాసి అయిన ఈ ఎడారి వాసియే వాస్తవానికి ఆధునిక యుగానికి మూలపురుషుడనే నిజం, మానవతకు నిజమైన నాయకుడు అనే యదార్థం అప్పటికిగాని బోధపడవు. ఆయన్ని విశ్వసించినవారికే నాయకుడు కాడు ఆయన, ఆయన్ని నమ్మని వారికీ - ఆ మాటకువస్తే తృణీకరించిన వారికీ నాయకుడే. భేదమేమంటే, ఆయన ప్రసాదించిన మార్గదర్శకత్వం తమ విచారధారనూ, ఆచరణ సరళిని ఇప్పటివరకూ అఖండనీయంగా ప్రభావితం చేస్తూనేవుందనే యదార్థాన్నీ ఈ తృణీకరించేవారు ఎరుగరు. అంతేకాదు, ఆయన మార్గదర్శకత్వం వారి జీవితాలను ఆదర్శప్రాయమైన ఆధునిక యుగానికే ఊపిరి అనీ, మూల సిద్ధాంతమనీ వారెరుగరు.★

---

★ "ఇస్లాం వాస్తవంగా మహత్కార్యం సాధించింది. మానవ చరిత్రలో మాయని చిహ్నాల్ని స్థిరంగా వదిలింది.... ప్రపంచం పూర్తిగా వృద్ధిచెందినప్పటికిగాని ఈ యదార్థం గుర్తించటం జరుగదు."

- *Arther Leonard*

# మానవాళి ఋణపడి ఉంది

భ్రమలు, మూఢ నమ్మకాలు, మానవనైజానికి విరుద్ధమయిన వాటిపట్ల ప్రేమ, వైరాగ్యం లాంటి వాటి నుండి మానవ విచారధారను హేతువాదం, సత్యప్రియత్వం భయభక్తులతో నిండిన సమంజసమైన ప్రాపంచిక జీవితంవైపుకు మళ్ళించింది ఆయనే. చూచేవారినీ చకితులు చేసే

---

*గొప్ప శాస్త్రజ్ఞుడయిన John Devenport, ఇలా అన్నాడు, "యూరోపులో 10వ శతాబ్దం నుంచి వృద్ధివికాసాలు పొందిన భౌతిక, ఖగోళ, తాత్విక, గణిత శాస్త్రాలకు చెందిన విజ్ఞానం తొలుత అరేబియా విద్యాలయాల నుండి గ్రహించబడినదే అన్న యదార్థం ఒప్పుకుని తీరవలసిందే. ఇలాగే ఇస్లామీయ స్పెయిన్‌కు, పాశ్చాత్య యూరోపునకు తాత్విక మహాపిత కూడా ఇస్లామే అన్న విషయమూ గమనార్హమయినదే" (పై రెండు వ్యాఖ్యలున్నూ Islamic Contribution to Science and Civilization అనే గ్రంథంలోనుంచి గ్రహించబడినవి).*

*ప్రఖ్యాత బ్రిటిష్ తత్వవేత్త Bertrand Russel ఇలా వ్రాస్తాడు. "ప్రాచ్య దేశాల ఔన్నత్యం సైనికమయినది మాత్రమే కాదు. విజ్ఞాన శాస్త్రం, తత్వశాస్త్రం, కవిత్వం కళలు సయితమూ ముస్లిం జగత్తులో - ఇంకా యూరోపు అజ్ఞానం, మూఢత్వాలలో మునిగివున్నప్పుడే - వృద్ధివికాసాలు పొందాయి, యూరోపు వారు క్షమించరాని నిర్లజ్జతో ఈ కాలాన్ని "అంధకారపు యుగం" అంటారు. కాని, అప్పుడు చీకట్లలో దాగియున్నది స్వయంగా యూరోపు - క్రైస్తవ యూరోపు! ఇదే యదార్థం. ఎందుచేతనంటే ఆనాడు ముస్లిముల అధీనంలో వుండిన స్పెయిన్ ఉజ్వలమయిన సంస్కృతికి ఆలవాలమయివుండింది."*

*(Pakistan Quarterly Vol. iv No.3)*

*ప్రఖ్యాత చరిత్రకారుడు Robert Brfault తన గ్రంథం The making of humanity లో ఇలా అంగీకరిస్తాడు: "బహుశః అరబ్బులే లేకపోతే ప్రగతి దశలన్నిటినీ దాటడానికి శక్తినిచ్చిన గుణం యోగ్యతలు పొందలేకపోయేది*

చమత్కారాలనే మహత్కార్యాలని ఎంచి, సత్యాసత్యాల విచక్షణకు ప్రమాణంగా వాటికొరకే ఎదురుచూచే ప్రజల్లో, హేతువును సత్యాసత్యాల ప్రమాణంగా ఎంచే అభిరుచిని ఆ విశ్వాసాన్నీ సృజించినదీ ఆయనే. ఆయనే ప్రకృతి పోకడల్లో దైవ నిదర్శనాలను అన్వేషించడం అలవర్చినది. నిరాధారమయిన మూఢనమ్మకాలనుంచి మానవుల్ని రక్షించి, ప్రయోగం, అనుభవం, పరిశీలన, పరిశోధనల ఆధారంగా సరైన జ్ఞానం దృఢమైన, హేతుబద్ధమైన మార్గాన్ని చూపినదీ ఆయనే. ఆయనే బుద్ధీ, హేతువూ అంతర్ప్రేరణల పరిధుల్ని విశదీకరించాడు. ఆధ్యాత్మిక భౌతిక విలువలలో సమంజసత్వాన్ని సామరస్యాన్నీ సృష్టించిందీ ఆయనే. విశ్వాసాన్ని జ్ఞానమూ ఆచరణలతో సమన్వయపరచినదీ ఆయనే. "మత" (ఆధ్యాత్మిక) శక్తిలో శాస్త్రీయ భావన (Scientific Spirit) పెంపొందించినదీ మరియు శాస్త్రీయ భావనకు ఆధారంగా నిజమయిన

---

*ఆధునిక యూరోపియన్ నాగరికత. కారణమేమంటే : ఇస్లామీయ నాగరికత యొక్క నిర్ణయాత్మకమైన ప్రభావం మానవ అభ్యున్నతి యొక్క మరే విభాగంలోనూ కానరాకపోయినప్పటికీ, ఆధునిక యుగపు ప్రచండమయిన ప్రత్యేకతకు దాని విజయానికి మూలసాధనమయిన ప్రకృతి శాస్త్రం (Natural Science) లోనూ శాస్త్రీయ విజ్ఞాన సృజనలోనూ అది అత్యంత ప్రస్ఫుటంగానూ ప్రచండంగానూ కానవస్తుంది.... పరిశోధనలో నవజీవం, విచారణలో సరికొత్త త్రోవలు, ప్రయోగం, పరిశీలన, పరిణామ పంథా, గ్రీకులకు తెలియని గణితశాస్త్రాభివృద్ధి - వీటన్నిటి పర్యవసానంగా యూరోపులో విజృంభించినదాన్నే మనం నేడు "సైన్స్" అంటున్నాము. ఆ జీవం, ఆ విధానాలు యూరోపుకు అరబ్బుల ద్వారానే పరిచితమయినాయి.*

*Stan Wood Cobb, "అభ్యుదయ విద్యాసంస్థ" స్థాపకుడు ఇలా అంటున్నాడు:*

*"యూరోపు పునరుజ్జీవనానికి నాంది - ఇస్లామే"-- (Quoted by Fober L Gullick Jr, In Muhammad the Educator)*

"మత" భావనను సృజించినది కూడా ఆయనే!

విగ్రహారాధన, వ్యక్తిపూజ, బహు దైవారాధనల విధానాలన్నింటినీ పరిపూర్ణంగా నిర్మూలించి దేవుని ఏకత్వపు భావన ఆధారంగా ఎంతో దృఢవిశ్వాసాన్ని సృష్టించాడు. తద్వారా మూఢనమ్మకాలు, విగ్రహారాధనలపై పూర్తిగా ఆధారపడిన మతాలకు సయితం ఏకేశ్వరవాదంలో శరణు పొందడం తప్ప గత్యంతరం లేకపోయింది. నైతిక, ఆధ్యాత్మిక భావనల్లో మౌలికమయిన పరిణామందెచ్చాడు. వైరాగ్యం ఆత్మపీడనలు మాత్రమే ఆధ్యాత్మిక పారిశుద్ధ్యానికి ప్రమాణాలని నమ్మే వారికీ శారీరక అవసరాలన్నింటినీ త్యజించి దేహానికి సర్వవిధాలయిన బాధలకు గురిచేసి ప్రాపంచిక జీవితాన్నుంచి పరారీ కానంతవరకు పారిశుద్ధ్యం సిద్ధించదని విశ్వసించేవారికీ, ఆధ్యాత్మిక ప్రగతిని నైతిక ఉన్నతిని, మోక్షాన్ని తమ చుట్టూ ఉన్న ప్రపంచ కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొంటూనే సాధించడం ఎలాగో నేర్పాడు.

మానవుని నిజస్థానం, ఔన్నత్యాల చైతన్యాన్ని కలిగించినదీ ఆయనే. అవతార దైవాన్నీ, దేవుని కుమారుణ్ణి తప్ప ఇతరులు మరెవ్వరినీ తమకు నైతిక గురువుగా, ఆధ్యాత్మిక మార్గదర్శిగా గుర్తించనివారితో, తమలాంటి సామాన్య మనిషి "దైవత్వపు వేషం" వేయకుండా భువిలో దేవుని ప్రతినిధి కాగలడనీ చెప్పడం జరిగింది. శక్తిమంతులైన వ్యక్తుల్ని తమ దేవతలుగా చాటి పూజించేవారికి, వారి మిథ్యా ప్రభువులు కేవలం సామాన్య మనుషులని బోధపరచటం జరిగింది. ఎవరయినాసరే, పవిత్రత, అధికారం, ప్రభుత్వం తమ జన్మ హక్కని చాటడానికి వీలులేదనీ, ఎవరయినాసరే జన్మతః అస్పృశ్యత, బానిసత్వం, నిమ్నత్వాల కళంకం పెట్టుకుని పుట్టలేదని నొక్కి వక్కాణించటం జరిగింది. ఆయన బోధనలే ప్రపంచంలో మానవ ఏకత్వం,

సర్వమానవ సమానత్వం నిజమయిన ప్రజాస్వామ్యం; వాస్తవ స్వాతంత్ర్యాల భావనల్ని ఉద్భవింపజేశాయి.

ఇదంతా అలా ఉండగా ఇంకా కాస్త లోతుగా పరిశీలిస్తే ఈ నిరక్షరాసి నాయకత్వాన లభించిన క్రియాత్మక ఫలితాలు అగణ్యంగా ప్రపంచపు శాసనాల్లో, సంప్రదాయాల్లో కానవస్తాయి. నేడు ప్రపంచంలో కనిపించే సత్ప్రవర్తన, సభ్యత సంస్కారం, నాగరికత, ఆలోచన, ఆచరణ సిద్ధాంతాలు ఆయన స్థాపించినవే. ఆయన ప్రసాదించిన సామాజిక విధానాలు మానవ సామాజిక జీవితపు పునాదుల్లో చోటుచేసుకున్నాయి. నేటికీ వాటి ప్రభావధార అగోచరంగా ప్రవహిస్తూనే ఉంది. ఆర్థికశాస్త్రంలో ఆయన బోధించిన మూల సిద్ధాంతాలు, ప్రపంచ చరిత్రలో ఎన్నో ఉద్యమాలకు దారిచూపాయి. ఇక ముందు కూడా చూపిస్తాయి. ఆయన సమకూర్చిన పరిపాలనా నిబంధనలు, ఆనాడు చెలామణిలో వున్న రాజకీయ దృక్పథాల్లో, సిద్ధాంతాల్లో విప్లవాత్మక పరిణామాలకు కారణమయ్యాయి. నేటికీ వాటి ప్రభావం కానవస్తూనే ఉంది. ఆ మహా మేధావిచేత సూచింపబడిన న్యాయశాస్త్ర మూల సూత్రాలు అనేక దేశాలలో న్యాయస్థాపనకై గణనీయమైన ప్రభావాన్ని వేశాయి. భావి న్యాయవేత్తల మార్గదర్శానికై శాశ్వత ఆధారాలుగా నిలిచి పోయాయి. తొట్టతొలిగా అంతర్జాతీయ సంబంధాల నిబంధన తయారు చేసిందీ, శాంతీ సంగ్రామాలలో పాటించవలసిన నియమాలను రూపొందించిందీ, వాటికి క్రమబద్ధత నిచ్చినదీ ఈ నిరక్షరాసయిన అరబ్బువాసియే. యుద్ధంలోను నైతిక నియమావళి అంటూ ఒకటి ఉండటానికి వీలుందని, విభిన్న దేశాల సంబంధాలు, సర్వమానవ సమానత్వం పునాదిగా సముద్ధరించుకోవచ్చు అనే తలంపు కూడా అంతకుముందు ఎవరికైనా వచ్చినట్లు ఆధారాలు లేవు.

# మహా గొప్ప విప్లవకారుడు

చరిత్ర ప్రాంగణంలో విచిత్రమైన ఈ వ్యక్తి యొక్క అసమానమైన రూపం, కాలగతిలో ప్రకాశవంతంగా వెలిగిన ప్రపంచ మహాపురుషులందరిలోనూ అత్యున్నతంగా గోచరిస్తుంది. ఆయనతో వారందరినీ పోల్చినప్పుడు వారు మరుగుజ్జుల్లా కనిపిస్తారు. వారిలో, ఎవరిలోనూ మానవ జీవితపు కొన్ని రంగాలపై తప్ప తమ ప్రభావం ఏయగలిగే మేధాశక్తి కానరాదు. కొందరు సిద్ధాంతాలు సూత్రాల ఘనులయితే క్రియాత్మక జీవితంలో వారి పాత్ర శూన్యం. మరికొందరు కార్యరంగ వీరులయితే బుద్ధీ వివేకాల పరిధిలో స్థానంలేనివారు; కొందరు కేవలం రాజకీయ నాయకులుగానే ఖ్యాతిపొందారు. మరికొందరు యుక్తులు పన్నడం, ఎత్తుకు పై ఎత్తు వేయడంలో చతురులు; కొందరయితే ఒకే జీవిత రంగాన తమ శక్తినంతా కేంద్రీకరించి తతిమ్మా రంగాలన్నింటినీ త్రోసిపుచ్చారు; కొందరు నైతిక, ఆధ్యాత్మిక విధానాలకే తమ శక్తిని ధారపోసి ఆర్థిక, రాజకీయాల్ని త్యజించారు; ఇంకా కొందరు ఆర్థిక, రాజకీయాలకే జీవితాలు అంకితంచేసి నైతిక, ఆధ్యాత్మిక రంగాల్ని విస్మరించారు. ఒక్కమాటలో - జీవితపు ఏదో ఒక రంగాన్ని మాత్రమే అలంకరించిన యోధుల్నీ చూడగలం; కాని సర్వసద్గుణాలు మేళవించిన ఒకే వ్యక్తిత్వం ఆయన దొక్కటే; ఆయన ఒక తత్వవేత్త, జ్ఞాని, అదే సమయంలో తన బోధనలకు సజీవ స్వరూపమూ ఆయనే. గొప్ప రాజకీయవేత్త అసమాన సమరయోధుడు, ఎదురులేని శాసనకర్త మాత్రమే కాదు, నైతిక ప్రచారకుడు, ఆధ్యాత్మిక మార్గదర్శి, మతగురువుకూడాను. జీవితపు ప్రతిరంగాన్ని ఆయన కన్ను కానగలిగింది. ఆయన చేపట్టిన తరువాత రాణించని విషయమంటూ లేదు. ఆయన బోధనలు ఆదేశాల

పరిధి అంతర్జాతీయ సంబంధాలు మొదలు భోజన పానీయాల్లాంటి దైనం దిన చర్యల వరకూ సువిశాలంగా వ్యాపించింది. తన సిద్ధాంతాల ఆధారంగా ఆయన ఒక సంస్కృతీ నాగరికతల్ని స్థాపించాడు. పరస్పరం విరుద్ధమైన జీవితరంగాల్లో రవ్వంతయినా పొరపాటు, కొరత, అసంపూర్ణత లేకుండా సహజీవనమూ సామరస్యమూ నెలకొల్పాడు. ఇలాంటి పరిపూర్ణ సర్వతోముఖమైన వ్యక్తిత్వం వేరొకటి కాన వీలవుతుందా?

## వాతావరణ జనితమా ఈ వ్యక్తిత్వం?

రమారమి ప్రపంచంలోని ప్రఖ్యాత వ్యక్తులందరూ తమ వాతావరణానికి పర్యవసానంగా ఉద్భవించినవారే. కాని ఈయనదొక ప్రత్యేకత. ఈయన వ్యక్తిత్వ నిర్మాణంలో వాతావరణానికి ఎలాంటి పాత్ర లేదు. ఆయన, జన్మతః తన సమకాలీన అరేబియా వాతావరణానికి కాలానుగుణంగా రూపొందిన వ్యక్తి అని చెప్పడానికి కూడా ఆస్కారం లేదు. మహా అయితే సాధారణంగా తోచేదేమంటే అరేబియా సాంఘిక పరిస్థితులు చాలా విషమంగా తయారయ్యాయి, పరస్పరం ఢీకొని నశిస్తున్న తెగల్ని ఒక జాతిగా బంధించగలిగేందుకు, వారి ఆర్థిక పురోగతిని పటిష్టం చేసేందుకు, వారి పాలన క్రింద వేరే రాజ్యాల్ని తేగలందులకు జాతీయ నాయకుడు ఒకడు ఆనాడు ఎంతైనా అవసరం. అతడు, అరబ్బుల్లో ప్రచారంలో ఉన్న యుక్తులన్నింటిని వినియోగించి, హింసా దౌర్జన్యాలను, వంచన, రక్తపాతాలను, కాపట్యం, ద్వంద్వ ప్రవర్తనల్ని ఇంకా ఏవైనా ధర్మాధర్మ విధానాలన్నింటినీ ఉపయోగించి తన ప్రజల అభివృద్ధికై కృషిచేసేవాడూ, తన అనుచరులకై ఒక రాజ్యాన్ని వారసత్వంగా వదలిపెట్టగలిగే నాయకుడు కాగలగాలి. ఆనాటి పరిస్థితుల్ని గమనించే వారెవరయినా ఆనాటి అరబ్బుల ప్రధానావశ్యకత

ఇదే తప్ప మరేదీ కాదని నిరూపించడం సాధ్యమే.

హేగల్ (Hegel) ప్రవచించిన ఐతిహాసికతత్వం మరియు మార్క్స్ (Marx) బోధించిన ఐతిహాసిక లౌకికం ప్రకారం, ఒక జాతి (Nation) ని చైతన్యవంతం చేసి ఒక రాజ్యాన్ని స్థాపించగల ఒక గొప్ప నాయకుడి ఆవిర్భావం కొరకు ఆ కాలం, ఆనాటి అరేబియా వాతావరణం పరిపక్వం చెందాయని మాత్రమే చెప్పగలం. కాని శ్రేష్ఠమయిన నైతిక బోధనల ప్రచారంచేసి, సకల విధాల మాలిన్యాల నుండి మానవాళిని ప్రక్షాళనం చేసిన ప్రజ్ఞాశాలి; అజ్ఞాన కాలపు దురభిమానాలను మూఢ నమ్మకాలను దూరంచేసి, జాతి, దేశం, వర్ణ విభేదాల సంకుచిత పరిధుల్ని ఛేదించి తన దేశానికి మాత్రమే కాక ప్రపంచం మొత్తానికై, నైతిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక రాజకీయ మహా నిర్మాణానికి నాంది పలికిన నాయకుడు; సిద్ధాంతరూపేణ మాత్రమే కాక క్రియాత్మకంగా వాణిజ్యం, పౌరవిద్య, రాజకీయం, అంతర్జాతీయ సంబంధాలను నైతిక ఆధారాలపై స్థాపించి, లౌకిక జీవితంలోనూ ఆధ్యాత్మిక వికాసంలోనూ నాటికీ నేటికీ అపూర్వమయిన మహత్కార్యంగా ప్రతీతిపొందిన సంతులనాన్ని, సామరస్యాన్ని ఏర్పర్చిన మహనీయుడు, ఆ వాతావరణ పరిణామ ఫలంగా ఎలా పుట్టగలిగాడో ఈ హేగల్, మార్క్స్ ఫిలాసఫీలు సమాధానం చెప్పజాలవు. అరేబియాలో నలువైపులా వ్యాపించిన ఆ అంధ కారానికి పరిణామంగా తయారయినట్లు ఈ వ్యక్తిని ఎవరైనా చెప్పగలరా?

## యుగపురుషుడు కాడు సర్వయుగపురుషుడు

తన చుట్టుపట్ల ఉన్న వాతావరణానికి సంబంధం లేకుండా ఉండటమేకాదు - మనం ఆయన సాధించిన గొప్ప కార్యాలను గమనించామంటే, వాస్తవంగా దేశకాల పరిధులన్నింటినీ ఆయన అధిగ

మించారని ఇట్టే చెప్పగలం. ఆయన దృష్టి దేశ కాలపు తెరలను ఛేదించుకుంటూ శతాబ్దాలు, యుగాలను దాటిపోతుంది. ఆ దివ్యదృష్టిలో సమస్త మానవాళి వ్యవహారాలూ, సర్వమానవ భావిచరిత్ర ఇమిడి ఉన్నాయి.

ఆయన చరిత్ర విస్మరించిన అనామకుడు కాడు. కేవలం తన సమకాలీన నాయకుల్లో ఓ నాయకుడు మాత్రమే అన్నది కూడా నిజం కాదు, కాలంతో పాటు ముందుకుసాగే, ప్రతి కాలంలోనూ, ప్రతి యుగంలోనూ, తన కాలంలో వలెనే నిత్యం అధునాతనంగా ప్రజ్వలించే ఏకైక అనుపమ మానవ నాయకుడాయన, వాస్తవానికి ఆయన బోధనలు రేపటి స్వచ్ఛమైన సూర్యోదయంలా ప్రతినిత్యం కొత్తవే.

సాధారణంగా జనులు ఎవరినైతే "చరిత్రను సృష్టించిన వారు" (Makers of History) అని పిలుస్తారో వారు వాస్తవంగా "చరిత్ర చేత సృష్టించబడినవారు" (Creatures of History). యదార్థమేమంటే ఆయన సర్వమానవ చరిత్రలోనే అసమానమయిన "చరిత్రకర్త". విప్లవాలు తెచ్చిన ప్రపంచపు గొప్ప గొప్ప నాయకుల జీవితచరిత్రల్ని, వారి పరిస్థితులను క్షుణ్ణంగా గాలిస్తే ఆ సమయాల్లో జరుగబోయే పరిణామానికై విప్లవాత్మక శక్తులు ఒక్కటయి ఒక మార్గాన పురోగమిస్తూ విజృంభించడానికి అదనుకోసం ఎదురుచూస్తూ కనిపిస్తాయి. దాన్ని కార్య రూపాన్నివ్వటానికి, వారిని సకాలంలో సమాయత్త పర్చడానికి విప్లవనాయకుడు నాటకరంగంలో నటునిలా వచ్చి తన పాత్రను నిర్వహిస్తాడు. కాని ఈ "చరిత్రను సృష్టించిన" విప్లవయోధులందరిలో ఆయనదొక ప్రత్యేకత – ఆయనే స్వయంగా విప్లవానికి కావలసిన సాధన సామగ్రిని ప్రోగుచేశాడు. తన లక్ష్యానికి కావలసిన విధంగా వ్యక్తుల్ని తయారుచేసుకున్నాడు – తన దృష్టిలో ఉన్న విప్లవాత్మకమయిన భావాలూ యోగ్యతలూ తన పరిసరాల్లో లభించిన మనుషుల్లో కానరాలేదు గనుక.

తన అత్యున్నతమయిన వ్యక్తిత్వంతో లక్షలాది అనుచరుల హృదయాలపై చెరగని ముద్రవేసి కావలసిన రీతిలో వారిని మలచుకున్నాడు. తన ఉక్కులాంటి మనోబలంతో విప్లవానికి పునాదులు వేశాడు. దాని రూపురేఖలు సరిదిద్దాడు. సంఘటనల ధారను తాను అభిలషించే మార్గాన మరల్చాడు. ఇలాంటి అద్వితీయమయిన చరిత్ర నిర్మాతగా, ఇలాంటి మేధాశక్తి, మహత్తుగల విప్లవవాదిగా మరొకరిని ఎవరయినా చూపడం సాధ్యమా?

ఈ విషయాలను యోచిస్తే ఆశ్చర్యమే కలుగుతుంది. 1400 సంవత్సరాలకు పూర్వం అంధకార యుగంలో కాంతివిహీనమైన మారుమూలల్లో పడివుండే అరేబియా లాంటి భూభాగాన ఒక నిరక్షరాసి అయిన అరబ్బు గొర్రెలకాపరి, వర్తకుడు, ఇంతటి క్రాంతిని, విజ్ఞానాన్ని, శక్తి సామర్థ్యాలను, అతి మనోజ్ఞంగా వికసించిన సద్గుణాలను ఎలా సముపార్జించగలిగాడో?

ఆయన ప్రబోధించిన సందేశం కేవలం ఆయన ఊహాజనితమే, అందులో ప్రత్యేకత ఏమీలేదని ఎవరయినా అనవచ్చు. అయితే - తానే దైవమని ప్రకటించినా ఆయన్ని అడిగే వారెవరు? అప్పట్లో అలాంటి ప్రకటన చేసినా - కృష్ణుడు దైవం అని విశ్వసించినవారు, గౌతమ బుద్ధుని పూజించినవారు, తమ ఇచ్ఛానుసారం ఏసుక్రీస్తును దేవుని కుమారుడు చేసి కూర్చున్నవారు, జంకులేకుండా నిప్పును, నీటిని, గాలిని, వెలుగును ఇంకా ఇతర ప్రకృతి శక్తుల్ని ఆరాధించేవారు - తక్షణం ఇలాంటి అద్వితీయ వ్యక్తిని సర్వేశ్వరుడని నమ్మడానికి వెనుదీయకపోదురు.

కాని, ఆయన అలా చెయ్యలేదు. ఆయన చేసిన ప్రకటన దీనికి పూర్తిగా విరుద్ధమయినది. ఆయన వాదించింది ఇదీ:

"నేనూ మీలాంటి మానవమాత్రుణ్ణే. మీ కొరకు స్వయంగా నేనిచ్చే

సందేశమేమీలేదు. మీకు అందజేసేది దైవం తరపున అవతరింపజెయ్యబడిన సందేశమే. నా వద్ద ఉన్నదంతా ఆయనకు చెందినదే. మానవాళి అంతా చేరి రచించలేని ఈ సందేశం, దైవసందేశం, ఇది నా మేధా కల్పనకాదు. దీనిలో ప్రతి పదం దైవం పంపినదే, ఆయనకే స్తోత్రాలు. మీ అభిప్రాయంలో, నేను సాధించిన అత్యంత వింతయిన ఘనకార్యాలు, నేను సమకూర్చిన శాసనాలు, బోధించిన సిద్ధాంతాలు వీటిలో ఏదీ నా సొంతంకాదు. కేవలం నా సొంతశక్తి సామర్థ్యాలతో ఇలాంటి పనులు చేయగలిగే యోగ్యత నాకులేదని స్వయంగా నాకు తెలుసు. ప్రతి విషయంలోను నేను దైవ మార్గదర్శకత్వానికై ఎదురుచూస్తూ ఉంటాను. ఆయన ఇచ్ఛానుసారంగా ఆచరిస్తాను, ఆయన సందేశం ప్రకారం నడచుకుంటాను."

నీతి నిజాయితీకి, బాధ్యతా భావానికి, సత్యనిష్ఠకు, సత్యసంధతకు ఆత్మ వికాసానికి ఎంత ఉత్తమమయిన ఆదర్శం! ఎవరయినా అబద్ధానికి అలవాటుపడ్డ వ్యక్తి అయితే లేక కపటి అయితే సామాన్యంగా ఇతరులు సాధించిన కార్యాల కీర్తి సైతమూ తనకే దక్కాలని ప్రయత్నిస్తాడు - తన భ్రమను సునాయాసంగా పటాపంచలు చేయ వీలవుతుందని అతనికి తెలిసినా! కాని ఈ మహాపురుషుడు, ఈ ఘనకార్యాలలో ఏ ఒక్కదాని కీర్తి కూడా తనకు సంక్రమించడం సహించడు. ఆయన అలా చేసినా చెల్లుతుందని తనకు తెలిసినా, ఆయనకు దైవవాణి లభించే మూలాధారాన్ని పరిశోధించే మార్గం ఏదీలేని కారణాన ఎవరూ ఆయన చేసేదాన్ని వ్యతిరేకించలేరు కూడా.

కర్తవ్యపరాయణత, సత్యసంధత, విశాల హృదయతలకు ఇంతకు మించిన మరో నిదర్శనం ఏది కాగలదు? అమూల్యమయిన అనుపమ అనుగ్రహాలను, తన అంతర్ప్రేరణకు కారణమయినదాన్ని, తన జ్ఞాన

కాంతికి మూలమయిన దాన్ని ఎవరికీ తెలియని అగోచర మార్గాన్ని పొంది ఎలాంటి దాపరికం లేకుండా "ఇదో చూడండి, ఇదే జ్ఞాన సరోవరం" అంటూ చూపెట్టే వానికన్నా సత్యవంతుడు ఎవరుకాగలరు? ఈ అంశాలన్నింటినీ గమనిస్తే ఇలాంటి వ్యక్తియే దేవుని నిజ సందేశహరుడనే నిర్ణయానికి రావలసివస్తుంది.

ఈయనే, ఈ మహనీయుడే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం). అసాధారణమయిన యోగ్యతలుగల అనుపమ వ్యక్తిత్వం, సభ్యతా సంస్కారాల పరిపూర్ణ రూపం, సత్యం, సదాచారాలకు చిహ్నం, మూర్తీభవించిన కారుణ్యం, దేవుని అంతిమ దూత, ప్రపంచమంతటికీ దైవసందేశహరుడు. ఆయన జీవితం, ఆయన విచారధార, ఆయన సత్యసంధత, నిజాయితీ తత్పరత, ఆయన సచ్చరిత్రత, ఆయన కర్తవ్యపరాయణత - ఇంకా ఆయన ఆలోచనలు, ఆయన అందజేసిన సిద్ధాంతాలు, ఆయన ఆచరణలు, ఆయన సాధించిన ఘనకార్యాలు - ఇవన్నీ ఆయన దైవదౌత్యానికి అఖండనీయమయిన నిదర్శనాలు. ఎవరైనా ఎలాంటి పక్షపాతం, ఎలాంటి దురభిమానం లేకుండా ఆయన జీవితాన్ని, ఆయన బోధనల్ని పరిశీలనా దృష్టితో అధ్యయనం చేస్తే నిస్సందేహంగా ఆయన దేవుని నిజప్రవక్త అని, ఆయన మానవాళికి అందజేసిన ఉద్గ్రంథం "ఖుర్ఆన్" దైవగ్రంథమని ఇట్టే రుజువవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## దైవదౌత్యం సమాప్తం

మరోమాట, నేడు నిజ ధర్మమయిన ఇస్లాం రుజుమార్గాన్ని గురించి తెలుసుకోడానికి మహాప్రవక్త (సఅసం) తప్ప మరే ఆధారం లేదన్న యదార్థాన్ని స్పష్టంగా అర్థంచేసుకోవాలి. మానవాళి దైవేచ్ఛ ఏమిటో

పూర్తిగా తెలుసుకునేందుకు దివ్యఖుర్ఆన్ మరియు మహాప్రవక్త (సఅసం) ఆదర్శజీవితం మాత్రమే విశ్వసనీయమయిన మూలాధారాలు. ముహమ్మద్ (సఅసం) యావత్తు మానవాళి కొరకు పంపబడిన దైవసందేశహరుడు, దైవప్రవక్తల పరంపర ఆయనతో అంతమైపోయింది. ఆయన ప్రవక్తల్లో చిట్టచివరివాడు. దేవుడు మానవాళికై అనుగ్రహించదలచిన బోధనల్ని, మార్గదర్శకత్వాన్ని ముహమ్మద్ (సఅసం)కు వహీ (దైవవాణి) ద్వారా అందజేశాడు, ఈ మార్గదర్శక బోధనలు దివ్యఖుర్ఆన్ మరియు సున్నత్ (మహాప్రవక్త జీవిత సంప్రదాయం) లో సురక్షితంగా ఉన్నాయి. ఇప్పుడెవరైనా సత్యాన్ని తెలుసుకోదలచినట్లయితే, నిజమయిన దైవ విధేయుడు - ముస్లిం - అవగోరినట్లయితే, దైవమార్గాన్ని చిత్తశుద్ధితో అనుసరించదలచి నట్లయితే, దేవుని చివరి ప్రవక్తను విశ్వసించడం, ఆయన బోధనల్ని స్వీకరించడం అనివార్యం. ఆయన జూపిన బాటన నడవటం తప్ప గత్యం తరం లేదు. ఇదే ఇహపరాల సాఫల్యానికి, మోక్షానికి రుజుమార్గం.

## దైవదౌత్యం ముగింపు - ఆధార ప్రమాణాలు

దైవదౌత్య వాస్తవికతను తెలుసుకున్నాము. ఈ అంశాన్ని అర్థంచేసుకుని సరిగ్గా ఆకళింపు చేసుకుంటే, దైవ ప్రవక్తలు ప్రతిరోజు పుట్టరని, ప్రతి కాలానికీ, ప్రతి జాతికి ఓ ప్రవక్త అంటూ ప్రత్యేకంగా నిత్యం ప్రభవిస్తూ ఉండటం కూడా అనవసరమని ఇట్టే గ్రహించగలం. ప్రవక్త జీవితమంటే వాస్తవానికి అది ఆయన సందేశం, బోధనలు, ఉపదేశాల జీవితం. ఆయన సందేశం, మార్గదర్శకత్వం సజీవంగా ఉన్నంత కాలం ఆయనే సజీవంగా ఉన్నాడని అర్థం. ఈ భావంలో వెనుకటి ప్రవక్తలు అంతమయ్యారు - ఎందు కంటే, వారు తెచ్చిన బోధనలు, హితోపదేశాలు ప్రజలు తారుమారుచేసివేశారు.

వారు మానవాళి కందచేసిన ఉద్గ్రంథాల్లో ఒక్కటీ నేడు దాని నిజ స్వరూపంలో కానరాదు. స్వయంగా వారి అనుయాయులు సయితం తమ వద్ద ఉన్నవి తమ ప్రవక్తలు ప్రసాదించిన గ్రంథాలే అని రూఢీగా చెప్పలేదు. వారు తమ ప్రవక్తల జీవిత చరిత్రల్ని సయితం మరచిపోయారు. గత ప్రవక్తల్లో ఏ ఒక్కరి జీవిత వివరాలయినా వాస్తవమయినవిగా, విశ్వసనీయంగా, నిర్ధారితంగా, నిర్దుష్టంగా, ప్రామాణికంగా ఎక్కడా లభించవు. వారు ఎక్కడ పుట్టారో, ఏ కాలంలో పుట్టారో, వారు సాధించిన మహత్కార్యాలేవో, జీవితం గడిపిన విధానం ఏదో, బోధించిన ఆదేశాలేవో, జారీచేసిన నిషేధాలేవో ఇదమిత్థంగా చెప్పజాలం. ఈ పరిస్థితినే వాస్తవానికి వారి అంతం అని మనం చెప్పగలం.

కాని ముహమ్మద్ (సఅసం) అమరులై సజీవంగా నేడు మన మధ్య ఉన్నారు – ఎందుకంటే ఆయన సందేశం, మార్గదర్శకత్వం ప్రబోధాలు సజీవంగా ఉన్నాయి. ఆయన అందజేసిన దివ్యగ్రంథం ఖుర్ఆన్ తన నిజ పద సముదాయంలో సురక్షితంగా ఉంది. అందులో ఒక్క అక్షరం కూడా పొల్లుపోకుండా, తారుమారు కాకుండా భద్రంగా ఉంది. అంతేకాదు, ఆయన జీవిత వివరాలు, ఆయన బోధనలు, పలికిన మాటలు, చేసిన పనులు, సర్వమూ సురక్షితంగా ఉన్నాయి. నేడు 1400 ఏళ్ళ కాలం గడచినా, చరిత్ర పుటల్లో ఆయన రూపురేఖల వర్ణన స్వయంగా ఆయన్నే చూస్తున్నామా అన్నంత విశదంగా, అన్ని వివరాలతో, సుస్పష్టంగా పొందుపరచబడి ఉంది. ప్రపంచంలో మరే వ్యక్తి జీవిత వివరాలయినా ఈ విధంగా భద్రపరచబడిలేవు, ఆయన స్వరూప స్వభావాలు, సంప్రదాయాల, బోధనల వివరాలు ఏ మేరకు ఉన్నాయంటే మనం మన నిత్య జీవితంలోని ప్రతి వ్యవహారంలోనూ అనుక్షణం ఆయన ఆదర్శ జీవితం ద్వారా దారిని, వెలుగును పొందగలమని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తరువాత

మరో ప్రవక్త ప్రభవించే అవసరమే లేదనడానికి ఈ ఒక్క ఆధారమే చాలు.

## మరో దైవప్రవక్త ఆవిర్భావానికి కారణాలు

ఒక దైవప్రవక్త తరువాత మరో దైవప్రవక్త ప్రభవనకు మూడు కారణాలు అవసరం.

1. వెనుకటి ప్రవక్త అందజేసిన బోధనలు, సందేశం పూర్తిగా సమసిపోయి వాటిని తిరిగి అందజెయ్యవలసిన ఆవశ్యకత కలగడం.
2. వెనుకటి ప్రవక్త యొక్క బోధనలు అసంపూర్ణమయినవి కావడంచేత వాటిలో మార్పులు చేర్పులు చెయ్యవలసిన సందర్భం ఏర్పడటం.
3. వెనుకటి ప్రవక్త బోధనలు, మార్గదర్శకత్వం ఓ ప్రత్యేక జాతి వరకు పరిమితమై, ఇతర జాతుల కొరకు మరో ప్రవక్త ఆవశ్యకత కలగటం.★

ప్రస్తుతం ఈ మూడు కారణాలూ కానరావడం లేదు.

1. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధించిన ఉపదేశాలు సురక్షితంగా సజీవంగా ఉన్నాయి. ఆయన బోధించిన 'దీన్' (ధర్మం, జీవన విధానం) ఏదో, ఆయన అందజేసిన బోధనలేమిటో, ఆయన ప్రచారం చేసిన జీవిత నియమావళి ఎలాంటిదో, ఎలాంటి ఆచార వ్యవహారాలను,

---

★ నాల్గవ కారణం కూడా కావచ్చు. ఒక ప్రవక్త ఉండగా ఆయనకు తోడుగా, సహకారం అందజెయ్యడానికి మరో ప్రవక్త ప్రభవించడం. కాని ఇలా జరిగిన దృష్టాంతాలు దివ్యఖుర్‌ఆన్‌లో రెండే రెండు ఉన్నాయి. ఈ రెండు అసాధారణ ఉదాహరణల ద్వారా సహాయ ప్రవక్త ప్రభవింపజెయ్యబడే సామాన్య నియమాన్ని సూత్రీకరించడం, అలాంటి ఓ నియమం దైవం వద్ద ఉందనే నిర్ణయానికి రావడం సబబు కాదు. అందువల్ల దీనికి ఇక్కడ ప్రస్తావించడం జరగలేదు.

ఎలాంటి సంప్రదాయాలను నిర్మూలించడానికి ఆయన కృషి సలిపారో తెలుసుకునే ఆధారాలు, నిదర్శనాలు సంపూర్ణంగా, సురక్షితంగా లభిస్తాయి. ఆయన బోధనలు ఆదేశాలు, నిర్దేశాలు ఏవీ సమసిపోలేదు. కనుక వాటిని సరికొత్తగా ప్రబోధించేందుకు మరో ప్రవక్త ఆవిర్భవించే ప్రసక్తే రాదు. ఆ అవసరమే లేదు.

2. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా ఇస్లాం సందేశం ప్రపంచానికి పరిపూర్ణంగా అందజెయ్యడం జరిగింది. ఇందులో మార్పులు, చేర్పులు చెయ్యవలసిన అవసరం ఏమాత్రం లేదు. ఇంకా మరో ప్రవక్త వచ్చి పూరించవలసిన ఏ కొరత కూడా ఇందులో లేదు.

3. మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఏదో ఓ ప్రత్యేక జాతికై గాను ప్రవక్తగా నియుక్తులు కాలేదు. ఆయన ప్రపంచం మొత్తానిగ్గాను ఆవిర్భవించిన దైవప్రవక్త. మానవాళి అంతా అనుసరించడానికి ఆయన బోధనలు, ఉపదేశాలే చాలు. కనుక ఇప్పుడు ఏ ప్రత్యేక జాతి కొరకయినా మరో ప్రత్యేక ప్రవక్త ప్రభవించే అవసరమే ఏర్పడదు. ★

---

★ *1400 ఏళ్ళ క్రితం ఆవిర్భవించిన ఇస్లామీయ శాసనాంగం నియమాలు నేడు మారుతున్న కాలంలో మనకు ఎలా తోడ్పడగలవు? అన్న సందేహం కొందరికి కలగవచ్చు. కొన్ని మౌలిక విషయాలు దృష్టిలో ఉంటే ఇలాంటి స్థూలమయిన అనుమానాలు ఉత్పన్నం కావు.*

*1. 'ఇస్లాం' దైవం ప్రసాదించిన ధర్మం, దైవజ్ఞానం పరిపూర్ణమయింది. దాని పరిధిలో 'ఆది కాలం' 'అంత్యకాలం' అన్నీ చేరి ఉన్నాయి. మానవుడు ఎప్పుడు ఎలాంటి అవసరాలను ఎదుర్కొంటాడో ఆయనకు బాగా తెలుసు.*

*2. ఇస్లాం సూచించే నియమాలు, సిద్ధాంతాలు అన్నీ వాస్తవానికి మానవ నైజానికి అనుగుణంగా నిర్ణయించబడ్డాయి. కాలం మారినంత మాత్రాన*

# అంతిమ దైవ సందేశహరుడు

ఈ కారణాల వల్లనే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ను "ఖాతిమున్నబియ్యీన్" అనంటారు. అంటే నబువ్వత్ (దైవదౌత్యం) పరంపరను సమాప్తం చేసిన వారు, దాన్ని సంపూర్ణం గావించినవారు అని అర్థం. ఇప్పుడు ప్రపంచానికి వేరొక ప్రవక్త ఆవశ్యకత అసలు లేనేలేదు. ఇప్పుడు కావలసినది ఒకటి : మహాప్రవక్త (సఅసం) చూపిన మార్గాన్ని తామూ అనుసరిస్తూ ఇతరులూ దాన్ని అనుసరించేలా మార్గాన్ని సుగమం చేస్తూ కృషి చేసేవారు, ఆయన బోధనల్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని, వాటి ప్రకారం ఆచరిస్తూ ఆయన అందజేసిన ధర్మసందేశం ప్రాబల్యాన్ని ప్రపంచంలో ప్రతిష్ఠింపజెయ్యడానికి దృఢ కంకణం కట్టుకున్నవారు ముందుకు రావడం. ఇదే నేటి అవసరం.

---

మానవ నైజం మారదు.

3. జీవితపు మౌలిక సిద్ధాంతాలు మౌలిక మూల్యాల్లో ఎన్నటికయినా వ్యత్యాసం వాటిల్లదు. కాలానుగుణంగా సమాజంలోను, మానవ జీవితాల్లోనూ వచ్చే మార్పు కేవలం బాహ్యమైందే. జీవితపు మౌలిక మూల్యాల్లో, మనిషి స్థాయిలోనూ ఎలాంటి మార్పు సంభవించదు. ఇస్లాం సూచించిన సిద్ధాంతాలు, నియమాలు కేవలం మౌలికమయినవే. 'ఇజ్తిహాద్' ద్వారా మనిషి వాటిని తన అవసరాలకనుగుణంగా అనువర్తింపజేసుకోగలడు. మౌలిక మూల్యాలు, సిద్ధాంతాలు అతన్ని నిత్యం ఇస్లాం సన్మార్గంపై నిలకడను కల్పిస్తూ ఉంటాయి. అసలు విషయం ఏమిటంటే ఇస్లాంలో మానవుని విజ్ఞతా వివేకాలకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. మానవ వివేచనా శక్తి పరిపక్వం చెందిన దశలోనే ఇస్లాం కొన్ని మౌలిక సిద్ధాంతాలను, విలువలను ప్రతిపాదించి కొన్ని నియమాలు, నిర్దేశాలు ఇచ్చింది. వాటి వెలుగులో ఏ కాలంలోనయినాసరే మనిషి తన వ్యక్తిగత, సామూహిక జీవన వ్యవహారాలు చక్కదిద్దుకోవాలని సూచిస్తుంది ఇస్లాం.

# నాల్గవ అధ్యాయం

# ఈమాన్ ముఖ్యాంశాలు

చర్చను ముందుకు కొనసాగించే ముందు ఇంతవరకు చర్చించిన విషయాలను మరోసారి ప్రస్తావించుకుందాము.

1. "ముస్లిమ్" అంటే దైవ విధేయత పాటించేవాడు. దైవాజ్ఞాపాలన చేసేవాడు అని అర్థం. అయితే దేవుని ఉనికి ఆయన గుణ విశేషాలు, ఆయనకు ఇష్టమైన రీతిలో జీవితం గడిపే విధానం, పరలోక శిక్షా మోక్షాల వాస్తవికత ఇత్యాది విషయాలను గురించి తెలుసుకోవడం అన్నది దైవ సందేశహరుని ద్వారా మాత్రమే సాధ్యం. అందువల్ల "ఇస్లాం" ధర్మానికి నిజమైన నిర్వచనం ఇలా చెప్పుకోవలసి వస్తుంది. "దైవ ప్రవక్త బోధించిన దాన్ని విశ్వసించడం, ఆయన చూపెట్టిన రీతిలో దేవుని దాస్యం చెయ్యడమే ఇస్లాం." ప్రవక్తను త్రోసిరాజని దేవుని విధేయత, దేవుని ఆజ్ఞాపాలన చేస్తున్నట్లు వాదించే వ్యక్తి ముస్లిం కాజాలడు.

2. ప్రాచీన కాలంలో వేర్వేరు జాతుల కొరకు వేర్వేరు ప్రవక్తలు ప్రభవించారు. ఒక్కోసారి, ఒకే జాతిలో ఒకరి వెనక మరొకరు ఎందరో ప్రవక్తలు ప్రభవించారు. ప్రతి జాతికీ దాని ప్రవక్త లేక ప్రవక్తలు ప్రత్యేకంగా బోధించిన ధర్మం ఇస్లాం ధర్మమే. ఇస్లాం, ప్రతి దేశంలోను, ప్రతి కాలంలోను, ప్రతి జాతిలోను సిద్ధాంతపరంగా ఒక్కటే ఐనా "షరీఅత్" అంటే ఆచరణ నియమావళి లేక శాసనాంగం, ఆరాధనా విధానాలు కొంతవరకు భిన్నంగా ఉండేవి. అందువల్ల ఒక జాతి ప్రవక్తను మరో జాతి ప్రజలు అనుసరించే

అవకాశం, అవసరం, లేకుండా పోయింది. అయితే ప్రవక్తలనందరినీ దైవప్రవక్తలుగా విశ్వసించడం మాత్రం ప్రజలందరికీ తప్పనిసరే.

3. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను తన సందేశహరునిగా నియమించి దైవం అందజేసిన ఇస్లాం బోధనలు పరిపూర్ణమైనవి, ప్రపంచమంతటికీ ఒకే షరీఅత్‌ని (ఆచరణ నియమావళి, శాసనాంగం) ఆమోదించాడు దేవుడు. ముహమ్మద్(సఅసం) దైవదౌత్యం ప్రత్యేకజాతికీ, ప్రత్యేక దేశానికీ పరిమితం కాదు. దాన్ని ఆదం సంతతి మొత్తానిగ్గాను, చిరకాలానిగ్గాను నియమించటం జరిగింది. గత ప్రవక్తలు తెచ్చిన ఇస్లామీయ షరీఅత్, శాసనాంగాలన్నీ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆవిర్భావం తరువాత రద్దు చెయ్యబడ్డాయి. ఇక ప్రళయం వరకు మరే ప్రవక్త రావడంకాని, దైవం తరఫున మరే షరీఅత్ అవతరించడంకాని జరగదు. కనుక ఇప్పుడు ఇస్లాం లేక దైవ విధేయతా మార్గం అంటే మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ను అనుసరించడమే. ఆయన దైవదౌత్యాన్ని స్వీకరించడం, ఆయనపట్ల గల నమ్మకంతో ఆయన నమ్మమన్న వాటినన్నింటినీ నమ్మడం, ఆయన అందజేసిన ఆదేశాలన్నింటినీ దైవాదేశాలుగా భావించి వాటిని పాటించడమే "ఇస్లామ్". ఎవరినయినా తప్పనిసరిగా విశ్వసిస్తేనే ఒకవ్యక్తి ముస్లిం అవుతాడని, ఆయన్ని విశ్వసించకపోతే కాఫిర్ అవుతాడని అనడానికి, అలాంటివారు ముహమ్మద్ (సఅసం) తరువాత ఇక ఎవ్వరూ దైవం తరఫున ప్రవక్తగా ప్రభవించరు.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) విశ్వసించమని బోధించిన విషయాలేవో, అవి ఎంత సత్యమయినవో, వాటిని స్వీకరించినట్లయితే మన వ్యక్తిత్వం ఎంత ఉన్నత స్థాయికి ఎదుగుతుందో చూద్దాం.

## దైవ విశ్వాసం

మహాప్రవక్త (సఅసం) బోధించిన అతి ముఖ్యమయిన ప్రప్రథమ బోధన ఇది :

"లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప వేరే దైవం లేడు).

ఈ కలిమా (వచనం) ఇస్లాం మౌలిక సిద్ధాంతం. ఒక ముస్లిమ్‌ని కాఫిర్ (తిరస్కారి)తో, ముష్రిక్ (బహు దైవోపాసకుడు)తో, నాస్తికునితో వేరు చేసేది ఈ వచనమే. ఈ కలిమాను స్వీకరించడం, లేక తిరస్కరించడం వల్ల మనిషి మనిషికి మధ్య మహత్తరమయిన వ్యత్యాసం ఏర్పడుతుంది. స్వీకరించే వారంతా ఒక వర్గంగాను, తిరస్కరించేవారు మరో వర్గంగాను రూపొందుతారు. దీన్ని స్వీకరించిన వారికి ఇహపరాల వృద్ధి వికాసాలు, విజయం, సాఫల్యాలు గౌరవోన్నతులు ప్రాప్తమవుతాయి. తిరస్కరించినవారికి పతనం, పరాజయం, పరాభవాలే మిగులుతాయి.

మానవుల మధ్య ఏర్పడే ఇంత గొప్ప వ్యత్యాసం కేవలం కొన్ని అక్షరాల చిన్న వచనాన్ని ఉచ్ఛరించినంత మాత్రాన రూపొందదు. నోటితో కొన్ని వేల పర్యాయాలు క్రోసిన్, క్రోసిన్ అని వల్లించినంత మాత్రాన జ్వరం తగ్గుతుందా? అలాగే నోటితో "లా ఇలాహ ఇల్లల్లాహ్" అని పలికి, ఈ పదాల భావమేమిటో, వీటిని పలికిన వ్యక్తి ఎంత గొప్ప విషయాన్ని అంగీకరించాడో, ఈ అంగీకారం వల్ల ఎంత పెద్ద బాధ్యత అతను స్వీకరించాడో, అర్థం చేసుకోలేకపోతే, "అజ్ఞానం" తో చేసిన ఈ వచన పఠనం కేవలం నిష్ప్రయోజనం.

"లా ఇలాహ ఇల్లల్లాహ్" అనే వచనానికి అర్థం హృదయాంతరాళాల్లో

నాటుకున్నప్పుడు, దీనిపట్ల పరిపూర్ణ విశ్వాసం కలిగినప్పుడు, దీనికి భిన్నమయిన నమ్మకాలన్నీ హృదయం నుండి దూరమయి ఆంతర్యం పరిశుద్ధమయినప్పుడు, ఈ కలిమా ప్రభావం మనో మస్తిష్కాలపై చెరగని ముద్రవేసినప్పుడు - అప్పుడే - నిజమయిన వ్యత్యాసం మనిషీ మనిషికి మధ్య ఏర్పడుతుంది. ఈ కలిమా ప్రభావం, కనీసం, నిప్పు కాలుస్తుందని, విషం చంపుతుందని గల నమ్మకాల ప్రభావానికి సమానంగానయినా ఉండాలి. అంటే ఏ విధంగా నిప్పు గుణంపై గల నమ్మకం కుంపటిలో చెయ్యి పెట్టనివ్వదో, విషగుణంపై గల నమ్మకం విషం త్రాగనివ్వదో అదే విధంగా "లా ఇలాహ ఇల్లల్లాహ్" పై గల విశ్వాసం, బహుదైవారాధన, దైవ ధిక్కారం, నాస్తికత్వాలకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్నుంచి మనిషిని దూరంగా ఉంచాలి - విశ్వాసపరంగా, ఆచరణపరంగా కూడా.

# "లా ఇలాహ ఇల్లల్లాహ్" అర్థం

"ఇలాహ్" అంటే ఏమిటో ముందు తెలుసుకుందాము. "ఇలాహ్" అన్న అరబీ పదానికి "ఆరాధనా యోగ్యమయిన" అని అర్థం. అంటే తన వైభవోన్నతుల రీత్యా పూజనీయుడైనవాడు, ఆరాధన, దాస్య భావాలతో ఆయన సమక్షంలో తలవంచడానికి తగిన ప్రభువు అని భావం. 'ఇలాహ్' అర్థంలో ఆయన మానవ బుద్ధికి అతీతమయిన, అపరిచితమయిన, అపార శక్తిశాలి అన్న భావమూ ఇమిడి ఉంది. 'ఇలాహ్' అర్థంలో స్వయంగా ఆయన ఏ అవసరమూ లేనివాడయి, అందరూ తమ జీవిత వ్యవహారాల పట్ల ఆయన సమక్షంలో అశక్తులయి ఆయన సహాయాన్ని అర్థించవలసిన అగత్యపరులయి ఉంటారన్న భావమూ ఉంది. 'ఇలాహ్' లో అగోచరశక్తులు కలవాడు అన్న భావం కూడా ఉంది. ఫార్సి భాషలో 'ఖుదా', తెలుగులో 'దైవం', ఇంగ్లీషులో

"గాడ్" అన్న పదాల భావం ఈ పదంలో ఉంది. ఇతర ప్రపంచ భాషల్లో కూడా ఈ ఇలాహ్ భావాన్ని ప్రకటించే ప్రత్యేక పదాలున్నాయి.

"అల్లాహ్" అనే పదం, వాస్తవానికి తానొక్కడే 'దైవం' అయిన దేవునికి వ్యక్తిగత నామవాచకం. కనుక, "లా ఇలాహ ఇల్లల్లాహ్" అనే వచనానికి శాబ్దిక అనువాదం ఇది: "అల్లాహ్ అనే పేరు గల ప్రత్యేక అస్తిత్వం తప్ప వేరే దేవుడెవడూ లేడు." దీని భావమేమంటే, విశ్వమంతటిలో పూజనీయమైన అస్తిత్వం, అల్లాహ్ తప్ప మరేదీ లేదు; ఆరాధన, దాస్యం, ఆజ్ఞాపాలనకై తలవంచడానికి అర్హత ఆయనకు తప్ప మరెవ్వరికీ లేదు; ఆయన ఒక్కడే విశ్వమంతటికీ యజమాని, అధికారి, ప్రభువు పాలకుడు; విశ్వంలో ఉన్న మిగతావన్నీ ఆయన ఆశ్రయం పొందవలసినవే. అందరూ ఆయన సహాయం అర్థించవలసినవారే; ఆయన ఇంద్రియ జ్ఞానానికి గోచరించని అతీతుడు; ఆయన ఉనికిపట్టును అర్థం చేసుకోవడంలో బుద్ధీ వివేకాలు విఫలమయి స్తబ్దతకు చేరుకున్నాయి.

## లా ఇలాహ ఇల్లల్లాహ్ వాస్తవికత

మనం గత పంక్తుల్లో తెలుసుకున్నది కేవలం ఈ వచనంలోని పదాల భావం. ఇక ఆ వచనంలోని వాస్తవికతను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిద్దాం.

అత్యంత ప్రాచీన మానవ చరిత్ర వివరాలను, అత్యంత ప్రాచీన జాతుల అవశేషాలను పరిశీలిస్తే మనిషి ప్రతి కాలంలోను ఏదయినా ఒకదాన్ని దైవమని నమ్మేవాడని, ఎవరైనా ఒకరిని ఆరాధించేవాడని వెల్లడవుతుంది. ఇప్పటికీ ప్రపంచంలో ఉన్న జాతుల్లో - అడవి తెగలయినా, గొప్ప నాగరిక జాతులయినా - దేన్నయినా దైవమని నమ్మి దాన్ని ఆరాధించే భావం

మాత్రం సర్వ సామాన్యంగా వ్యాపించి ఉంది. ఈ యదార్థం తెలిపేదేమంటే, మానవ ప్రకృతిలోనే దైవ భావన నిబిడీకృతమయి ఉంది; అతని నైజంలో, అతని ఆంతర్యంలో ఎవరినయినా దైవమని విశ్వసించి ఆరాధించే ప్రబల వాంఛ సహజంగానే ప్రజ్వలితమయి ఉంది. మనిషి దానివల్ల వివశుడయిపోతాడు. అయితే ఆ శక్తి, ఆ అస్తిత్వం ఏది? అన్నదే ప్రశ్న. మీరు స్వయంగా మీ ఉనికిని, ఇతర మానవుల స్థితిని పరిశీలిస్తే ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోగలుగుతారు.

వాస్తవమేమంటే మనిషి దాసునిగానే జన్మించాడు. సహజసిద్ధంగానే అతడు తన అవసరాలకు ఇతరులపై ఆధారపడి ఉన్నాడు; అశక్తుడు, శక్తిహీనుడు; ఇతని మనుగడకొరకు అనేక పదార్థాలు అవసరం; కాని అవన్నీ ఇతని అధీనంలో లేవు. అవి ఇతని ప్రమేయం లేకుండానే ఇతనికి ప్రాప్తమవుతాయి, ఇతని ప్రమేయం లేకుండానే ఇతన్నుండి తీసుకోబడతాయి కూడా.

ఇతనికి నష్టాన్ని చేకూర్చే పదార్థాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఇతని యావజ్జీవ కృషిని ఒక్క క్షణంలో మట్టిపాలు చేసివేస్తాయి. ఇతను కట్టుకున్న ఆశాసౌధాలను రెప్పపాటు కాలంలో నేలమట్టం చేస్తాయి. వ్యాధులకు, వినాశాలకు గురిచేస్తాయి. ఇతను వాటి నివారణ కొరకు ప్రయత్నిస్తాడు. ఒక్కోసారి ఇతని ప్రయత్నం సఫలమౌతుంది. మరోసారి కాదు. అప్పుడు వాటి రాకపోకలు తన చేతుల్లో లేవని అర్థం చేసుకుంటాడు. ప్రపంచంలో ఇంకా ఎన్నో వస్తువులున్నాయి. వాటి వైభవం, గొప్పతనం, ఠీవి, దర్పం చూసి భయాంకితుడయిపోతాడు. భీతావహుడయిపోతాడు. ఎత్తుగా అజేయంగా కనిపించే మహోన్నత పర్వత శిఖరాలు, హోరున అరుస్తూ

భయంకరంగా పరుగెత్తే నదులు, మహానదులు, భయానక రూపాల భారీ వన్యమృగాలు, ప్రచండమయిన తుఫానులు, త్రుటిలో గొప్ప గొప్ప భవంతులనే నేలమట్టంచేసి వేసే వరదలు, భూకంపాలు - అన్నిటినీ తిలకిస్తాడు. ఉరుములతో, మెరుములతో గర్జిస్తూ భయపెడుతూ తరలివచ్చే మేఘదళాలు, భోరున కురిసి నదీనదములన్నీ ఏకంచేసే వర్షాలు - ప్రతి నిత్యం పరివర్తనచెందే దృశ్యాలు ఇతనికి ఎదురవుతాయి. ఇవన్నీ ఎంత గొప్పగా, ఎంత శక్తిమంతంగా, ఎంత ప్రచండంగా ఉన్నాయి? వాటిముందు తానెంత అల్పంగా, శక్తిహీనంగా ఉన్నాడు?

ఈ వివిధ దృశ్యాలను, స్వయంగా తన అశక్తతను గమనించినప్పుడు ఇతని హృదయంలో సహజంగానే దాస్య భావన, శక్తిహీనతా భావనలు ఉత్పన్నమవుతాయి. ఈ భావన రాగానే సహజ పరిణామంగా ఇతనిలో ఆ శక్తుల పట్ల దైవ భావన కూడా జనిస్తుంది. ప్రపంచంలో పనిచేస్తున్న ప్రచండ శక్తుల్ని ఊహించుకోగానే వాటి గొప్పతనం ఇతన్ని వాటి సమక్షంలో ఆరాధనా భావంతో తలవంచేలా చేస్తుంది. వాటి బలప్రతాపాల జ్ఞానం, వాటి ముందు తన నిస్సహాయతను, శక్తి లేమిని నివేదించుకునేందుకు ఇతన్ని వివశుణ్ణి చేస్తుంది. తనకు నష్టం చేకూర్చే శక్తుల జ్ఞానం, వాటికి భయపడేందుకు, వాటి ఆగ్రహానికి గురికాకుండా తనను తాను రక్షించుకునేందుకు అతన్ని ప్రేరేపిస్తుంది.

## మూఢత్వానికి పరాకాష్ఠ

మానవుని మూఢత్వపు అధమాతి అధమదశ ఏమిటంటే గొప్పగా, శక్తిమంతంగా అగుపించేవాటిని లేక ఏదో ఓ రూపంలో తనకు లాభాన్నిగాని, నష్టాన్నిగాని చేకూర్చే శక్తులుగా గోచరించే వాటిని దైవాలని భావించడం.

తదనుగుణంగా మనిషి భయంకర మృగాలను, జంతువుల్ని, నదుల్ని, పర్వతాలను ఆరాధిస్తాడు. భూమినీ, అగ్నినీ, వర్షాన్నీ, సూర్యచంద్రాదుల్ని పూజిస్తాడు.

ఈ మూఢత్వం కాస్త తగ్గి జ్ఞాన కాంతి ప్రవేశించినప్పుడు ఇవన్నీ తన మాదిరిగానే శక్తిహీనమైనవని గ్రహిస్తాడు మనిషి. ఎంతో పెద్ద మృగమయినా, అల్పాతిఅల్పమయిన దోమలా చనిపోతుంది. మహా నదులే ఎండిపోతాయి, ఒక్కోసారి వరదలు వచ్చి పొంగుతాయి. మరోసారి తగ్గిపోతాయి. పర్వతాలను స్వయంగా మనిషే ముక్కలు ముక్కలుగా చేసివేస్తున్నాడు. భూమిపై పంటలు పండటం, కాయలు కాయడం, పువ్వుపూయడం, అసలు వీటన్నిటిపై భూమికి ఏ విధమయిన అదుపు లేదు. నీరు సహకరించకపోతే భూమి బీటలు వారుతుంది. అయితే నీటికీ స్వేచ్ఛ లేదు. అదీ గాలిపై ఆధారపడి ఉంది. అది స్వయంగా దానంతట లాభమూ చేకూర్చజాలదు, నష్టాన్నీ కలిగించలేదు. దానివల్ల కలిగే లాభనష్టాలు ఇతర అనేక కారణాలపైనే ఆధారపడి ఉన్నాయి.

సూర్యచంద్ర నక్షత్రాదులు సయితమూ ఓ శాసనానికి బద్ధులయి ఉన్నాయి. ఈ శాసనాన్ని అవి ఏ మాత్రం ఉల్లంఘించలేవు. ఇదంతా పరిశీలించి, గ్రహించి, తెలుసుకుని మనిషి మనసు కానరాని మర్మశక్తుల వైపుకు మళ్ళుతుంది. ప్రత్యక్షంగా కనబడే ఈ సరంజామా వెనుక కొన్ని అగోచర శక్తులున్నాయని, అవి ఈ వ్యవహారాన్నంతా తమ అదుపులో ఉంచుకుని తమ ఆజ్ఞానుసారం దీన్నంతటినీ నడుపుతున్నాయని మనిషి గ్రహిస్తాడు. అప్పుడే దేవుళ్ళు, దేవతలు, నమ్మకాలు జనిస్తాయి. వెలుగు, వేడిమి, గాలి, నీరు, వ్యాధి, స్వస్థత ఇంకా అనేక అంశాలకు వేర్వేరు దైవాలను నిర్ణయించుకుని వాటి ఊహా చిత్రాలు తయారుచేసి పూజిస్తాడు మనిషి.

# జ్ఞానకాంతి ప్రవేశం

ఆ తరువాత జ్ఞానకాంతి ఇంకా అధికమయినప్పుడు ప్రపంచ వ్యవస్థలో ఓ ప్రచండ శాసనం ఓ గొప్ప నియమం పాటించడం జరుగుతోందన్న విషయాన్ని గమనిస్తాడు మనిషి. గాలులు వీయడం, వానలు కురియడం, నక్షత్రాల పరిభ్రమణం, పంటలు పండటం, ఋతువుల రాకపోకలలో ఎంతటి క్రమబద్ధత కానవస్తోంది? అసంఖ్యాకమయిన సృష్టి శక్తులు ఎలా పరస్పరం సంఘీభావంతో సమన్వయంతో వ్యవహరిస్తున్నాయి? ఎంతటి బలవత్తర శాసనమిది? - ఏ పనికి ఏ కాలం నిర్ణయమై ఉందో సరిగ్గా ఆ సమయానికే విశ్వంలో సకల సాధనాలు సమకూరి పరస్పర సహకారంతో ఆ పనిని పూర్తి చేస్తాయి.

విశ్వ వ్యవస్థలోని ఈ సమన్వయాన్ని, సామరస్యాన్ని చూచి ఓ బహు దైవారాధకుడు సయితం విస్తుపోతాడు. ఈ చిల్లరదేవుళ్లపై అధికారంగల, అందరికన్నా గొప్పవాడయిన మరో దేవుడొకడున్నాడని, అలాకాకపోతే ప్రపంచంలోని ఈ కార్యకలాపాలన్నీ ఛిన్నాభిన్నమయిపోయేవని నమ్మడం తప్ప అతనికి గత్యంతరం లేదు. అతను ఈ పెద్ద దేవుణ్ణి "అల్లాహ్" అని "పరమేశ్వరుడు" అని, "ఖుదాయె ఖుదాగాన్", "దేవదేవుడు" అని పిలుచుకుంటాడు. కాని ఆరాధనలో మాత్రం దైవానికి తోడుగా ఆ చిల్లర దేవుళ్ళను సయితమూ చేర్చి మరీ ఆరాధిస్తాడు. దైవత్వం కూడా ప్రాపంచిక రాజరికం లాంటిదని అతడు భావిస్తాడు. ప్రపంచంలో ఏ విధంగానయితే ఒక రాజు ఉండి అతనికి మంత్రులు, సామంతులు, కార్యదర్శులు నిర్వాహకులు సాధికార ఉద్యోగులు ఉంటారో అదే విధంగా విశ్వంలో సయితం అందరికంటే గొప్ప దేవుడు ఒకడుండి, ఆయన ఆధిపత్యంలో చిన్న చిన్న దేవుళ్ళు అనేక

మంది ఉంటారనీ ఈ చిల్లర దేవుళ్ళ ప్రసన్నతను పొందనంతవరకు పెద్ద దేవుని సన్నిధికి చేరలేమని భావిస్తాడు, కనుక ఈ చిన్న దేవుళ్ళను కూడా ఆరాధించాలని, వీరిని కూడా అర్థించాలనీ, వీరి ఆగ్రహానికి భయపడాలని, వీరే దేవదేవుని సాన్నిధ్యానికి చేర్చగల మాధ్యమశక్తులవడాన వీరికి మొక్కుబడులూ, నైవేద్యాలూ అర్పించాలనీ, ఈ విధంగా వీరిని సంతోషపెట్టాలనీ అనుకుంటాడు.

విజ్ఞానం వృద్ధిచెందినకొద్దీ దేవుళ్ళ సంఖ్య తగ్గుతూపోతుంది. అజ్ఞానులు మూఢత్వం మూలాన నిర్మించుకున్న ఊహాదైవాలు ఒక్కొక్కరిని గురించి నిశితంగా పరిశీలిస్తే అవి దైవాలు కావని, మనలాంటి దాసులేనని మనకు మించిన అశక్తులని మనిషి గ్రహించగలడు. ఈ పరిశీలనలో ఒక్కొక్కరినే దైవత్వం నుండి తొలగిస్తూపోతే చివరికి ఒకే దేవుడు మిగులుతాడు. అప్పటికీ ఆయన గురించి సయితం కొన్ని మూఢ నమ్మకాలు మిగిలిపోతాయి. దేవునికి మనలాంటి శరీరముందని ఆయన మానవుల్లానే ఎక్కడో తిష్ఠవేసి తన దైవత్వం చెలాయిస్తున్నాడని కొందరు అభిప్రాయపడగా, కొందరు, దేవుడు కూడా మానవుల్లానే భార్యాపిల్లలు కలిగి ఉన్నాడని, ఆయనకు సంతానం కూడా ఉందని నమ్ముతారు. కొందరు, దేవుడే మానవాకారంలో ప్రపంచంలో అవతారమెత్తుతాడని భావిస్తే ఇంకా కొందరు ఈ విశ్వకార్య కలాపాలను ప్రారంభించి ఆయన ఎక్కడో హాయిగా విశ్రమిస్తున్నాడని తలపోస్తారు. పూర్వం గతించిన మనుషులు, ప్రేతాత్మల సిఫారసులేనిదే వీరి మధ్యవర్తిత్వం లేనిదే దైవం సమక్షాన ఏ పనీ జరగదని కొందరు భావించగా, మరికొందరు, దైవానికి తమ ఊహల ప్రకారం ఒక రూపమంటూ కల్పించి పూజలు జరిపేటప్పుడు ఆ రూపాన్ని ముందుంచుకోవడం అవసరమని తలుస్తారు.

ఇలాంటి తప్పుడు భావాలెన్నో ఏకేశ్వరవాదం (తౌహీద్) పట్ల విశ్వాసంతో పాటు మానవ మస్తిష్కంలో నిలిచిపొయ్యాయి. ఈ తప్పుడు నమ్మకాల కారణంగా మనిషి బహు దైవ వాదన (షిర్క్) కు, కుఫ్రకు (దైవ తిరస్కారానికి) పాల్పడుతాడు. దీనికంతటికీ కారణం అజ్ఞానమే.

## నిజమయిన దైవభావన

అన్నిటికంటే ఉన్నతమైనదీ, ఉత్తమమైనదీ "లా ఇలాహ ఇల్లల్లాహ్" దశ. ప్రతి యుగంలోనూ దేవుడు తన సందేశహరుల ద్వారా పంపిన జ్ఞాన జ్యోతి ఇదే. తొలుత హజ్రత్ ఆదమ్ (అలైహిస్సలాం)ను భువిపై ప్రభవింపజేసినదీ ఈ జ్ఞానాన్ని ప్రసాదించే. ఈ జ్ఞానమే హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) తరువాత హజ్రత్ నూహ్, హజ్రత్ ఇబ్రాహీం, హజ్రత్ మూసా (అలైహిముస్సలాం) తదితర ప్రవక్తలకూ ఇచ్చి పంపాడు దేవుడు. ఈ జ్ఞానాన్నే, చివరి దైవ సందేశహరులు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా తీసుకువచ్చారు. ఇది స్వచ్ఛమయిన, ఎలాంటి కల్తీలేని పరిశుద్ధమయిన జ్ఞానం. ఇందులో అజ్ఞానం ఏదయినా ఉందనే రవ్వంత సంశయమయినా లేదు. పైన పేర్కొన్నటువంటి బహుదైవారాధన, విగ్రహారాధన, దైవ తిరస్కారంలాంటి భావనా రూపాలన్నీ మానవుడు దైవ సందేశహరుల బోధనల్ని త్రోసిరాజనడం చేతను వాటికి ప్రతిగా తన సొంత బుద్ధీజ్ఞానాలపై ఆధారపడటం చేతను ఉత్పన్నమయ్యాయి.

ఈ చిన్న వచనం "లా ఇలాహ ఇల్లల్లాహ్" లో ఎంతటి గొప్ప యదార్థం నిక్షిప్తమయి ఉందో గమనిస్తే తెలుస్తుంది.

# దేవుడు ఒక్కడే

1. మొట్టమొదటి విషయం దైవత్వపు భావన.

ఈ సువిశాల విశ్వం, ఆది ఏదో, అంతం ఏదో కనీసం ఊహించనయినా అలవికాని ఈ అనంత విశ్వం, అజ్ఞాత కాలం నుండి ఇలానే వ్యవహరిస్తోంది. అలాగే అంతు తేలని కాల గమ్యం వైపుకు నిరంతర ప్రయాణం చేస్తోంది, అసంఖ్యాకమయిన సృష్టిరాసులిందులో ఉనికిలోకి వచ్చాయి. మానవ మేధ నిశ్చేష్ఠ అయి నిలిచిపొయ్యే చిత్రవిచిత్ర సంఘటనలు, అద్భుతాలు ఇందులో సంభవిస్తుంటాయి.

ఈ అనంత విశ్వంపై పరిపాలన చేసే, దైవత్వాలను చెలాయించే దైవం – అనంతుడు. ఆది మధ్యాంతరహితుడు, అజరుడు, అమరుడు, సర్వవ్యాపి; ఆయనకు ఎవరి ఆశ్రయమూ అక్కరలేదు, నిరపేక్షాపరుడు, అపారశక్తిమంతుడు, సర్వోపరిజ్ఞాని, సర్వాంతరజ్ఞాని, సర్వాధిపతి, సర్వాధికారి; ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించే సాహసం ఎవ్వరికీ కలగనటువంటి ప్రభువు; అసమాన శక్తిప్రతాపాలుగల స్వామి. సృష్టి సర్వానికి జీవనోపాధిని ప్రసాదించే దాత; కొరత, లేమి, దోషంలాంటి అవగుణాలు లేని అపర నిర్మల తేజస్వి; ఎవ్వరికీ ఆయన కార్యకలాపాల్లో జోక్యం కలుగజేసుకునే ధైర్యం కలగనటువంటి సర్వాధికారి.

2. దైవత్వపు ఈ గుణాలన్నీ ఒకే అస్తిత్వంలో ఇమిడి ఉండడం అవసరం. రెండు అస్తిత్వాలు ఈ గుణాలన్నీ సమానంగా కలిగి ఉండటం అసంభవం, ఎందుచేతనంటే, 'అందరి'పై స్వాధీనం కలవాడు, 'అందరి'కీ ప్రభువు ఒక్కడే కాగలడు. ఈ గుణాలు అనేక దేవుళ్ళలో విభజించబడటమూ

అసాధ్యమే. ఎందువల్లనంటే ఒకరు శాసన కర్త, మరొకరు సర్వజ్ఞుడు, ఇంకొకరు దాత అయినట్లయితే ప్రతి "దైవం" మరొక "దైవానికి" అధీనమవవలసి ఉంటుంది. ఒకవేళ ఒక దైవం మరొక దైవంతో సహకరించక పోతే విశ్వం మొత్తమే ఒక్క క్షణంలో నాశనమయిపోతుంది.

ఈ గుణాలు పరస్పరం మారడం, అంటే ఒకప్పుడు ఓ దైవంలోను మరొకప్పుడు మరో దైవంలోను ఉండటం కూడా అనూహ్యమే, ఎందుకంటే స్వశక్తితో మనగలగని దైవం విశ్వాన్నంతటికీ జీవం ప్రసాదించగలడా? స్వయంగా తన "దైవత్వాన్ని" రక్షించుకోలేని దేవుడు ఇంత గొప్ప విశ్వాన్ని పరిపాలించగలడా?

తేలిందేమంటే, జ్ఞానకాంతి వికాసమొందిన కొద్దీ దైవత్వపు గుణాలు ఒకే అస్తిత్వంలో ఇమిడి ఉండటం అవసరమన్న విశ్వాసం దృఢతరమవుతూ పోతుంది.

3. దైవత్వపు ఈ పరిపూర్ణమయిన నిజభావనను దృష్టిలో ఉంచుకుని విశ్వాన్ని పరిశీలించండి. మీరు చూడగలిగే వస్తువుల్లో, మరే ఇతర సాధనాల ద్వారానయినా మీ అనుభవంలోకి వచ్చే వస్తువుల్లో, మీ జ్ఞాన పరిధిలో ఉన్న వస్తువుల్లో ఏ ఒక్కటి కూడా ఈ గుణగణాలు కలిగిలేదు. విశ్వంలో ఉనికి గలవన్నీ పరాధీనమైనవే, పరపాలనలో ఉన్నవే. అవి ఎవరిచేతనో నిర్మించ బడతాయి, విచ్ఛిన్నమవుతాయి. వీటన్నింటికీ జననమరణాలున్నాయి. దేనికీ ఓ నిలకడ అంటూ కానరాదు. ఏదీ తన సొంత అధికారంతో కదలదు, మెదలదు. ఓ బలవత్తర అగోచర శాసనానికి వ్యతిరేకంగా ఏదీ ఏ మాత్రం కదలజాలదు.

వీటి ఈ పరిస్థితే ఇవేవీ దైవం కావని ఎలుగెత్తి చాటుతోంది.

దేనిలోనూ దైవత్వపు చిహ్నం ఛాయ మాత్రంగానైనా కానరావటం లేదు. దైవత్వంలో దేనికీ ఏ మాత్రం భాగమూ లేదు - ఇదే "లా ఇలాహ" భావం.

4. విశ్వంలో ఉన్న వాటన్నిటిలో దేనికీ "దైవత్వం" లేదని తేలిపోయిన తరువాత, వీటన్నిటికంటే ఉన్నతమయిన అధికారంగల శక్తి మరొకటి ఉందని, అదే దైవత్వపు సకల గుణగణాలు కలిగి ఉందనీ మీరు అంగీకరించక తప్పదు - "ఇల్లల్లాహ" భావమిదే.

ఇదే అసలు నిజమయిన మహత్తర జ్ఞానం. మీరెన్ని పరిశోధనలు చేసినా, ఎన్ని అన్వేషణలు జరిపినా జ్ఞానానికి మూలాధారం ఇదే అని, మరిదే జ్ఞానానికి చివరి అంచు అనీ గ్రహిస్తారు. భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, ఖగోళ శాస్త్రం, గణిత శాస్త్రం; జీవ శాస్త్రం, మానవ శాస్త్రం - ఒక్క మాటలో, విశ్వం వాస్తవికతను అన్వేషించే, పరిశోధించే విజ్ఞాన శాస్త్రాల్లో దేన్ని తీసుకుని అనుశీలన, అధ్యయనాలు చేసినా, ఈ పరిశోధనలో ఎంత లోతుగా ముందుకు సాగితే అంతే ప్రస్ఫుటంగా "లా ఇలాహ ఇల్లల్లాహ" లోని యదార్థం స్పష్టమవుతూ పోతుంది. దీని విశ్వాసం అధికమవుతూపోతుంది. వైజ్ఞానిక పరిశోధన పరిశీలనారంగాల్లో ఈ మహత్తర సత్యాన్ని తిరస్కరించినట్లయితే విశ్వంలోని ప్రతి పదార్థం అర్థరహితమయిపోతుంది.

## 'తౌహీద్' (ఏకేశ్వరవాదం) ప్రభావం

"లా ఇలాహ ఇల్లల్లాహ" అనే కలిమా (వచనం) ను స్వీకరించడం వల్ల మానవ జీవితంపై ఎలాంటి ప్రభావంపడుతుందో చూద్దాం.

# విశాల దృష్టి

1. ఈ వచనాన్ని (కలిమాను) నమ్మిన వ్యక్తి సంకుచిత మనస్కుడు కానేరడు. అతను విశ్వసించే దైవం, భూమ్యాకాశాల కర్త. తూర్పు పడమరల స్వామి, విశ్వాన్నంతటికీ పాలకుడు, పోషకుడు. ఈ విశ్వాసం ఏర్పడిన తరువాత యావజ్జగత్తులో అతనికి పరాయి వస్తువు ఏదీ కానరాదు. విశ్వంలో ఉన్నదంతా తనలానే ఒకే ప్రభువుకు చెందిన సొత్తు. ఒకే పాలకుని అధీనంలో ఉన్న విత్తం. అందువల్ల ఈ వ్యక్తి ప్రేమాభిమానాలు, సేవలు ఎలాంటి పరిమితులకు లోనయి ఉండవు. ఇతని దృష్టి దేవుని రాజ్యంలా అవధుల్లేనిది. ఈ విశాల హృదయత అనేక చిన్న చిన్న దేవుళ్ళను నమ్మే వ్యక్తికి లేక దైవంలో ఉన్నవి కూడ మానవునిలా పరిమితమైనవని, అసంపూర్ణమయిన గుణాలని భావించే వ్యక్తికి లభ్యం కాదు.

# ఆత్మాభిమానం

2. ఈ కలిమా మనిషిలో భారీ ఎత్తున ఆత్మాభిమానాన్ని ఆత్మ గౌరవాన్నీ జనింపజేస్తుంది. దీన్ని విశ్వసించే వ్యక్తి శక్తులన్నింటికీ అధికారి దేవుడు ఒక్కడే అని, లాభనష్టాలు కలిగించేవాడు, మానవుల జనన మరణాలపై అధీనం, అధికారం, ప్రభావంగలవాడు, ఆయన ఒక్కడే తప్ప మరి ఎవ్వరూ లేరని తెలుసుకుంటాడు. ఈ జ్ఞానం, ఈ విశ్వాసం అతన్ని దైవానికి తప్ప మరే ఇతర శక్తికి భయపడనివానిగా, అన్ని శక్తుల పట్ల నిరపేక్షాపరునిగా చేసివేస్తాయి. సృష్టిలోని శక్తుల ముందు - అది ఏదయినా - ఇతడు తలవంచడు. చెయ్యి చాచి ఎవ్వరినీ అర్థించడు, ఇతని హృదయ ఫలకంపై దైవం తప్ప మరెవ్వరి పవిత్రతా భావం, ఔన్నత్య భావం కూడా ముద్ర

వెయ్యజాలదు. ఈ గుణాలు, తౌహీద్ (దేవుని ఏకత్వపు భావం) పట్ల విశ్వాసం ద్వారా తప్ప మరే విశ్వాసం ద్వారానూ జనించజాలవు. బహు దైవారాధన, దైవ ధిక్కారం, నాస్తికత్వం వల్ల అనివార్యంగా జనించే గుణాలు ఏవంటే మానవుడు సృష్టి ముందు తలవంచడం, సృష్టిలోని అనేక శక్తులకు లాభనష్టాలు కలిగించే అధికారం, శక్తి ఉన్నాయని నమ్మడం, వాటి భీతిపై ఆధారభూతమయిన జీవితం గడపడం వాటి మీదే ఆశలు పెంచుకోవడం.

## వినయ వినమ్రతలు

3. ఈ కలిమా, ఆత్మాభిమానానికి తోడుగా మనిషిలో సామ్యం, వినయ వినమ్రతలూ జనింపజేస్తుంది. దీన్ని నమ్మేవాడు ఎన్నటికీ గర్విష్ఠి, అహంకారి కాజాలడు. తన శక్తి సామర్థ్యాల వల్ల, సిరిసంపదల వల్ల ఇతని ఆంతర్యంలో దురహంకారం చోటు చేసుకోజాలదు. ఎందుకంటే అతనికి తెలుసు, తనవద్ద ఉన్నదంతా దైవ ప్రసాదమే అని, దేవునికి అనుగ్రహించే శక్తి ఉన్నట్లే, తిరిగి తీసుకునే శక్తి ఉందని కూడా అతనికి తెలుసు. దీనికి భిన్నంగా నాస్తిక వాదాన్ని విశ్వసించే వ్యక్తికేదైనా ప్రాపంచిక విషయంలో ప్రావీణ్యం ప్రాప్తమయితే అతను అహంభావానికి గురవుతాడు. ఎందుకంటే తనకు లభించిన విశేష గుణం తన సొంత శక్తి సామర్థ్యాల ఫలితమే అని అతని భావన. ఇలాగే షిర్క్ (బహు దైవవాదం), కుఫ్ర్ (దైవ ధిక్కారం) తో పాటు అహంభావం జనించడం కూడా సహజమే. ఎందుకంటే బహుదైవారాధకుల, దైవ ధిక్కారుల అభిప్రాయాల ప్రకారం, తమ దేవుళ్ళతో వాళ్ళకేదో ప్రత్యేక అనుబంధం ఉంది, ఇలాంటి ప్రత్యేకానుబంధం ఇతరులెవ్వరికీ లేదు గనక.

# నిజ ప్రేరణ

4. ఈ కలిమాను విశ్వసించే వ్యక్తికి తన ఆత్మ ప్రక్షాళనం జరిగి, తాను సత్కార్యాలు చెయ్యడం తప్ప తన మోక్షం సాఫల్యాలకు మరో మార్గం లేదని బాగా తెలుసు. ఎందుకంటే తాను విశ్వసించే దైవానికి ఎవరితోనూ ఏలాంటి అవసరం లేదు. మరెవరితోనూ ఎలాంటి ప్రత్యేకానుబంధం లేదు. ఆయన నిరపేక్షాపరుడు, నిష్పాక్షికంగా న్యాయం చేసే స్వామి, ఆయన దైవత్వంలో ఎవరికీ ఎలాంటి జోక్యం కలగజేసుకునే అధికారం లేదు.

దీనికి భిన్నంగా ముష్రికులు (బహు దైవారాధకులు), కాఫిర్లు (దైవ ధిక్కారులు) ఎప్పుడూ మిథ్యా ఆశల గాలిమేడలు కట్టుకుని జీవిస్తూ ఉంటారు. వీరిలో కొందరు, దైవ కుమారుడు తమ పాపాలకు పరిహారంగా బలి అయ్యాడని భావిస్తే మరి కొందరు మేము దైవానికి ప్రీతిపాత్రులము మాకు శిక్షపడటమే జరగదనీ అపోహలకు లోనయి ఉంటారు. ఇంకా కొందరు, పుణ్యపురుషులయిన మా పూర్వుల ద్వారా దైవ సమక్షంలో సిఫారసు పొంది దైవాగ్రహం నుండి తప్పించుకోవచ్చని పగటి కలలు కంటుంటారు. కొందరయితే, తాము తమ దేవతలకు నైవేద్యాలు, అర్చనలు జరిపినందుకు ప్రపంచంలో స్వైరవిహారం చెయ్యడానికి తమకు లైసెన్సు లభించిందని సంబరపడుతుంటారు. ఇలాంటి మిథ్యా విశ్వాసాలు వీరందరిని నిత్యం పాపపు కార్యాలు, దుష్కృత్యాలు, దుర్మార్గాల పద్మవ్యూహంలో పడవేస్తాయి. ఈ మిథ్యా విశ్వాసాల కారణాన వీరు ఆత్మ పరిశుద్ధత పట్ల, సత్క్రియల పట్ల ఉపేక్షాభావానికి గురవుతారు.

ఇక మిగిలింది నాస్తికులు. వీరు, ఒక ఉన్నత శక్తి తమ ఆచరణను గురించి, వాటి మంచి చెడులను గురించి ప్రశ్నిస్తుందన్న యదార్థాన్నే

నమ్మరు. కనుక ప్రపంచంలో వారు స్వేచ్ఛా జీవులుగా మెలుగుతారు. వారి మనోకాంక్షలే వారి దైవం, వారు దానికే దాసులు!

## ఆశావాదం

5. ఈ కలిమాను విశ్వసించిన వ్యక్తి ఎట్టి పరిస్థితిలోనూ నిరాశావాదిగా, భగ్న హృదయుడుగా రూపొందడు. భూమ్యాకాశాల నిధులన్నింటికీ స్వామి అయిన అల్లాహ్‌ను అతడు విశ్వసిస్తున్నాడు. ఆయన కరుణానుగ్రహాలు అపారం, అపరిమితం. ఆయన శక్తి సామర్థ్యాలు అనంతం, తన ప్రభువు పట్ల ఈ భావన, ఈ విశ్వాసం అతని ఆంతర్యానికి అసాధారణ తృప్తినిస్తుంది. అతని అంతరాళం ప్రశాంతతకు మారుపేరయి ఆశావాదం అతని విధానమవుతుంది. అతడు ప్రపంచంలో ప్రతి చోటా తృణీకరించబడినా, ఆధారాల ద్వారాలన్నీ మూయబడినా, వనరులు, సాధనాలన్నీ, ఒక్కొక్కటే దోచుకోబడినా ఏకైక దేవుని అండ, నీడలు మాత్రం అతన్ని విడనాడవు. ఈ ఆధారాన్ని పట్టుకునే అతడు సరికొత్త సంకల్పాలతో, ఆశలతో, నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తూ పురోగమిస్తాడు. ఈ మానసిక తృప్తి ఒక్క తౌహీద్‌లో తప్ప మరెక్కడా ప్రాప్తం కాదు. బహు దైవారాధకులు, దైవ ధిక్కారులు, నాస్తికులు, అందరూ అల్ప మనస్కులు. వారి ఆశలు, నమ్మకాలు, స్వల్ప శక్తులపై ఉంటాయి. అందువల్లనే కష్టకాలంలో నిరాశానిస్పృహలు అతి శీఘ్రంగా వారిని చుట్టుముట్టుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో వీరు ఆత్మహత్యకు పాల్పడడం కూడా సంభవమే.

## సంకల్పనిరతి

6. ఈ వచనాన్ని నమ్మే వ్యక్తిలో దృఢ సంకల్పం, సహన స్థయిర్యాలు,

దైవంపై భరోసాలాంటి సద్గుణాలునిండిన ఎదురులేని శక్తి జనిస్తుంది. దైవ ప్రసన్నత కొరకే గొప్ప గొప్ప కార్యాలు నిర్వహించడానికి పూనుకున్నప్పుడు "నా వెనకాల సహాయానికై భూమ్యాకాశాల ప్రభువయిన దేవుని బలముంది" అనే అచంచల విశ్వాసం అతని ఆంతర్యంలో ధైర్యసాహసాల్ని, పర్వతాల్లాంటి స్థయిర్యాన్నీ జనింపజేస్తుంది. ప్రపంచంలో ఎదురయ్యే కష్టాలు, బాధలు, ఇంకా ఇతర ప్రతికూల విషయాలన్నీ ఏకమైనప్పటికీ అతన్ని తన సంకల్పాన్నుండి ఏ మాత్రం కదిలించలేవు.

## శూరత్వం

7. ఈ వచనం మనిషిలో శూరత్వాన్ని సృజిస్తుంది. అది ఎలాగో కాస్త గమనిద్దాము. మనిషిలో పిరికితనాన్ని పుట్టించే విషయాలు నిజానికి రెండే. ఒకటిః ధన, ప్రాణ, భార్యాపుత్రాదుల ప్రేమ. రెండోదిః మనిషి తన మృత్యువు దైవం తప్ప ఇతర శక్తుల హస్తాల్లో ఉందని, అతడు తన ప్రయత్నాల ద్వారా మృత్యువును తొలగించగలడని ఏర్పడే అపోహ. "లా ఇలాహ ఇల్లల్లాహ్" పట్ల గల విశ్వాసం ఈ రెంటినీ నిర్మూలిస్తుంది. దీన్ని విశ్వసించే వ్యక్తి తన ధన ప్రాణాలు, ఇంకా ఇతర వస్తు సామగ్రి అంతా దైవానిదే అని భావిస్తాడు. ఆ దైవం ప్రసన్నత పొందడానికి తనకున్న సర్వస్వాన్ని త్యాగం చేసేందుకు సిద్ధమవుతాడు. దీనివల్ల మొదటి కారణం దూరమవుతుంది. "లా ఇలాహ ఇల్లల్లాహ్"ను విశ్వసించే వ్యక్తి తన ప్రాణం తీసే అధికారం, శక్తిసామర్థ్యాలు ఏ జంతువులోనో, తుపాకీ కరవాలాల్లోనో, కర్రలూ రాళ్ళలోనో లేవని, ఆ శక్తి, అధికారాలు కేవలం దైవానికే ఉన్నాయని నమ్ముతాడు. ఇంకా ఆయన నిర్ణయించిన మరణ ఘడియకు ముందు, ప్రపంచంలోని శక్తులన్నీ కలిసి ఎవరి ప్రాణాలయినా తీయదలిస్తే, తీయలేరని

గట్టిగా నమ్ముతాడు. ఈ విధంగా రెండో కారణం కూడా తొలగిపోతుంది.

ఈ కారణంగానే అల్లాహ్‌ను విశ్వసించే వ్యక్తికంటే శూరత్వంగల వ్యక్తి ప్రపంచంలో మరొకడెవడూ కాజాలడు. అతని సమక్షంలో కత్తికటారుల ఝుళుపులు, తుపాకి గుండ్ల వర్షం, సైనిక బృందాల ముట్టడి ఏదీ నిలువజాలదు. దైవ మార్గాన, రణరంగంలో ఇతను ప్రవేశించినప్పుడు తనకంటే పది వంతుల శక్తిని నేలమట్టం చేయగలుగుతాడు. బహుదైవారాధకులు, దైవ ధిక్కారులు, నాస్తికులు ఈ శక్తిని ఎలా పొందగలరు? వారికి ప్రాణమే ప్రియతమం,తమ మృత్యువు శత్రువు ద్వారానే సంభవిస్తుందని వారి భావన!

## సంతృప్తి, సంతుష్టి

8. 'లా ఇలాహ ఇల్లల్లాహ్' పట్ల గల విశ్వాసం మనిషిలో తృప్తిని, నిరపేక్షతను జనింపజేస్తుంది. దురాశ, అసంతృప్తి, లోభం, ఈర్ష్య, ద్వేషంలాంటి భావాలను మానవ హృదయం నుండి దూరం చేస్తుంది, తన కోరికల్ని నెరవేర్చుకోడానికి అధర్మమయిన, హేయమయిన విధానాలనవలంబించే ఊహ కూడా ఇతనిలో జనించదు. జీవనోపాధి దేవుని హస్తగతమయి ఉందని, ఆయన తన ఇష్టం ప్రకారం ఒకరికి అధికంగాను మరొకరికి స్వల్పంగాను ప్రసాదించగలడని ఇతని నమ్మకం. గౌరవోన్నతులు, శక్తి, అధికారం, అన్నీ దేవుని స్వాధీనంలో ఉన్నాయని, ఆయన, తాను సముచితమని భావించిన రీతిలో ఎవరికి ఎంత ఇవ్వదలిస్తే అంతే ప్రసాదిస్తాడని ఇతని అభిప్రాయం. ధర్మమయిన రీతిలో కృషి చెయ్యడమేఅతని కర్తవ్యం. జయాపజయాలు, సఫలతా నిష్ఫలితాలు దైవాధీనం. ఆయన అనుగ్రహించ దలిస్తే ప్రపంచంలోని ఏ శక్తి ఆయన్ని ఆపలేదు. ఆయన ఇవ్వదలచకపోతే ప్రపంచంలోని ఏ శక్తి ఆయన్నుండి ఇప్పించజాలదు. ఇది ఇతని విశ్వాసం.

దీనికి భిన్నంగా బహు దైవారాధకులు, దైవ ధిక్కారులు, నాస్తికులు, సఫలతా నిష్ఫలితాలు వారి కృషిపై, ప్రాపంచిక శక్తుల సహకారం, లేక వాటి వ్యతిరేకతలపై ఆధారపడి ఉంటాయని భావిస్తారు. అందువల్ల వారిలో పేరాశ, లోభం తిష్ఠవేసి కూర్చుంటాయి. కార్యం నెరవేరడానికి, లంచం, ముఖస్తుతి, కుతంత్రాలు, ఇంకా నీచమయిన మార్గాలన్నింటినీ అవలంబించటానికి మాత్రం వీరు వెనుదీయరు. ఇతరులకు ప్రాప్తించిన సాఫల్యం పట్ల ఈర్ష్యా ద్వేషాలకు గురయి మండి చస్తారు. వారిని అవమానించేందుకు, కించపరిచేందుకు ఎంతనీచమయిన విధానాన్నయినా అనుసరించడానికి జంకరు.

## దైవ విధేయత

9. అన్నిటికంటే ముఖ్యమయిన విషయమేమంటే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే కలిమా మనిషిని దైవాజ్ఞల్ని పాలించేవానిగా తయారుచేస్తుంది. ఈ వచనం పట్ల నమ్మకం గల మనిషి, దైవానికి అన్నీ తెలుసు అని, గోచరమయినవీ, గోప్యమయినవీ అన్నీ దేవునికి ఎరుకే అని నమ్ముతాడు. ఇంకా ఆయన మనకు మన బృహద్ధమనికంటే కూడా సమీపంలో ఉన్నాడని, మనం కటిక చీకటిలోనూ, ఏకాంత కుహరంలోను అత్యాచారం చేశామంటే దేవుడు దాన్ని తెలుసుకుంటాడని, మన హృదయాంతరాళాల్లో జనించే దురాలోచనకు సంబంధించిన సమాచారం కూడా తక్షణం దైవానికి చేరిపోతుందని అతనికి బాగా తెలుసు.

మనం ఎవరితోనయినా ఏదయినా దాచగలం కాని, దైవంతో ఏదీ దాచలేము. మరే చోటినుంచి అయినా తప్పించుకొని పారిపోగలంకాని దైవ రాజ్యం నుండి తప్పించుకుని పారిపోలేము. అందరినీ తప్పించుకోగలం కాని

దేవుని పిడికిలి నుండి జారుకోలేము. ఈ విశ్వాసం ఎంత పటిష్టమయితే దైవాదేశాలను పాటించడంలో అంతే దృఢమవుతాడు మనిషి. దైవం నిషేధించినవాటి దగ్గరికి కూడా పోడు. ఆయన ఆదేశించిన విషయాన్నయితే ఏకాంతంలోనూ, చీకటిలోనూ ఆచరిస్తాడు. ఎందుకంటే ఎట్టి పరిస్థితిలోనూ వదలి వెళ్ళని పోలీసు అతన్ని వెంబడిస్తూ ఉంటుంది. ఒక న్యాయస్థానం అనునిత్యం అతన్ని భయపెడుతూ ఉంటుంది. దాన్ని తప్పించుకునేందుకు అతను ఈ ప్రపంచం నుంచి ఎక్కడికీ పారిపోలేడు.

అందువల్లనే ముస్లిమవడానికి "లా ఇలాహ ఇల్లల్లాహ్"ను విశ్వసించడమే మొట్టమొదటి నియమం. ముస్లిమంటే, ఇంతకు ముందు వివరించినట్లు దేవుని విధేయుడయిన దాసుడని భావం. అల్లాహ్ తప్ప వేరే ఇతర దైవం లేడని మనిషి గట్టిగా నమ్మనంతవరకు అతడు నిజమయిన దైవ విధేయుడుగా రూపొందడం అసాధ్యం.

మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) బోధించిన విషయాల్లో ఈ దైవ విశ్వాసం అన్నిటికంటే ముఖ్యమయింది, మౌలికమయినది. ఇదే ఇస్లాం బోధనల కేంద్రం, మూలాధారం, శక్తి సరోవరం. ఇస్లాం బోధించే తతిమ్మా విశ్వాసాలు, ఆదేశాలు, శాసనాలు అన్నీ ఈ మౌలిక విషయంపైనే ఆధారభూతమయి ఉన్నాయి. వీటన్నిటికీ శక్తి ఈ కేంద్రం నుంచే సరఫరా అవుతుంది. దీన్ని తొలగిస్తే "ఇస్లామ్" అన్నదే శూన్యం.

## దైవదూతల ఎడల విశ్వాసం

దైవ విశ్వాసానికి తరువాత మహా ప్రవక్త(సఅసం) బోధించిన రెండో విశ్వాస అంశం దైవ దూతల ఎడల విశ్వాసం. ఈ విశ్వాసం వల్ల ముఖ్య ప్రయోజనమేమంటే ఏకేశ్వరవాదంలో బహు దైవారాధనా కాలుష్యం కలిసే

ప్రమాదం ఉండదు. అది స్వచ్ఛంగా సురక్షితంగా ఉంటుంది.

ఇంతకు ముందు పరిశీలించినట్లు బహు దైవారాధకులు సృష్టిలోని రెండు రకాల శక్తుల్ని దైవత్వంలో సహవర్తులుగా భావించారు. ఒకటి, గోచర సృష్టిరాశి. ఉదాహరణకు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్ని, నీరు, గతించిన పుణ్యపురుషులు మొదలయినవారు. రెండవది, అగోచర సృష్టిరాశి. అంటే శారీరకంగా ఉనికి లేనివి. ఈ శక్తులు గోప్యంగా విభిన్న విశ్వ కార్యకలాపాలను నడిపిస్తుంటాయి. ఉదాహరణకు గాలిని వీచేలా చేసేవి, నీటిని కురిసేలా చేసేవి, వెలుతురును ప్రసరించేలా చేసేవి. ఈ రెండు రకాల శక్తుల్లో మొదటిది మనిషి కళ్ళ ఎదుటనే ఉండటం మూలాన వీటి దైవత్వాన్ని నిరాకరించడం సులువు. అది "లా ఇలాహ ఇల్లల్లాహ్" లోనే ఇమిడి ఉంది. కాని రెండో రకం శక్తులు మర్మంగా ఉన్నాయి. బహు దైవారాధకులు అధికంగా వీటినే నమ్ముతారు. ఇవే దేవతలని, దైవాలని, దేవుని సంతానమని భావిస్తారు. వాటి కాల్పనిక విగ్రహాలు తయారుచేసి వాటికి అర్చనలు, నైవేద్యాలు సమర్పిస్తారు. కనుక తౌహీద్(ఏకేశ్వరవాదం)ను, షిర్క్ (బహుదైవవాదం)లోని ఈ రెండో విభాగాన్నుండి రక్షించడానికి ఓ ప్రత్యేక విశ్వాసాంశాన్ని చేర్చడం ప్రయోజనకరమయింది.

## వీరెవరు?

మహా ప్రవక్త(సఅసం) బోధనలేమంటేః మీరు దైవం, దేవతలు, దైవ సంతానమని భ్రమపడే ఈ అగోచర తేజోమయ జీవాలు వాస్తవానికి దైవ దూతలు(ఫరిష్తాలు, మలాయికా). వీరికి దైవత్వంలో ఎలాంటి భాగస్వామ్యమూ లేదు. వీరంతా దైవ విధేయులు మాత్రమే. దైవాజ్ఞను అణుమాత్రమైనా జవదాటని దాసులు. దేవుడు తన ప్రభుత్వనిర్వహణలో వీరిని ఉపయోగించు

కుంటాడు. వీరు దైవాజ్ఞల్ని పొల్లుపోకుండా పాటిస్తూ ఉంటారు. వీరికి తమ ఇష్టంతో పనిచేసే అధికారమే ఉండదు. స్వశక్తిపై ఆధారపడి దైవం సమక్షంలో ఎలాంటి ప్రతిపాదనను చెయ్యలేరు. దైవం ఎదుట ఎవరి సిఫారసు కూడా చెయ్యలేరు. ఎలాంటి అధికారమయినా, సాహసమయినా వీరికి లేదు. ఇలాంటివారిని ఆరాధించడంగాని, వీరి సహాయాన్ని అర్థించడం గాని మానవునికి అవమానకరం. ఎందువల్లనంటే ఆదిలో తొలి మానవుడయిన ఆదమ్ (అలైహిస్సలాం) ఎదుట వీరిచేత సజ్దా (లొంగుబాటు) చేయించాడు అల్లాహ్. వీరికన్నా అధిక జ్ఞానాన్ని ఆదమ్ (అలైహిస్సలాం)కు ప్రసాదించాడాయన. వీరిని కాదని ఆదమ్(అలైహిస్సలాం)కు భువిపై తన ప్రాతినిధ్యాన్ని అనుగ్రహించాడు. దైవ దూతల చేత ప్రణామం చేయించుకున్న మానవుడు తిరిగి వారి ఎదుటనే సాష్టాంగపడటం, వారినే అర్థించడంకన్నా అవమానం, అప్రతిష్ఠ వేరే ఏమున్నాయి.

మహాప్రవక్త (సఅసం) ఒక వైపున దైవదూతల్ని ఆరాధించడం, వారిని దైవత్వంలో భాగస్వాములుగా, సహవర్తులుగా భావించడం నిషిద్ధాలుగా ప్రకటించారు. మరోవైపున వారిని గురించి ఇలా బోధించారు: దైవదూతలు దేవుని ఉత్తమ సృష్టిరాశికి చెందినవారు, దోషరహితులు, స్వచ్ఛమయినవారు, నిష్కల్మషమయినవారు, తమ నైజం రీత్యా వారు దైవాజ్ఞల్ని ధిక్కరించలేరు. నిత్యం దైవోపాసన, దైవనామ సంకీర్తనలో నిమగ్నులయి ఉంటారు. వీరిలోని ఓ ప్రత్యేక దూత ద్వారానే అల్లాహ్ తన ప్రవక్తలకు తన సందేశాన్ని "వహీ" (దైవవాణి) రూపేణ అందజేస్తాడు. ఈ దైవదూత పేరు జిబ్రయీల్ (అలైహిస్సలాం). మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) పై జిబ్రయీల్ ద్వారానే దివ్య ఖుర్‌ఆన్ వహీగా అవతరించింది.

ఈ దైవదూతల్లోనే కొందరు మానవులమయిన మనతో బాటు ఉంటూ మన మంచి కర్మల్ని, చెడు కర్మల్ని గమనిస్తూ, మన మంచి మాటల్ని చెడు మాటల్ని వింటూ వీటన్నింటినీ గ్రంథస్తం చేస్తూ ఉంటారు. వీరి వద్ద ప్రతి వ్యక్తి జీవితపు భోగట్టా అంతా భద్రంగా రికార్డయి ఉంటుంది. మరణానంతరం మనం దైవం సమక్షంలో హాజరయినప్పుడు వీరు మన కర్మపత్రాన్ని దైవానికి సమర్పిస్తారు. అందులో మనం జీవితాంతం గోప్యంగాను, బహిరంగంగాను చేసిన మంచీ చెడు కార్యాలన్నీ గ్రంథస్థమై ఉంటాయి.

దైవ దూతల పట్ల, వారి ఉనికి పట్ల ఇంకా ఇతర వివరాలు తెలుపలేదు మహాప్రవక్త (సఅసం). కేవలం వారి గుణవిశేషాలే తెలిపి వారి ఉనికిని నమ్మవలసిందిగా ఆదేశించారు. వారెలా ఉంటారో మరెలా ఉండరో తెలుసుకునే ఏ సాధనమూ మన వద్ద లేదు. అందువల్ల మనం కేవలం మన బుద్ధినుపయోగించి వారి వ్యక్తిత్వం పట్ల ఏదయినా ఊహించడం, దానికి ఓ రూపకల్పన చెయ్యడం అజ్ఞానం తప్ప మరేమీ కాదు. వారి ఉనికిని నిరాకరించడం కుఫ్ర్ (దైవ ధిక్కారం, విశ్వాస రాహిత్యం) అవడంలో సందేహంలేదు. ఎందుచేత నంటే, వారి ఉనికిని కాదనే ఆధారం ఎవరి వద్దనూ ఏదీ లేదు. అలాంటప్పుడు వారిని తిరస్కరించేవారు వాస్తవానికి మహాప్రవక్త (సఅసం) అబద్ధమాడారని ఆరోపిస్తున్నారన్నమాట! (దైవం మన్నించుగాక!). వారిని గురించి దేవుని నిజ సందేశహరులు మనకు తెలిపిన కారణాన మనం వారిపట్ల నమ్మకం కలిగి ఉండాలి.

## దైవ గ్రంథాల పట్ల విశ్వాసం

మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) మనకు బోధించిన మూడవ విశ్వాసాంశం, దైవం తన ప్రవక్తలపై అవతరింపచేసిన గ్రంథాలను విశ్వసించడం.

ముహమ్మద్ (సఅసం)పై దేవుడు ఏ విధంగా దివ్య ఖుర్‌ఆన్‌ని అవతరింపజేశాడో అదే విధంగా ఆయనకు ముందు ప్రభవించిన దైవ సందేశహరులపై కూడా ఆయన తన గ్రంథాలను అవతరింపజేశాడు. వాటిలో కొన్నింటి పేర్లు మనకు తెలుపబడ్డాయి, ఉదాహరణకు 'సుహుఫె ఇబ్రాహీం' దేవుని ప్రవక్త ఇబ్రాహీం (అస్సలాం)పై అవతరించాయి. మూసా (అస్సలాం)పై అవతరించిన గ్రంథం పేరు "తౌరాత్" (Torah), దావూద్ (అస్సలాం)పై అవతరించిన గ్రంథానికి 'జబూర్' (Pslams) అని, ఈసా (అస్సలాం)పై అవతరించిన గ్రంథానికి ఇంజీల్ (Gospel) అనీ పేరు. ఇవికాక వేరే ప్రవక్తలకు ప్రసాదించబడిన ఇతర గ్రంథాల పేర్లు మనకు తెలుపడం జరగలేదు. అందువల్ల ఇతర మత గ్రంథాలను గురించి అవి దైవ గ్రంథాలో కావో ఇదమిత్థంగా చెప్పడం సాధ్యపడదు. కాని దేవుని తరఫున పంపబడిన గ్రంథాలన్నీ సత్యమైనవేనని, ధర్మమైనవేనని మనం నమ్మాలి.

మనకు పేర్లు తెలుపబడిన గ్రంథాల్లో ప్రస్తుతం ప్రపంచంలో "సుహుఫె ఇబ్రాహీం" అన్నదాని జాడ ఎక్కడా లేదు. ఇకపోతే తౌరాత్, జబూర్, ఇంజీల్ గ్రంథాలు ఇవి మాత్రం యూదులు, క్రైస్తవుల వద్ద ఉన్నాయి. అయితే ఈ దైవ గ్రంథాల్లో ప్రజలు ఎన్నో ప్రక్షిప్తాలు, మార్పులు, చేర్పులు చేశారని దివ్య ఖురాన్ మనకు తెలుపుతోంది. స్వయంగా క్రైస్తవులు, యూదులు కూడా అసలు మూల గ్రంథాలు తమ వద్ద లేవని, తమ వద్ద ఉన్నవి కేవలం వాటి అనువాదాలు మాత్రమే అని, వాటిలో శతాబ్దాల కాలంలో అనేక సవరణలు జరుగుతూ వచ్చాయని, ఇంకా జరుగుతూనే ఉన్నాయని అంగీకరిస్తారు. ఆ గ్రంథాలను పఠించినా, వాటిలో దైవ వచనాలు కానేరని ఎన్నో విషయాలు ఉన్నట్లు స్పష్టంగా తేలిపోతుంది.

ఈ విధంగా ఇప్పుడు, దైవ గ్రంథాలుగా మిగిలిపోయిన గ్రంథాలు

కూడా పూర్తిగా సరయిన దైవ గ్రంథాలు కావు. వీటిలో దైవ వచనాలు, మానవ కల్పితాలు కలగాపులగమయ్యాయి. వాటిలో దైవ వాక్కు ఏదో, మానవ మాటలేవో గుర్తుపట్టే సాధనం మనవద్ద ఏదీ లేదు. అందువల్ల వెనుకటి గ్రంథాలను విశ్వసించాలి అన్న దైవాదేశానికి భావమేమంటే, ప్రపంచంలోని ప్రతి జాతిలోను, ప్రతి దేశంలోను, దివ్య ఖురాన్‌కు ముందు కూడా దైవం తన ఆదేశాలను తన ప్రవక్తల ద్వారా అందజేసే ఏర్పాటు చేశాడు. అవన్నీ దివ్య ఖుర్‌ఆన్‌ని అవతరింపజేసిన ఆ దైవంచేత పంపబడిన గ్రంథాలే, ఆదేశాలే. ఈ కారణం చేత ఖురాన్ ఓ కొత్త సందేశాన్ని అందజేసే విచిత్రమయిన గ్రంథమేమీ కాదు. గతంలో ప్రజలకు గ్రంథం ప్రాప్తంకాగా వారు దాన్ని కోల్పోయి, లేక వారందులో ప్రక్షిప్తాలు చేసి లేక అది మానవ రచనలతో కలిసిపోయి వికృతంగా తయారయినందున ఆ గ్రంథాల్లోని నిజ బోధనలకే కొత్తగా జీవం ప్రసాదించడానికి ఆవిర్భవించిన గ్రంథమిది.

# దివ్య ఖుర్‌ఆన్

పవిత్ర ఖుర్‌ఆన్ దైవం పంపిన అంతిమ గ్రంథం, దీనికి గత దైవ గ్రంథాలకూ గల వ్యత్యాసాన్ని పరిశీలిస్తే ఈ విధంగా తేలుతుంది:

1. పూర్వం అవతరించిన దాదాపు అన్ని గ్రంథాల మూల ప్రతులు నేడు కానరాకుండా ఉన్నాయి. నేడున్నవి కేవలం వాటి అనువాదాలే. కాని దివ్య ఖుర్‌ఆన్ ఏ పదాల్లో అవతరించిందో సరిగ్గా ఆ పదాల్లోనే నేటికీ సురక్షితంగా ఉంది. అందులోని ప్రతి అక్షరం పొల్లుపోకుండా యథాతథంగా ఉంది.

2. వెనుకటి గ్రంథాల్లోని దైవ వచనాలతోపాటు తమ రచనల్ని

సయితం ప్రజలు జత చేశారు. ఒకే గ్రంథంలో దైవాదేశాలూ ఉన్నాయి, ఆ జాతి ఇతిహాసమూ ఉంది; ఇంకా పూర్వుల జీవిత వివరాలూ ఉన్నాయి; వీటన్నిటితోపాటు దైవాదేశాల వ్యాఖ్యానమూ, ధర్మవేత్తల శాసనాంగానికి సంబంధించిన నిర్ణయాలూ ఉన్నాయి. ఇవన్నీ కలగాపులగమయ్యాయి. వీటిలో నుంచి దైవ వచనాలను వేరుచెయ్యడం అసాధ్యం. కాని దివ్య ఖుర్‌ఆన్‌లో అలా కాదు. అందులో కేవలం దైవ వచనాలే లభిస్తాయి. అందులో మరెవరి రచన అయినా ఏ మాత్రమూ కలవలేదు. దివ్య ఖుర్‌ఆన్ వ్యాఖ్యానాలు (తఫ్‌సీర్) మహాప్రవక్త (సఅసం) ప్రవచనాలు (హదీసులు) ఆయన ఆదర్శ జీవితం (సీరత్), ధర్మశాస్త్రం (ఫిక్హ్), ప్రవక్త సహచరుల జీవిత వివరాలు (సహాబా సీరత్), ఇస్లామీయ చరిత్ర ఇత్యాది విషయాల మీద ముస్లింలు రచించినదంతా ప్రత్యేక గ్రంథాల రూపంలో వేర్వేరుగా ఉన్నాయి, పవిత్ర ఖుర్‌ఆన్‌లో వీటిలోని ఏ ఒక్క పదమూ చేరలేదు.

## చారిత్రక ప్రమాణాలు

3. ప్రపంచంలోని వివిధ జాతుల్లో ఉన్న మత గ్రంథాల్లో దేన్నయినా, దానితో సంబంధంకల ప్రవక్తపై అది అవతరించినట్లు చారిత్రక నిదర్శనాలతో రుజువు చెయ్యడం అసాధ్యం. ఇంకా, కొన్ని కొన్ని మత గ్రంథాలైతే ఏ కాలంలో, ఏ ప్రవక్తపై అవతరించాయన్న విషయమూ ఎవరికీ తెలియదు. కాని దివ్య ఖుర్‌ఆన్ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై అవతరించిందనే విషయాన్ని శంకించడం దుర్లభం. ఎందుకంటే దాని అవతరణకు సంబంధించిన విషయంలో బలమైన చారిత్రక సాక్ష్యాలు, నిదర్శనాలూ ఉన్నాయి. చివరికి దానిలోని ఏ ఆయత్ (వచనం) ఎప్పుడు, ఎక్కడ అవతరించిందో కూడా స్పష్టంగా తెలిసిన విషయమే.

4. గత గ్రంథాలు అవతరించిన భాషలు చాలా కాలంగా మృత భాషలుగానే మిగిలాయి. ఆ భాషల్ని మాట్లాడేవారు ఇక ప్రపంచంలో ఎక్కడా లేరు. వాటిని అర్థం చేసుకోగలవారు సయితమూ చాలా కొద్దిమంది మాత్రమే. ఇలాంటి గ్రంథాలు ఒకవేళ తమ నిజ స్వరూపంలో ఉన్నప్పటికీ అవి బోధించే ఆదేశాలను అర్థం చేసుకోవటమూ వాటి ప్రకారం ఆచరించడమూ దుర్లభం. కాని ఖుర్‌ఆన్ అవతరించిన భాష సజీవ భాష. అది నేటికీ కోట్లాది ప్రజల మాతృ భాష. కోటానుకోట్ల ప్రజలు ఆ భాష మాట్లాడగలరూ, అర్థం చేసుకోగలరు కూడా. దాన్ని నేర్పే ఏర్పాటు నేటికీ ప్రపంచంలో ప్రతి చోటా ఉంది. దాన్ని ప్రతి వ్యక్తి నేర్చుకోగలడు. అప్పటికీ ఎవరికయినా దాన్ని నేర్చుకునే తీరిక లేకుంటే అతనికి దివ్య ఖుర్‌ఆన్ వచనాల భావాన్ని బోధించే సామర్థ్యం గల వ్యక్తి ప్రపంచంలో ప్రతి చోటా లభిస్తాడు.

## సార్వజనీనం

5. ప్రపంచంలో వివిధ జాతుల వద్ద ఉన్న మత గ్రంథాల్లో ప్రతి దానిలోనూ ఓ ప్రత్యేక జాతిని సంబోధించడం జరిగింది. ప్రతి గ్రంథంలోనూ ప్రత్యేక కాలపరిస్థితుల అవసరాలకు తగినటువంటి ఆదేశాలనే బోధించటం జరిగింది. నేడు ఆ అవసరాలూ లేవు, ఆ ఆదేశాలను నేడు అమలు జరపడమూ సాధ్యం కాదు. అంటే ఆ గ్రంథాలన్నీ వేర్వేరు జాతులకై ప్రత్యేకంగా పంపబడ్డాయన్న మాట. వీటిలో ఏదీ మొత్తం ప్రపంచానికై అవతరించలేదు. ఇంకా, అవి ఏ జాతుల్లో అవతరించాయో వాటికై కూడా ఎల్లప్పటికీ కాక ఓ ప్రత్యేక కాలానికై మాత్రమే అవి వచ్చాయి. దివ్య ఖుర్‌ఆన్‌ని పరిశీలిస్తే అది అలా కాదు. ఈ గ్రంథంలో ప్రతి చోటా మానవుణ్ణి సంబోధించడం జరిగింది. దీని ఏ వచనాన్ని గమనించినా అది ఓ ప్రత్యేక

జాతికై పంపబడిందన్న సంశయం కలగదు. ఈ గ్రంథంలో బోధించబడిన ఆదేశాలన్నీ ప్రతి కాలంలోను, ప్రతి చోటా అనుసరణీయాలే. ఇందువల్ల దివ్య ఖుర్‌ఆన్, యావత్తు ప్రపంచం కొరకు, సకల కాలాలకై అవతరించిందన్న విషయం సందేహరహితంగా రుజువయిందన్నమాట.

## సమగ్రం, సమంజసం

6. వెనుకటి గ్రంథాల్లో కూడా సత్యాన్నే, సన్మార్గాన్నే బోధించడం జరిగింది. సత్ప్రవర్తన, సత్యసంధతలనే నేర్పడం జరిగింది. దైవ సమ్మతి ప్రకారం జీవితం గడిపే విధానమే సూచించటం జరిగింది. అయితే ఈ మంచి విషయాలన్నీ ఒక్క విషయమూ వదలకుండా ఒకే చోట సంగ్రహపరచడ మన్నది వీటిలో ఏ ఒక్క గ్రంథంలోనూ జరగలేదు, ఇది కేవలం దివ్య ఖుర్‌ఆన్‌లో మాత్రమే ప్రాప్తమవుతుంది. వేర్వేరుగా ఉన్న పూర్వ గ్రంథాల్లోని సద్గుణాలన్నీ ఇందులో ఒక్కచోట సమీకరించడం జరిగింది. గత గ్రంథాల్లో వదలివేసిన మంచి మాటలన్నీ ఇందులో చేర్చడమూ జరిగింది.

7. మత గ్రంథాలన్నిటిలోనూ మానవుల మార్పులు చేర్పుల వల్ల యదార్థానికి విరుద్ధమయిన, అహేతుకమయిన అత్యాచారం, అన్యాయాలతో కూడుకున్న ఎన్నో విషయాలు కలసిపొయ్యాయి. వీటి వల్ల మనిషి విశ్వాసాలు, ఆచరణలు రెండూ చెడిపోతాయి. కొన్ని గ్రంథాల్లోనయితే అశ్లీలమయిన, నీతిబాహ్యమయిన విషయాలు సయితమూ దొరుకుతాయి. పవిత్ర ఖుర్‌ఆన్ ఇవన్నీ లేకుండా స్వచ్ఛంగా పరిశుద్ధంగా ఉంది. ఇందులో, హేతుబద్ధంకాని, నిదర్శనాల ద్వారా, అనుభవం ద్వారా తప్పుగా రుజువుకాగల విషయమేదీ లేదు. దీని ఏ ఆదేశంలోనూ అన్యాయమంటూ కానరాదు.

దీనిలో సూచించబడిన ఏ విషయమూ మనిషిని పెడత్రోవన పడవెయ్యదు. అశ్లీలమయిన, నీతిబాహ్యమయిన విషయాల గాలి కూడా దీనికి సోకలేదు. తొలి నుంచి తుది వరకు ఇందులో ఉన్నదంతా – ఉన్నత విజ్ఞాన వివేకాలు, నీతినిజాయితీల బోధనలు, సత్యం, న్యాయం, సన్మార్గాల ఉపదేశాలు, ఉత్తమ శాసనాలు, ఆదేశాలు వెల్లివిరిసే వచనాలే.

ఈ ప్రత్యేకతలు, ఈ విశేష లక్షణాల కారణంగానే ప్రపంచంలోని జాతులన్నిటికీ ఖుర్‌ఆన్‌ను విశ్వసించవలసిందిగా, ఇతర గ్రంథాలన్నింటినీ వదలి కేవలం ఈ గ్రంథాన్ని ఒక్కదాన్నే అనుసరించవలసినదిగా ఆదేశించడం జరిగింది. ఎందుకంటే దైవేచ్ఛ ప్రకారం మనిషి జీవితం గడపడానికి కావలసిన బోధనలన్నీ – ఒక్కటీ వదలకుండా – ఇందులో పొందుపరచ బడ్డాయి. ఈ గ్రంథం అవతరించిన మీదట మరో గ్రంథం అవసరమే లేదు.

## అనుసరణీయం

దివ్య ఖుర్‌ఆన్ మరియు ఇతర గ్రంథాల మధ్యగల వ్యత్యాసాన్ని అర్థం చేసుకున్న తరువాత ఖుర్‌ఆన్‌ని విశ్వసించడంలోను, ఇతర గ్రంథాలను విశ్వసించడంలోను గల వ్యత్యాసం అవలీలగా బోధపడుతుంది. వాటిని విశ్వసించడమంటే రూఢీపరచడం మాత్రమే అన్నమాట. అంటే అవన్నీ దైవం పంపినవే, ధర్మమయినవే, దివ్య ఖుర్‌ఆన్ ఏ అవసరం కొరకు అవతరించిందో ఆ అవసరం కొరకు అవతరించినవే అని నమ్మడం అన్నమాట. ఐతే దివ్య ఖుర్‌ఆన్‌ని విశ్వసించడమంటే, ఇది స్వచ్ఛమయినదని, పరిపూర్ణమయిన, ధర్మమైన వచనమని, దీని ప్రతి మాట పొల్లుపోకుండా సురక్షితంగా ఉందని, దీని ప్రతి మాట సత్యమయినదని, దీని ప్రతి ఆదేశాన్ని అనుసరించడం మానవుల విద్యుక్త ధర్మమని ఖుర్‌ఆన్‌కు ప్రతికూలమయిన

ప్రతి మాట తిరస్కారయోగ్యమైనదనీ విశ్వసించడమన్న మాట.

## దైవ సందేశహరుల పట్ల విశ్వాసం

దైవ గ్రంథాల పట్ల విశ్వాసానికి తరువాత సకల దైవ ప్రవక్తల్ని విశ్వసించవలసినదిగా ఆదేశించడం జరిగింది.

దైవ ప్రవక్తలు ప్రపంచంలోని జాతులన్నిటిలోనూ ఆవిర్భవించారు. వారందరూ అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) బోధించిన ఇస్లామ్ ప్రబోధాలనే ఉపదేశించారని మనం వెనుకటి పుటల్లో తెలుసుకున్నాము. తదనుసారంగా దైవ ప్రవక్తలందరూ ఒకే వర్గానికి చెందినవారు – అది దైవ సందేశహరుల వర్గం. ఎవరయినా వీరిలో ఏ ఒక్కరినయినాసరే తృణీకరించినట్లే. అలాగే ఎవరయినా వీరిలో ఏ ఒక్కరిని స్వీకరించినా మిగతా వారినందరినీ స్వీకరించడం కూడా తప్పనిసరి అవుతుంది.

ఇది సమంజసం సహేతుకం కూడా. పదిమంది ఒకే మాటను పలుకుతారనుకుందాము. వారిలో ఏ ఒక్కరినయినా సత్యవంతులని ఒప్పుకున్నా మిగతా 9 మందిని సత్యవంతులని స్వీకరించినట్లే. ఒకవేళ వారిలో ఏ ఒక్కరినయినా తృణీకరించినట్లయితే, అతను పలికే మాటను సయితం తృణీకరించినట్లవుతుంది. గనుక అందరినీ తృణీకరించినట్లే, అందువల్లనే ప్రవక్తలందరినీ విశ్వసించడం ఇస్లాంలో అత్యావశ్యకం. ఏ ఒక ప్రవక్తను విశ్వసించని వ్యక్తిఅయినా అతను మిగతా ప్రవక్తలందరినీ విశ్వసించినప్పటికీ ఇస్లాం ప్రకారం "విశ్వసించని వ్యక్తి" లేక తిరస్కారిగానే పరిగణించబడతాడు.

# పూర్వ ప్రవక్తలు

మహనీయ ముహమ్మద్ (సఅసం) ప్రవచనాలయిన హదీసుల్లో ప్రపంచం మొత్తాన వివిధ జాతుల్లో ప్రభవింపజెయ్యబడిన దైవ సందేశహరుల సంఖ్య లక్షా ఇరువయినాలుగు వేలని ఉంది. ఈ లోకంలో మనిషి ఎప్పటి నుంచి నివసిస్తున్నాడో, ప్రపంచంలో ఇంతవరకు ఎన్ని జాతులు గతించాయో తెలుసుకుంటే ఈ సంఖ్య అంతగా అధికమని తోచదు. ఈ లక్షా ఇరవయి నాలుగువేల ప్రవక్తల్లో ఎవరి పేర్లయితే దివ్య ఖుర్ఆన్‌లో తెలుపబడ్డాయో వారిని స్పష్టంగానే నమ్మవలసి ఉంటుంది. మిగతా ప్రవక్తలు కూడా దైవ దాసులయిన మానవుల శిక్షణకై పంపబడినవారని, వారంతా సత్యవంతులని విశ్వసించాలి. కనుక భారత దేశం, చైనా, ఈరాన్, ఈజిప్టు, ఆఫ్రికా, యూరోపు ఇంకా ప్రపంచంలోని ఇతర దేశాల్లోనూ దైవ సందేశహరులు ఆవిర్భవించి ఉంటారు. వారందరి పట్ల విశ్వాసం కలిగి ఉండాలి. అయితే అక్కడి ఏ ప్రత్యేక వ్యక్తిని గురించి అయినా ఆయన దైవ సందేశహరుడా? కాదా? అని మాత్రం ఖచ్చితంగా చెప్పలేము. ఎందుకంటే మనకు ఆయన గురించి ఇదమిత్థంగా తెలుపడం జరుగలేదు.

ఈ సందర్భంలో గమనించవలసిన విషయమేమంటే వివిధ మతాలను అనుసరించేవారు తమ గురువులుగా, నాయకులుగా, మత ప్రముఖులుగా భావించేవారి పట్ల ప్రతికూలంగా ఏదీ, ఎవరూ చెప్పరాదు. అలా వ్యాఖ్యానించడం ధర్మ విరుద్ధం, ఇస్లాం విరుద్ధం. వారు నిజానికి దైవ ప్రవక్తలయి ఉండవచ్చు. వారు గతించిన తరువాత వారి అనుచరులు వారు బోధించిన ధర్మాన్ని – ప్రవక్త మూసా (Moses), ప్రవక్త ఈసా (Jesus) అనుచరుల మాదిరిగా – మార్చివేసి వికృతం చెయ్యడమూ సంభావ్యమే, అందువల్ల మనం వ్యక్తం

చేసే అభిప్రాయాలు కేవలం నేడు వారి అనుచరులు అవలంబిస్తున్న సిద్ధాంతాలు, ఆచరిస్తున్న ఆచార వ్యవహారాల వరకే పరిమితమయి ఉంటాయి. పూర్వపు ఆ మత గురువుల పట్ల మనం మౌనం వహించడమే ధర్మమయిన విషయం. లేకపోతే మనకు తెలియకుండానే దైవ ప్రవక్తల పట్ల మనం అపచారం చేసినట్లవుతుంది.

## మహాప్రవక్త (సఅసం)

పూర్వపు ప్రవక్తలందరూ సత్యవంతులయినవారే అని, దైవం పంపగా వచ్చినవారే అని, ఇస్లాం మార్గాన్ని చూపినవారే అని విశ్వసించడం అవసరం. ఈ విషయాల్లో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మరియు ఇతర ప్రవక్తలందరూ సమానులే. అయినప్పటికీ మహనీయ ముహమ్మద్(సఅసం) కు మరియు ఇతర ప్రవక్తలకు మూడు విషయాల్లో వ్యత్యాసం ఉంది.

ఒకటి, గతంలో వచ్చిన ప్రవక్తలందరూ ప్రత్యేక జాతుల్లో ప్రత్యేక కాలానికిగాను ఆవిర్భవించారు. అయితే మహాప్రవక్త (సఅసం) ప్రపంచం మొత్తానికి, అన్ని కాలాలకుగాను పంపబడ్డారు. వెనుకటి పుటల్లో ఈ అంశాన్ని పరిశీలించాము.

రెండు, గత ప్రవక్తల బోధనలు ప్రపంచంలో కానరాకుండా సమసిపొయ్యాయి. ఏ కొద్ది గొప్పో ఉన్నా అది తన నిజస్వరూపంలో సురక్షితంగా లేదు. అలాగే ప్రవక్తల జీవిత వివరాలు కూడా ఎక్కడా సరైన స్థితిలో ప్రాప్తం కావు. వాటిపై కట్టుకథల తెరలెన్నో పడివున్నాయి. దీని మూలాన ఆ ప్రవక్తల్ని ఎవరైనా అనుసరించగోరినా అది సాధ్యపడదు. దీనికి భిన్నంగా జగన్నాయకులు ముహమ్మద్ (సఅసం) బోధనలు, ఆయన జీవిత చరిత్ర, ఆయన ప్రవచనాలు, ఆయన ఆచార సంప్రదాయాలు,

ఆయన ప్రవర్తన, ఆయన అలవాట్లు, ఆయన గుణగణాలు - ఒక్కటేమిటి? ఆయనకు సంబంధించిన ప్రతి విషయం పరిపూర్ణంగా సురక్షితంగా ఉంది. ఈ కారణంచేత దేవుని సందేశహరుల్లో మహాప్రవక్త (సఅసం) ఒక్కరు మాత్రమే తన సజీవబోధనల దృష్ట్యా అమర ప్రవక్త - ఆయన్ని మాత్రమే అనుసరించడం సాధ్యం.

మూడు, వెనుకటి ప్రవక్తల ద్వారా అందజెయ్యబడిన ఉపదేశాలు, బోధనలు అసంపూర్ణమయినవి. ప్రతి ప్రవక్త తరువాత మరో ప్రవక్త వచ్చి వెనుకటి సందేశాల్లోని ఆదేశాల్లో, శాసనాల్లో, బోధనల్లో హెచ్చుతగ్గులు చేస్తూవచ్చారు, ఈ విధంగా సవరణలు, సంస్కరణలు, వృద్ధివికాసాలు జరుగుతూ వచ్చాయి. అందువల్లనే ఆ ప్రవక్తల బోధనల్ని, ఉపదేశాల్ని నిర్ణీత కాలం తరువాత భద్రపరిచే ఏర్పాటు చెయ్యలేదు దైవం. ఎందుకంటే ఆ కాలానికి సరిపోయే సంపూర్ణ బోధనలు అవతరించిన పిదప గతించిన అసంపూర్ణ బోధనల ఆవశ్యకత ఏ మాత్రం ఉండదు. చివరికి దేవుని అంతిమ సందేశహరులు ముహమ్మద్(సఅసం) ద్వారా సకల విధాల పరిపూర్ణమయిన ఇస్లామ్ బోధనలు పంపడం జరిగింది. దీని అవతరణ తరువాత వెనుకటి ప్రవక్తలందరి శాసనాంగాలు(షరీఅత్‌లు) వాటంతటఅవే రద్దయిపొయ్యాయి. ఎందుకంటే, పరిపూర్ణమైనది ఉండగా దాన్ని వదలి అసంపూర్ణమయిన దాన్ని అనుసరించడం అసమంజసం, నిర్హేతుకం. చివరి ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ను అనుసరించే వ్యక్తి నిజానికి గత ప్రవక్తలనందరినీ అనుసరించా డన్నమాట. ఎందువల్లనంటే ప్రవక్తలందరి బోధనల్లో ఉన్న శుభాలన్నీ మహాప్రవక్త బోధనల్లో పొందుపరచడం జరిగింది. ఆయన్ని వదలి గత ప్రవక్తల్ని అనుసరించే వ్యక్తి ఎంతో మంచిని, ఎన్నో శుభాలను కోల్పోతాడు - కొత్తగా దైవం పొందుపరచిన శుభాలు పూర్వపు బోధనల్లో ఉండవుగనక!

## ఆయన బోధనలే శరణ్యం

ఈ కారణాల వల్ల ప్రపంచంలోని మానవులంతా మహా ప్రవక్త ముహమ్మద్(సఅసం) ను అనుసరించడం తప్పనిసరి అయింది. ఒక వ్యక్తి ముస్లిం అయ్యేందుకు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ను మూడు విధాలుగా విశ్వసించడం అవసరం.

ఒకటి : ఆయన దైవం చేత పంపబడిన నిజ ప్రవక్త.

రెండు : ఆయన బోధించిన ప్రబోధనలు పరిపూర్ణమయినవి. వాటిలో ఎలాంటి కొరతగాని, లోపంగాని లేదు. అవి మచ్చలేని స్వచ్ఛమయిన బోధనలు.

మూడు : ఆయన దేవుని అంతిమ ప్రవక్త, ఆయన తరువాత తుది దినం వరకూ ఏ జాతిలోనూ మరో ప్రవక్త ప్రభవించడు. ముస్లిం అవడానికి ఫలానా వ్యక్తిని అనివార్యంగా విశ్వసించాలని, ఆ వ్యక్తిని విశ్వసించకపోతే మనిషి కాఫిర్ అయిపోతాడని అనుకోడానికి అలాంటి ఏ వ్యక్తీ ప్రభవించడు.

## మరణానంతర జీవితంపట్ల విశ్వాసం

దైవ ప్రవక్తల పట్ల విశ్వాసం తరువాత విధిగా విశ్వసించవలసిన అయిదవ విషయం మరణానంతర జీవితం. మరణానంతర జీవితం విషయంలో ఈ క్రింది అంశాలను విశ్వసించవలసి ఉంటుంది.

1. దేవుడు ఎప్పుడో ఒక రోజు ఈ విశ్వాన్ని, ఇందులో ఉన్న సకల సృష్టిని పూర్తిగా నిర్మూలిస్తాడు. అదే ఖియామత్ (ప్రళయం).

2. తిరిగి ఆయన అందరికీ మరో జీవితం ప్రసాదిస్తాడు. అప్పుడు అందరూ అల్లాహ్ సమక్షంలో హాజరవుతారు, దాన్ని 'హష్ర్' (Ressurrecti..n) అంటారు.

3. మానవులంతా తమ ప్రాపంచిక జీవితంలో చేసిన కర్మలన్నీ ఒక గ్రంథంలో రికార్డు చేయబడుతాయి. తరువాత దాన్ని హశ్ర్ రోజున, దైవ న్యాయస్థానంలో ప్రవేశపెడతారు.

4. మానవులు చేసిన సత్కార్యాలు, దుష్కార్యాలు అన్నీ దైవ సమక్షంలో తూచబడతాయి. దైవ తులామానంలో ఎవరి సత్కార్యాలు వారి దుష్కార్యాలకన్నా బరువుగా ఉంటాయో వారికి మోక్షం అనుగ్రహించబడు తుంది. అలాగే ఎవరి దుష్కార్యాల పళ్ళెం క్రిందికి వంగిపోతుందో వారు శిక్షించబడతారు.

5. రక్షించబడినవారు స్వర్గానికి, శిక్ష వెయ్యబడినవారు నరకానికి పంపబడతారు.

## పరలోక విశ్వాసం – దాని హేతువు

పరలోక విశ్వాసం గురించి మహాప్రవక్త (సఅసం) బోధించినట్లే పూర్వప్రవక్తలందరూ బోధించారు. ప్రతి యుగంలోనూ ముస్లింలు దీన్ని విశ్వసించడం విధిగా ఉంటూ వచ్చింది. దీన్ని తిరస్కరించినవారిని లేక దీనిపై సందేహం వెలిబుచ్చినవారిని తిరస్కారులుగా పరిగణించారు ప్రవక్త లందరూ. ఎందుకంటే దీన్ని కాదని దైవాన్ని, దైవ గ్రంథాల్ని, దైవ దూతల్ని విశ్వసించడం అర్థరహితమే అవుతుంది. అంతేకాదు, ఆ కొరత వల్ల కలిగే దుష్ప్రభావంతో మనిషి జీవితం మొత్తం చెడిపోతుంది.

మీరు కాస్త జాగ్రత్తగా గమనిస్తే ఈ విషయం సునాయాసంగా బోధపడుతుంది. మీకు ఏదయినా పనిచేయమని చెప్పినప్పుడు మీ హృదయంలో తలెత్తే మొదటి ప్రశ్న - ఈ పనిచేస్తే లాభం ఏమిటి? చెయ్యకపోతే కలిగే నష్టం ఏమిటి? అనే కదా. ఈ ప్రశ్న ఎందుకు

ఉత్పన్నమవుతుంది? దానికి కారణం మానవ నైజమే. ఆ పనిలో ప్రయోజనం లేకపోతే అది వ్యర్థమని, నిరర్థకమని భావిస్తుంది మానవ నైజం. ఏదయినా ఒక కార్యం వల్ల ఎలాంటి లాభంలేదని మీరు దృఢంగా విశ్వసిస్తే దాన్ని చేయడానికి ఎన్నటికీ మీరు సిద్ధం కారు. అలాగే ఒక వస్తువు వల్ల నష్టం కలగదని మీకు గట్టి నమ్మకం ఏర్పడితే దాన్ని వదలిపెట్టడానికి మీరు ఏమాత్రం అంగీకరించరు. పోతే అనుమానం విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. ఏదయినా పనిలో లాభం అనుమానాస్పదంగా ఉన్నప్పుడు, ఆ పని పట్ల మీలో ఆసక్తి జనించదు. అలాగే మరేదయినా పనిలో నష్టం సందేహాస్పదంగా ఉంటే ఆ పనిని విసర్జించడానికి కూడా మీరు ప్రత్యేక కృషి చేయరు.

పసిపాపల్ని చూడండి. వారు నిప్పులో చేతులు పెడతారు. ఎందుకు? నిప్పు కాల్చివేస్తుందనే జ్ఞానం దానిపట్ల నమ్మకం వారికి ఉండవు. చదువు సంధ్యలంటే శ్రద్ధచూపక తప్పుకుంటూ ఉంటారు. వారి పెద్దలు చెప్పే విద్యా ప్రయోజనాలు వారి మనసులకెక్కవు. ఇది మానవ నైజం. కాస్త మీరే గమనించండి, మరణానంతర జీవితం పట్ల నమ్మకంలేని వ్యక్తి దైవాన్ని నమ్మడం, ఆయన అభీష్టం ప్రకారం మసలుకోవడం అంతా నిష్ప్రయోజనమనే భావిస్తాడు. అతని ప్రకారం, దైవాజ్ఞాపాలన వల్ల కలిగే లాభమూ లేదు, ఆయన అవిధేయత వల్ల వాటిల్లే నష్టమూ లేదు. అలాంటప్పుడు అతడు, దైవం తన ప్రవక్తలు, తన గ్రంథాల ద్వారా పంపిన మార్గదర్శకత్వాన్ని అనుసరించడం, దైవాదేశాలను పాటించడం ఎలా సాధ్యమవుతుంది? ఇలాంటి వ్యక్తి దైవాన్ని నమ్మినా ఆ నమ్మకం నిరర్థకం. ఎందుకంటే అతడు క్రియాత్మకంగా దైవశాసనాన్ని పాటించడు. దైవేచ్ఛ ప్రకారం జీవితం గడపడు.

# పరలోకంపట్ల విశ్వాసం అవసరమా?

అంతేకాదు, మరణానంతర జీవితం పట్ల విశ్వాసం కలిగి ఉండడమో, విశ్వాసం లేకపోవడమో అన్న విషయం మానవ జీవితంలో నిర్ణయాత్మక మయిన ప్రభావం చూపగలదు. కాస్త లోతుగా పరిశీలించండి. మనిషి ఏ పనినయినా చెయ్యడమో, చెయ్యకపోవడమో అన్న విషయాన్ని దానివల్ల అతనికి కలిగే లాభనష్టాల ఆధారంగా నిర్ణయిస్తాడు, ఇది మానవ సహజ గుణం. ఒక వ్యక్తి దృష్టి ఈ లోకపు లాభనష్టాల వరకే పరిమితమయి ఉంటుంది. ఈ లోకంలో ఎలాంటి ప్రయోజనాన్నయినా సమకూర్చగలదన్న ఆశేలేని ఏ మంచి పనినీ అతడు ససేమిరా చెయ్యడానికి పూనుకోడు. అలాగే ఏ చెడు పని వల్లనయినా ఈ లోకంలో నష్టం వాటిల్లగలదన్న భయమే లేకపోతే దాన్ని వదులుకోడానికి సిద్ధం కాడు. మరో వ్యక్తి దృష్టి తాను చేసే పనుల అంతిమ పరిణామంపై ఉంటుంది. అతడు ప్రాపంచిక లాభనష్టాలు తాత్కాలికమయినవనీ భావిస్తాడు. పరలోకంలో ప్రాప్తమయ్యే శాశ్వత లాభనష్టాల్ని పరిగణనలో తీసుకుని మంచితనాన్నే అవలంబిస్తాడు. చెడు నడతను వదలుకుంటాడు. ఈ లోకంలో అతనికి మంచితనం మూలాన ఎంత నష్టం కలిగినా చెడు నడత వల్ల ఎంత లాభం కలిగినా అతను తన వైఖరిని మార్చుకోడు.

# రెండు విభిన్న దృక్పథాలు

ఇదీ ఈ ఉభయ దృక్కోణాలుగల వ్యక్తుల్లో ఏర్పడే వ్యత్యాసం. ఒక వ్యక్తి అభిప్రాయంలో, ఈ లోకపు స్వల్పమయిన జీవన వ్యవధిలో మంచి ఫలితాన్నిచ్చేదే మంచి కార్యం. ఉదాహరణకు, కొంత డబ్బు చేజిక్కడం, కొంత భూమి ప్రాప్తమవడం, ఏదయినా హోదా లభించడం, ఏవో పేరూ

ప్రతిష్టలు పొందడం,ప్రజలు మెచ్చుకోవడం, కొన్ని రుచులు స్వాదనలు సంప్రాప్తమవడం, కొన్ని కాంక్షలు ఫలించడం, కొన్ని కోరికలు తీరడం - ఇలాంటివాటికి దోహదపడే పనులే అతని దృష్టిలో చెయ్యదగ్గ పనులు.

అలాగే ఈ జీవిత కాలంలో దుష్పరిణామాలు కలిగే ప్రమాదమున్న కార్యాలే దుష్కార్యాలు అతని దృష్టిలో. ఉదాహరణకు, ధనప్రాణాల నష్టం, అనారోగ్యం, అపకీర్తి, ప్రభుత్వం విధించే శిక్ష, పాలకుల వల్ల కలిగే మరేదయినా నష్టం, దుఃఖం బాధ - అతని ప్రకారం, ఇలాంటి వాటికి గురిచేసే పనులే చెయ్యరాని పనులు.

దీనికి భిన్నంగా మరో వ్యక్తి అభిప్రాయంలో దైవం సమ్మతించే, ఆయన ప్రసన్నుడయ్యే కార్యమే సత్కార్యం, దైవం ఇష్టపడని కార్యమే దుష్కార్యం. ఈ ప్రమాణాల రీత్యా సత్కార్యం ద్వారా ఈ ప్రపంచంలో ఎలాంటి లాభం దొరక్కపోయినా, పైగా నష్టమే కలిగినా దాన్ని ఈ వ్యక్తి చెయ్యదగ్గ కార్యమనే భావిస్తాడు. అంతంలో శాశ్వత లాభాన్ని దేవుడు ప్రసాదిస్తాడని నమ్ముతాడు. అలాగే దుష్కార్యాల వల్ల ఈ లోకంలో ఎలాంటి నష్టం కలగకపోయినా, ఏ నష్టం కలిగే ప్రమాదమూ లేకపోయినా పైగా దానివల్ల లాభమే కలిగేలా కనిపించినా దాన్ని ఇతను దుష్కార్యంగానే పరిగణిస్తాడు. ప్రపంచపు స్వల్ప వ్యవధిలో దాని దుష్పరిణామాన్ని, శిక్షను తప్పించుకున్నా, కొంతకాలం స్వేచ్ఛ లభించి రుచులు మరిగినా, చివరికి దైవ సమక్షంలో శాశ్వత నష్టాన్ని, ఆయన శిక్షను తప్పించుకోవడం దుర్లభమని అతడు నమ్ముతాడు.

## రెండు విభిన్న వైఖరులు

ఈ రెండూ రెండు భిన్నమయిన దృక్పథాలు. వీటి ప్రభావం వల్ల

మానవులు రెండు విభిన్నమయిన మార్గాలనవలంబిస్తారు. పరలోకం పట్ల నమ్మకం లేని వ్యక్తి ఇస్లాం చూపే సన్మార్గాన ఒక్కడుగూ వెయ్యజాలడు.

దైవ మార్గంలో అగత్యపరులకు జకాత్★ చెల్లించమని ఇస్లాం ఆదేశిస్తోంది. అప్పుడు "జకాత్ చెల్లిస్తే నా ధనం తగ్గిపోతుంది. నేనయితే ఈ ధనం ద్వారా వడ్డీ వ్యాపారం చేసి ఇంకా అత్యధిక ధనం సంపాదిస్తాను. కోర్టులో వడ్డీ డిక్రీ పొంది తద్వారా నిరుపేదల గుడిసెల్లోని ఒక్కో గడ్డి పోచనుసయితం జప్తు చేయిస్తాను" అని బదులిస్తాడు. నిత్యం సత్యమే పలకమని, సత్యం పలకడం వల్ల నష్టం కలిగినా, అబద్ధం వల్ల లాభం కలిగినా అబద్ధమాడవద్దని ఇస్లామ్ బోధిస్తుంది. అతడు ఇచ్చే సమాధానం ఇదిః "నాకు నష్టం కలిగించే, ఎలాంటి లాభాన్ని చేకూర్చని ఈ "సత్యం" నాకెందుకు? లాభకరమయినటువంటి, ఎలాంటి హాని చెయ్యనటువంటి అసత్యాన్ని నేనెందుకు వదలుకోవాలి?" అతను ఒక నిర్జన మార్గాన పయనిస్తుంటాడు. దారిలో పడివున్న విలువయిన వస్తువు ఏదో అగుపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో, "ఇది నీ సొత్తు కాదు. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ముట్టుకోరాద"ని ఇస్లామ్ శాసిస్తుంది. దానికి అతడు, "ఎలాంటి కష్టం, కృషి లేకుండా దొరికిన దాన్ని నేనెందుకు వదులుకుంటాను? ఈ విషయాన్ని పోలీసులకు చెప్పేవారు, కోర్టులో సాక్ష్యమిచ్చేవారు, నన్ను జనుల్లో అప్రతిష్టపాలు చేసేవారు ఎవ్వరూ లేనప్పుడు దాన్ని నేనెందుకు కాజెయ్యకూడదు?" అనంటాడు. ఎవరయినా ఇతనివద్ద ఏదయినా వస్తువు అమానతుగా భద్రపరచి, ఎవరికీ తెలియకుండా అప్పగించి తరువాత మరణిస్తే అతని వైఖరి ఎలా ఉంటుంది? ఇస్లామ్, "ఈ అప్పగింతను కాజెయ్యకు దాన్ని

---

★ జకాత్= నిర్ణీత పరిమాణం కన్నా అధికంగా ధనం కలవారు చెల్లించవలసిన ధనం.

అతని వారసులయిన అతని భార్యాపిల్లలకు తిరిగి అప్పచెప్పు" అని అంటుంది. అప్పుడు, "ఎందుకు? మరణించినవాని వస్తువు నా వద్ద ఉన్నట్లు ఎలాంటి సాక్ష్యం లేదు. అతని భార్యాపిల్లలకే దాని గురించి తెలీదు. దాన్ని కాజెయ్యటం సులువుగా సాధ్యమయినప్పుడు, కోర్టులో దావా వేసేవారు లేనప్పుడు, నలుగురిలో అపకీర్తిపాలయే భయమూ లేనప్పుడు దాన్ని ఎందుకు స్వాహా చెయ్యకూడదు?" అని బదులిస్తాడతడు.

అంటే జీవితంలో అడుగడుగునా ఇస్లాం అతనికి ఓ మార్గాన్ని అనుసరించేందుకు ఆదేశమిస్తే అతను దానికి పూర్తిగా భిన్నమయిన వ్యతిరేకమయిన వేరే మార్గాన్ని అనుసరిస్తాడు. ఎందుకంటే, ఇస్లాం ప్రకారం, ప్రతి పనికి, పరలోకంలో లభించే శాశ్వత ప్రతిఫలానికనుగుణంగా విలువ ఉంటుంది. కాని ప్రతి వ్యవహారంలోనూ అతని దృష్టి ప్రాపంచిక స్వల్ప జీవన వ్యవధిలో లభించే ఫలితాలపైనే కేంద్రీకృతమై ఉంటుంది.

పరలోకం పట్ల విశ్వాసంలేని వ్యక్తి ముస్లిం అవడం ఎందుకు సాధ్యమవదో ఇప్పుడు మీరు గ్రహించే ఉంటారు. ముస్లిమవడం అలా ఉంచి, మరణానంతర జీవితాన్ని తిరస్కరించే వ్యక్తి నిజానికి, మానవత్వస్థాయి నుండి దిగజారి పశుత్వంకన్నా అధమదశలో పడిపోతాడు.

## పరలోకం – సహేతుక నిర్ధారణ

మరణానంతర జీవితం పట్ల విశ్వాసంలోగల లాభాలు, దాని ఆవశ్యకతను గురించి తెలుసుకున్నాము. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) పరలోకాన్ని గురించి వివరించిన భావనే సహేతుకమయింది అనే విషయాన్ని పరిశీలిద్దాము, దైవ సందేశహరుని పట్ల మనకుగల అచంచల విశ్వాసం కారణంగా ఆయన బోధించినట్లు, మరణానంతర జీవితాన్ని గురించి నమ్మడం సమంజసమే

అయినా మరణానంతర జీవితం పట్ల మన విశ్వాసానికి అదే అసలు మూలాధారమయినా, కాస్త పరిశీలిస్తే ఆయన తెలిపిన భావనే ఇతర భావనలన్నింటికంటే సహేతుకమయిందని బోధపడుతుంది.

## భిన్న దృక్పథాలు

పరలోకం గురించి ప్రపంచంలో మూడు విభిన్న దృక్పథాలున్నాయిః

1. 'మనిషి మరణానంతరం సర్వనాశనమయిపోతాడు. ఆ తరువాత మరో జీవితమంటూ ఏదీ లేదు' అన్నది ఓ దృక్పథం. ఇది నాస్తికుల అభిప్రాయం. వీరు తమ దృక్పథం సశాస్త్రీయమయింది (Scientific) అని కూడా భావిస్తారు.

2. కొందరి నమ్మకం ప్రకారం, మనిషి తన కర్మల ఫలితాన్ని అనుభవించడానికి ఈ ప్రపంచంలోనే పునర్జన్మ పొందుతూ ఉంటాడు. దుష్కర్మలు చేస్తే మరో జన్మలో ఓ జంతువై, పిల్లి, కుక్కలా జన్మిస్తాడు లేక ఓ చెట్టుగా, గుట్టగా మారుతాడు. లేకపోతే అధమ జాతి వ్యక్తిగా పుడతాడు. ఈ దృక్పథం కేవలం వెనుకబడ్డ మతాలలో కానవస్తుంది.

3. మరొక భావన ప్రకారం ప్రళయ దినం, తీర్పు దినం దైవ న్యాయస్థానంలో హాజరవడం, శిక్షనో, బహుమానాన్నో పొందడం విశ్వాస అంశాలు. ఈ భావననే ప్రవక్తలందరూ సమానంగా బోధించారు.

ఇక వివరంగా ఒక్కొక్క దృక్పథాన్నే పరిశీలిద్దాముః

'మరణానంతరం తిరిగి జీవించగా మనమెవ్వరినీ చూడలేదు. మరణించినవారు మట్టిలో కలసిపోవడమే మన అనుదిన అనుభవం, అందువల్ల

మరణానంతరం మరో జీవితం లేనేలేదు' అంటుంది మొదటి దృక్పథం. కాస్త ఆలోచించండి, ఇది కూడా ఓ నిదర్శనమేనా? మరణానంతరం ఎవరినీ తిరిగి జీవించగా చూడకపోతే, "మరణానంతరం ఏమవుతుందో మాకు తెలీదు" అని అనడమే సహేతుకమయిన విధానం. దాన్ని అధిగమించి, "మరణానంతరం ఏమీ జరగదని మాకు తెలుసు" అని వాదించడంలో ఔచిత్యమేముంది? దీనికి హేతువేమిటి? పామరుడెవడయినా విమానాన్ని చూడకపోతే "విమానమేమిటో నాకు తెలీదు" అని మాత్రమే అనగలడు కాని, "నాకు బాగా తెలుసు, విమానమంటూ ఏదీ లేదు" అని అంటే అతడ్ని మీరు మూర్ఖుడని అనరా? ఎందువల్లనంటే, వాస్తవానికి అతడు దాన్ని చూడకపోయి నంత మాత్రాన అది లేనేలేదని భావం కాదు, ఇలా, ఒక్క వ్యక్తేకాదు, లోకంలో ఉన్నవారంతా చూడకపోయినా ఒక వస్తువు అసలు లేదనే వాదన చెయ్యడం శుద్ధ అవివేకం.

## జన్మల చక్రం

రెండో దృక్పథాన్ని తీసుకోండి. దీని ప్రకారం, ప్రస్తుతం మనిషిగా ఉన్న వ్యక్తి వెనుకటి పశు జన్మలో సత్కార్యాలు చేశాడు, కాబట్టి నేడు మనిషిగా పుట్టాడు, నేడు జంతువుగా ఉన్నది, గత జన్మలో మనిషిగా చేసిన దుష్కర్మల మూలాన నేడు జంతువుగా పుట్టింది. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషయినా, మృగమయినా, మ్రానయినా వాస్తవానికి అది గత జన్మ కర్మల ఫలమే.

ఇప్పుడు ఓ ప్రశ్న తలెత్తుతుంది. ఆదిలో ఉండింది ఏమిటి? ప్రారంభం మనిషితో జరిగితే అంతకుముందు అతను ఏ జంతువో, చెట్టో

అయి ఉంటాడని ఒప్పుకోవలసి ఉంటుంది. లేకపోతే అతనికి ఈ మానవ జన్మ లభించడానికి పుణ్యఫలం ఎలా లభిస్తుంది? ఒకవేళ ఆదిలో జంతువో చెట్టో ఉండేదని అనుకుంటే అంతకుముందు అది మనిషిగా ఉండటం అనివార్యం, లేకపోతే ఈ చెట్టు లేక జంతువు ఏ దుష్కర్మకు ఫలితంగా ఈ జన్మనెత్తింది? మొత్తానికి ఈ దృక్పథాన్ని విశ్వసించి సృష్టి ప్రారంభం ఏ విధంగా, ఏ జీవితో జరిగిందో ఇదమిత్థంగా నిర్ణయించడం అసాధ్యం. ఎందుకంటే ప్రతి జీవానికి ముందు మరో జీవం ఉడటం అనివార్యం - అప్పుడే ఈ రెండో జీవికి మొదటి జీవి కర్మల ఫలంగా ఈ జన్మ ప్రాప్త మయిందని చెప్పవచ్చు. ఈ జన్మల ఎడతెగని పరంపర ప్రస్ఫుటంగా బుద్ధికందని, నిర్హేతుకమయిన విషయం.

మూడో దృక్పథాన్ని గమనిద్దాము. ఈ దృక్పథంలోని ఒక్కో అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిద్దాము.

## ప్రళయం, పరలోకం

ఈ దృక్పథంలోని మొదటి విషయమేమిటంటేః ఒకరోజు ప్రళయం సంభవిస్తుంది. దేవుడు ఆ రోజున ఈ విశ్వ కార్యకలాపాన్నంతా శిథిలం చేసి, సరికొత్తగా సుస్థిరమయిన, ఉత్తమమయిన వ్యవస్థను సృష్టిస్తాడు. ఈ విషయాన్ని కాస్త లోతుగా ఆలోచిస్తే ఇందులో ఏ సంశయానికీ తావు కనిపించదు. ప్రపంచ కార్యకలాపాలను శ్రద్ధగా పరిశీలిస్తే ఈ వ్యవస్థ చిరస్థాయిగా ఉండే వ్యవస్థ మాత్రం కాదని బోధపడుతుంది. ఎందుకంటే ఇందులో పనిచేసే శక్తులన్నీ పరిమితమయినవి. ఒకరోజు ఇవి అంతమవడం తథ్యం, ఇది యదార్థమే అన్నట్టు వైజ్ఞానికులంతా, ధగధగమని ప్రజ్వలించే సూర్యుడు

ఓ రోజున చల్లబడతాడని, అజ్ఞాత కాలం నుంచి అంతరిక్షంలో విహరిస్తున్న నక్షత్రాలు పరస్పరం ఘర్షించుకుంటాయని, కళకళలాడే ప్రపంచమంతా వెలవెలబోతుందని, ఈ వ్యవస్థ అంతా అంతమయిపోతుందని ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నారు.

ఈ దృక్పథం చాటే రెండో అంశం: మానవునికి తిరిగి మరో జీవితం అనుగ్రహించబడుతుందన్నది. ఇది సాధ్యమా? ఇదే అసాధ్యమయితే మనిషికి ఇప్పుడు ప్రాప్తమయిన జీవితం ఎలా సాధ్యమయింది? మానవుణ్ణి ఈ లోకంలో పుట్టించిన విశ్వప్రభువు మరో ప్రపంచంలోనూ పుట్టించలేడా? కాస్త ప్రశాంతంగా ఆలోచిస్తే ఈ విషయం బోధపడటం ఎంతో కష్టం కాదు.

ఈ దృక్పథం తెలిపే మూడో అంశం ఏమిటంటే, "మనిషి తన ప్రాపంచిక జీవితంలో చేసే చర్యలన్నీ రికార్డు చేసి భద్రపరచబడుతున్నాయి. ఆ రికార్డు, మనిషి తిరిగి లేపబడిననాడు, ప్రత్యక్షపరచబడుతుంది." ఈ అంశం మనకు నేడే ప్రత్యక్షంగా రుజువవుతోంది. నోటి నుండి వెలువడే శబ్దం గాలిలో కొన్ని తరంగాలు ఉత్పన్నం చేసి అంతరించిపోతుందని క్రితంలో భావించబడేది. కాని ఈ శబ్దతరంగాలు చుట్టుపట్ల ఉన్న వస్తువులపై కూడా తమ ప్రభావాన్ని వదలుతాయని, ఆ వస్తువుల ద్వారా తిరిగి వాటిని జనింపజెయ్యడం సాధ్యమే అని కనుగొనటం జరిగింది. గ్రామఫోను రికార్డు ఈ సూత్రానికనుగుణంగానే రూపొందించబడుతోంది. ఇలాగే మన ప్రతి కదలిక దానితో సంబంధమున్న ప్రతి వస్తువుపై తన ముద్ర వేస్తుందన్న విషయమూ తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో మన "కర్మపత్రం" పూర్తిగా సురక్షితమయి ఉంటుందనడం, అది తిరిగి ప్రత్యక్షం కాగలదనడం అంతా సాధ్యమే అన్న నమ్మకం కలుగుతుంది.

ఈ దృక్పథం సూచించే నాల్గవ విషయం, "విశ్వప్రభువు తీర్పుదినాన న్యాయవ్యవస్థను నెలకొల్పి మనిషి చేసిన సత్కర్మలకు బహుమానమో, దుష్కర్మలకు దండననో నిర్ణయిస్తాడు". ఇది అసాధ్యమనడానికి ఆధార మేముంది? ఇందులో బుద్ధికందని విషయం ఏముంది? దేవుని న్యాయస్థానంలో సమంజసమయిన రీతిలో తీర్పులు జరగాలని, న్యాయం ప్రాప్తం కావాలనే బుద్ధి కోరేది.

ఒక వ్యక్తి జీవితాంతం మంచి పనులే చేస్తాడు. దాని ఫలితం అతనికి ఈ జీవితంలో ఏదీ లభించదు. ఈ విషయం మన నిత్యానుభవమే. ఇలాగే మరో వ్యక్తి చెడు పనుల్ని చేస్తాడు. కాని దాని పర్యవసానంగా అతనికి ఎలాంటి నష్టమూ వాటిల్లదు. ఇంతేకాదు, సత్క్రియలు చేసేవారు ఎందరో ఈ లోకంలో కష్టనష్టాల పాలవడం మనం చూస్తూనే ఉంటాము. ఇలాగే దుష్క్రియలు చేసేవారు ఎందరో ఇక్కడ ఆనందంగా సుఖశాంతులతో జీవించడం కూడా మనం చూస్తూనే ఉన్నాము. ఇలాంటి ఉదంతాలు చూచి సజ్జనులకు వారి సత్క్రియల ఫలితం, దుష్టులకు వారి దుశ్చేష్టల శిక్ష ఏ విధంగానయినా లభించడమే న్యాయమని మన బుద్ధివివేకాలు అభిలషిస్తాయి.

## మానవుని అంతిమ నివాసం

నమ్మవలసిన చివరి విషయం స్వర్గనరకాలు. వీటి ఉనికి కూడా అసంభవమేమీ కాదు. భూమిని, సూర్యచంద్రాది గ్రహాలను సృష్టించిన దైవా నికి స్వర్గనరకాలు సృష్టించడం అసాధ్యమయినదేముంది? ఆయన, న్యాయపీఠం నెలకొల్పి, ప్రజలకు శిక్షనో, బహుమానాన్నో ప్రసాదించనున్నప్పుడు బహు

మానాన్ని పొందేవారి కొరకు గౌరవనీయమయిన, సుఖవంతమయిన, ఆనంద ప్రదాయకమయిన స్థానం, శిక్ష పొందేవారికి అవమానకరమయిన, దుఃఖదాయకమయిన బాధాపూరితమైన చోటునూ అవసరమయినవేగా?!

ఈ విషయాలను గురించి లోతుగా ఆలోచిస్తే తేలేదేమంటే మానవుని అంతిమ దశను గురించి ప్రపంచంలో ప్రచారంలో ఉన్న దృక్పథాలన్నింటిలో ఈ దృక్పథమే బుద్ధికందేదిగా సమంజసమయిందిగా అగుపడుతుంది. ఇందులో నిర్హేతుకమయింది, అసంభవమయింది ఏదీ కానరాదు.

ఇంకా, సత్య సందేశహరులు ముహమ్మద్ (సఅసం) సెలవిచ్చిన మాట ఇది. ఇందులో మన శ్రేయమే ఇమిడి ఉంది. దీన్ని మనస్ఫూర్తిగా నమ్మడమే వివేకవంతమైన పని. ఎలాంటి నిదర్శనం, ఆధారం లేకుండా దీన్ని గురించి కుశంకలకు గురవడం సమంజసం కాదు.

# కలిమయే తయ్యిబా (శిష్టవచనం)

ఇస్లామ్‌కు మూలాధారాలయిన విశ్వాసాంశాలను పైన వివరించడం జరిగింది.★ ఈ అయిదింటి భావసారాన్ని సంక్షిప్తంగా ఒకే సద్వచనంలో పొందుపరచడం జరిగింది. అదే :-

---

★ *విశ్వాసాంశాలను అయిదుగా ఇక్కడ సూచించడం జరిగింది. ఈ మౌలిక అంశాలను దివ్య ఖుర్‌ఆన్‌లోని బఖరా సూరా 285వ ఆయత్, అన్నిసా సూరా 136వ ఆయత్ ద్వారా గ్రహించడం జరిగింది. హదీసుల్లో అదృష్ట దురదృష్టాలను సయితం విశ్వాసాంశాలుగా పరిగణించిన విషయం వాస్తవమే. ఈ విధంగా విశ్వాసాంశాలు ఆరు అవుతాయి. కాని వాస్తవమేమంటే అదృష్ట*

## లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్

మనిషి "లా ఇలాహ ఇల్లల్లాహ్" అన్నప్పుడు సకల మిథ్యా దైవాలను తప్పుడు దైవభావనలను పరిత్యజించి ఒకే దైవానికి విధేయతా దాస్యాలు పాటించే ప్రమాణం చేస్తాడన్న మాట. అలాగే "ముహమ్మదుర్రసూలుల్లాహ్" అన్నప్పుడు ముహమ్మద్ (సఅసం) దైవసందేశహరులన్న యదార్థాన్ని ధృవపరుస్తాడు. దైవ దౌత్యాన్ని ధృవపరచగానే దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధించినదంతా ధృవపరచినట్లే అవుతుంది. దేవుని గుణగణాలు, దైవదూతలు,దైవ గ్రంథాలు, దైవ ప్రవక్తలు, మరణానంతర జీవితం ఇత్యాది విషయాలను గురించి మహాప్రవక్త(సఅసం) బోధించినదంతా విశ్వసించడం, ఆయన ఆదేశించిన విధంగా దైవారాధనను, దైవ విధేయతా మార్గాన్ని పాటించడం అనివార్యమవుతుంది.

---

దురదృష్టాల పట్ల విశ్వాసం అన్నది దైవ విశ్వాసంలోని అంతర్భాగమే. దివ్య ఖుర్ఆన్‌లో దీన్ని ఈ విధంగానే ప్రస్తావించడం జరిగింది. అందువల్లనే ఈ విశ్వాసాన్ని ఏకేశ్వర విశ్వాసం సందర్భంలోనే విశదీకరించాము. అలానే కొన్ని హదీసుల్లో స్వర్గనరకాలు, సిరాత్ (పరీక్షామార్గం), మీజాన్ (తులమానం) కూడా వేర్వేరు విశ్వాసాంశాలుగా సూచించబడ్డాయి కాని వాస్తవానికి ఇవన్నీ ఆఖిరత్ (పరలోకం) పట్ల విశ్వాసంలోని అంశాలే.

# అయిదవ అధ్యాయం

# ఆరాధనలు

వెనుకటి పుటల్లో మనం గమనించినట్లు విశ్వప్రవక్త ముహమ్మద్ (సఅసం) అయిదు విషయాల్ని విశ్వసించమని ఆదేశమిచ్చారు.

1. ఎవరూ సహవర్తులు లేని ఏకైక దైవం
2. దైవ దూతలు
3. దైవ గ్రంథాలు, ముఖ్యంగా దివ్య ఖుర్ఆన్
4. దైవ సందేశహరులు, ముఖ్యంగా దేవుని చివరి ప్రవక్త ముహమ్మద్ (సఅసం)
5. మరణానంతర జీవితం

ఇవే ఇస్లాంకు మూలాధారమయిన విశ్వాసాలు. ఈ అయిదింటినీ విశ్వసించిన వ్యక్తి ముస్లిం అవుతాడు. అయితే ఇంతటితోనే అతడు పరిపూర్ణ ముస్లిం కాలేడు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) దైవం తరఫున మానవులకు అందజేసిన ఆదేశాల ప్రకారం ఆచరించనంతవరకు ఒక వ్యక్తి పరిపూర్ణ ముస్లిం అవజాలడు. ఎందుచేతనంటే విశ్వాసం కలిగిన వెంటనే విధేయత తప్పనిసరి అవుతుంది. వాస్తవానికి ఈ విధేయతకే ఇస్లామ్ అని అంటాము.

దీన్ని కాస్త శ్రద్ధగా గమనించాలి. అల్లాహ్ మాత్రమే మీ ఏకైక దైవమని మీరు అంగీకరించారు. అంటే ఆయన మీ ప్రభువు, మీరు ఆయన దాసులు. ఆయన మీ పాలకుడు, మీరాయన పాలితులన్నమాట. అలాంటప్పుడు

ఆయన్ని మీరు మీ ప్రభువుగా, పాలకునిగా అంగీకరించి ఆయన ఆజ్ఞాపాలన చెయ్యకపోతే, మీరు మీ అంగీకారం ప్రకారం దోషిగా, ద్రోహిగా రూపొందుతారు.

అలాగే దివ్య ఖుర్‌ఆన్‌ని దైవ గ్రంథమని మీరు ఒప్పుకున్నారు. అంటే ఖుర్‌ఆన్‌లో ఉన్నదంతా దైవాదేశాలే అని మీరు అంగీకరించారని భావం కదా. ఇక, ఇది బోధించే ప్రతిమాటను స్వీకరించడం, ప్రతి ఆదేశాన్ని శిరసావహించడం అనివార్యం. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) దైవ సందేశహరులని మీరు అంగీకరించారు. అంటే నిజానికి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇచ్చిన ఆదేశాలు, చేసిన నిషిద్ధాలు కేవలం దైవం తరపునే ఆయన చేశారని మీరు ఒప్పుకున్నారన్నమాట. ఇప్పుడు మహాప్రవక్త (సఅసం)ను అనుసరించడం తప్పనిసరి అయింది.

అందువల్ల, మీ ఆచరణా విధానం మీ విశ్వాసాలకు అనుగుణంగా రూపొందినప్పుడే మీరు పరిపూర్ణ ముస్లింగా రూపొందగలరు. లేకపోతే మీ విశ్వాసం (ఈమాన్), ఆచరణల్లో ఏ మేరకు వ్యత్యాసముంటుందో అంతవరకు మీ ఈమాన్ అసంపూర్ణంగా ఉంటుంది.

ఇప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) దైవేచ్ఛ ప్రకారం జీవితం గడిపేందుకు బోధించిన విధానమేదో, ఇచ్చిన ఆదేశాలేవో, చేసిన నిషిద్ధాలేవో పరిశీలించాలి. ఈ సందర్భంలో ప్రప్రథమంగా వచ్చే విషయం, ముస్లిమయిన ప్రతి వ్యక్తి అనివార్యంగా ఆచరించవలసిన ప్రాథమిక విద్యుక్త ధర్మం – ఆరాధనలు – ఇబాదాత్.

## ఇబాదత్ భావం

ఇబాదత్ అంటే వాస్తవానికి "దాస్యం" అని అర్థం. మానవుడు 'అబ్ద్' అంటే సేవకుడు. అల్లాహ్ "మాబూద్" అంటే సేవితుడు. అబ్ద్ (సేవకుడు)

తన మాబూద్ (సేవితుని) విధేయతను పాటించడాన్నే ఇబాదత్ (సేవ) అంటారు. ఉదాహరణకు మీరు పరస్పరం మాట్లాడుకుంటారు. అయితే ఈ సంభాషణలో మీరు అబద్ధం పలకరు, దుర్భాషలాడరు. దైవం వీటిని నిషేధించిన కారణాన మీరు ఇలా ఆచరించినట్లయితే, ఇంకా దైవం ఇష్టపడే కారణాన నిత్యం సత్యాన్ని, సన్మార్గాన్ని నీతిని, నిజాయితీనే పలికినట్లయితే - ఇవన్నీ ప్రాపంచికమయిన మాటలే అయినప్పటికీ మీరు చేసినది "ఇబాదత్" అనబడుతుంది. (ఇబాదత్‌కు బహువచనం ఇబాదాత్).

మీకు ప్రజలతో లావాదేవీలుంటాయి. బజారులో క్రయవిక్రయాలుంటాయి. ఇంట్లో తల్లిదండ్రులు, సోదరసోదరీలతో మెలుగుపాటు ఉంటుంది. బంధుమిత్రులతో సంబంధాలు ఉంటాయి. జీవితపు ఈ వ్యవహారాలన్నింటిలో మీరు దైవాదేశాలను ఆయన నియమాలను పాటిస్తూ, మీతో సంబంధమున్న ప్రతి ఒక్కరి హక్కును మీరు సరిగ్గా నిర్వర్తిస్తూ ఉన్నట్లయితే, ఇదంతా దైవం ఆజ్ఞాపించినందుకే మీరు చేసినట్లయితే, దైవం వారించినందుకే ఇతరుల హక్కును కాజెయ్యకుండా మీరు వ్యవహరించినట్లయితే మీ జీవితమంతా "ఇబాదత్" అంటే "దైవసేవ" లో గడిచిపోయిందన్న మాట. నిరుపేదకు సహాయం చెయ్యడం, ఆకలిగొన్నవారికి అన్నం పెట్టడం, రోగికి సేవ చెయ్యడంలాంటి కార్యాల్లో స్వార్థప్రయోజనమో, నలుగురి మెప్పుపొందాలన్న ప్రదర్శనా బుద్ధియో లేకుండా ఇవి కేవలం దైవ ప్రసన్నతకై ఆయన ఆజ్ఞాపాలనగా చేసినట్లయితే ఇవన్నీ ఇబాదత్, దైవసేవ కిందికే వస్తాయి. మీరు విభిన్న వృత్తులు చేపడతారు. వ్యాపారాలు చేస్తారు. వీటిలో దైవభీతితో, న్యాయబద్ధతతో, నిజాయితీతో వ్యవహరించినట్లయితే ధర్మసమ్మతమైన (హలాల్) సంపాదన ఆర్జించి అధర్మ (హరామ్) సంపాదనకు దూరంగా వున్నట్లయితే స్వయంగా మీ జీవనోపాధికై మీరు చేసే కృషి కూడా "ఇబాదత్" గానే పరిగణించబడుతుంది.

# జీవితమే ఓ ఆరాధన

కనుక, ప్రాపంచిక జీవితంలో ప్రతి నిత్యం, ప్రతి విషయంలో దైవభీతితో, దైవ ప్రసన్నత పొందే కాంక్షతో వ్యవహరించడం, దైవాజ్ఞల్ని పాలించడం, దేవుని అవిధేయత ద్వారా ప్రాప్తమయ్యే లాభాలను త్రోసిపుచ్చడం, ఆయన విధేయత కారణంగా సంభవించే లేక సంభవించగల నష్టాలను సంతోషంగా స్వీకరించడం - దీన్నే దేవుని సేవ, దైవోపాసన, దైవారాధన అనంటారు. ఈ పంథాలో సాగే జీవితం మొత్తం దైవారాధనే. ఇలాంటి జీవితంలోని ప్రతి విషయం చివరికి భోజనపానీయాలు, మనిషి తిరగడం, నిద్రపోవడం, జాగరణ చెయ్యడం, మాటలాడటం అన్నీ ఇబాదత్, సేవలో చేరిన విషయాలే.

'ఇబాదత్' అన్న పదానికి ఇదే నిజమయిన భావం. ఒక ముస్లిమ్‌ని ఇలాంటి దైవ సేవకునిగా తయారుచెయ్యడమే ఇస్లామ్ ముఖ్యోద్దేశం. ఈ లక్ష్యసాధన కొరకు కొన్ని ఆరాధనా విధానాలను విధిగా పాటించాలని ఇస్లామ్ ఆదేశిస్తుంది. ఈ ఆరాధనా విధానాలు పైన పేర్కొన్న పరిపూర్ణ సేవా పరాయణత్వపు జీవితం కొరకు మనిషిని సిద్ధం చేస్తాయి. అంటే ఈ ఆరాధనా విధానాలు ఆ "పరిపూర్ణ ఆరాధన" కొరకు శిక్షణా ప్రణాళిక (Training Course) లాంటివన్నమాట. ఈ శిక్షణను ఏ వ్యక్తి ఎంత శ్రద్ధగా గ్రహిస్తాడో అతడు అంతే ఉత్తమ రీతిలో ఆ నిజమయిన పరిపూర్ణ ఆరాధనను, సేవను నిర్వర్తిస్తాడు. ఈ కారణంచేతనే ఈ ఆరాధనా విధానాలను అత్యంత మౌలికమయిన విధులుగా నిర్ణయించడం జరిగింది. వీటిని 'అర్కానె దీన్' అంటే "ధర్మ మూలస్థంభాలు"గా పేర్కొనడం జరిగింది. ఏ విధంగానయితే ఒక కట్టడం నిలువడానికి స్థంభాలు ఆధారభూతమయి ఉంటాయో అదేవిధంగా ఇస్లామీయ జీవన వ్యవస్థ సౌధం ఈ ఆరాధనా విధుల స్థంభాల ఆధారంగానే

నిలబడగలుగుతుంది. వీటిని నిలుపలేకపోయినా, పడగొట్టినా ఇస్లామ్ ధర్మసౌధమే నిలువజాలదు, శిధిలమయిపోతుంది.

# నమాజ్ (దైవోపాసన)

ఇస్లామ్ విధిగా నిర్ణయించిన ఆరాధనా విధానాల్లో మొట్టమొదటిది నమాజ్, నమాజ్‌లో జరిగేదేమిటి? మీరు విశ్వసించినవాటి పునశ్చరణ రోజుకు అయిదుపూటలా జరుగుతుంది.

ప్రాతఃకాలానే (ఫజ్ర్ నమాజ్ వేళ) లేచి పరిశుభ్రంగా తయారయి మీరు మీ ప్రభువు సమక్షంలో సవినయంగా హాజరవుతారు. ప్రార్థనా సమయంలో ప్రభువు సమక్షంలో మీరు అనుసరించే విభిన్న భంగిమలు వాస్తవానికి ఆయనకు మీరు చేసే దాస్యానికి నిదర్శనాలే. మీరు ప్రార్థనలో ఆయన సహాయాన్ని అర్థిస్తారు, మార్గదర్శకత్వం కొరకు వేడుకుంటారు. విధేయతా ప్రమాణాన్ని ధృవపరుస్తారు, ఆయన అనుగ్రహంపొందే అభిలాష, ఆగ్రహానికి దూరంగా ఉండే ఆకాంక్షను మరీ మరీ వ్యక్తం చేస్తారు. ఆయన ప్రసాదించిన దివ్య గ్రంథాన్ని పఠిస్తారు. ఆయన సందేశహరుని పట్ల విశ్వాస ప్రమాణాన్ని ప్రకటిస్తారు. తీర్పుదినాన ఆయన న్యాయస్థానంలో మీ చేష్టలకు బదులు చెప్పుకునే బాధ్యతను జ్ఞాపకం చేసుకుంటారు. ఈ ప్రమాణాలు, ప్రకటనలతో మీ దినచర్య ప్రారంభం అవుతుంది.

ఆ తరువాత కొంతకాలం వరకు మీరు మీ దినచర్యల్లో నిమగ్నులవుతారు. మధ్యాహ్నం (జుహర్ వేళ) "ముఅజ్జిన్" – ప్రార్థనకై పిలుపును చాటే వ్యక్తి – మీరు ఈ పాఠాన్ని మరచిపొయ్యి ఎక్కడ దైవాన్ని విస్మరిస్తారో అని, కొన్ని నిముషాలు ఆ పాఠాన్ని పునశ్చరణ చేసుకోడానికి మళ్ళీ పిలుస్తాడు. మీరు ప్రార్థనల్లో పాల్గొని మీ ఈమాన్ (విశ్వాసం) లో క్రొత్తదనాన్ని

నింపుకుని వస్తారు. తిరిగి ప్రపంచంలో, దాని అంతమవ్వని కార్యకలాపాల్లో మీరు నిమగ్నులవుతారు.

అలాగే సాయం సమయాన (అస్ర్ వేళ) పిలుపువస్తుంది. తిరిగి మీ విశ్వాసం ప్రఫుల్లమవుతుంది. తరువాత సూర్యాస్తమయం (మగ్రిబ్ వేళ) కాగానే రాత్రి ఆవరిస్తుంది. ప్రాతఃకాలాన ఏ విధంగా దైవారాధనతోనే మీరు దినాన్ని ప్రారంభిస్తారో, రాత్రిని అదే విధంగా దైవారాధనతోనే మొదలెడతారు. అంటే రాత్రిలో సయితం అసలు పాఠాన్ని మరచిపొయ్యి మార్గం తప్పే అవకాశం లేకుండా కట్టుదిట్టం చెయ్యడం జరిగిందన్నమాట. ఇలా కొన్ని గంటలు గడవగానే నిద్రించే సమయం (ఇషా వేళ) ఆసన్నమవుతుంది. ఇందులో చివరిసారిగా మీ విశ్వాసం (ఈమాన్)కు తాజాదనం సమకూర్చబడుతుంది. దీనితో మీ శిక్షణ దశలు పూర్తయ్యాయన్నమాట. పగటి కోలాహలంలో మీకు ఏకాగ్రత కొరవడినట్లయితే ఇప్పుడు ఈ ప్రశాంత సమయంలో తృప్తిగా దీక్ష వహించి మీ గురుతర బాధ్యతల్ని మీరు నెమరువేసుకోగలరు.

## శీల నిర్మాణంలో నమాజ్

ఇప్పుడు కాస్త పరిశీలనాత్మకంగా చూడండి. ఈ ప్రార్థన, 'నమాజ్' ప్రతి రోజూ అయిదు వేళలా మనిషిలోని ఇస్లామ్ మౌలిక విశ్వాసాలను దృఢపరుస్తుంది. ఇంతకుముందు వివరించిన అసలు ఆరాధనకై, జీవితం మొత్తాన జరిపే ఆరాధనకై ఈ నమాజ్ తర్ఫీదునిస్తుంది. మానసిక పరిశుద్ధత, ఆత్మ వికాసం, స్వరూప స్వభావాల ప్రక్షాళన, ఆచరణల సంస్కరణ ఏ ప్రధాన విశ్వాసాలపై ఆధారభూతమయి ఉన్నాయో, వాటికి నవజీవనాన్నిస్తుంది.

దీన్ని కాస్త వివరంగా పరిశీలించండి. వుజూ ★ చెయ్యడంలో మీరు మహాప్రవక్త (సఅసం) సూచించిన విధానాన్నే ఎందుకు అనుసరించాలి? ఆయన బోధించిన సంస్కరణ వచనాలనే నమాజ్‌లో ఎందుకు పఠించాలి? మహాప్రవక్త ముహమ్మద్(సఅసం)కు విధేయులయి ఉండటాన్ని, ఆయన విధేయతను పాటించడాన్ని ముస్లిములు తమ విధిగా భావించడంవల్లనేగా? దివ్య ఖుర్‌ఆన్ పఠనంలో తెలిసీ ఎలాంటి తప్పు చెయ్యరు. ఎందుకు? అది దైవ గ్రంథమన్న దృఢ విశ్వాసం ఉండటం మూలానేగా? నమాజ్‌లో మెల్లమెల్లగా శబ్దం పైకిరాకుండా పఠించే వాటిని పఠించకపోయినా లేక ఆ వచనాలకు బదులు మరేమాటలనయినా పఠించినా వచ్చిన కష్టమేముంది? కలిగే భయమేముంది? దాన్ని వినేవాడెవడు? కాని ఎవరికీ వినబడనట్లు పఠించినా దాన్ని వినగలిగేవాడు, వింటున్నవాడు దేవుడున్నాడని, మనం చేసే ఏ నిగూఢ కార్యమయినా, బహిరంగకార్యమయినా అంతా దైవానికి తెలుసని నమ్మడమే కదా ఈ వైఖరికి మూల కారణం?

చూచేవారెవరూ లేనిచోట కూడా నమాజ్ కొరకు మనిషిని లేపే శక్తి ఏది? దేవుడు చూస్తున్నాడన్న విశ్వాసమేగా? నమాజ్ సమయం కాగానే చేస్తున్న ఏదయినా అత్యవశ్యమయిన పనిని మాన్పించి మనిషిని నమాజ్ కొరకు సమాయత్తపరిచే శక్తి ఏది? నమాజ్ దైవం చేత విధించబడ్డ విధి అన్న భావనేగా! చలికాలంలో వేకువజామున, వేసవిలో మధ్యాహ్నం వేళ, ప్రతి దినం హాయిగా షైరుకెళ్ళే ఆహ్లాదకరమయిన సాయంసమయాన నమాజ్ కొరకు వత్తిడి తెచ్చే శక్తి ఏది? అది, కర్తవ్య జ్ఞానం, విధినిర్వహణ పట్ల ఉన్న బాధ్యతాభావం కాకపోతే మరేమిటి? నమాజ్ ఆచరించడంలో ఎలాంటి

---

★ ప్రార్థన (నమాజ్)కు ముందు తప్పనిసరిగా ముఖం, చేతులు కాళ్ళు కడుక్కునే ప్రత్యేక విధానం.

తప్పు జరక్కుండా మనిషి జాగ్రత్తపడతాడెందుకు? ఆంతర్యం దైవ భీతికి ఆలవాలమవడంచేత కాదా? ఆయన ఏర్పరచే న్యాయస్థానంలో ఓ రోజున హాజరు కావలసి ఉందని తెలిసి ఉండటం మూలాన కాదా??

ఇప్పుడు చెప్పండి, ఓ మనిషిని పరిణతి చెందిన ఓ నిజమయిన ముస్లింగా తయారుచేయడానికే నమాజ్‌కంటే ఉత్తమమయిన శిక్షణ ఏదయినా కాగలుగుతుందా? ఇలాంటి వ్యక్తి నమాజ్ తరువాత తన ప్రాపంచిక వ్యవహారాల్లో నిమగ్నుడయినప్పుడు కూడా దైవ భీతితో వ్యవహరిస్తాడని, ఆయన ఆజ్ఞల్ని పాటిస్తాడని, పాపపు కార్యమయినా, మరే అపరాధమయినా చేసే అవకాశం కలిగినప్పుడు దేవుడు చూస్తున్నాడనే విషయాన్ని మరవకుండా మెలుగుతాడని ఆశించడానికి వీలుంది. ఒకవేళ ఎవరయినా ఇంత మహత్తరమయిన శిక్షణ పొందినప్పటికీ దైవ భీతిలేనివాడయి, దైవాదేశాలకు భిన్నంగా ఆచరించడం మానుకోకపోతే అది నమాజ్‌లోని లోపం కాదు. స్వయంగా అతని ఆంతర్యంలోనే ఏదో వక్రత ఉందని దానికి భావం.

## సమైక్యతకు సోపానం

మరో విషయాన్ని గమనించండి. నమాజ్‌ని, అందరూ కలసి జమాఅత్‌తో, సామూహికంగా ఆచరించాలని అల్లాహ్ ఆదేశం. ముఖ్యంగా వారానికి ఒకసారి శుక్రవారంనాడు సామూహిక ప్రార్థన చెయ్యడం విధిగా నిర్ణయించడం జరిగింది. దీన్ని సరిగ్గా ఆచరిస్తే ముస్లిముల్లో సమైక్యత, సమతాభావాలు ఉత్పన్నమవుతాయి. ముస్లిముల్ని ఇది సంఘటితపరచి ఓ బలమయిన సంఘంగా తీర్చిదిద్దుతుంది.

అందరూ కలసి ఒకే దైవాన్ని ఆరాధించినప్పుడు, ఆ దైవారాధనలో అందరూ ఒకే నాయకుని ఆధ్వర్యాన ఒక్కసారిగా ఒకే విధానాన్ని

అనుసరించినప్పుడు సహజంగానే వారి హృదయాలు ఏకమయిపోతాయి; వారిలో పరస్పర సోదర భావం నెలకొంటుంది. ఒకే నాయకుని విధేయతా మార్గంలో పయనించడం కూడా అలవడుతుంది. వారిలో క్రమశిక్షణ, వారి జీవితాల్లో ఓ క్రమబద్ధత ఏర్పడుతుంది. వారి మధ్య పరస్పర ప్రేమాభిమానాలు జనిస్తాయి. సమతాభావం, సమైక్యతాభావం పుడుతుంది. కలవారు, లేనివారు, చిన్నవారు, పెద్దవారు, ఉన్నతోద్యోగులు, అధికారులు, బంట్రోతులు అందరూ ఒకే వరుసలో నిలబడి ప్రార్థన చేస్తారు. కులం లేదు, గోత్రం లేదు, అగ్రవర్ణం లేదు, అల్పవర్ణం లేదు - అందరూ సమానులే.

నమాజ్ వల్ల కలిగే అసంఖ్యాకమయిన లాభాల్లో ఇవి కొన్ని మాత్రమే. ఈ లాభాలన్నీ లభించేది మానవునికే - దైవానికి కాదు. మానవ శ్రేయాన్ని కాంక్షించే దేవుడు వీటిని విధించాడు. దీన్ని ఆచరించకపోతే ఆయన అప్రసన్నుడవుతాడంటే దానికి కారణం, ఆయనకు మనమేదో నష్టం కలిగించామన్నది కాదు, స్వయంగా మనం నష్టపొయ్యామన్నదే. నమాజ్ ద్వారా దైవం మానవులకు ఎంతటి ఘనమయిన శక్తిని ప్రసాదిస్తున్నాడో దాన్ని గ్రహించలేకపోతున్నాడు మనిషి.

ఎంత లజ్జాకరమయిన విషయమో గమనించండి. నోటితో దేవుని ఏకత్వాన్ని ఆయన ప్రవక్త అనుసరణను, పరలోకంలోని పరీక్షను ఒప్పుకున్న మనిషి దైవం, దైవ ప్రవక్త తనపై విధించిన ముఖ్యమయిన విద్యుక్త ధర్మాన్నే నిర్వర్తించడం లేదు. ఎంత శోచనీయం!

మనిషి ఇలా చేస్తున్నాడంటే దీనికి రెండేరెండు కారణాలు కాగలవు. నమాజ్, దైవం నియమించిన విధి అన్న విషయాన్ని అతడు ఆమోదించలేదు. లేదా దాన్ని "విధి"గా అంగీకరించకపోవడమంటే, దాన్ని "విధి"గా ప్రకటించే దివ్య ఖుర్ఆన్ని, దైవ ప్రవక్త ప్రవచనాన్ని రెంటినీ ధిక్కరిస్తున్నాడు. అంటే

దైవాన్ని, దైవ ప్రవక్తను విశ్వసించానని అతడు చేసే వాదన మిథ్యావాదన అన్నమాట. అలాకాక దాన్ని విధిగాపరిగణిస్తూనే దాన్ని పాటించకపోవడమంటే, అలా చేసేవారు ఏ మాత్రం విశ్వసనీయులు కాజాలరని భావం. ప్రపంచంలోని మరే విషయంలోనూ అలాంటి వారిని నమ్మ శక్యం కాదు. దైవం విధించిన వాటిలోనే వంచనకు పాల్పడినవారు మానవుల విషయంలో అలా చెయ్యరని నమ్మకమేముంది?

## ఉపవాస వ్రతం – రోజా

రెండవ విధి రోజా - ఉపవాసవ్రతం. రోజాలో ఉన్నదేమిటి? ఏ విషయాలనయితే నమాజ్ రోజూ అయిదువేళలా జ్ఞాపకం చేస్తుందో ఆ విషయాలనే 'రోజా' సంవత్సరంలో ఒకసారి పూర్తిగా ఒక్క నెల వరకు ప్రతి దినం, ప్రతి క్షణం జ్ఞాపకం చేస్తూ ఉంటుంది. రమజాన్ నెల వచ్చిందంటే ఉషోదయం మొదలుకుని సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలు పుచ్చుకోవడం నిషేధించబడుతుంది.

## శీల నిర్మాణం

సహర్★ సమయాన భోజనం చేస్తూ ఉంటాము. అకస్మాత్తుగా అజాన్ (ప్రార్థన పిలుపు) వినవస్తుంది. తక్షణం భోజనం నిలిపివేస్తాము. ఇప్పుడు ఎంత స్వాదిష్టమయిన భోజనం ముందుంచినా, ఆకలి ఎంతగా దహించివేసినా, మనసు ఎంతగా అల్లాడినా సూర్యాస్తమయం వరకు ఏమీ భుజించేది లేదు. ఇతరుల సమక్షంలో తినకపోవడమే కాదు. ఏకాంతంలో ఎవరూ చూడలేనటువంటి పరిస్థితిలో కూడా ఒక్క నీటి చుక్కనయినా

---

★ రాత్రి చివరి ఘడియల్లో ప్రాతఃకాలానికి ముందు సమయం.

ఒక్క మెతుకు అన్నమయినా మింగడానికి వీల్లేదు. ఈ నిషేధాజ్ఞలు నిర్ణీత సమయం వరకే ఉంటాయి. అటు మగ్‌రిబ్ – సూర్యాస్తమయంవేళ – అజాన్ అవగానే ఇటు ఇఫ్తార్★ కొరకు ఉపక్రమిస్తాము. ఆపైన రాత్రంతా ఇష్టమయిన దంతా భుజించవచ్చు. ఇదంతా ఏమిటో కాస్త గమనించవలసి ఉంటుంది.

ఈ క్రియ లోతుల్లో దాగి ఉన్న భావనలు ఏవి? దేవుని ఎడల భయభక్తులు, ఆయన సర్వత్రా ప్రత్యక్షంగా ఉన్నాడన్న భావన, ఆయన ప్రతిదీ కానగలడన్న నమ్మకం; మరణానంతర జీవితంపట్ల, దైవ న్యాయస్థానంలో హాజరవడం పట్ల అచంచల విశ్వాసం ; దివ్య గ్రంథం, దైవ ప్రవక్తల పట్ల పరిపూర్ణ విధేయతా భావం. అంతేకాదు ఈ క్రియ వెనుక ఉన్న మరికొన్ని ఉత్తమ లక్షణాలు – ఎట్టి పరిస్థితిలోనూ తొణకని కర్తవ్య పరాయణత, సహనస్థయిర్యాలు, కష్టాలను ఓరిమితో ఎదుర్కొనే మనోబలం, మనోకాంక్షలపై అదుపు, నిగ్రహశక్తి.

ప్రతి సంవత్సరం రమజాన్ నెల వస్తుంది. పూర్తిగా ముప్ఫయి రోజులు ఉపవాస వ్రతం – రోజా – శిక్షణనిస్తుంది. పైన పేర్కొన్న భావనల్ని, లక్షణాలను శక్తుల్ని మనిషి తనలో పెంపొందించుకోడానికి దోహదపడుతుంది. మనిషి పరిపూర్ణ ముస్లింగా మారడానికి, తన నిత్య జీవితంలో ఆ ఉత్తమ గుణగణాలను వినియోగించి, తాను జీవితాంతం చెయ్యవలసిన ఆ "ముఖ్యారాధన" కొరకు యోగ్యుడుగా తయారవడానికి మనిషిని సమాయత్తపరుస్తుంది.

## సామూహిక శిక్షణ

మరో విషయాన్ని గమనించాలి. రోజాను ప్రతి వ్యక్తి వేర్వేరుగా,

★ ఉపవాసవ్రత విరమణ.

వేర్వేరు కాలాల్లో పాటించడానికి వీల్లేదు. అందరూ కలిసి, ఒకే నెలలో విధిగా పాటించాలని నియమించాడు దేవుడు. కాస్త గమనిస్తే ఈ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు అసంఖ్యాకమని బోధపడుతుంది.

ఈ నెల పొంతం ముస్లిం సమాజంలో ప్రతి చోట పవిత్రత, పరిశుద్ధతలు వెల్లివిరుస్తాయి. వాతావరణమంతా దైవ విశ్వాసం, దైవ భీతి, దైవ విధేయతా భావాలతో, ఉన్నత నైతిక పోకడలతో, స్వభావ స్వరూపాల పరిశుద్ధతతో, సత్క్రియ సదాచార వ్యవహారాలతో అలరారుతుంది. ఈ వాతావరణంలో చెడు అన్నది అణగిపోతుంది, మంచి అన్నది పెరిగిపోతుంది. సజ్జనులు సత్కార్యాల్లో పరస్పరం సహకరించుకుంటారు. దుర్మార్గులు దుష్క్రియలాచరించడానికి సాహసించరు. ధనవంతులు నిరుపేదల సహాయానికై ముందుకు వస్తారు. దైవ మార్గాన ధారాళంగా ధనం ఖర్చు చేస్తారు. కలవారని, లేనివారని, రాజని, పేదలని తారతమ్యం లేకుండా ముస్లిం సమాజంలోని వారందరూ ఒకే ఉపవాసస్థితిలో ఉంటారు. ఈ 'స్థితి' వాళ్ళందరిలో, తామంతా ఒకే సంఘానికి చెందినవాళ్ళమన్న భావనను కలిగిస్తుంది. వారిలో సోదరభావం, పరస్పర ప్రేమాభిమానాలు, సమైక్యత సామరస్యాలు సృజించడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.

## మీరు దైవ విధేయులా?

ఇవన్నీ మనకు ఒనగూడే ప్రయోజనాలే. మనం ఉపవాసం ఉండటంచేత దైవానికి కలిగే లాభమేదీ లేదు. ఆయన మనకొరకే ఈ ఉపవాస వ్రతాన్ని మనపై విధిగా నియమించాడు. సమంజసమయిన కారణం లేకుండా ఈ విధి నిర్వహణ పట్ల అలక్ష్యం చూపేవారు తమను తామే అత్యాచారానికి గురి చేసుకుంటారు. ఈ సందర్భంలో మరీ లజ్జాకరమయిన

విషయమేమిటంటే, ముస్లింలయి కూడా రమజాన్ నెలలో రోజా కాలంలో బహిరంగంగా భోజన పానీయాలు పుచ్చుకుంటారు కొందరు. అంటే, మేము ముస్లిం సమాజానికి చెందినవాళ్ళంకామని, ఇస్లామ్ సూచించే ఆదేశాలంటే మాకు ఎలాంటి గౌరవం, శ్రద్ధ ల్లేవని, మేము దైవాన్ని నమ్మి ఆయన ఆజ్ఞల్ని ధిక్కరించగలిగే దుస్సాహసులమని వాళ్ళు చాటుకుంటున్నారన్నమాట!

కాస్త ఆలోచించండి. తమ సంఘాన్నుండి వేరుపడటాన్ని ఇంత సులువుగా భావించేవారిని, తమ సృష్టికర్త తమ పోషకుడయిన దైవాన్ని ధిక్కరిస్తూ కొంతయినా సంశయించనివారిని, తమ ధర్మాన్ని, తమ జీవన వ్యవస్థను, తమ దీన్‌ని, దైవ సందేశహరుడు, తమ మహానాయకుడు ఏర్పరచిన నియమాన్ని అతిక్రమించేవారిని ఏమని అనగలం? వీరిలో విశ్వసనీయత, సత్ప్రవర్తన, కర్తవ్యపరాయణత, బాధ్యతాభావం, క్రమశిక్షణ శాసనపాలనను ఎవరయినా ఎలా ఆశించగలుగుతారు??

## జకాత్

మూడవ విధి జకాత్* ఇది అభాగ్యుల హక్కు. దీన్ని ధనవంతుడయిన ప్రతి ముస్లింపై విధిగా నిర్ణయించాడు అల్లాహ్. ఆ వ్యక్తి వద్ద నిర్ణీత పరిమితికంటే అధికంగా ధనం ఒక సంవత్సర కాలంపాటు నిలువ ఉన్నట్లయితే, అతడు అందులో నుంచి రెండున్నర శాతం (నలభయ్యో వంతు) ధనాన్ని

---

★ జకాత్ నిబంధన కేవలం రూపాయలకే కాదు, వెండి, బంగారం, వాణిజ్య సామగ్రి, పాడిపంటలకు కూడా వర్తిస్తుంది. వీటిలో ఎంత పరిమాణానికి ఎంత జకాత్ విధించబడుతుంది అన్న విషయాన్ని ఫిక్హ్ (ఇస్లామీయ ధర్మశాస్త్రం) గ్రంథాల ద్వారా వివరంగా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం జకాత్ ప్రయోజనాలు, దాని మర్మ హేతువును వివరించడమే మా ఉద్దేశ్యం.

జకాత్‌గా చెల్లించవలసి ఉంటుంది. దీన్ని నిరుపేదలు, అభాగ్యులు కొత్తగా ఇస్లామ్ పరిధిలోకి వచ్చినవారు, బాటసారులు, రుణగ్రస్తులు ఇత్యాది అగత్యపరుల అవసరాలను తీర్చడానికి వినియోగించడం జరుగుతుంది.* ఇలా శ్రీమంతుల ధనంలో నుండి రెండున్నర శాతం ధనాన్ని అగత్యపరులకొరకు కేటాయించాడు అల్లాహ్. దీనికంటే అధికంగా ఎవరైనా చెల్లిస్తే అల్లాహ్ కూడా వారికి ఇతోధికంగా బహూకరిస్తాడు.

## చిత్తశుద్ధి అవసరం

ఈ ధనం అల్లాహ్‌కు అవసరమూ లేదు, అది అల్లాహ్‌కు చేరదు కూడా. అయినా మనం సంతోషంగా మన తోటి సోదరుల కొరకు చేసే ఈ సహాయానికి, ఎన్నో రెట్లు అధికంగా ప్రతిఫలమిస్తానని ఆయన వాగ్దానం చేస్తున్నాడు. అయితే ఒక్క షరతు పాటించడం అవసరం. ఇలా సహాయం చేసి, చేసిన ఉపకారాన్ని చాటుకోకూడదు. పుచ్చుకున్నవారిని కించపరచ కూడదు. వారి అభివందనాలను ఆశించకూడదు. నలుగురి నుండి పొగడ్తలనూ కాంక్షించకూడదు. ఇలాంటి తప్పుడు ఆలోచనలు సయితం ఆంతర్యంలో రాకుండా మనసు కలుషితం కాకుండా కేవలం దైవ ప్రసన్నతను పొందే కోరికతో ఈ విధిని నిర్వర్తించామంటే, తన అనంత ఐశ్వర్యంలోనుంచి తరగని మహాభాగ్యాన్ని అనుగ్రహించే వాగ్దానం చేస్తున్నాడు అల్లాహ్.

---

★ ఈ సందర్భంలో ఒక విషయం గమనించాలి. దైవ సందేశహరులు ముహమ్మద్ (సఅసం) తన వంశంలోనివారు అంటే 'సయ్యిద్' 'హాషిమీ' ముస్లింలకు జకాత్ ధనాన్ని నిషేధించారు. అంటే వారు జకాత్ చెల్లించే స్తోమతగలవారయితే చెల్లించడం విధియేగాని జకాత్ పుచ్చుకోడానికి అర్హులయినా, వారు జకాత్ పుచ్చుకోరాదు. ఎవరైనా సయ్యిద్, హాషిమీలకు ధనసహాయం చెయ్యదలచుకుంటే, జకాత్‌కాని ధనాన్ని కానుకగా ఇవ్వగలరు.

నమాజ్, రోజాలను ఏ విధంగానయితే ముస్లింలు విధిగా పాటించడం అవసరమో అదే విధంగా జకాత్‌ను కూడా పాటించడం ధర్మం. ఇది ఇస్లామీయ జీవనంలో ప్రముఖ అంశం. దీనికి ప్రాముఖ్యత రావడానికి కారణం ఏమిటంటే ఇది ముస్లిముల్లో దైవం కొరకు త్యాగం చేసే ఉన్నత గుణాన్ని సృజిస్తుంది. స్వార్థం, సంకుచితత్వం, ధనలాలసలాంటి దుర్గుణాలను రూపుమాపుతుంది. ధనాన్ని పూజించేవారు, డబ్బుకై దేన్నయినా, ప్రాణాలనైనా ఇచ్చేవారు, లోభులు, పిసినారులు - వీరందరికి ఇస్లామ్‌లో చోటులేదు. తన కష్టార్జితాన్ని దైవాదేశానికనుగుణంగా, నిస్వార్థ బుద్ధితో త్యాగం చెయ్యగలిగే వ్యక్తియే ఇస్లామ్ చూపే బాటన నడవగలడు. "జకాత్" వల్ల ముస్లిముల్లో ఈ త్యాగనిరతి జనిస్తుంది. దైవ మార్గాన ధనం ఖర్చు చెయ్యవలసిన అవసరం ఏర్పడినప్పుడు ధనాన్ని మూట కట్టుకుని కూర్చోకుండా సంతోషంగా యధేచ్ఛగా ఖర్చు చేసే ఉత్తమ గుణాన్ని పెంపొందిస్తుంది.

## సమాజశ్రేయం

జకాత్ వల్ల కలిగే ప్రాపంచిక ప్రయోజనాలు సయితం అనేకం. ముస్లిములు పరస్పరం సహాయం చేసుకోవడం అలవర్చుకుంటారు. ఏ వ్యక్తీ కూడు గుడ్డలకై అలమటిస్తూ పరువు ప్రతిష్ఠలు కోల్పోయి బాధపడే అవసరముండరాదు. ధనవంతులు నిరుపేదల్ని ఆదుకోవాలి. బీదవారు భిక్షమెత్తుకుంటూ తిరగరాదు. ఎవరూ తన సంపాదనను కేవలం తన భోగవిలాసాలకై సుఖ సంతోషాలకై మాత్రమే వినియోగించుకోరాదు. సమాజంలోని అనాథలు, నిరుపేదలు, వితంతువులు, ఉపేక్షితులు కూడా ఆ సంపాదనలో హక్కు కలిగి ఉన్నారని వారు మరువరాదు. పనిచేసే సామర్థ్యం, యోగ్యత, అర్హతలు ఉన్నా పెట్టుబడి లేకపోవడంచేత జీవనోపాధికై

ఎలాంటి పనిచెయ్యలేకపోతున్నవారి హక్కు కూడా అందులో ఉందని వారు గ్రహించాలి. సహజంగా బుద్ధీజ్ఞానాలున్నా బీదవారవడంచేత విద్యను అభ్యసించలేని బాలల హక్కు కూడా సంపాదనాపరుల ధనంలో ఉంది. వికలాంగులయి ఎలాంటి పనీ చెయ్యలేని అభాగ్యుల హక్కు సయితం అందులో ఉంది. ఈ హక్కుల్ని కాదనే వ్యక్తి పరమ క్రూరుడు, దౌర్జన్యపరుడనడంలో సందేహమేముంది?

వేలాది ప్రజలు సమాజంలో ఒక్కొక్క మెతుకు కోసం అలమటిస్తుంటే, అసంఖ్యాక నిరుద్యోగులు అహర్నిశలు బ్రతుకుతెరువు కోసం బాధపడుతుంటే, మూటలు, కట్టలుగా, కుప్పలు తెప్పలుగా ధనాన్ని కూడబెట్టి, అందమయిన భవంతుల్లో, స్వర్గ సుఖాలను అనుభవించడం, మోటారు కారుల్లో షికార్లు కొట్టడం కన్నా పరమ దౌర్జన్యం, క్రౌర్యం, అత్యాచారం మరొకటి ఏముంది? ఇలాంటి స్వార్థాన్ని ఇస్లాం ఏ మాత్రం సహించదు. స్వార్థానికి ఇస్లామ్ పరమ విరోధి. చేజిక్కిన ధనాన్ని కూడబెట్టి దాన్ని వడ్డీ వ్యాపారంలో పెట్టి ఇతరుల కష్టార్జితాన్ని కూడా తామే కాజేసే బుద్ధిని సృజిస్తుంది - దైవ తిరస్కారుల సంస్కృతి వారిలో. కాని దీనికి భిన్నంగా ఇస్లామ్ తన అనుయాయులైన ముస్లింలకు, "మీ అవసరాలకు మించిన సంపాదనను దైవం మీకు అనుగ్రహిస్తే దాన్ని కూడబెట్టకండి, తోటి సోదరులకు ఇవ్వండి. వారి కనీసావసరాలను తీర్చండి వారు కూడా మీలానే తమ జీవనోపాధిని సంపాయించుకునే స్తోమతను పొందగలుగుతారు" అని బోధిస్తుంది.

## హజ్

ఇస్లామ్ విధించే నాల్గవ విధి హజ్(మక్కా యాత్ర). ఈ విధిని జీవితం మొత్తంలో ఒక్కసారి నిర్వర్తించడం, అదీ పవిత్ర మక్కా నగరం వెళ్ళే స్తోమత గలవాళ్ళు మాత్రమే నిర్వర్తించడం విధి.

# తొలి ఆరాధనాలయం

నేడు దివ్య మక్కా నగరం ఉన్న చోటనే, వేల సంవత్సరాల క్రితం హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) దైవారాధన కొరకు ఓ చిన్న కట్టడాన్ని నిర్మించారు. నిష్కళంకమయిన ఆయన ప్రేమను, భక్తినీ మెచ్చుకుని అల్లాహ్, ఇబ్రాహీం (అస్సలాం) నిర్మించిన గృహాన్ని తన గృహంగా ప్రకటించి ఆదరించాడు. ఇంకా దాన్ని గురించి ఇలా సెలవిచ్చాడుః

"నన్ను ఆరాధించదలచినవారు ఈ గృహాభిముఖులయి ఆరాధించాలి. ముస్లిమయిన వ్యక్తి ప్రపంచంలో ఏ మూలన ఉన్నప్పటికీ అర్హత ఉన్నట్లయితే జీవితంలో కనీసం ఒక్కసారయినా ఈ గృహదర్శనానికై రావాలి. మా ప్రియదాసుడు ఇబ్రాహీం (అస్సలాం) ఏ విధంగా భయభక్తులతో, ప్రేమాభిమానాలతో మా గృహప్రదక్షిణ చేసేవాడో అదే విధంగా ఇక్కడికి వచ్చేవారు ఈ గృహ ప్రదక్షిణ చెయ్యాలి. ఈ గృహోన్ముఖులయి యాత్రలో బయల్దేరేవారు వచ్చేటప్పుడు చిత్తశుద్ధితో రావాలి. మనోకాంక్షల్ని అదుపులో ఉంచుకుని మరీ రావాలి. దుర్మార్గం, రక్తపాతం, దుర్భాషలకు దూరంగా ఉంటూ, వీటినన్నింటినీ త్యజించి మెలగాలి. మీ ప్రభువు సాన్నిధ్యంలో ఏ వినయ వినమ్రతలతో, ఏ విధేయతా భావంతో హాజరుకావడం అవసరమో ఆ విధంగా హాజరు కావాలి. మానవులందరూ ఏ ప్రభు సమక్షంలోనయితే దీనులో, ఆ భూమ్యాకాశాల స్వామి సన్నిధానంలో వెళుతున్నామన్న భావనతో రావాలి. ఇలా వినయవిధేయతలతో వచ్చి నిష్కల్మష హృదయంతో వచ్చి మా ఆరాధన చేసినట్లయితే మిమ్మల్ని మా అనుగ్రహాల ద్వారా సుసంపన్నం చేస్తాము."

# సమగ్ర ఆరాధన

హజ్ యాత్ర ఓ విధంగా దైవారాధనలన్నింటిలో గొప్పదయిన ఆరాధన. దైవభక్తి, దైవం పట్ల ప్రేమాభిమానాలే మనిషి అంతర్యంలో లేకపోతే తన నిత్య కార్యకలాపాలన్నీ వదలి బంధుమిత్రులకు దూరంగా పెద్ద ప్రయాణానికై మనిషి తయారయి ప్రయాసలన్నింటినీ ఎందుకు భరిస్తాడు? కనుక హజ్ సంకల్పమే భక్తిప్రపత్తులకు, నిష్కపటమయిన దైవ ప్రేమకు ప్రబల నిదర్శనం.

ఈ ప్రయాణం సాధారణ ప్రయాణాల్లాంటిది కాదు. ఇందులో ప్రయాణం చేసే వ్యక్తి దీక్ష అంతా దైవంపై కేంద్రీకృతమయి ఉంటుంది. హృదయంలో దైవ గృహం సందర్శించబోతున్నందుకు ఉత్సాహం, ఉల్లాసం, ఉద్వేగాలు ఉప్పొంగుతుంటాయి. కాబా గృహం సమీపించినకొద్దీ భక్తిభావ తరంగాలు ఉవ్వెత్తున లేస్తుంటాయి. అపరాధాలు, అపచారాలు, అవిధేయత పట్ల గుండెల్లో జుగుప్స, అసహ్యం జనిస్తాయి. గత అపరాధాల పట్ల లజ్జ కలుగుతుంది. మనసు ఎంతో క్రుంగిపోతుంది, భావి జీవితంలో దైవ విధేయుడై జీవించే సద్బుద్ధిని ప్రసాదించమని దైవాన్ని వేడుకుంటాడు. ఇక్కడి ఆరాధనలో దైవనామ సంస్మరణలో అపూర్వమయిన తియ్యదనాన్ని ఆస్వాదిస్తాడు. దైవ సాన్నిధ్యంలో సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేసినప్పుడు మళ్ళీ తలెత్తాలన్నా మనసు ఒప్పుకోదు. ఈ దైవ గృహంలో దివ్య ఖుర్‌ఆన్ పారాయణం చేస్తే అనిర్వచనీయమైన ఆనందానుభూతి కలుగుతుంది. ఆ వాతావరణంలో రోజా (ఉపవాస వ్రతం) పాటిస్తే అనుభవంలోకి వచ్చే మాధుర్యమే వేరు!

## చెరగని ముద్ర

అతడు హిజాజ్ (నేటి సఊదీ అరేబియా) భూభాగంలో కాలుమోపగానే ఇస్లామీయ ఉద్యమ ప్రారంభ దశ కళ్ళ ఎదుట ప్రత్యక్షమవుతుంది. దైవ భక్తులు, దైవ మార్గాన ప్రాణాలను సయితం త్యాగం చేసిన మహాత్ముల చిహ్నాలు అక్కడ అడుగడుగునా అగుపిస్తాయి. అక్కడి అణువణువూ ఇస్లామ్ ప్రతిభను, ఇస్లామీయ ఉద్యమ చరిత్రను చాటి చెబుతుంది. అక్కడి ప్రతి రాయి ఈ దివ్య భూమిలోనే దైవ వచనం సర్వోన్నతంగా భాసిల్లిందని ఎలుగెత్తి చాటుతుంది. ఈ విధంగా హజ్ యాత్రకై వెళ్ళిన ముస్లిం ఆంతర్యమంతా దైవ భక్తితో ఇస్లామ్ ప్రేమతో జ్యోతిర్మయమవుతుంది. అమృతమయమవుతుంది. అక్కడ అతని అనుభూతులు, అక్కడ అతను పొందే స్ఫూర్తి అతని మనోఫలకంపై చిరస్థాయిగా చెరగని ముద్రను ప్రతిష్ఠింపజేస్తాయి.

హజ్‌లో పరలోక లాభాలేకాక ఐహిక లాభాలూ అనేకమున్నాయి. హజ్ కారణంగా పవిత్ర మక్కా నగరాన్ని ప్రపంచ ముస్లింల కేంద్రంగా నిర్ణయించాడు అల్లాహ్. ప్రపంచ మూలమూలల నుండి అల్లాహ్ నామ సంస్మరణ చేసేవారు ప్రతి సంవత్సరం ఏక కాలంలో అక్కడ సమావేశమవుతారు. పరస్పరం పరామర్శించుకుంటారు. ఆంతర్యాల్లో ఇస్లామీయ ప్రేమానురాగాలు సుస్థిరమవుతాయి. ముస్లిములు ఏ దేశానికి, ఏ వర్ణానికి, ఏ వర్గానికి చెందినవారయినా వారంతా సోదరులే, ఒకే సంఘానికి చెందినవారే అన్న భావాలు హృదయాల్లో నాటుకుంటాయి. అందువల్లనే హజ్ వాస్తవంలో దైవారాధనే అయినా అది యావత్ప్రపంచ ముస్లిముల సమావేశం కూడా. ముస్లింల విశ్వజనీన సౌభ్రాతృత ఆధారంగా వారిలో ఐక్యత సృజించే సాధనం కూడా ఇదే.

## ధర్మ రక్షణ

దైవం, విశ్వసించినవారిపై విధించిన చివరి బాధ్యత ఇస్లామ్ పరిరక్షణ. ఇది ఇస్లామ్ మౌలిక అంశాల్లో విధి కాకపోయినప్పటికీ ఇస్లామ్ సూచించే విధుల్లో అతి ముఖ్యమయింది. ఖుర్ఆన్, హదీసుల్లో దీనికి ఎంతో ప్రాముఖ్యతనివ్వడం జరిగింది.

## ప్రేమకు ప్రమాణం

ఇస్లామ్ పరిరక్షణ అంటే ఏమిటి? దాన్ని విధిగా నిర్ణయించడానికి గల కారణం ఏమిటి? అన్నవి కాస్త వివరంగా పరిశీలించవలసిన విషయాలు. దాన్ని ఓ ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోడానికి ప్రయత్నిద్దాం. ఒక వ్యక్తి మీతో స్నేహం చేస్తాడనుకుందాం. అతనికి మీతో ఎలాంటి సానుభూతిలేదని అనుభవపూర్వకంగా తేలిపోతుంది, అతడు మీ లాభనష్టాలంటే ఖాతరు చెయ్యడు. తన స్వార్థం కొరకు మీకు నష్టం కలిగించే ఏ పనయినా చెయ్యడానికి వెనుదీయడు. మీకు లాభకరించేదిగా ఉండి, తనకు లాభకరం కాని పనిలో మీతో సహకరించడు. మీపై ఆపద వస్తే సహాయం చెయ్యడు. మీపై అభాండాలు మోపేవారుంటే అతను వారిలో చేరిపోతాడు లేక అపవాదులు విని మౌనం వహిస్తాడు. మీ విరోధులు మీకు ప్రతికూలంగా తీసుకునే చర్యల్లో అతను వారికి తోడ్పడుతాడు. లేక మిమ్మల్ని వారి నుండి రక్షించేందుకు ఏ మాత్రమూ ప్రయత్నించడు. ఇలాంటి వ్యక్తిని మీరు మిత్రుడని అంటారా? ఎన్నటికీ అనరు. వాస్తవానికి అతడు చేసే స్నేహ ప్రకటన కేవలం నోటికే పరిమితం. అతని హృదయంలో మీ పట్ల స్నేహభావం లేనేలేదన్నమాట.

తన మిత్రుని పట్ల నిష్కపటమయిన ప్రేమ, సానుభూతి శ్రేయోభిలాషకలవాడే కదా నిజమయిన మిత్రుడు. మిత్రుడు అయినవాడు తోటి స్నేహితుని అవసరాల్లో అతనికి బాసటగా నిలవాలి, శత్రువుల్ని ఎదుర్కొని అతన్ని రక్షించాలి. అతన్ని గురించి దుర్భాషలు, దూషణలు విన్నప్పుడు దాన్ని సహించరాదు. ఇలాకాక మర్కోవిధంగా వ్యవహరిస్తే అతడు వంచకుడు, ద్వంద్వ స్వభావి, కపటి. అతని మైత్రి నిజానికి ద్రోహం.

## విశ్వాసానికి గీటురాయి

ఈ ఉదాహరణ దృష్ట్యా కాస్త గమనించండి. మీరు ముస్లిములయ్యే ప్రకటన చేశారంటే మీపై తారసిల్లే విద్యుక్త ధర్మం ఏదో, మీ బాధ్యతలేవో కాస్త ఆలోచించండి. ముస్లిం అయినందుకు మీలో ఇస్లామీయ స్వాభిమానం జనించాలి. ఈమాన్ (విశ్వాసం) సృష్టించే ఆత్మగౌరవం మీలో ఉండాలి. ఇస్లామ్ పట్ల ప్రేమాభిమానాలు, సానుభూతి మీలో కలగాలి. ముస్లిం సోదరుల పట్ల శ్రేయోభిలాష మీలో ఏర్పడాలి. ప్రపంచంలో మీరు చేసే పని ఏదయినా అందులో ఇస్లామ్ హితైషులుగా, ముస్లింల మేలును కోరేవారుగా మీరు వ్యవహరించాలి. స్వలాభం కొరకో లేక సొంత నష్టాన్నుండి తప్పించుకోడానికో ఇస్లామ్ ఆదర్శాలకుగాని, ముస్లిముల ప్రయోజనాలకుగాని భంగం వాటిల్లజేసే ఏ పనీ మీరు చెయ్యరాదు. ఇస్లామ్, ముస్లిముల ప్రయోజనాలుగల ప్రతి కార్యంలోనూ మీరు మీ ధన ప్రాణాలతో సహకరించాలి. ఇస్లామ్, ముస్లింలకు నష్టాన్ని చేకూర్చే ప్రతి పనికీ దూరంగా మెలగాలి.

తమ జీవన వ్యవస్థ (ధర్మం, దీన్) తమతోటి అనుచర సంఘం (ధార్మిక సంఘం ఉమ్మత్) యొక్క గౌరవమే తమ గౌరవంగా మీరు భావించాలి. మీరు మీకు కలిగే అగౌరవాన్ని మీకు కలిగే అప్రతిష్ఠను ఏ విధంగా

సహించరో అదే విధంగా ఇస్లామ్, ఇస్లామీయ సమాజానికి కలిగే అగౌరవాన్ని సహించరాదు. మీరు ఏ విధంగానయితే తమ విరోధులకు, శత్రువులకు ఎట్టి పరిస్థితిలోనూ తోడవ్వరో అదే విధంగా మీరు ఇస్లామ్ మరియు ముస్లిముల విరోధులకు, శత్రువులకు తోడవరాదు. మీరు మీ ధన మాన ప్రాణాల రక్షణకై ఎలాంటి త్యాగానికైనా ఎలా సిద్ధమవుతారో అలాగే ఇస్లామ్ మరియు ముస్లిముల రక్షణకై మీరు ఎలాంటి త్యాగానికయినా కంకణబద్ధులవ్వాలి. ఈ ఉత్తమ గుణాలన్నీ తాను ముస్లిమని చాటుకునే ప్రతి వ్యక్తిలోనూ ఉండవలసిందే, లేకపోతే అతన్ని మునాఫిక్‌గా, వంచకునిగా, కపటునిగా పరిగణించడం జరుగుతుంది. స్వయంగా అతని ఆచరణే అతని మిథ్యా వాదాన్ని బహిర్గతం చేస్తుంది.

## జిహాద్

ఇస్లామ్ రక్షణలో ఒక విభాగం ప్రత్యేకంగా ఉంది. దాన్ని ఇస్లామీయ శాసనాంగం (షరీఅత్)లో "జిహాద్" అనంటారు. "జిహాద్" అంటే ఒకానొక కార్యసాధనకై నిరంతర కృషి చేస్తూ తన శక్తినంతటినీ ధారపొయ్యటం అని భావం. అంటే తన ధనంతో, కలంతో, మాటలతో, చేతలతో దైవ వచనాన్ని ఉన్నతం చెయ్యడానికి కృషి చేసే ఏ వ్యక్తి అయినా "జిహాద్"లోనే నిమగ్నుడయి ఉన్నాడన్నమాట, కాని "జిహాద్" అనే పారిభాషిక పదాన్ని, ప్రాపంచిక ప్రయోజనాలన్నింటికీ అతీతంగా కేవలం దైవానుగ్రహం పొందే అభిలాషతో చేసే పోరాటానికి ప్రత్యేకంగా ప్రయోగించడం జరిగింది. షరీఅత్ పరిభాషలో జిహాద్‌ను "ఫర్జుల్ కిఫాయ" (సామూహిక కర్తవ్యం) గా పేర్కొనడం జరిగింది. అంటే ఇది ముస్లిములందరికీ వర్తించినప్పటికీ కొందరు వ్యక్తుల ఓ వర్గం దీన్ని నిర్వర్తిస్తే అందరి బాధ్యతా తీరిపోతుంది.

కాని ఒక ఇస్లామీయ రాజ్యంపై శత్రువుదాడి జరిపిన పక్షంలో ఆ దేశ వాసులందరిపై నమాజ్, రోజాల మాదిరిగానే జిహాద్ కూడా ముఖ్య విధిగా రూపొందుతుంది. ఆ దేశవాసులకు శత్రువును ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు లేకపోతే పొరుగున ఉండే ముస్లిం రాజ్యాలు ఆ దేశాన్ని బలపరచడం అనివార్యం, అయినప్పటికీ శత్రువును జయించడం సాధ్యం కాకపోతే వారికి సహాయ సహకారాలందజెయ్యడం ప్రపంచ ముస్లింలందరి విద్యుక్తధర్మ మవుతుంది - నమాజ్, రోజాలు ప్రతి ముస్లిం ఆచరించవలసిన ధర్మమ యినట్లు! అంటే ఏ వ్యక్తయినా ఈ బాధ్యతను నిర్వర్తించడంలో అలక్ష్యం కనబరిస్తే అతడు అపరాధం చేసినవాడవుతాడు.

## అత్యున్నత ఆరాధన

ఇలాంటి సందర్భాల్లో జిహాద్ ప్రాముఖ్యత నమాజ్, రోజాలకంటే అధికతరమవుతుంది. ఎందువల్లనంటే జిహాద్ నిజానికి మనిషిలోని ఈమాన్‌కు (విశ్వాసానికి) పరీక్షా సమయం. ఇస్లామ్, ముస్లిములు ఆపదల్లో ఉన్నప్పుడు ముందుకువచ్చి అండగా నిలువని వ్యక్తి విశ్వాసం (ఈమాన్) సందేహాలకు ఆస్కారం కల్పిస్తుంది. అతడు చేసే నమాజ్, పాటించే రోజా వ్రతాలు ఎవరికొరకు చేస్తున్నట్లు ? తన ప్రేమకు తార్కాణంగా నిలువని నమాజ్, రోజాల విలువెంత?

ఇలాంటి సమయాల్లో ఇస్లామ్, ముస్లిముల విరోధులతో కలసి వారికి తోడుగా నిలిచే దౌర్భాగ్యుడెవడయినా ఉంటే అతడు మునాఫిక్ (కాపట్యంగల వ్యక్తి, వంచకుడు) అనడంలో సందేహం లేదు. అతని నమాజ్, రోజా, జకాత్, హజ్ - అంతా నిరర్థకాలు, నిష్ప్రయోజకాలు.

# ఆరవ అధ్యాయం

# దీన్, షరీఅత్

ఇంతవరకు మనం పరిశీలించిన విషయాలన్నీ దీన్ (ధర్మం-విశ్వాసాలు, ఆరాధనలు)కు సంబంధించినవి. ఇప్పుడు మహాప్రవక్త(సఅసం) అందజేసిన షరీఅత్ (శాసనాంగం) ను గురించి పరిశీలిద్దాము. అయితే ముందు "షరీఅత్" అన్నది ఏమిటో చూడటం ముఖ్యం.

## దీన్, షరీఅత్‌ల వ్యత్యాసం

వెనుకటి పుటల్లో దైవ ప్రవక్తలందరూ ఇస్లామ్ జీవన మార్గాన్నే (ఇస్లామ్ దీన్‌ని, ఇస్లామ్ ధర్మాన్ని) బోధిస్తూ వచ్చారని తెలుసుకున్నాము. దేవుని గుణగణాల గురించి, మరణానంతర జీవితంలో లభించే శిక్ష, బహుమానాలను గురించి దేవుని నిజ ప్రవక్తలు బోధించిన విధంగా విశ్వసించడం, దైవ గ్రంథాలను నమ్మడం, తమ సొంత కాల్పనిక విధానాలను వదలి, ఆ గ్రంథాల్లో బోధించబడిన జీవిత విధానాన్నే పరమ సత్యమయినదిగా విశ్వసించడం, దైవప్రవక్తల విధేయులుగా మెలగటం, మరెవరినీ కాక వారినే అనుసరించడం, మరెవరినీ దేవుని సహవర్తులుగా ఎంచకుండా ఆయన్నే ఆరాధించడం, ఈ "ఈమాన్" (విశ్వాసం), ఈ 'ఇబాదత్" (ఆరాధన)లనే "దీన్" (ధర్మం) అనంటారు. దైవ ప్రవక్తలందరూ బోధించిన "ధర్మం" ఇదే.

ఇప్పుడు మరో విషయముంది. దాన్నే షరీఅత్(శాసనాంగం, ధర్మ

శాస్త్రం) అనంటారు. ఇందులో ఆరాధనారీతులు, సామాజిక సిద్ధాంతాలు, మనుషుల మధ్య సంబంధాలు, వారి పరస్పర వ్యవహారాలు, ధర్మాధర్మ విషయాలు, (హలాల్, హరామ్), న్యాయాన్యాయాల పరిధులు తదితర విషయాలన్నీ చేరి ఉన్నాయి. ఈ విషయాలన్నింటిలో దేవుడు ప్రారంభం నుండి కాలానుగుణంగా ఆయా జాతుల పరిస్థితులకు తగినట్లుగా షరీఅత్‌లను తన ప్రవక్తల ద్వారా పంపించాడు. ఆ ప్రవక్తలు ప్రతి జాతిలోనూ వేర్వేరుగా సభ్యతా సంస్కారాల వివరాలు, నైతిక బోధనలు ప్రచారం చేసి క్రమేణ ప్రజలంతా ఓ మహత్తరమయిన శాసనాంగాన్ని అనుసరించ గలిగేలా వారిని మలచుతూ వచ్చారు. ఈ కార్యం పూర్తయిన తరువాత విశ్వ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా ప్రపంచం మొత్తానికి సమంగా వర్తించే సముచితమయిన నియమాలుగల గొప్ప శాసనాంగాన్ని అవతరింపజేశాడు అల్లాహ్.

దీన్ మాత్రం వెనుకటి ప్రవక్తలు బోధించినదేకాని, వెనుకటి ప్రవక్తలు తెచ్చిన షరీఅత్‌లు మటుకు రద్దయిపొయ్యాయి. వాటి స్థానే మానవులందరికీ సమంగా వర్తించే షరీఅత్, అంటే, ఆరాధనా విధానాలు, సామాజిక రీతులు, మానవుల పరస్పర వ్యవహారాల నియమాలు, ధర్మాధర్మాల, న్యాయా న్యాయాల పరిధులు నెలకొల్పబడ్డాయి.

## షరీఅత్ మూలాధారాలు

మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) అందజేసిన షరఅత్ సిద్ధాంతాలకు మూలాధారాలు రెండు. ఒకటి దివ్య ఖుర్‌ఆన్, రెండవది హదీస్. పవిత్ర ఖుర్‌ఆన్‌ను గురించి, అది దైవవాణి అని, దాని ఒక్కొక్క పదమూ దైవం తరఫున అవతరించిందని తెలుసుకున్నాము. ఇక హదీసు అంటే ఏమిటో పరిశీలించాలి.

హదీసు అంటే మహాప్రవక్త (సఅసం) ఆదేశాలు, ఉపదేశాలని భావం. ప్రవక్త శ్రేష్ఠుల (సఅసం) జీవితం మొత్తం ఖుర్ఆన్ ఆచరణాత్మక వివరణే. ఆయన ప్రవక్తగా నియుక్తులయిన తరువాత 23 ఏండ్ల కాలంలోని ప్రతి క్షణంలోనూ తన సహచరులకు బోధనలు చెయ్యడంలోను వారికి సుశిక్షణ గరపడంలోను నిమగ్నులయి ఉన్నారు. తన మాటల ద్వారా, చేతల ద్వారా దైవేచ్ఛ ప్రకారం జీవితం గడిపే విధానమేదో ప్రజలకు తెలిపారాయన. ఆయన జీవిత కాలంలో ఆయన సహచరులైన స్త్రీ పురుషులు, ఆయన బంధువులు, భార్యలు అందరూ ఆయన పలికిన ప్రతి మాటను శ్రద్ధగా వినేవారు, చేసిన ప్రతి పనిని పరిశీలనగా గమనించేవారు, తమకు ఎదురైన ప్రతి విషయంలో షరీఅత్ ఆదేశమేమిటో ఆయన్నడిగి తెలుసుకునేవారు.

ఒక్కోసారి మహాప్రవక్త (సఅసం) ఓ కార్యాన్ని చెయ్యమని లేక మరో కార్యాన్ని చెయ్యరాదని ఆదేశించేవారు. అక్కడ ఉన్న వారంతా ఆ ఆదేశాన్ని కంఠస్థం చేసుకునేవారు. ఒక్కోసారి ప్రత్యేక రీతిలో ఓ ప్రత్యేక కార్యాన్ని మహాప్రవక్త చేసేవారు, చూసేవారంతా ఆ సన్నివేశాన్ని, మహా ప్రవక్త ఆ పనిని చేసిన రీతిని అలాగే జ్ఞాపకముంచుకునేవారు. అక్కడలేని వారికి ఆ పనిని మహాప్రవక్త చేసిన తీరును చేసి చూపించేవారు. అలాగే ఆయన సమక్షంలో ఎవరయినా ఒకపనిని చేసినప్పుడు దాన్ని చూసి మహాప్రవక్త (సఅసం) మౌనం వహించేవారు లేదా తన ఆమోదాన్ని, ఆ పనిపట్ల తన ప్రసన్నతను వెలిబుచ్చే వారు లేదా దాన్ని చెయ్యరాదని నిషేధించేవారు. ఈ సంఘటన మొత్తాన్ని అక్కడున్నవారు పూర్తిగా జ్ఞాపక ముంచుకునేవారు. ఇవే హదీసు లనబడతాయి.

ఇలాంటి విషయాలన్నీ ఆయన (సఅసం) సహచరులయిన స్త్రీ పురుషుల ద్వారా ఆనాటి ప్రజలు, తరువాతి వారు కూడా విన్నారు.

కొందరు వాటిని యధాతథంగా కంఠస్థం చేసుకున్నారు. కొందరు వ్రాసుకున్నారు. అంతేకాదు, ఈ సమాచారమంతా తమకు ఎవరెవరి ద్వారా ఎలా చేరిందో కూడా పేర్ల వివరాలతో సహా జ్ఞాపకముంచుకున్నారు. క్రమేణ ఇలాంటి ఉల్లేఖనాలన్నింటినీ గ్రంథస్థం చెయ్యనారంభించారు. ఈ విధంగా హదీసుల గొప్ప సంకలనా గ్రంథాలు ఉనికిలోకి వచ్చాయి. వీటిలో ఇమామ్ మాలిక్(రహ్మతుల్లా అలైహి), ఇమామ్ బుఖారీ (రహ్మలై), ఇమామ్ ముస్లిం (రహ్మలై), ఇమామ్ అబూదావూద్(రహ్మలై), ఇమామ్ నసాయి(రహ్మలై), ఇబ్నుమాజ(రహ్మలై)సంకలనం చేసిన గ్రంథాలు అతి ప్రామాణికమయినవిగా పరిగణించబడతాయి.

## ఫికహ్ (ఇస్లామీయ న్యాయశాస్త్రం)

ఖుర్ఆన్, హదీసుల్లో ఉన్న ఆదేశాలను విశ్లేషించి వాటి నుండి నియమాలు, చట్టాలు సేకరించి కొందరు మహానుభావులు సామాన్య ప్రజల ఉపయోగార్థం వాటిని సంకలనం చేశారు. దీన్నే "ఫికహ్" అనంటారు. ప్రతివ్యక్తి దివ్య ఖుర్ఆన్‌లోని సూక్ష్మ విషయాలను గ్రహించజాలడు. ప్రతి వ్యక్తికీ షరీఅత్ ఆదేశాలను తెలుసుకోడానికి తగినంత 'హదీసు' పరిజ్ఞానం ప్రాప్తం కాదు. అందువల్లనే మన పూర్వీకులు ఏండ్ల తరబడి శ్రమించి కృషిచేసి, పరిశోధన, విశ్లేషణ, చింతనల ద్వారా ఫికహ్‌ను సంకలనం చేశారు. వీరు చేసిన ఈ మహోపకార ఋణాన్ని ముస్లిం జగత్తు ఎన్నటికీ తీర్చుకోజాలదు. వారి కృషిఫలితంగానే కోట్లాది ముస్లిములు నేడు ఎలాంటి శ్రమ లేకుండానే షరీఅత్‌ని అనుసరిస్తున్నారు. దైవాదేశాలేవో, దైవప్రవక్త ఆచరణ ఏదో తెలుసుకోవడం నేడు ఏ మాత్రం కష్టతరం కాదు.

ప్రారంభంలో చాలా మంది మహనీయులు తమ తమ పరిశోధనల ప్రకారం ఫికహ్ సంకలనం చేశారు. కాని కాలక్రమేణ నాలుగు ఫికహ్‌లు

స్థిరమయిపొయ్యాయి. నేడు ప్రపంచంలో ముస్లిములు అధికంగా వీటినే అనుసరిస్తున్నారు అవి :

1. ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) సంకలనం చేసిన ఫిక్హ్, దీని సంకలనాకార్యంలో ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ జుఫర్(రహ్మలై) ఇంకా ఇతర శాస్త్రవేత్తలు కూడా పాల్గొన్నారు. దీన్ని "హనఫీ ఫిక్హ్" అనంటారు.
2. ఇమామ్ మాలిక్ (రహ్మలై) సంకలనం చేసిన ఫిక్హ్, దీన్ని "మాలికీ ఫిక్హ్" అనంటారు.
3. ఇమామ్ షాఫియీ (రహ్మలై) సంకలనం. దీని పేరు "షాఫియీ ఫిక్హ్".
4. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై) చే సంకలితమయిన ఫిక్హ్. "హంబలీ ఫిక్హ్" అని దీని పేరు.

ఈ నాలుగు ఫిక్హ్లను దైవ ప్రవక్త (సలసం) పరమపదించిన తరువాత రెండు వందల ఏళ్ళకు సంకలనం చెయ్యడం జరిగింది. వీటిలో ఉన్న విభేదాలు అన్నీ సహజమయినవే. కొందరు వ్యక్తులు ఒక విషయాన్ని పరిశోధిస్తే లేక దేన్నయినా అర్థం చేసుకోడానికి కృషి సలిపితే వారి పరిశోధన, అవగాహనల్లో ఏదో కొంత భేదం ఉండటం అనివార్యం. అయితే ఈ మహాపురుషులందరూ సత్యప్రియులు, నిష్కపట మనస్కులు, సత్సంకల్పం కలవారు, ముస్లిముల హితైషులు అవటంచేత ముస్లిములందరూ ఈ నాలుగు ఫిక్హ్లను సత్యమయినవిగా విశ్వసిస్తారు.

ఈ సందర్భంలో ఒక విషయం గమనార్హం. ఎవరయినా ఏ వ్యవహారంలోనయినా ఒకే విధానాన్ని అవలంబించడమే సాధ్యం. నాలుగు విభిన్న వాదాలను పాటించడం సాధ్యపడదు. అందుచేత ఈ నాల్గింటిలో

ఏదో ఒకదాన్ని మాత్రం ముస్లింలు అనుసరించాలని ఇస్లామ్ ధర్మవేత్తలు అభిప్రాయపడతారు.

ఇంకా కొందరు ధర్మవేత్తలు, ఏ ఫిక్హ్‌ను కూడా అనుసరించవలసిన అవసరంలేదని, జ్ఞానంగల ప్రతి వ్యక్తి నేరుగా ఖుర్‌ఆన్, హదీసుల ద్వారా షరీఅత్ ఆదేశాలను పరిగ్రహించి అనుసరించాలని అభిప్రాయపడతారు. ఆ మేరకు ధార్మిక పరిజ్ఞానం లేకపోతే తనకు నమ్మకమున్న ఏ ధర్మవేత్త ద్వారా నయినా షరీఅత్ ఆదేశాలు తెలుసుకుని పాటించాలని వీరు అంటారు. వీరిని "అహ్లె హదీస్" అనంటారు. పైన పేర్కొన్న నాలుగు ఫిక్హ్ సంప్రదాయాల మాదిరిగా వీరి విధానంకూడా సరయినదే.

# తసవ్వుఫ్ (ఆధ్యాత్మిక తత్త్వం)

ఫిక్హ్‌కు మానవుని బాహ్యాచరణతోనే సంబంధం. మానవులకు అందజెయ్యబడిన ఆదేశాలను వారు పాటించారా? లేదా? అన్న విషయాన్ని మాత్రమే అది పరిశీలిస్తుంది. ఆజ్ఞాపాలన సరిగ్గా జరిగినట్లయితే మన ఆంతర్యం, మానసిక స్థితి ఎలా ఉన్నాయో అది పట్టించుకోదు. ఈ ఆంతర్య పరిశీలనా తత్వాన్నే "తసవ్వుఫ్" ★ అనంటారు. ఉదాహరణకు మీరు నమాజ్ చేస్తారు. అందులో ఫిక్హ్ గమనించే విషయాలు, కేవలం మీరు వుజూ సరిగ్గా చేశారా? లేదా ? కాబాభిముఖులయి నిల్చున్నారా? లేదా?

---

★ దివ్య ఖుర్‌ఆన్‌లో "తజ్‌కియా", "హిక్మత్" అని పేర్కొనబడినది. దీన్నే హదీసుల్లో "ఇహ్‌సాన్" అని ప్రస్తావించడం జరిగింది. తరువాతి కాలంలో సామాన్య ప్రజల్లో అది "తసవ్వుఫ్" అని స్థిరపడిపోయింది.

పఠించవలసిన స్మరణ వచనాలు సరిగ్గా పఠించారా ? లేదా? ఇంకా, ఏ వేళకు ఎన్ని రకాతుల★ నమాజ్ చెయ్యాలో ఆ వేళకు సరిగ్గా ఆ లెక్క ప్రకారమే నమాజ్ చేశారా? లేదా? అన్న విషయాలు మాత్రమే, ఇవన్నీ మీరు సరిగ్గా ఆచరించారంటే మీ నమాజ్ పరిపూర్ణమయింది అన్నమాట.

కాని, ఈ ప్రార్థనలో మీ మానసిక స్థితి ఎలా ఉండింది? మీరు దైవం వైపునకే దీక్షను సరిగా మళ్ళించారా? మీ ఆంతర్యం ప్రాపంచిక విషయాల తలంపులతో కలుషితంకాక స్వచ్ఛంగా ఉండిందా? నమాజ్ వల్ల మీలో దైవ భీతి, దేవుడు ప్రతి చోటా ఉంటాడన్న భావన ఆయన ప్రతిదాన్నీ చూడగలడన్న భావన పటిష్టమయ్యాయా? కేవలం ఆయన ప్రసన్నత పొందాలన్న ఆకాంక్ష మాత్రమే మీలో ఉత్పన్నమయిందా? మీ ఆంతర్యం, మీ ఆత్మ ఏ మేరకు ప్రక్షాళితమయ్యాయి? మీ నైతిక నడవడి ఎంతవరకు సంస్కరించబడింది? ఈ నమాజ్ మిమ్మల్ని ఏ మేరకు దృఢచిత్తుడయిన, నిజమయిన ముస్లింగా తయారుచెయ్యగలిగింది? అన్న విషయాలను పరిశీలించేది తసవ్వుఫ్.

నమాజ్ (ప్రార్థన) అసలు ఉద్దేశాలయిన ఈ విషయాలు ఎంతగా పరిపూర్ణత చెందితే తసవ్వుఫ్ దృష్టిలో మీ ప్రార్థన అంతగానే పరిపూర్ణమయిందన్నమాట. ఈ విషయాలు ఎంతగా కొరవడితే నమాజ్ కూడా ఆ మేరకు అసంపూర్ణంగా ఉంటుందన్నమాట.

## అంతర్బాహ్యాలు

ఇదేవిధంగా షరీఅత్ ఆదేశాలన్నింటి విషయంలో ఫిక్హ్ పరిశీలించేది, మీరు ఆ ఆదేశాన్ని ఏ విధంగా పాటించాలో ఆ విధంగా పాటించారా లేదా

★ నమాజ్ తాలూకు నిర్దిష్టమయిన ఓ కాలమానం.

అన్న విషయం మాత్రమే. కాని తసవ్వుఫ్ మాత్రం, ఈ ఆజ్ఞాపాలనలో మీ ఆంతర్యాన చిత్తశుద్ధి, సంకల్ప శుద్ధి, నైర్మల్యం ఏ మేరకు ఉంటాయో గమనిస్తుంది.

ఈ వ్యత్యాసాన్ని ఓ ఉదాహరణ ద్వారా అర్థం చేసుకుందాం. మనం మనతో కలిసే ప్రతి వ్యక్తిని రెండు విధాలుగా పరికిస్తాము. ఒకటేమిటంటే, అతను ఆరోగ్యంగా ఉన్నాడా, అంగసౌష్ఠవం కలిగి ఉన్నాడా? లేక వికలాంగుడై ఉన్నాడా? రూపురేఖలెలా ఉన్నాయి? అందంగా ఉంటాడా? వికృతంగానా? అతడు ధరించిన బట్టలు పరిశుభ్రమయినవా? మాసిపోయినవా? అన్న విషయాల దృష్ట్యా పరిశీలిస్తాము. రెండో విషయమేమంటే, అతని ప్రవర్తన ఎలాంటిది? అలవాట్లు, స్వభావాలూ ఎలా ఉన్నాయి? బుద్ధీవివేకాల స్థాయి ఏది? చదువుకున్నాడా, నిరక్షరాస్యుడా? గుణవంతుడా? దుర్మార్గుడా? అన్నవాటిని పరిశీలిస్తాము. మొదటి చూపు ఫిక్హ్‌కు సంబంధించింది, రెండోది తసవ్వుఫ్‌కు చెందింది. ఎవరినయినా స్నేహానికై మీరు ఎన్నుకుంటే, అతని వ్యక్తిత్వంలోని ఈ రెండు రూపాలనూ గమనిస్తారు. అతని బాహ్యస్వరూపమూ మంచిదై అంతర్ స్వభావమూ అందమయినదయి ఉండాలని కాంక్షిస్తారు.

ఇదే విధంగా షరీఅత్ ఆదేశాలను అనుసరించడం అన్నది బాహ్యపరంగానూ సజావుగా వుండి, ఆంతరంగికంగానూ సరయినదయి ఉండాలి. అలాంటి జీవితమే ఇస్లామ్‌లో అభిలషణీయమయింది. ఒకరి బాహ్య విధేయత సవ్యంగా ఉండి ఆంతర్యంలో విధేయతా భావన శూన్యమయితే అతను అందమైన ఓ మృతకళేబరంతో సమానం. ఎవరి ఆచరణలోనయితే అంతర్ లక్షణాలు మాత్రం అందమయినవయి బాహ్యస్వరూపం సరయినదయి లేకపోతుందో అతడు ఎంతో ఆదరణీయుడయిన సజ్జనుడే కాని, వికలాంగుడు, కురూపి అయినవాడన్నమాట!

ఈ ఉదాహరణ ద్వారా ఫిక్హ్ మరియు తసవ్వుఫ్‌ల మధ్యగల వ్యత్యాసం సరిగ్గా బోధపడి ఉంటుంది. కాని ఈ సందర్భంలో ఒక విషయం మాత్రం ఎంతో విచారకరమైనది మనకు ఎదురవుతుంది. ఇస్లాం ఆవిర్భావపు తొలినాటి సత్ పురుషుల తరువాతి కాలంలో ధర్మజ్ఞానం కొరవడి, నైతిక పతనం అధికమవడం చేత ఎన్నో రుగ్మతలు పొడసూపనారంభించాయి. వాటితో పాటు తసవ్వుఫ్ పరిశుద్ధ సరోవరం కూడా మలినమయిపోయింది.

## దారితప్పిన సూఫీలు

ప్రజలు రకరకాల ఇస్లామేతర తత్వాలు, మార్గం తప్పిన జాతుల నుండి పరిగ్రహించి తసవ్వుఫ్ పేరిట ఇస్లాంలో ప్రవేశపెట్టారు, చిత్రవిచిత్రమయిన నమ్మకాలు; వింతయిన ఆచారాలకు తసవ్వుఫ్ అని పిలువసాగారు. వాటికి ఏ ఆధారమూ ఖుర్ఆన్ మరియు హదీసుల్లో గోచరించదు. ఈ దృక్పథంగల ప్రజలు క్రమేణ షరీఅత్ అనుసరణ నుండి "విముక్తు"లవసాగారు. తసవ్వుఫ్‌కు షరీఅత్‌తో ఎలాంటి సంబంధం లేదు. ఈ మార్గమే వేరు అని వాదించారు. "సూఫీ" (తసవ్వుఫ్‌ను సాధన చేసే వ్యక్తి) కి షరీఅత్ నియమ నిబంధనల అనుసరణతో పనేమిటి? అని ప్రశ్నించారు.

ఇలాంటి మాటలు సాధారణ జ్ఞానంలేని సూఫీలు తరచుగా అంటూ ఉంటారు కాని నిజానికి ఇదంతా బూటకం, అసత్యం. షరీఅత్ ఆదేశాలతో సంబంధంలేని తసవ్వుఫ్ ఇస్లామ్ దరిదాపుల్లోకి కూడా చేరే అవకాశం లేదు. నమాజ్, రోజా, హజ్, జకాత్ - వీటి పాటింపు నుండి "విముక్తు" డవడానికి ఏ వ్యక్తికయినా, ఏ "సూఫీ"కయినా అధికారం లేదు. దైవం, దైవ ప్రవక్త సూచించిన సామాజిక, ఆర్థిక, నైతిక, వ్యావహారిక, ఆదేశాలను మనుషులకు వర్తించే హక్కులను, విధులను, ధర్మాధర్మ పరిధులను కాదనే, అతిక్రమించే హక్కు ఏ సూఫీకీ లేదు.

# ప్రేమకు ప్రతిరూపం

దైవ సందేశహరుడు ముహమ్మద్ (సఅసం)ను అనుసరించని వ్యక్తి ఆయన చూపిన విధానాన్ని పాటించని వ్యక్తి ముస్లిమ్ అని పిలుచుకునేందుకే సిగ్గుపడాలి. సూఫీ అయ్యే అర్హత ఎలా పొందుతాడు?

తసవ్వుఫ్ అంటే వాస్తవానికి, దైవం పట్ల భక్తితత్పరతలకు, దైవప్రవక్త (సఅసం) ఎడల అనురాగపూర్వకమయిన, త్యాగభావంతో కూడుకున్న ప్రేమకు మారు పేరు. భక్తిప్రేమభావాలు ఉన్నచోట దైవాజ్ఞాపాలనను, ఆయన ప్రవక్త అనుసరణను త్రోసిరాజనే భావం దరిచేరదు. వాటికి విముఖులయి నడిచే ఊహ కూడా కలగదు. కనుక తసవ్వుఫ్ షరీఅత్‌కు అతీతమయినది కాదు. అది షరీఅత్ ఆదేశాలను నిర్మల మనస్సుతో చిత్తశుద్ధితో, సంకల్పశుద్ధితో పాటింపజేస్తుంది. విధేయతాభావంలో దైవ ప్రేమను, దైవ భక్తిని, దైవ భీతిని రంగరించి పోసి దాన్ని సజీవంచేసే తత్వాన్నే తసవ్వుఫ్ అనంటారు.

# ఏడవ అధ్యాయం

# షరీఅత్ ఆదేశాలు

ధరణిపై మానవ మనుగడకు ఒక్క దైవ మార్గదర్శకత్వం తప్ప మరో సరయిన పంథా లేదని, అది దేవుని అంతిమ సందేశహరుడు ముహమ్మద్ (సఅసం) ద్వారా దివ్య ఖుర్ఆన్ రూపంలో మానవాళికి ప్రసాదించబడిందని మనం తెలుసుకున్నాము. ప్రవక్త ముహమ్మద్(సఅసం) బోధించిన విశ్వాసాలు, ఆరాధనా విధానాలు కూడా పరిశీలించాము. మానవ జీవనానికి సంబంధించిన సమగ్ర జీవన వ్యవస్థ తాలూకు శాసనాలను నియమాలను సూచించే "షరీఅత్" (ఇస్లామీయ శాసనాంగం) ను ఇక అధ్యయనం చేద్దాము.

షరీఅత్ సిద్ధాంతాలేవో, అది చూపే ముఖ్యమయిన ఆదేశాలేవో వివరంగా చూడవలసి ఉంటుంది. అప్పుడే, ఇస్లామీయ షరీఅత్, మానవ జీవితాన్ని ఉత్తమమైన వ్యవస్థలో ఏ విధంగా క్రమబద్ధం చేస్తుందో, ఆ వ్యవస్థలో ఏ విధమయిన వివేచనాపూరితమైన మర్మ హేతువులున్నాయో బోధపడుతుంది.

## షరీఅత్ సిద్ధాంతాలు

మనం మన ఉనికిని, దాని లోతుపాతుల్ని కాస్త శ్రద్ధగా పరిశీలించామంటే మనం ప్రపంచంలోకి అనేక శక్తిసామర్థ్యాలతో వచ్చామని, ప్రతి శక్తిని స్వయంగా మనకు ప్రయోజనకరమయ్యేలా వినియోగించుకోవడమే అభిలషణీయమని అర్థమవుతుంది. మనలో వివేచన, విచక్షణాజ్ఞానాలున్నాయి; మానసిక శక్తులూ ఉన్నాయి; కోరికలూ కాంక్షలూ ఉన్నాయి; చూచే వినే

శక్తులున్నాయి; కాళ్ళూ చేతుల బలమూ ఉంది; ద్వేషమూ ఉంది; ఆగ్రహావేశమూ ఉంది; ప్రేమానురాగాలూ ఉన్నాయి, భయము ఆశాప్రలో భాలూ ఉన్నాయి. వీటిలో ఏదీ నిరుపయోగం కాదు. మనకు వీటి ఆవశ్యకత ఉంది గనుకనే వీటిని మనకు ప్రసాదించడం జరిగింది. మన నైజం, మన ప్రకృతి దేన్నయితే కాంక్షిస్తుందో దాన్ని తీర్చడంలోనే మన మనుగడ, దాని సాఫల్యం ఇమిడి ఉన్నాయి. అయితే దైవం మనకు ప్రసాదించిన శక్తుల్ని వినియోగించుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది.

## ఈ లోకం మనిషి కోసం

మనకు శక్తులివ్వడమే కాదు, వాటిని వినియోగపరచుకునే సాధనాలను సయితం ప్రసాదించటం జరిగింది. ప్రప్రథమంగా మన శరీరాన్ని తీసుకుందాము, ఇందులో కావలసిన అవయవాలన్నీ అమర్చబడి ఉన్నాయి. మన చుట్టుప్రక్కలనున్న ప్రపంచాన్ని చూస్తే అక్కడ కూడా రకరకాల వస్తువులు పరికరాలున్నాయి. మన సహాయానికి స్వయంగా మనలాంటి మానవు లున్నారు. మన సేవకై పశువులున్నాయి. చెట్లూ గుట్టలూ ఉన్నాయి. నేల, నీరు, గాలి, వేడి, వెలుగు ఇంకా అసంఖ్యాకమయిన వనరులున్నాయి, మనం మన జీవితాన్ని సవ్యంగా గడుపుకోడానికి వీటినన్నింటినీ వినియోగించు కునేందుకు, వీటి సహకారం పొందేందుకు వీటిని సృష్టించాడు ఆ ప్రభువు.

ఈ విషయాన్ని మరో విధంగా పరిశీలిస్తే తెలిసేదేమంటే మనకు అనుగ్రహించబడిన శక్తులన్నీ మనం వాటిద్వారా ప్రయోజనం పొందడానికేగాని నష్టపోవటానికి మాత్రం కాదు, వీటిని "సరయిన విధంగా" మనం వినియోగించుకున్నామంటే ఆ వినియోగం ప్రయోజనకరంగానే ఉండితీరాలి. ఒకవేళ ఏ మాత్రమయినా నష్టం కలిగినా అది కేవలం అనివార్యమయిందే అయి ఉండాలి. ఈ విధంగా ప్రయోజనకరమయిన వినియోగం తప్ప ఇతర

ఎన్ని విధాల ఉపయోగాలయినా అవన్నీ "సరయినవి" కావని తెలుస్తూనే ఉంది. ఇదే హేతుబద్ధమైన విషయం.

ఉదాహరణకు మనం ఏదయినా పనిచేసి తద్వారా నష్టపడినట్లయితే ఆ పని సరయినది కాదని అర్థం. మనకున్న ఏ శక్తితోనయినా మనం ఇతరులకు హాని కలుగజేసినా అది కూడా సరయిన పద్ధతి కాదు. మనకున్న శక్తుల వినియోగం వల్ల మనకు ఇవ్వబడిన ఒనరులు వ్యర్థమయిన సందర్భంలో కూడా తప్పు జరిగిందనే అనుకోవాలి. "నష్టం" అన్నది ఏ రూపంలో జరిగినా అలా జరక్కుండా తపించుకోవడమే అభిలషణీయమని బుద్ధే సాక్ష్యమిస్తుంది. దాన్ని ఏ విధంగానూ తప్పించుకోవడం సాధ్యం కానప్పుడే దాన్ని అనివార్యంగా సహించవచ్చు. లేదా ఆ నష్టాన్ని భరించి అంతకంటే గొప్ప ప్రయోజనాన్ని దేన్నయినా పొందగలిగినప్పుడే దాన్ని సహించవచ్చు.

## మంచిగా బ్రతకగోరేవారికి...

ఇంకా కాస్త ముందుకు ఆలోచిస్తే ప్రపంచంలో రెండు రకాల మనుషులున్నట్లు ద్యోతకమవుతుంది. ఒక కోవకు చెందిన వారు సంకల్పికంగా తమ శక్తియుక్తుల్ని వినియోగించి స్వయంగా తమకున్న ఇతర శక్తిసామర్థ్యాలకే నష్టం కలుగజేసుకుంటారు లేదా ఇతరులకయినా నష్టం కలుగజేస్తారు, లేక ప్రయోజనం పొందడానికి ప్రసాదించబడిన వనరుల్ని నష్టపరచుకుంటారు. మరోకోవకు చెందినవారు కావాలని ఇలా చెయ్యరు కాని, సరయిన విషయజ్ఞానం లేకపోవడం చేత ఇలాంటి తప్పులు వారిచేత జరిగిపోతాయి.

మొదటి కోవకు చెందినవారు దుష్టులు, వీరిని అదుపులో ఉంచటానికి తగిన చట్టాలు, నియమ నిబంధనలు అవసరమే. రెండో కోవకు చెందినవారు

"అజ్ఞానులు" వీరికి తమ శక్తుల్ని వినియోగించుకునే సమంజసమయిన విధానాన్ని తెలిపే 'జ్ఞానం' అందజెయ్యడం అవసరం.

## ....దైవం ప్రసాదించిన జ్ఞానం

తన సందేశహరుని ద్వారా దేవుడు మానవాళికి షరీఅత్ (ధర్మశాసనాంగం) అందజేశాడు. ఈ అవసరాన్ని తీర్చడానికే ఇది మానవశక్తుల్లో దేన్నీ వృధాగా పోనివ్వదు. అలాగే మానవ కోరికల్ని కూడా దేన్నీ హరించివెయ్యదు. ఏ భావాన్నీ అణచివెయ్యదు. ఇది మానవుల్ని, "ఈ లోకాన్ని త్యజించండి, అడవుల్లోకి కొండల్లోకి పోయి బ్రతకండి, పొట్టకు తిండి, ఒంటికి బట్టల్లేకుండా చావండి, ఆత్మపీడన ద్వారా కష్టాలు భరించండి, ప్రాపంచిక సౌఖ్యాలను, సంతోషాలను పరిత్యజించండి, అన్నింటినీ నిషేధించుకోండి" అని ఎట్టి పరిస్థితుల్లోనూ కోరదు.

ఇది మానవుని నిజస్వామి, ప్రభువు పంపిన షరీఅత్. మానవుని కొరకు అందమయిన ఈ జగత్తును సృజించిన దైవం, నిత్యం జీవనశోభతో కళకళలాడవలసిన ఈ ప్రపంచంలో జీవన కార్యకలాపాలన్నీ అంతమొందించాలని, ప్రపంచాన్ని కళావిహీనమయిన ప్రదేశంగా తయారుచెయ్యాలని ఎలా అభిలషిస్తాడు? మానవునిలోని ఏ శక్తినీ నిష్ప్రయోజనంగా అనవసరంగా సృజించలేదాయన. నేలపై నింగిలో ఏదీ నిరుపయోగంగా నిర్మించలేదాయన. ఈ లోకంలో జీవన కార్యకలాపాలు అతి సుందరంగా, మనోహరంగా కొనసాగాలని మనిషి తనకున్న ప్రతి శక్తినీ సంపూర్ణంగా వినియోగించుకోవాలని, అతను ప్రపంచంలోని ప్రతి వస్తువు ద్వారా ప్రయోజనం పొందాలని, విశ్వంలోని వస్తుసామగ్రినంతా ఉపయోగించుకోవాలని ఆయన కోరుతున్నాడు.

అయితే తన అజ్ఞానం మూలానో లేక దుర్మార్గం చేతనో మనిషి తనకయినా, ఇతరులకయినా నష్టం కలిగించడాన్ని దేవుడు ఇష్టపడడు. ఈ కారణంచేతనే షరీఅత్ నియమాలను మానవుల కొరకు అందజేశాడు దేవుడు. మనిషికి హానికరమైనవన్నీ షరీఅత్‌లో "హరామ్"(ధర్మసమ్మతంకానివి) గానూ, ప్రయోజనకరమయిన వాటిని "హలాల్"(ధర్మసమ్మతమైనవి)గానూ నిర్ణయించడం జరిగింది. మనిషి తనకు, తోటి సోదరులకు హాని కలుగ జేసుకోగల పనులన్నింటినీ షరీఅత్ నిషేధించింది. మనిషికి ప్రయోజన కరమయి ఇతరులెవ్వరికీ నష్టకరం కాని వాటిని షరీఅత్ అనుమతించింది.

## షరీఅత్ సూత్రాలు

షరీఅత్‌శాసనాలన్నీ ఒక సూత్రానికి ఆధారపడివున్నాయి. "మానవునికి తన కోరికల్ని, అవసరాల్ని తీర్చుకోడానికి, తన ప్రయోజనసాధనకై సకల విధాలా కృషిచెయ్యడానికి అధికారం ఉంది. కాని ఆ అధికారాన్ని వినియోగించుకునేటప్పుడు అజ్ఞానం మూలానో లేక దుర్మార్గం చేతనో ఇతరుల హక్కుల్ని భంగపరచకుండా, వీలయినంతవరకు ఇతరులకు సహకారం అందజేస్తూ మసలుకోవాలి" అన్నదే ఆ సూత్రం. ఏ పనుల్లోనయితే ఓ విధంగా ప్రయోజనం, మరో విధంగా నష్టం ఉంటుందో వాటిని గురించి షరీఅత్ సూత్రమేమంటే, "బృహత్తర ప్రయోజనానికై అల్పమయిన నష్టాన్ని స్వీకరించవచ్చు. అలాగే పెద్ద నష్టాన్ని నివారించడానికి చిన్న ప్రయోజనాన్ని వదులుకోవచ్చు."

ఒక్కో కాలంలోనూ ఒక్కో మనిషి, ఒక్కో వస్తువు, ఒక్కో పనిని గురించి అందులో లాభకరమయినదేమిటో నష్టకరమయినదేమిటో తెలుసు కోవడం అసాధ్యం కనుక, సర్వోపరిజ్ఞాని అయిన అల్లాహ్ మానవ జీవితా న్నంతటికీ ఓ సరయిన నియమావళిని అనుగ్రహించాడు. ఈ నియమావళిలో

ఉన్న ప్రయోజనాలు, దాని మర్మ హేతువు కొన్ని శతాబ్దాల క్రితం ప్రజలకు బోధపడకపోయినా నేడు వైజ్ఞానిక అభివృద్ధి మూలంగా దానిపై ఉన్న తెరలన్నీ ఒక్కొక్కటే తొలుగుతున్నాయి. అయితే వాటి సంపూర్ణ అవగాహన మాత్రం కలిగిందని చెప్పలేము. ఈ విషయంలో ఒకటి మాత్రం నిజం. విజ్ఞానం ఎంతగా వృద్ధిచెందుతుందో షరీఅత్ ఆదేశాల్లోని మర్మ హేతువు అంతగానే వెల్లడవుతూ ఉంటుంది. తమ అసంపూర్ణ విజ్ఞానం, అసంపూర్ణ వివేకం పట్ల గొప్పగా తప్పుడు అంచనాలు వేసుకుని అసంబద్ధమయిన నమ్మకాలకు గురయినవారు శతాబ్దాల తరబడి పొరపాట్లు చేస్తూ అగచాట్లు పడుతూ చివరికి ఈ షరీఅత్ సిద్ధాంతాల్లోని ఏదో ఒకదాన్ని ఆశ్రయించవలసి వచ్చిన సందర్భాలెన్నో ఉన్నాయి, దైవసందేశహరునిపై విశ్వాసమున్నవారు ఈ "అజ్ఞానం" వల్ల ఏర్పడే నష్టాన్ని తప్పించుకున్నారు. ఎందుచేతనంటే వారికి షరీఅత్ ఆదేశాల్లోని మర్మ హేతువు బోధపడినా బోధపడకపోయినా అన్ని పరిస్థితుల్లోనూ, వారు కేవలం దైవ ప్రవక్తలపై గల విశ్వాసం మూలాన సత్యజ్ఞానం ఆధారంగా దైవం తరఫున నిర్మించబడిన స్వచ్ఛమయిన నియమావళిని పాటిస్తారు. ఈ విధంగా ఇతరులుపడే కష్టాల నుండి రక్షించబడతారు. ★

## హక్కులు నాలుగు రకాలు

షరీఅత్ ప్రకారం ప్రతి వ్యక్తిపై నాలుగు రకాల బాధ్యతలు (ఇతరుల హక్కులు) విధించడం జరిగింది. (1) దైవం హక్కులు (2) మనిషి సొంత హక్కులు (3) తోటి మానవుల హక్కులు (4) మానవుని ఉపయోగార్థం

---

★ ఈ సందర్భంలో ఓ ఉదాహరణను ప్రస్తావించడం సమంజసం. ప్రపంచం ఇంతవరకు 'వర్ణ' విభేదాన్ని నిర్మూలించలేకపోయింది. విజ్ఞానం వింతలు చిందిస్తున్న అమెరికాలో రెండు శతాబ్దాలుగా వర్ణవిభేదాల ఆధారంగా మానవుల్లో

దైవం ప్రసాదించిన ఒనరుల హక్కులు. ఈ నాలుగు విధాల హక్కులను గురించి, అంటే ఇతరుల పట్ల తనపై వాటిల్లే ఈ బాధ్యతలను గురించి పూర్తిగా తెలుసుకోవడం, వాటిని సరిగ్గా నిర్వర్తించడం నిజమైన ముస్లిం విద్యుక్త ధర్మం. షరీఅత్ ఈ నాలుగు హక్కుల్ని విడి విడిగా వివరిస్తుంది. వాటిని నెరవేర్చే విధానాలను సయితం నిర్ణయిస్తుంది. అయితే వీటిలో ఎవరి హక్కును నెరవేర్చడంలోనయినా మరొకరెవరి హక్కు కూడా భంగపడరాదని భావిస్తుంది. అలాగే హక్కులన్నీ సమంగా నిర్వర్తించబడటానికి వీలుగా ఆ నియమాలను నిర్మిస్తుంది.

---

*విచక్షణ చూపడం చట్టరీత్యా న్యాయమయిందిగా పరిగణించబడుతోంది. వేలాది ప్రజలు కేవలం తమ చర్మం 'నల్ల'గా ఉన్న 'అపరాధానికి శిక్ష'గా రకరకాలుగా పీడించబడుతున్నారు. నీచమయినవారుగా, క్షుద్రులుగా ఎంచబడుతున్నారు. వారి జీవితం దుర్భరమయిపోయింది. 'తెల్ల' వారికీ, 'నల్ల' వారికీ వేర్వేరు చట్టాలున్నాయి. ఒకే పాఠశాలలో నల్లవారు తెల్లవారితో కలిసి చదవడానికి కూడా వీల్లేదు. 1954 మే 17న అమెరికా సుప్రీంకోర్టు విశ్వవిద్యాలయాల్లో వర్ణవిభేదం పాటించడం అన్యాయమని తీర్పునిచ్చింది. అంటే శతాబ్దాలుగా మనిషి అంతులేని పొరపాట్లుచేసి మానవత్వాన్నే నీచపరచి చివరికి తన పొరపాటును గ్రహించగలిగాడు. ఇప్పటికీ, దక్షిణాఫ్రికా ప్రభుత్వం, ఆఫ్రికాలోని పాశ్చాత్యులు, అమెరికా 'నాగరిక' ప్రజలు చాలావరకు ఈ వైఖరిని అసమానత్వమని, అమానుషత్వమని అంగీకరించడం లేదు. స్వయంగా మన దేశంలోనూ కుల వ్యవస్థ వల్ల దళితుల్ని అగ్రకులాలవారు పీడించడం మన నిత్యానుభవమే.*

*మానవ మస్తిష్కం ఓ సమస్యను పరిష్కరించడానికి ఇంతవరకు కోట్లాది ప్రజల్ని బలిగొని చేసిన ప్రయత్నానికి ఇదొక ఉదాహరణ. ఇస్లామీయ షరీఅత్ తొలినాడే మానవుణ్ణి ఈ బాధ నుండి విముక్తం చేసి సరయిన మార్గం చూపింది. దివ్య ఖుర్ఆన్ ఆదేశించింది:*

# దైవం హక్కులు

దైవం పట్ల మానవుడు నిర్వర్తించవలసిన మొదటి బాధ్యత - అంటే మొదటి దైవం హక్కు - ఏమిటంటే, మనిషి దైవాన్నే తన నిజ ప్రభువుగా ఎంచి ఎవరినీ ఆయనకు సహవర్తులుగా, భాగస్వాములుగా భావించరాదు. "లా ఇలాహ ఇల్లల్లాహ్" ను విశ్వసించి, స్వీకరించి మనిషి ఈ హక్కును నెరవేర్చుతాడు.

---

*"ఆదం సంతతి (మానవుల్ని)ని మేము గౌరవవంతులుగా సృష్టించాము."*
*మరొకచోట :*
*"జనులారా! మేము నిస్సందేహంగా మిమ్మల్ని ఒకే స్త్రీ పురుషుల జంట ద్వారా సృష్టించాము. మీ పరస్పర పరిచయం కొరకు మీలో తెగలూ, వంశాలూ సృష్టించాము. కాని వాస్తవానికి, మీలో దైవం పట్ల అత్యధిక భయభక్తులు కలవాడే ఆదరణీయుడు."*
*అలాగే మహాప్రవక్త (సఅసం) తన అంతిమ హజ్ సమయాన చేసిన ప్రసంగంలో ఇలా ఉపదేశించారు :*
*"జనులారా! మీ ప్రభువు ఒక్కడే, మీ తండ్రీ ఒక్కడే - మీరందరూ ఆదం సంతతివారే. ఆదం మట్టితో సృజించబడ్డారు. అరబ్బుకు అరబ్బేతరునిపై గాని, అరబ్బేతరునికి అరబ్బుపై గాని, తెల్లవానికి నల్లవానిపై గాని, నల్లవానికి తెల్లవానిపై గాని ఆధిక్యత లేదు. నిస్సందేహంగా మీలో దైవభీతి గలవాడే ఆదరణీయుడు."*
*ఇప్పటికి 1400 ఏళ్ళ క్రితం ఇస్లామీయ షరీఅత్ సత్యాన్ని ఈ విధంగా బోధించింది. ఎన్నో శతాబ్దాల ప్రయాసల తరువాతగాని ఈ సత్యాన్ని ప్రపంచం అర్థం చేసుకోలేకపోయింది - దైవ మార్గదర్శకత్వాన్ని స్వీకరించకపోవడంచేత! జీవితంలోని ప్రతి రంగంలోనూ షరీఅత్, అతి సులువయిన, అతి సామాన్యమయిన ఆదేశాలనిస్తుంది. వాటిని వదలిన మానవుడు చీకట్లల్లో తలక్రిందులవడం తథ్యం!*

రెండవ హక్కు ఆయన మానవాళికై పంపిన బోధనల్ని చిత్తశుద్ధితో స్వీకరించాలి. మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ను విశ్వసించి తద్వారా ఈ హక్కును నిర్వర్తిస్తాడు మనిషి.

మూడో దైవం హక్కు లేక దైవం పట్ల మనిషి మూడో బాధ్యత ఏమిటంటే, మనిషి దైవం పంపిన ఆజ్ఞల్ని పాలించాలి. ఈ హక్కు, దివ్య ఖుర్‌ఆన్, మహాప్రవక్త(సఅసం)ఆదర్శ సంప్రదాయాల్లో వివరించబడి ఉన్న ఆదేశాలను పూర్తిగా అనుసరించడం ద్వారా నెరవేరుతుంది. దైవం నాల్గవ హక్కు, దైవారాధన చేయడం. వెనుకటి పుటల్లో పేర్కొన్న 'విధుల్ని' పాటించడం ద్వారా ఈ హక్కును నిర్వర్తించడం సాధ్యమవుతుంది.

దైవం హక్కు తతిమ్మా హక్కులన్నింటికన్నా ప్రాముఖ్యం గల హక్కు కావడంచేత దీన్ని నెరవేర్చడానికి ఇతర హక్కులు కొన్నింటిని త్యాగం చెయ్యవలసి ఉంటుంది. ఉదాహరణకు నమాజ్ రోజాలాంటి విధుల్ని పాటించడానికి మనిషి స్వయంగా తన కోరికల్ని, అనేక శారీరక హక్కుల్ని త్యజించవలసివస్తుంది. నమాజ్ కొరకు మనిషి ప్రాతఃకాలాన లేచి చల్లని నీటితో వుజూ చేస్తాడు. రాత్రింబవళ్ళలో అనేకసార్లు తనకు అత్యంతావశ్యకమయిన పనుల్ని, తనకు ఇష్టమయిన కాలక్షేపాల్ని, తన అభిరుచికి అనువయిన కార్యక్రమాల్ని వదలిపెడతాడు. రమజాన్ నెలలో ఆకలిదప్పుల్ని, ఇతర కోరికల్ని అణచివేసి ఆ బాధను భరిస్తాడు. జకాత్ ధనం చెల్లిస్తూ తన ధన ప్రేమను దైవభక్తికై త్యాగం చేస్తాడు. హజ్‌లో అనేక వ్యయప్రయాసలతో కూడిన ప్రయాణం చేసి తన ధనాన్ని త్యాగం చెయ్యడమేకాక బాధల్ని సయితం భరిస్తాడు.

ఇలాగే ఇతరుల హక్కుల్ని సయితం దైవం హక్కుల కొరకు దాదాపు త్యాగం చెయ్యడం అనివార్యమవుతుంది. ఉదాహరణకు ఒక నౌకరు తన

యజమాని పని కాస్సేపు కట్టిపెట్టి, నమాజ్‌కు – అంటే గొప్ప యజమాని సేవకొరకు – వెళతాడు. హజ్‌కు పోయేటప్పుడు మనిషి, తన వాణిజ్య కార్యకలాపాలన్నింటికీ స్వస్తి చెప్పి మక్కా నగరానికి పయనమవుతాడు. ఇందులో కూడా అనేకమంది హక్కులు భంగపడతాయి. జిహాద్ (దైవ ధర్మోన్నతికై జరిగే నిరంతరకృషి) లో మనిషి కేవలం దైవ ప్రసన్నత కొరకే తన ప్రాణత్యాగం చెయ్యడానికి సిద్ధమవుతాడు.

ఇలాగే మానవుని అధీనంలో ఉన్న అనేక వస్తువులు దైవం హక్కు కొరకు భగ్నమౌతాయి. ఉదాహరణకు కుర్బానీలో పశువుల్ని అర్పించడం, దైవ మార్గంలో ధనం వెచ్చించడం ద్వారా ఇది మనకు అనుభవంలోకి వస్తుంది.

అయితే అల్లాహ్ తన హక్కుల నిర్వర్తన కొరకు కొన్ని పరిమితులు నిర్ణయించాడు. వాటి ప్రకారం, ఒక హక్కును నెరవేర్చడానికి ఇతర హక్కుల్ని ఏ మేరకు త్యాగం చెయ్యడానికి సాధ్యమవుతుందో అంతకంటే అధికంగా వాటికి భంగంవాటిల్ల కూడదు. ఉదాహరణకు నమాజ్‌ను తీసుకోండి. దైవం విధించిన ఈ నమాజ్‌ను చెయ్యడానికి అన్ని విధాలా సౌకర్యాలూ ఉన్నాయి. వుజూ కొరకు నీళ్ళు దొరక్కపోతే లేక మనిషి వ్యాధిగ్రస్తుడయితే తయమ్ముమ్* చేసుకోవచ్చు. ప్రయాణావస్థలో ఉంటే, నమాజ్‌లో "కస్ర్" (తగ్గుదల) చెయ్యడం, వీలుపడకపోతే కూర్చుని, లేకపోతే పడుకుని చెయ్యడం కూడా అనుమతించడం కూడా జరిగింది. ఇంతేకాదు, నమాజ్‌లో పఠించబడేది

---

★ అంటే పరిశుద్ధమయిన మట్టి లేక ఇసుకపై చేతులు కొట్టి ఆ చేతులతో ముఖాన్నీ చేతుల్నీ మోచేతుల వరకు తడుముకోవటం. ఇది, నమాజ్‌కుగల పవిత్రత, దాని పట్ల గౌరవాదరణల్ని, పరిశుద్ధతా భావాన్ని ఎట్టి పరిస్థితిలోనూ తాజాగా సజీవంగా ఉంచడానికి ఉత్తమ మార్గం.

కూడా ఎంతో అధికంగా లేదు. ఒక్క పూట నమాజ్‌లో కొన్ని నిమిషాలకంటే అధిక కాలం పట్టదు, తీరిక సమయాల్లో ఇష్టమయితే మనిషి "బఖర" సూరా పఠించవచ్చు. కాని కార్యకలాపాల్లో నిమగ్నులయి ఉన్న కాలంలో సుదీర్ఘ మైన నమాజ్ చెయ్యడాన్ని వారించడం జరిగింది. ఇంకా ఫర్జ్ (విధిగా నిర్ణయించ బడిన) నమాజ్‌లేకాక అదనపు (నఫిల్) నమాజ్‌లు చెయ్యదలచు కుంటే చెయ్యవచ్చు. అల్లాహ్ ప్రసన్నుడవుతాడు. కాని, రాత్రి పూట నిద్రను, పగటి పూట పనుల్నీ అన్నింటినీ మానివెయ్యమని జీవనోపాధి సముపార్జించే కాలాన్ని ఇలా నఫిల్ నమాజుల కొరకు వెచ్చించమని లేక ఇతర దైవదాసుల హక్కులకు నష్టం కలిగిస్తూ నమాజులు చెయ్యమని దైవం కోరలేదు.

ఇలాగే రోజా(ఉపవాస) వ్రతాన్ని పాటించడంలో కూడా సకల సౌకర్యాలున్నాయి. కేవలం సంవత్సరానికి ఒక్క నెలలోనే ఈ వ్రతం విధిగా నిర్ణయించబడింది. పైగా, ఆ నెలలో ప్రయాణం చెయ్యడం సంభవించినా, వ్యాధిగ్రస్తుడయినా మనిషి దాన్ని "కజా"* చెయ్యవచ్చు. ఇంకా రోజా వ్రతాన్ని పాటించే వ్యక్తి మధ్యలో వ్యాధికి లోనయి లేక మరే కారణం చేతనయినా ప్రాణాపాయానికి గురయితే అతడు వ్రత భంగం చెయ్యడం కూడా అనుమతించబడింది. రోజా పాటించవలసిన కాలపరిమితిని మించి ఒక్క నిమిషం కూడా అధికంగా పాటించడం ధర్మసమ్మతం కాదు. సహరీ**చివరి ఘడియల వరకు భుజించే అనుమతి ఉంది. ఇఫ్తార్ (రోజా విరమణ కాలం)

---

★ కజా చెయ్యడమంటే నిర్ణీత కాలంలో నమాజ్ లేక రోజా చెయ్యడానికి వీలుపడకపోతే ఆ కార్యాన్ని ఆ సమయానికి వాయిదావేసి వీలు కలిగినప్పుడు దాన్ని పూర్తిచెయ్యడం అని అర్థం.

★★ సహరీ = ఉషోదయానికి పూర్వం రోజా ప్రారంభించేముందు చేసే భోజనం.

కాగానే ఒక్క క్షణం కూడా నిరీక్షించకుండా రోజాను విరమించుకునే ఆదేశం ఇవ్వటం జరిగింది. విధిగా నిర్ణయించిన రోజాలకు మించి ఎవరయినా నఫిల్ రోజాలు పాటించదలచినట్లయితే అది దైవ ప్రసన్నతకు మార్గమే అవుతుంది. కాని ఎడతెగకుండా రోజా వ్రతాలు పాటించి, మనిషి ప్రాపంచిక కార్యకలాపాల్లో పాల్గొనజాలనంతగా బలహీనుడవడం మాత్రం దైవానికి సుతరామూ ఇష్టం లేదు.

అలాగే జకాత్‌ను పరిశీలించండి. ఇదీ దైవారాధనే. జకాత్ కొరకు కూడా కనీస ప్రమాణం నిర్ణయించడం జరిగింది. అదీ నియమానుసారం నిర్ణీత ధనపరిమాణంకంటే అధికంగా కలవారికే విధించడం జరిగింది. దాన్ని మించి ఎవరయినా సదకా, దైవ మార్గంలో దానధర్మాలు చెయ్యదలిస్తే అది వారి ఎడల దేవుని ప్రసన్నతకు కారణమవుతుంది. కాని మనిషి తన సొంత హక్కుల్నీ, తన ఆత్మీయుల హక్కుల్ని త్యాగం చేసివేసి అంతా దానధర్మాల్లో ఖర్చు చెయ్యడం, స్వయంగా తాను నిర్ధనుడయి, అగత్యపరుడయి చేతులు కట్టుకుని కూర్చోవడం దైవానికి ఏ మాత్రం ఇష్టముండదు. ఇందులోనూ మధ్యే మార్గాన్ని అవలంబించాలన్నదే దేవుని అభిమతం.

హజ్ యాత్రను గమనిస్తే తేలే అంశాలు ఇవి : మొదటిది ప్రయాణావసరాలు సమకూర్చుకోగలవారిపై, ప్రయాణంలోని కష్టాలను భరించగలిగేవారిపై మాత్రమే హజ్‌ను విధిగా నిర్ణయించడం జరిగింది. అందునా జీవితం మొత్తాన ఒక్కసారి సౌకర్యం కలిగినప్పుడు హజ్‌కై బయల్దేరాలి. మార్గమధ్యంలో యుద్ధం వల్ల లేక మరే కారణంచేతనయినా అశాంతి చెలరేగిఉంటే హజ్ సంకల్పాన్ని వాయిదా వేసుకోవచ్చు. ఇంకా తల్లిదండ్రులు ముసలివారయి ఉండి, పరిచర్యలు చేసేవారు ఇతరులు లేకపోయిన పరిస్థితిలో వారికి కష్టం కలక్కుండా, వారి అనుమతిని పొందడం

కూడా అవసరమని సూచించడం జరిగింది. వీటన్నింటిని గమనిస్తే దైవం తన హక్కుల పట్ల మానవుల బాధ్యతలను నిర్వర్తింపజెయ్యటంలో ఎంతో ఉదారతను కనబరచినట్లు, మానవుల హక్కుల్ని ఎంతో గౌరవించినట్లు ద్యోతకమవుతుంది.

## భౌతికమయిన ఉనికి, నైతికమయిన ఉనికి

దేవుని హక్కును నెరవేర్చడానికి మానవుల హక్కుల్ని త్యాగం చేయవలసివచ్చే అత్యంత గొప్ప కార్యరూపం "జిహాద్". ఇందులో మనిషి తన సొంత ధన ప్రాణాల్ని ధారపోయడమేకాక ఇతరుల ధన ప్రాణాలను సయితమూ బలిగొంటాడు. కాని అసలు విషయం ఏమిటంటే ఇంతకుముందు సూచించినట్లు ఇస్లామ్ సిద్ధాంతం ప్రకారం పెద్ద నష్టాన్ని తప్పించుకునేందుకు చిన్న నష్టాన్ని భరించాలి. ఈ సిద్ధాంతాన్ని దృష్టిలో ఉంచుకుని గమనించండి. కొన్ని వందల, కొన్ని వేల లేక కొన్ని లక్షల మంది మనుషులు హతమవడం కంటే - సత్యం సమక్షంలో మిథ్యావాదన వర్ధిల్లడం, సత్యతిరస్కారం (కుఫ్ర్), బహుదైవ వాదం, నాస్తిక వాదాల సమక్షంలో దైవం ప్రసాదించిన జీవన వ్యవస్థ (ధర్మం, దీన్) అణగిమణగి ఉండటం, ప్రపంచంలో దుర్మార్గం, దుష్టత్వం, దుర్గుణాలు, దురభ్యాసాలు వృద్ధివికాసాలు పొందడం - ఇవన్నీ మానవతకు మహత్తరమైన నష్టాలు కావా?

అందువల్లనే నైతిక, ఆధ్యాత్మిక విలువల ఈ బృహత్తర నష్టాన్నుండి రక్షించడానికి ధనప్రాణాల అల్పమయిన నష్టం భరించడాన్ని, దైవ ప్రసన్నత కొరకు, అంగీకరించమని అల్లాహ్ ఆదేశించాడు. దానితోపాటే ఈ విధంగా కూడా ఆదేశించాడు : అనివార్యమయినదానికంటే అధికంగా ప్రాణహాని చెయ్యరాదు. ముసలివారిపై, పసివారిపై, మహిళలపై, వ్యాధిగ్రస్తులపై,

క్షతగాత్రులపై చెయ్యెత్తకూడదు. మిథ్యావాదాన్ని సమర్థిస్తూ కయ్యానికి కాలుదువ్విన వారితోనే పోరాడాలి, శత్రుదేశంలో అకారణంగా వినాశకరమయిన చర్యలకు పాల్పడరాదు. శత్రువుల్ని జయిస్తే వారితో న్యాయవంతంగా ప్రవర్తించాలి. వారితో ఏదయినా ఒడంబడిక జరిగితే దాన్ని పాటించాలి. వారు సత్యం పట్ల తమ వ్యతిరేకతను విరమించుకుంటే పోరాటం నిలిపివెయ్యాలి. ఈ నిబంధనల్ని పరిశీలిస్తే దేవుని హక్కును నెరవేర్చడానికి అనివార్యమైనవరకే మానవ హక్కుల్ని త్యాగం చేసే అనుమతి ఉందని, అంతకంటే అధికంగా మానవ హక్కుల్ని త్యాగం చెయ్యడం అధర్మమయిన చర్యగా పరిగణించటం జరుగుతుందని తెలుస్తోంది.

## సొంత హక్కులు

రెండో రకానికి చెందిన హక్కుల్ని పరిశీలిద్దాం : అంటే మనిషిపై స్వయంగా అతని శరీరం, మనస్సుల హక్కులన్నమాట.

బహుశా ఈ విషయం వింతగా అగుపడవచ్చు. కాని ఇది యదార్థం, మనిషిచేసే అత్యాచారాల్లో అన్నింటినీ మించిన అత్యాచారం అతడు తన ఆత్మపైనే చేసుకుంటాడు. ఇది విచిత్రమయిన విషయమే. మనిషికి తన సొంత సుఖశ్రేయాలే అన్నిటికంటే ముఖ్యమయినవి. స్వాభిమానానికి మించినది మరొకటి లేదని అందరూ ఒప్పుకుంటారు. మనిషి తనకు తానే శత్రువని అంటే అసలు ఎవ్వరూ ఒప్పుకోరు. కాని కాస్త పరిశీలనగా గమనిస్తే యదార్థం బట్టబయలవుతుంది.

మానవునిలో ఒక గొప్ప బలహీనత ఉంది. తనకు ఏదయినా కోరిక బలవత్తరంగా ఆకట్టుకుంటే అతడు దానికి బానిసయిపోతాడు. దాని పరిపూర్తి కొరకు తెలిసో తెలియకో స్వయంగా తనకు తానే హాని చేసుకుంటాడు.

ఎవరికయినా మద్యపాన జాడ్యం అంటుకుంటే అతడు దానికొరకు పిచ్చివాడుగా తయారవుతాడు. ఆరోగ్యం, ధనం, మానం - అన్నీ కోల్పోతాడు. భోజనప్రియుడయిన మరో వ్యక్తి దొరికిన చెత్తాచెదారమంతా తిని ప్రాణాపాయానికి గురవుతాడు. ఇంకో వ్యక్తి కామవాంఛలకులోనయి తన చెడు తిరుగుళ్ళమూలంగా తన సర్వనాశనానికి ప్రారంభోత్సవం జరుపు కుంటాడు. మరో పెద్ద మనిషికి ఆత్మవికాస కార్యకలాపాలంటే మక్కువ ఏర్పడుతుంది. ఆధ్యాత్మికత పేరుతో సొంత ప్రాణాలకే శత్రువయిపోతాడు. మనసులోని కోరికలన్నింటినీ అణచివేస్తాడు. శారీరక అవసరాలను తీర్చడానికి ఒప్పుకోడు. పెండ్లిపెటాకులు వద్దంటాడు, అన్నపానీయాలు వదలుకుంటాడు, వస్త్రధారణ అవసరంలేదు - చివరికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలను కూడా వద్దని అంటాడు. అడవుల్లో, గుట్టల్లో కూర్చుని ఈ లోకం, దాని సకల శోభలు తన కోసం కాదనుకుంటాడు. మనిషి అతివాద ప్రియత్వంలో పడి ఎలాంటి అవస్థకు లోనవుతాడో చూపడానికి కొన్ని మచ్చు తునకలు పేర్కొన్నాము. వాస్తవానికి అసంఖ్యాకమయిన ఇలాంటి అతివాద రూపాలు మనం పొద్దస్తమానం మన చుట్టుపట్ల చూస్తూనే ఉంటాము.

## ప్రపంచంలోని శుభాలన్నీ మనిషి కొరకే

ఇస్లామీయ షరీఅత్ మానవుల శుభశ్రేయాలనే కోరుతుంది కాబట్టి, అది మానవునికి "లినఫ్సిక అలైక హక్కున్" అంటే, "నీపై, స్వయంగా నీ ఆత్మ హక్కును నెరవేర్చే బాధ్యత ఉంది" అని హెచ్చరిస్తుంది. అది మనిషికి హానికరమయిన వాటినన్నిటినీ హరాం(నిషిద్ధం)గా పరిగణిస్తుంది. సారాయి, కల్లు, నల్లమందు, ఇంకా ఇతర మత్తు పదార్థాలు, పంది, క్రూర మృగాలు, విష పురుగులు, అశుద్ధమయిన జంతువులు, రక్తం, మృతపశువులు మొదలయినవి-

ఇవి మినహా పరిశుద్ధమయిన, ప్రయోజనకరమయినవాటిని మనిషికై హలాల్ (ధర్మసమ్మతమయినవి)గా నిర్ణయిస్తుంది. మనిషి తన శరీరానికి అపరిశుద్ధమయిన ఆహారం అందజేసి దాన్ని బాధలకు గురిచెయ్యరాదని అతనిపై తన శరీరం హక్కును నెరవేర్చే బాధ్యత ఉందని తెలుపుతుంది.

షరీఅత్ మనిషిని నగ్నంగా ఉండరాదని బోధిస్తుంది. దైవమను గ్రహించిన తన శరీరానికి శోభనిచ్చే దుస్తులు ధరించి లజ్జాకరమయిన శరీర భాగాలను కప్పివెయ్యమని ఆదేశిస్తుంది.

అది, మనిషిని జీవనోపాధిని సముపార్జించమని ప్రేరేపిస్తుంది. నిష్ప్రయోజనంగా కూర్చోవడం, భిక్షమెత్తడం, ఆకలితో చావటం అది సహించదు. దైవం ప్రసాదించిన శక్తుల్ని వినియోగించుకుని, భూమ్యాకాశాల్లో తన పోషణ, సంరక్షణల కొరకు సమకూర్చబడిన సాధన సామగ్రిని, ఒనరుల్ని ధర్మసమ్మతమయిన రీతిలో సంపాదించాలని ప్రోత్సహిస్తుంది.

మనిషి తన కామవాంఛల్ని చంపుకోవడం తగదని, వాటిని సంస్కారవంతమయిన రీతిలో తీర్చుకోవాలని షరీఅత్ పెళ్ళి నియమాన్ని నిర్ణయిస్తుంది.

ఆత్మపీడనను నిషేధిస్తుంది, సుఖసంతోషాలకు, ఉల్లాసవంతమయిన జీవితాన్ని పూర్తిగా త్యజించడం భావ్యంకాదని చెబుతుంది. ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకు, దైవసాన్నిధ్యం పొందటానికి, ఆఖిరత్ (పరలోకం)లో మోక్ష సాధనకు లౌకిక జీవితాన్ని సన్యసించవలసిన అవసరం లేదని అంటుంది. లౌకిక వ్యవహారాల్లో పూర్తిగా నిమగ్నులయి దైవస్మరణ చెయ్యడం, ఆయన అవిధేయతవల్ల కలిగే దుష్పరిణామానికి భయపడటం, ఆయన అనుగ్రహించిన నియమావళిని చిత్తశుద్ధితో అనుసరించడం – ఇవే ఇహపరాల

సాఫల్యానికి సోపానాలని మేల్కొలుపుతుంది.

షరీఅత్ ఆత్మహత్యను నిషేధిస్తుంది. మానవ ప్రాణం దైవం సొత్తు. మానవుడు దైవం నిర్ణయించిన కాల వ్యవధి వరకు వినియోగించుకునేందుకే ఈ ప్రాణం అతనికి అమానతుగా అప్పగించడం జరిగింది. దానికి హాని కలుగజేసే అధికారం మనిషికి లేదు.

# తోటి మానవుల హక్కులు

మానవుడు తన శరీరానికి ఉన్న హక్కుల పట్ల, తన వాంఛలకున్న హక్కుల పట్ల, తన బాధ్యతను నెరవేర్చడానికి అతనికి ఉత్తరువు ఇచ్చి మరో వైపున ఈ బాధ్యతల నిర్వర్తనలో ఇతరుల హక్కులను భంగం కలిగే విధానం ఏదీ అవలంబించరాదన్న నిబంధన కూడా పెట్టింది షరీఅత్. ఎందుచేతనంటే, ఇలా ఇతరుల హక్కులను కొట్టేసి మనిషి తన వాంఛల్ని తీర్చుకోవడం మూలాన అతని ఆంతర్యమూ కలుషితమవుతుంది. ఇంకా ఇతరులకూ రకరకాల నష్టాలూ కలుగుతాయి.

కనుక దొంగతనం, దోపిడీ,లంచం, మోసం, వడ్డీలాంటి వాటిని షరీఅత్ హరామ్ (నిషిద్ధమయినవి)గా నిర్ణయించింది. ఎందువల్లనంటే ఇలాంటి చర్యల వల్ల మనిషి పొందే ప్రయోజనాలన్నీ ఇతరుల నష్టాల వల్ల కలిగినవే. అబద్ధం, దూషణలు, దుర్భాషలు, నిందలు, అపవాదులు, చాడీలు ఇవన్నీ నిషిద్ధాలు. ఎందుకంటే ఇవన్నీ ఇతరులకు ఏదో ఓ రూపంలో హాని కలుగజేస్తాయి. జూదం, పందెం, లాటరీ కూడా నిషేధించబడ్డాయి; ఎందుచేతనంటే వీటి ద్వారా ఒక వ్యక్తి లాభమొంది వేలాది ప్రజలు నష్టపోతారు. మోసం, వంచనల ఆధారంగా ఒక పక్షానికి లాభకరంగాను, మరో పక్షానికి నష్టకరంగాను పరిణమించే వాణిజ్య వ్యవహారాలు, అలాంటి

లావాదేవీలు అధర్మమయినవిగా పరిగణించబడ్డాయి. హత్యలు, కలహాలు, కల్లోలాలు హరామ్‌గా సూచించబడ్డాయి. ఎందుకంటే ఒక వ్యక్తికి తన స్వప్రయోజనం కొరకుగాని లేక ఏదయినా తన వాంఛను నెరవేర్చుకోడానికిగాని ఇతరుల ప్రాణాలు తీసే, ఇతరులకు నష్టం కలుగజేసే అధికారం ఏమాత్రం లేదు. వ్యభిచారం, అసహజ సంభోగం కూడా హరామ్‌గా నిర్ణయించబడ్డాయి. ఎందువల్లనంటే ఈ చర్యలు స్వయంగా అతని ఆరోగ్యం పాడుచేసి, అతని స్వభావాన్ని గుణగణాలను సయితం నాశనంచేస్తాయి. మరోవైపున సమాజం లో అశ్లీలత, నిర్లజ్జత, నీతిబాహ్యమయిన పనులు ప్రబలిపోతాయి. జుగుప్సా కరమైన వ్యాధులు తరతరాలుగా వ్యాపించి మానవ సమాజం అంతా సర్వనాశనమయిపోతుంది. ఎన్నో ఉపద్రవాలు తలెత్తుతాయి. మానవ సంబంధాలు తెగిపోతాయి. సంస్కృతీ సభ్యతలు, నాగరికతలు అంతరించి పోతాయి.

## సామూహిక బాధ్యతలు

ఇవన్నీ ఒక వ్యక్తి తన సొంత హక్కుల్ని - శారీరక, మానసిక హక్కుల్ని- నెరవేర్చడంలో ఇతరుల హక్కుల్ని భంగపరచకుండా షరీఅత్ విధించిన నిర్బంధాలు. కాని, మానవ సమాజం, సంస్కృతీ నాగరికతల వృద్ధీవికాసాలు, మంగళశ్రేయాలు కేవలం ఒక వ్యక్తి మరొక వ్యక్తి సంబంధాలతో ముడిపడి లెవ్వు. ఒక వ్యక్తి మరొక వ్యక్తికి నష్టం కలిగించనంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. ప్రజలందరిలో పరస్పర సంబంధాలు పెంపొందింపజేసి వారంతా తోటి మనిషి మేలుకోరి పరస్పరం సహకరించుకునేలా చెయ్యడం అత్యవసరం. దీనికొరకు షరీఅత్ సూచించిన ఆదేశాలను సంక్షిప్తంగా పరిశీలిద్దాము.

## కుటుంబం

మానవ సంబంధాలు కుటుంబంతోటే ప్రారంభమవుతాయి. కనుక ముందు కుటుంబ వ్యవస్థను పరిశీలిద్దాము. వాస్తవానికి భర్త, భార్య, పిల్లల సమూహానికి కుటుంబం అని పేరు. కుటుంబ వ్యవస్థకు సంబంధించిన ఇస్లామీయ విధానమేమిటంటేః జీవనోపాధి, సంపాదన, కుటుంబ అవసరాలను సమకూర్చడం, భార్యాపిల్లల సంరక్షణ పురుషుని కర్తవ్యం. స్త్రీబాధ్యతలేమిటంటే, పురుషుడు సంపాదించి తెచ్చిన దానితో గృహస్థ వ్యవహారాలను చక్కబెట్టడం, వీలయినంతవరకు తన భర్తకు, పిల్లలకు సౌఖ్యం, సౌలభ్యాలు చేకూర్చడం. పిల్లల కర్తవ్యమేమిటంటే, వారు తమ తల్లిదండ్రులకు విధేయులై మెలగాలి, పెద్దవారయి తల్లిదండ్రుల సేవ చెయ్యాలి. కుటుంబ వ్యవస్థను తీర్చిదిద్దడానికే ఇస్లాంలో రెండు మార్గాలు అవలంబించబడ్డాయి.

(అ) భర్త లేక తండ్రిని ఇంటి పెద్దగా నియమించడం జరిగింది. ఎందువల్లనంటే ఏ విధంగానైతే ఓ గ్రామ వ్యవస్థ గ్రామ పెద్ద లేదా ఉన్నతాధికారి లేకపోవడంచేత, ఒక పాఠశాల హెడ్‌మాస్టర్ లేకపోవడంచేత సరిగ్గా నడవజాలవో అదేవిధంగా ఇంటి వ్యవస్థ కూడా ఒక అధికారి, యజమాని, పెద్ద అనేవాడు లేనిదే సవ్యంగా సాగదు. ఏ ఇంట్లోనయితే ప్రతి వ్యక్తి స్వేచ్ఛావర్తనుడో ఆ ఇల్లు నిష్కారణంగా అల్లకల్లోలాలపాలవుతుంది. సుఖ సంతోషాలు నామమాత్రాన కూడా మిగలవు. శ్రీవారు ఒకవైపున వెడితే శ్రీమతి మరోదారిన పడతారు, పిల్లలు మట్టిపాలవుతారు. ఈ దురవస్థను తొలగించాలంటే ఇంటికి ఒక పెద్ద ఉండాలి. ఆ యజమాని పురుషుడవటమే సముచితం. ఎందుకంటే కుటుంబపోషణ సంరక్షణ భారం అతనిపైనే ఉంది.

(ఆ) ఇంటి బయటి కార్యాల భారమంతా పురుషునిపై వేసి స్త్రీ అనవసరంగా ఇంటి వెలుపలి కార్యకలాపాలకు పోరాదని ఆదేశించడం జరిగింది. ఇంటి వెలుపలి కార్యాలభారం ఏమాత్రం ఆమెపై పడకుండా ఏర్పరచడానికి అసలు కారణం– ఆమె ఇంటి లోపలి కార్యాల బాధ్యతలన్నీ ప్రశాంతంగా, సవ్యంగా నిర్వర్తించాలని, ఆమె బయటికి వెళ్ళినట్లయితే గృహస్థ సుఖం, పిల్లల శిక్షణ దెబ్బతింటాయని– అది జరక్కూడదన్నది మాత్రమే.★ అంటే స్త్రీలు పూర్తిగా ఇంటినుంచి బయటికే వెళ్ళకూడదని అర్థం కాదు. అవసరమయితే వారు బయటి పనులు చేసే అనుమతి కూడా ఉంది. కాని వారి నిజమయిన కార్యరంగం ఇల్లే. వారి శక్తి అంతా గృహస్థ జీవితాన్ని సుఖమయం చెయ్యడంలో వినియోగపడాలన్నదే షరీఅత్ అభిమతం.

## తోటి మానవుల హక్కులు

రక్త సంబంధాలు మరియు వివాహసంబంధాల కారణంగా కుటుంబ పరిధి విస్తృతమవుతుంది. ఈ పరిధిలో పరస్పరం బంధుత్వాలు, అనుబంధాలు

---

★ ఈ కార్య విభజనను నిర్మూలించి తద్వారా ప్రాప్తమయిన హాలాహలాన్ని మింగలేక పాశ్చాత్య తత్త్వవేత్తలు కూడా స్త్రీలు గృహసీమను అలంకరించే విషయాన్ని సమర్థిస్తున్నారు. ఇక్కడ ప్రముఖ తత్త్వవేత్తల అభిప్రాయాలను ఇస్తున్నాం. *Dr. Fulton J. Sheen, Communism and Conscience of the West.* లో ఇలా రాస్తున్నారు.

"అమెరికాలో నేడు కుటుంబ జీవితం విచ్ఛిన్నమయిన రీతి మనదేశ చరిత్రలో ముందెన్నడూ కానరాదు. కుటుంబం దేశానికి వాయుమాపకం (*Barometer*) లాంటిది. అమెరికాలో సామాన్య కుటుంబం ఎలా ఉంటుందో దేశం కూడా అలాగే ఉంటుంది. సామాన్య కుటుంబం అప్పులు చేస్తూ

కలవారి మధ్యన సంబంధాలను మెరుగుపరచడానికి షరీఅత్ విభిన్న నియమాలను ఏర్పరచింది. అవన్నీ ఎంతో వివేచనతో కూడుకున్నవి. వాటిలో కొన్నింటిని క్రింద పేర్కొంటున్నాము.

1. పరస్పరం కలసిమెలసి జీవించడం ఎవరికయితే అనివార్యమో వారందరూ ఒకరికొకరు వివాహానికి హరామ్ అయినవారు(అధర్మమయినవారు, తగనివారు)గా నిర్ణయించడం జరిగింది. అంటే, తల్లి –కొడుకు, తండ్రీ –

---

డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెడుతూ, రుణాలలో చిక్కుకుంటే – అమెరికా కూడా జాతీయ రుణాలపై రుణాలు పెంచుతుంది. చివరికి "పతన దినం" ఆసన్నమవుతుంది.

సామాన్య దంపతులు తమ వివాహపు ఒప్పందాన్ని పాటించకపోతే – అమెరికా కూడా అట్లాంటిక్ చార్టర్, "ఫోర్ ఫ్రీడమ్స్" లో విశ్వాసానికై వత్తిడి చేయదు. (భార్యాభర్తల) ప్రేమ ఫలించడంలో అపజయమెదురయితే, దేశంలో అధికంగా ఉత్పత్తి అయిన ప్రత్తి, కాఫీ గింజలు కూడా సముద్రం పాలవుతాయి. లాభదాయకమయిన ధరల కోసం విపరీతమయిన ఆర్థిక విధానాలు అవలంబించడం జరుగుతుంది.

భార్యాభర్తలు ఒకరికై నొకరు జీవించడానికి బదులు స్వార్థపరులై జీవిస్తే, పరస్పర ఆనందంలోనే తమ వ్యక్తిగత సుఖం ఇమిడివుందన్న భావం వారిలో కలగకపోతే – అమెరికా కూడా భార్యాభర్తల్లా పోరాడుకునే పెట్టుబడి(దారులు) శ్రమ(జీవుల)కు నిలయమయిపోతుంది. సామాజిక జీవితం నాశనమవుతుంది, ఆర్థిక స్తోమత సన్నగిల్లిపోతుంది.

భార్యాభర్తలు వివాహేతర ప్రేమను కాంక్షించి పరస్పరం విడిపోతే – మన దేశం కొత్త (విదేశీ) తత్వాలకు దారినిస్తుంది. కమ్యూనిజం వచ్చి 'దేశభక్తి' అనబడే ప్రాథమిక విశ్వసనీయతను దోచుకున్నట్లు! భార్యాభర్తలు దైవం లేడని జీవిస్తే – దేశంలో కూడా నాస్తికులయిన పాలకులు స్థానమేర్పరచుకుంటారు. *Declaration of Independece*(అమెరికా స్వాతంత్ర్య ప్రకటన)ను కాలరాచి, వారు నాస్తికత్వమే జాతీయ ధర్మం (**National Policy**)గా చేయడానికి

కూతురు, మారు కూతురు - మారు తండ్రి, సవతి తల్లి - సవతి కొడుకు, సోదరుడు - సోదరి, ఒకే తల్లి పాలు త్రాగిన స్త్రీ పురుషులు, బాబాయి - కూతురు, మేనత్త -మేనల్లుడు, మేనమామ -మేనకోడలు, పినతల్లి-కొడుకు, అత్త-అల్లుడు, మామ-కోడలు - వీరంతా ఎన్నటికీ పెళ్ళి చేసుకోకూడదు. ఈ సంబంధాలన్నీ శాశ్వతంగా హరామ్ చెయ్యడం మూలాన ప్రాప్తమయ్యే అనేక ప్రయోజనాల్లో ఓ ప్రయోజనమేమంటే, పేర్కొన్న ఈ స్త్రీ పురుషుల సంబంధాలు అత్యంత పరిశుద్ధంగా, పవిత్రంగా ఉంటాయి. వీరంతా నిష్కల్మషంగా అన్యోన్య ప్రేమానురాగాలతో స్వేచ్ఛగా నిర్మొహమాటంగా కలిసిమెలిసి మసలుకోగలరు.

2. హరామ్ చెయ్యబడిన బంధుత్వాలు తప్ప కుటుంబంలోని ఇతర స్త్రీ పురుషుల మధ్య వివాహ సంబంధాలు ధర్మ సమ్మతమయినవిగానే

---

ప్రయత్నిస్తారు. మనకున్న హక్కులు, స్వాతంత్ర్యమూ అంతా దైవం తరఫున లభించినవే అన్న వివాదానికి తిలోదకాలిస్తారు.

వాస్తవానికి గృహమే దేశం అదృష్టాన్ని నిర్ణయిస్తుంది. కుటుంబంలో ఏది జరుగుతుందో తదనంతరం అదే జరుగుతుంది - కాంగ్రెస్ (అమెరికా పార్లమెంటు) లోనూ, వైట్‌హౌస్‌లోనూ, సుప్రీం కోర్టులోనూ! దేశం తనకు ఉచితమయిన ప్రభుత్వాన్ని నిర్మించుకుంటుంది. మనం ఎలా ఇంట్లో జీవిస్తామో దేశం కూడా అలాగే జీవిస్తుంది."

*Prof. Cyril Joad* స్పష్టంగా ఇలా రాస్తున్నారు :

"జీవిత ప్రమాణాన్ని కొంతవరకు తగ్గించవలసి వచ్చినప్పటికీ, మహిళలు తమ గృహాన్ని చక్కబెట్టుకోవడంలోనూ, పిల్లల శిక్షణలోనూ సరిపుచ్చుకుంటే లోకం ఆనందమయమవుతుందని నాకు దృఢ విశ్వాసం ఉంది." *Variety, December, 1952* -అనువాదకుడు

నిర్ణయించడం జరిగింది. దీనివల్ల బంధుత్వాలు ఇంకా పటిష్టమవుతాయి. గుణగణాలు, లక్షణాలు, స్వభావాలు పరస్పరం తెలిసి ఉన్న వారి మధ్యన జరిగే పెళ్ళి సంబంధాలు విజయవంతమవుతాయనడంలో సందేహం లేదు. కొత్త చుట్టరికాలు నెలకొల్పుకొనడం వల్ల తరచుగా పొంతన కుదరదు. ఇందువల్ల ఇస్లామీయ షరీఅత్‌లో "కుఫువ్"★ గలవారున్నప్పుడు వారికి "కుఫువ్" కాని వారిపై ప్రాధాన్యత నివ్వడం జరిగింది.

3. కుటుంబంలో నిరుపేదలు, శ్రీమంతులు, ఉన్నవారు లేనివారు అన్ని రకాల వారుంటారు. ఇస్లాం ఇచ్చే ఆదేశమేమంటే ప్రతి వ్యక్తిపై ఉన్న అతని బంధువుల హక్కులు ముఖ్యమయినవి. దాన్ని షరీఅత్ పరిభాషలో 'సిల రహ్మ్' అని అంటారు. దాని గురించి చాలా గట్టిగా తాకీదు చెయ్యడం జరిగింది, బంధువులతో సంబంధాలను తెంచుకొని వారి పట్ల ద్రోహం చెయ్యడాన్ని 'కత రహ్మ్' అనంటారు. ఇలా చెయ్యడం ఇస్లాం ప్రకారం ఘోరపాతకం. బంధువు బీదవాడయితే లేక అతనిపై ఏదయినా ఆపదవస్తే అతన్ని ఆదుకోవడం, కలవారైన అతని బంధువుల కర్తవ్యం. సదక, ఖైరాత్ (దాన ధర్మాలు) విషయంలో కూడా బంధువులకే ప్రాధాన్యతనివ్వడం ముఖ్యం.

4. ఒక వ్యక్తి ఆస్తి వదలి మరణిస్తే అది కొద్దిపాటిదైనా, ఎక్కువయినా, దాన్ని ఒకచోట నిలువ ఉండనివ్వకుండా మరణించిన వాని వారసుల్లో అందరికీ ఎంతో కొంత అందేలా వారసత్వపు చట్టాన్ని నిర్మించడం జరిగింది. కొడుకు కూతురు, భార్య, భర్త, తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి- వీరంతా మనిషికి అత్యంత సమీపంలోని హక్కుదారులు. అందువల్ల వారసత్వంలో ముందు వీరి వాటాలు నిర్ణయించబడ్డాయి. వీరు లేకపోతే వీరి

★ "కుఫువ్" అంటే సారూప్యత అని అర్థం.

తరువాతి దగ్గర బంధువులకు ఆ వాటాలు లభిస్తాయి. ఈ విధంగా ఒక వ్యక్తి మరణించిన తరువాత అతను వదలిన ఆస్తి చాలా మంది బంధువులకు ఉపయోగపడుతుంది. ఈ ఇస్లామీయ చట్టం ప్రపంచంలో అద్వితీయ మయింది. ఇప్పుడు ఇతర ప్రజలు సయితం దీన్ని అనుకరిస్తున్నారు. కాని విచారకరమయిన విషయమేమంటే స్వయంగా ముస్లిములు మాత్రం తమ అజ్ఞానం అవివేకాల మూలంగా తరచుగా ఈ చట్టాన్ని అతిక్రమిస్తున్నారు. ముఖ్యంగా ఆడపిల్లల వాటాను కాజేసే ఆచారం భారత పాకిస్తాన్‌లలో చాలా వ్యాపించిపోయింది. వాస్తవానికి ఇది గొప్ప అత్యాచారం, దౌర్జన్యం, ఖుర్‌ఆన్‌లోని స్పష్టమయిన ఆదేశాలకు ప్రతికూలం.

మనిషి సంబంధాల పరిధిలో కుటుంబం తరువాత అతని మిత్రులు, ఇరుగు పొరుగువారు, అతని వీధిలోని వారు, అతడు నివసించే పట్టణంలోని ప్రజలు, ఇంకా ఏదో ఓ విధంగా వివిధ సందర్భాల్లో అతణ్ణి కలిసేవారు వస్తారు. వీరందరిపట్ల, నిజాయితీగా, న్యాయవంతంగా, సద్ప్రవర్తనతో మెలగాలని ఇస్లాం ఆదేశిస్తుంది. ఇంకా, ఎవరికీ కష్టం కలిగించరాదు. ఎవరి మనసును నొప్పించరాదు. తిట్లు, దూషణలు, దుర్భాషల దరి చేరరాదు. పరస్పరం సహకారం అందచేసుకోవాలి. వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించాలి. మరణించినవారి జనాజా(అంత్యక్రియ)లో పాల్గొనాలి. కష్టంలో ఉన్నవారిపట్ల సానుభూతితో మెలగాలి, నిరుపేదలు, అగత్యపరులు, వికలాంగులయిన వారికి రహస్యంగా సహాయపడాలి. అనాధలు, వితంతువుల్ని ఆదుకోవాలి, ఆకలిగొన్నవారి ఆకలి తీర్చాలి. కట్టుబట్టలు లేనివారికి బట్టలిప్పించాలి, నిరుద్యోగులకు పని కల్పించాలి.

దైవం ధనం ప్రసాదిస్తే దాన్ని కేవలం తన సొంత సుఖ విలాసాలకే వినియోగించి వ్యయపరచరాదు. వెండి, బంగారపు పాత్రలు ఉపయోగించడం,

పట్టువస్త్రాలు ధరించడం, ధనాన్ని వ్యర్థమయిన కాలక్షేపాల్లో విలాసాల్లో వ్యయపరచడం ఇస్లాంలో నిషిద్ధం. ఎందుకంటే, వేలాది ప్రజల జీవనోపాధికి మార్గం కాగల ఈ ధనాన్ని ఒక వ్యక్తి తన కోసమే ఖర్చు చెయ్యడం అన్యాయం, ఎందరి కడుపులనో నింపగల ఈ ధనం కేవలం ఒక ఆభరణం రూపంలో మీ మెడను అలంకరించడం గాని ఒక పాత్ర రూపంలో మీ బల్లపై శోభించడంగాని, ఒక తివాసి రూపంలో మీ గది అందాన్ని పెంచడంగాని, టపాకాయల (Fire Work) రూపంలో కాలి బూడిద అవడంగాని అన్యాయం కాదా? అత్యాచారం కాదా?? ఇస్లాం, మీ సంపదను మీ నుండి దోచుకో దలచలేదు. స్వయంగా మీరు సంపాదించినదీ, మీకు వారసత్వంలో ప్రాప్తమయినదీ అంతా మీ సొంతమే, మీ ధనం ద్వారా మీరు పూర్తిగా సుఖాస్వాదన పొందడానికి కూడా ఇస్లాం మీకు అధికారాన్నిస్తుంది. దైవం మీకు ప్రసాదించిన ధనం మీ వస్త్రధారణలో, మీ గృహ నిర్మాణంలో, మీ వాహనంలో ప్రతిబింబించడానికూ్కడా అనుమతినిస్తుంది. అయితే దాని బోధనల ఉద్దేశ్యమేమిటంటే, మీరు ఒక నిరాడంబరమయిన మధ్యేమార్గాన్ని అవలంబించాలి. మీ అవసరాలు అవధులు దాటకుండా చూడాలి. మీ సొంత హక్కులనే కాక మీ బంధువులు, మిత్రులు, ఇరుగుపొరుగువారు దేశ వాసులు లోటి మానవ సోదరుల హక్కుల్ని కూడా గుర్తుంచుకోవాలి.

మనిషికి సంబంధించిన ఈ దగ్గరి పరిధుల్ని దాటి సువిస్తరమయిన సంబంధాల అతి విశాలపరిధిని పరికించండి. ఈ పరిధిలో ప్రపంచం మూల మూలల్లో ఉన్న ముస్లింలందరూ ఉన్నారు. ఎందువల్లనంటే ఇస్లాం స్వీకరించిన ప్రతి వ్యక్తి కేవలం ఇస్లాం ధర్మపరిధిలోనే ప్రవేశించడు, ఇస్లామీయ సమాజంలోనూ చేరిపోతాడు. ఈ సామాజిక పరిధి కొరకు షరీఅత్ కొన్ని నియమాలు నిబంధనలు సూచిస్తుంది. వీటిలో ముస్లిములు పరస్పరం తమ

మంచి కోసం సహకరించుకునేలా, చెడులు ఉత్పన్నమయ్యే కారణాలు వీలయినంతవరకు ఏర్పడకుండా చూసేలా జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది, ఉదాహరణకు కొన్నింటిని పరిశీలిద్దాము.

## నైతికతకు ప్రాధాన్యం

1. సంఘం నైతికతను పరిరక్షించడానికి సూచించబడిన నియమం ఇదిః ఏ స్త్రీపురుషుల మధ్య వైవాహిక సంబంధాలు హరాం(అధర్మమయినవి)గా నిర్ణయించబడలేదో వారు యధేచ్ఛగా కలివిడిగా మెలగకూడదు; సామాజికంగా స్త్రీలు వేరుగా పురుషులు వేరుగా మసలుకోవాలి; స్త్రీలు అధికంగా గృహస్థ జీవితపు బాధ్యతల పట్ల శ్రద్ధవహించాలి, బయటికి వెళ్ళడం అనివార్యమే అయితే, ఆభరణాలు, అలంకరణలతో వెళ్ళరాదు. నిరాడంబరంగా వెళ్ళాలి, శరీరాన్ని పూర్తిగా కప్పుకోవాలి, ముఖం, చేతులు బయటికి తియ్యడం అనివార్యమయితే తప్ప వాటిని కూడా కప్పి ఉంచాలి. ఏదయినా నిజమయిన అవసరం ఏర్పడితే ఆ అవసరానికై మాత్రం ముఖాన్నీ, చేతుల్నీ బయటికి తీయగలరు. దీనితోబాటు పురుషులకు ఇవ్వబడిన ఆదేశం ఇదిః పరస్త్రీలను చూడకూడదు. అకస్మాత్తుగా యాదృచ్ఛికంగా, స్త్రీలు దృష్టిలో పడితే చూపు మరల్చుకోవాలి, మరోసారి చూచే ప్రయత్నం చెయ్యడం తప్పు. వారిని కలిసి పలకరించే ప్రయత్నం చెయ్యడం మరీ పెద్ద తప్పు. స్త్రీ పురుషులు తమ నైతిక స్థితిని రక్షించుకోవడం వారి ధర్మం. తమలోని సహజమయిన లైంగిక వాంఛల్ని తీర్చుకోవడానికి దైవం నిర్ణయించిన వివాహపరిధుల్ని దాటడం అలా ఉంచి, దాటే కోరిక కూడా ఆంతర్యంలో జన్మించనివ్వరాదు.

2. సంఘ నైతికతను పరిరక్షించడానికే ఈ నియమాన్ని కూడా

ప్రవేశపెట్టడం జరిగింది: పురుషులు తమ మోకాలు, నాభిస్థానం మధ్యనున్న దేహాన్నీ, స్త్రీలు తమ ముఖం, ముంజేతులు తప్ప మిగిలిన దేహంలోని ఏ భాగాన్నీ ఎవరిముందైనా సరే ఆచ్ఛాదన లేకుండా చెయ్యరాదు - వారు అతి సమీప బంధువులయినా సరే. దీన్ని షరీఅత్ పరిభాషలో "సత్ర్" అనంటారు. 'సత్ర్'ను కప్పి ఉంచడం ప్రతి స్త్రీ పురుషుని కర్తవ్యం. దీని లక్ష్యమేమంటే, ప్రజల్లో లజ్జాభావం జనించి, అశ్లీలత నిర్లజ్జత పెంపొందకుండా ఉండాలన్నది. వీటివల్లనే కదా నీతిబాహ్యకార్యాలు, దుర్వ్యసనాలు, దుర్గుణాలు పెచ్చరిల్లేది!

3. మనిషి గుణగణాలను, స్వభావాలను చెరిపే, తుచ్ఛమయిన కోరికల్ని రేకెత్తించే, ధనాన్ని, కాలాన్ని, ఆరోగ్యాన్ని నష్టపరిచే కాలక్షేప కార్యకలాపాలను షరీఅత్ అనుమతించదు. కాలక్షేపం అన్నది అత్యంతావశ్యక మయినదే. మనిషిలో జీవితం పట్ల ఉత్సాహం, ఉత్తేజం, పని చేసే శక్తిని పెంపొందించుకునేందుకు బాగా పని చెయ్యడంతోపాటు కాలక్షేపమూ అవసరమయిందే. అయితే ఆ కాలక్షేపం ఆత్మపై మబ్బుతెరలు కప్పి, అంతర్యాన్ని మత్తుగొలిపేదిగా కారాదు. అది ఆత్మవికాసాన్ని కలగచేసేదిగా, అంతర్యంలో ఉత్తేజాన్ని సృజించేదిగా ఉండాలి. వేలాది ప్రజలు ఒకేచోట కూర్చుని అపరాధపరిశోధనల కట్టుకథలు, అశ్లీల సన్నివేశాలు అసహ్యమయిన దృశ్యాలు చూచే నీచమయిన కాలక్షేపాలు బాహ్యంలో ఎంతగా మనోరంజకంగా గోచరించినా జాతుల నైతికస్థితిని దిగజార్చి, ప్రజల స్వభావాలను గుణగణాలను సర్వనాశనం చేసేవే!

4. తమ జాతీయ ఐక్యత కొరకును, జాతీయ శుభశ్రేయాల కొరకును ముస్లింలు పరస్పర విభేదాలను, విరోధాలను విడనాడాలి; ముఠాతత్వాన్ని విసర్జించాలి. ఏదయినా విషయంలో భేదాభిప్రాయం వస్తే దివ్య ఖుర్‌ఆన్, హదీసుల ద్వారా దాన్ని పరిష్కరించుకోడానికి ప్రయత్నించాలి.

ఆ సమస్య ఎటూ తేలకపోతే పరస్పరం పోరాడుకోడానికి బదులు దాన్ని దైవ నిర్ణయంపై వదలివేయాలి. జాతీయ శుభశ్రేయాలకు సంబంధించిన కార్యాల్లో అన్యోన్యంగా సహకరించుకోవాలి. జాతీయ నాయకులకు విధేయులయి ఉండాలి. పరస్పరం సంఘర్షణల్లో తమ శక్తి సామర్థ్యాలను వ్యర్థపరుస్తూ జాతీయ గౌరవానికి విఘాతం కలిగించకూడదు.

5. ముస్లిమేతరుల నుండి కళల్ని, విజ్ఞానాన్ని సముపార్జించడంలో ముస్లిములకు స్వేచ్ఛ ఉంది. కాని జీవన వ్యవహారాల్లో వారిని అనుకరించడం నిషేధించబడింది. ఏ జాతి అయినా మరో జాతి ఎదుట తన హీనస్థితిని, న్యూనతను అంగీకరించినప్పుడే దాన్ని అనుకరిస్తుంది. ఈ కోవకు చెందిన బానిసత్వం అత్యంత నీచమయింది. ఇది వాస్తవానికి ఆ జాతి పరాజయానికి బహిరంగ ప్రకటన. చివరికి, అలా అనుకరించే జాతి తన సంస్కృతిని సర్వనాశనం చేసుకుంటుంది. అందుకే మహాప్రవక్త(సఅసం), ఇతర జాతుల సాంఘిక విధానాలను అవలంబించడాన్ని కఠినంగా నిషేధించారు. ఒక జాతి శక్తి దాని వస్త్రధారణపై, అది జీవితం గడిపే తీరుపై ఆధారభూతమయి ఉండదని, నిజానికి దానికున్న విజ్ఞాన సంపద, అందులోగల సువ్యవస్థ, అది అవలంబించే క్రియాశీలత్వంలోనే దాని శక్తి దాగి ఉన్నదని సాధారణ వివేకం ఉన్న ఏ వ్యక్తయినా గ్రహించగలడు. కనుక శక్తిని పొందదలచుకుంటే జాతులు శక్తిని పొందే విషయాలనే స్వీకరించాలి. జాతులు బానిసలుగా మారి చివరికి అవి ఇతరుల్లో విలీనమై తమ జాతీయ అస్తిత్వాన్నే కోల్పోయ్యేలా పరిణమించే విషయాలను మాత్రం స్వీకరించరాదు.

ముస్లిమేతరులతో వ్యవహరించే విషయంలో ముస్లిములకు సంకుచిత దృష్టిని, పక్షపాత వైఖరిని బోధించడం జరగలేదు. వారి పెద్దలను తూలనాడటం వారి మతాన్ని అవహేళన చెయ్యడం వంటి విషయాలు నిషేధించబడ్డాయి

వారు ముస్లిమ్‌లతో శాంతి సుహృద్భావాలతో వ్యవహరిస్తూ ముస్లిముల హక్కుల్ని కాజెయ్యకుండా ఉంటే ముస్లిములు కూడా వారి ఎడల స్నేహభావంతో, సుహృద్భావంతో, న్యాయవంతంగా మెలగాలని బోధించడం జరిగింది. ఇస్లామ్ నేర్పే సౌజన్య విధానాల రీత్యా ముస్లిములు అందరికంటే ఎక్కువగా మానవీయ సానుభూతితో, సుహృద్భావంతో, సౌజన్య వైఖరితో వ్యవహరించాలి. చెడు నడవడి, దౌర్జన్య వైఖరి, సంకుచిత మనస్తత్వం ముస్లిముల ఔన్నత్యానికి, ఉత్తమ స్థాయికి తగనటువంటివి. సద్గుణం, సౌజన్యం, సదాచారాలు మూర్తీభవించిన ఓ ఉత్తమ ఆదర్శవంతులుగా రూపొంది తమ నియమాల ద్వారా మానవ హృదయాలను చూరగొన గలగటానికే ప్రపంచంలో ముస్లిముల ఆవిర్భావం జరిగింది.

## సకల సృష్టిరాసుల హక్కులు

ఇప్పుడు నాలుగవ కోవకు చెందిన హక్కుల్ని పరిశీలిద్దాము.

తన అసంఖ్యాకమయిన సృష్టిరాసులపై మనిషికి అధికారాలనిచ్చాడు దేవుడు. మనిషి వాటిని తన శక్తి ద్వారా స్వాధీనపరచుకుంటున్నాడు. వాటిని వినియోగించుకుంటున్నాడు. వాటి ద్వారా ప్రయోజనం పొందుతున్నాడు. ఆధిక్యత గల సృష్టి అవడంచేత మనిషికి అలా చేసే హక్కు పూర్తిగా ఉంది. అయితే దీనికి ప్రతిగా వాటికి కూడా మనిషికై కొన్ని హక్కులున్నాయి. అవేమంటే, మనిషి వాటిని అకారణంగా వృథాపరచకూడదు; వాటిని అనవసరంగా నష్టపరచరాదు, కష్టపెట్టరాదు; తన ప్రయోజనానికై అవసరమయినంతమేరకే, వాటికి వీలయినంత తక్కువ నష్టం కలిగించి వినియోగించుకోవచ్చు. వాటి వినియోగంలో సాధ్యమయినంత ఉత్తమ విధానాలను అవలంబించాలి.

షరీఅత్‌లో ఈ హక్కుకు సంబంధించిన అనేక ఆదేశాలు పేర్కొనడం జరిగింది. ఉదాహరణకు, జంతువుల్ని కేవలం వాటివల్ల కలిగే హాని నుండి తప్పించుకోడానికో లేక మనిషి ఆహారం కొరకో వధించే అనుమతి ఇవ్వడం జరిగింది. కాని అనవసరంగా కేవలం కాలక్షేపానికి వాటి ప్రాణాలు తీయడం నిషిద్ధం. మనిషి తినే పశువుల్ని వధించడానికి 'జిబహ్' విధానాన్ని నియమించడం జరిగింది. ఇది పశువుల నుండి ప్రయోజనకరమయిన మాంసాన్ని సంగ్రహించే ఉత్తమమయిన విధానం. ఈ విధానం తప్ప ఇతర విధానాలు తక్కువ బాధాకరమయినవయితే వాటివల్ల మాంసంలోని విశేషాలెన్నో దెబ్బతింటాయి. అలా కాక మాంసంలో విశేషలక్షణాలను కాపాడుకునే ఇతర విధానాలు ప్రయోగిస్తే అవి జిబహ్ కంటే అధికంగా బాధాకరమయినవి. ఇస్లాం, ఈ రెండు విధానాలను కాదని మధ్యస్థ విధానాన్ని సూచిస్తుంది.

ఇస్లామ్‌లో జంతువుల్ని క్రూరంగా హింసిస్తూ చంపడం ఘోరమయిన తప్పుగా పరిగణించబడుతుంది. విష క్రిమికీటకాలను, క్రూరమృగాలను హతమార్చే అనుమతిని ఇవ్వడానికి కారణం, కేవలం మానవ ప్రాణం వాటి కన్నా విలువయినది కావడమే. అయితే వాటిని కూడా హింసిస్తూ చిత్రవధ చెయ్యడం ధర్మసమ్మతం కాదు. వాహనాలుగాను, భారం మోసేందుకుగాను ఉపయోగపడే జంతువులకు సరిగ్గా వాటి ఆహారాన్ని అందించకపోవడం, వాటిని అలివి కాని శ్రమకు గురిచెయ్యడం, వాటిని నిర్దయగా కొట్టడం లాంటి విషయాల్ని ఇస్లామ్ నిషేధిస్తుంది. పక్షుల్ని నిష్కారణంగా బంధించడం ఇస్లామ్ ప్రకారం గర్హనీయమయిన పని.

జంతువులే కాదు, చెట్లకు మొక్కలకు సయితం నష్టం కలగజెయ్యడాన్ని ఇస్లాం నిరసిస్తుంది. వాటి పండ్లు పువ్వులు తమ అవసరాలకుగాను కోసుకోవచ్చు కాని, వాటిని వృధాగా నాశనం చేసే హక్కు మనుషులకు లేదంటుంది

ఇస్లామ్. చెట్లయితే జీవం కలిగి ఉంటాయి. నిర్జీవమయిన వాటిని కూడా అకారణంగా వ్యర్థపరచరాదంటుంది. చివరికి నీరు కూడా అనవసరంగా, "దుబారా"గా ఖర్చుచెయ్యడం నిషిద్ధం.

# సార్వజనీనమయిన, సార్వకాలికమయిన షరీఅత్

ఇవే జగన్నాయకుడు ముహమ్మద్ (సఅసం) ద్వారా యావత్ప్రపంచానికి చిరకాలానిగ్గాను పంపబడ్డ షరీఅత్ ఆదేశాలు, నియమాలు. వీటిలో మనిషీ మనిషికీ మధ్య విశ్వాసం ఆచరణలు తప్ప మరే ఇతర విషయం ఆధారంగానూ ఎలాంటి తారతమ్యాన్ని పాటించడం ధర్మంకాదు. ఏ మతాల్లో, ఏ ధార్మిక నియమాల్లో, ఏ షరీఅతుల్లోనైతే వంశం, వర్ణం, దేశం పునాదులుగా మానవుల మధ్య విభేదాన్ని పాటించడం జరుగుతుందో ఆ మతాలు సార్వజనీనమయినవి కాజాలవు. ఎందువల్లనంటే ఒక వంశానికి చెందిన మనిషి మరో వంశంలో ఏ విధంగానూ చేరలేడు. లేదా లోకమంతా కుంచించుకుపోయి ఒకే దేశంలో విలీనమూ కాజాలదు. అలాగే నీగ్రో ప్రజల నల్లదనం, చైనీయుల పసుప్పచ్చ రంగు యూరోపియన్ల ఎర్రదనం ఎన్నటికీ మారలెవ్వు. అందువల్ల ఈ విభేదాల ప్రాతిపదికగా ఏర్పడ్డ మతాలు, వాటి నియమాలు అనివార్యంగా ఏదో ఒక్క జాతి వరకే పరిమితమయిపోతాయి.

వీటికి భిన్నంగా ఇస్లామీయ షరీఅత్ విశ్వజనీనమయింది.

"లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్"

(అల్లాహ్ తప్ప వేరే దైవం లేడు, ముహమ్మద్ దేవుని సందేశహరులు)

అన్న వచనాన్ని విశ్వసించే ప్రతి వ్యక్తీ ఇస్లామీయ షరీఅత్ ఆదేశాల

ప్రకారం ముస్లిం సమాజంలో సంపూర్ణంగా సమాన హక్కులతో ప్రవేశిస్తాడు. ఇక్కడ భాష, దేశం, వర్ణం, వంశం దేనికీ ప్రాముఖ్యత, ప్రత్యేకత లేదు.

ఈ షరీఅత్ శాశ్వతమయిన సార్వకాలికమయిన షరీఅత్. దీని శాసనాలు, ఓ ప్రత్యేక జాతికో, ప్రత్యేక కాలానికో చెందిన ఆచారాలు, సంప్రదాయాల ఆధారంగా లెవ్వు. మానవుడు ఏ ప్రకృతి సూత్రాల ఆధారంగా సృజించబడ్డాడో వాటి ఆధారంగానే ఈ శాసనాలు చెయ్యబడ్డాయి. మానవుని సృజనకు మూలమయిన ఈ ప్రకృతి అన్ని యుగాల్లోను, అన్ని పరిస్థితుల్లోనూ స్థిరంగానే ఉన్నప్పుడు దాని ఆధారంగానే ఏర్పడ్డ శాసనాలు సయితమూ అన్ని కాలాల్లోనూ, పరిస్థితులన్నింటిలోనూ స్థిరంగానే ఉండి తీరాలి.

: సమాప్తం :

# చదవండి ఒక వారం
# చదువుతారు ప్రతి వారం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad - 500 002.
Ph.: 24564583